# దైవం మానుష రూపేణ

## సద్గురు శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామిగారు
## (నేడు మన మధ్య నడిచే దైవం)

(1 - 8 - 2011)



ప్రకాశకులు :
శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్
గొలగమూడి
(వయా) సర్వేపల్లి
నెల్లూరు జిల్లా (A.P.)
PIN: 524321



అంకితము: శ్రీ భరద్వాజ మాస్టారుగారి పాదపద్మములకు

ఈ గ్రంథ రచనకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక నమస్కారములు

సేకరణ : ప్రసాద్ **పర్యవేక్షణ: పెనల సుబ్బరామయ్య**


ప్రాప్తిస్థానము (కాపీల కొరకు) :

శ్రీ సాయి మాస్టరు సేవాట్రస్టు

గొలగమూడి, నెల్లూరు జిల్లా - 524 321

Please visit **www.saimastersevatrust.org**

వెల : రూ. 30-00

ముద్రణ:



శ్రీ శ్రీ శ్రీ సద్గురు దర్గాస్వామి, అమ్మయ్య



శ్రీ దర్గాస్వామి, అమ్మయ్య




ఉరుసు ఉత్సవంలో శ్రీ దర్గాస్వామి



శ్రీ దర్గాస్వామి

# విషయసూచిక


| | | పేజి సంఖ్య |
|---|---|---|
| ముందుమాట | | ii |
| దైవం మానుష రూపేణ | | iv |
| మహనీయులను ఎలా సేవించుకోవాలి | | v |
| **అధ్యాయములు :** | | |
| 1 | శ్రీ స్వామి వారి జీవితం | 1 |
| 2 | మహాత్ములకు పుట్టినిల్లు | 11 |
| 3 | గురుసేవ | 16 |
| 4 | సర్వజ్ఞుడు – సర్వ సమర్థుడు | 20 |
| 5 | భూత నియంత | 56 |
| 6 | సకల సాధు, దేవతా స్వరూపము | 61 |
| 7 | దయాసాగరుడు | 75 |
| 8 | ఆశ్రిత కల్పవృక్షము | 79 |
| 9 | స్వామి దర్శన, ఆశీస్సుల మాహాత్మ్యము | 125 |
| 10 | స్వామి బోధ | 142 |
| 11 | స్వామి సూక్తులు | 155 |
| 12 | బోధనా దక్షత | 156 |
| 13 | అమ్మయ్యగారు | 163 |
| 14 | సద్ధర్మ సంరక్షకుడు | 181 |
| 15 | దర్బార్ నగరంలో ఉత్సవాలు | 200 |


## బస్సు మార్గము:

కడప నుండి రాయచోటి మార్గంలో నడిచే బస్సు ఎక్కి నీలకంఠరావుపేట - దర్గాస్వామి దగ్గరకి అని చెప్పి దిగాలి. దిగిన తర్వాత 2 కి.మీ. నడవాలి. లేదా రామాపురంలో దిగి ఆటో మాట్లాడుకుని వెళ్ళవచ్చు.

# ముందుమాట

సామాన్య భక్తులు నిరంతరము ధ్యానస్థితియందు మనస్సు నిల్పలేరు. గనుక ఇట్టివారికి మహనీయుల దివ్యలీలా చింతన చేయమని శ్రీ షిర్డీసాయి ఆదేశించారు. ఒక మహనీయుని గూర్చి వారెంతటి గొప్పవారో తెలియకనే అందరూ నమస్కరిస్తుంటే మనమూ నమస్కరించడం కాకుండా ఆ మహనీయుడు వివిధ భక్తులకు ఇచ్చిన దివ్యానుభవాలను తెలుసుకుంటే పెల్లుబికి పొంగుచున్న భక్తిభావముతో నమస్కరిస్తాము. అందుకొరకు శ్రీ దర్గాస్వామివారు నన్నొక పరికరముగా చేసుకొని ఈ చిన్న గ్రంథమును మీకందిస్తున్నారు. ఈ గ్రంథమును నవలలాగా చదివి ప్రక్కన పడేసినట్లుగాక ప్రతిలీలను బాగా హృదయగతం చేసుకొని సద్విమర్శ చేసి, మననం చేసి ఆ మహనీయుని స్థితిని విమర్శించుకుంటే వారి ఎడల నిజమైన భక్తిభావం ఏర్పడుతుంది. నిజమైన నమస్కారం చేయగల్గుతాము. ఇందుకు నిత్య సత్సంగము కనీసం వారమున ఒకసారైన భక్తులందరూ కలసి సత్సంగం చేసి చర్చించుకొనడం, భజన, నామస్మరణలు చేయడం అత్యంత అవసరం. శ్రీ దర్గాస్వామి దర్శనమునకు వెళ్ళేవారు ఈ గ్రంథమును దర్గాల దగ్గర పారాయణ చేయడం ద్వారా శ్రీ దర్గాస్వామి కృప విశేషంగా పొందగలరు. ఆ ప్రాంగణములో ఉన్నంత వరకు లౌకిక చర్చలు మాని ప్రదక్షిణలు, పారాయణ, నామస్మరణలతో గడిపి శ్రీ స్వామివారి ఆశీస్సులు పొందగలరు.

ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరు హైదరాబాద్ భక్తురాలితో "అమ్మా! నీకున్న ఆర్థిక వనరుల ద్వారా నిజమైన స్వామిసేవ చేయడమంటే- మహనీయుల గ్రంథాలు నీ బంధుమిత్రులకు పంచు. అట్టి దానము వల్ల ముల్లోకాలు దానమొసంగిన ఫలితమొస్తుంది" అని చెప్పారు. పుస్తకం చదివి అందరూ మహనీయులు కానక్కరలేదు. చదివినవారి హృదయాలలో మంచి సంస్కారములు నాటిన పుణ్యం ఆ గ్రంథమిచ్చినవారికి దక్కుతుంది. ఆ సంస్కారములు ఈ జన్మలోకానీ, మరుసటి జన్మలో కానీ మొలకెత్తక మానవు. మనస్సు భగవంతుడు కోరినట్లు

ఉపయోగించిన వారమౌతాము.

ఇంతటి గొప్ప మహనీయుడు మన మధ్య వున్నా వారినుండి పొందదగినంత పొందకపోవడం ఎంత దురదృష్టమో! మనలాంటి మానవుడుగా పుట్టి దేవుడయ్యేందుకు వారేమి చేశారో స్పష్టంగా తెలుస్తుంది. ''ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా'' అన్న శ్రీ వెంకయ్యస్వామివారి మాటను వీరెంత చక్కగా పాటించారో చూడండి. ఈనాటి విలువల ప్రకారం కోట్లు విలువ చేసే ఆస్తిని భగవంతునకు కర్పూరం వలె నివేదించారు. స్కూలు, అన్నదానం నిర్వహిస్తున్నారు. కఠోర బ్రహ్మచర్యం వహించి జీవితాంతం ఒకే ఇంట్లో భార్యాభర్తలు నివసించారు. కేవలం తల్లీబిడ్డలవలె మసలుకొన్నారు. ఎన్ని దేవాలయాలు, ఎందరి వివాహాలు, ఎంతమందికి విద్యాదానాలు చేశారో ఈ మహనీయుని జీవితం నుండి నేర్చుకోవాలి. రోజుకొక్క గ్లాసు పాలు గాని, టెంకాయనీళ్ళు గాని తీసుకొని జీవించడం ఈ మహనీయునికే చెల్లింది. ఇదే వారి జీవితం మనకు నేర్పే గొప్ప పాఠం.

**పెనల సుబ్బరామయ్య**

# దైవం మానుష రూపేణ

దేవుణ్ణి తెలుసుకునే మార్గం చెప్పమన్న భక్తులతో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు అంటారు: ‘‘నీయాల్నే వస్తే నీవేమి కనుక్కుంటావయ్యా’’. ఇది ఈనాడు కడప జిల్లా నీలకంఠరావుపేట వాస్తవ్యులు శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామిగారి ఎడల అక్షరాలా నిజమైంది. వారు మానవ రూపంలో మన ముందున్న భగవంతుడే అని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి. ఇది తెలియక కొందరు వీరిని ప్రశ్నలు చెప్పేవారుగా తలిస్తే, మరికొందరు ధర్మప్రభువుగా తలిస్తే, మరికొందరు మరొకవిధంగా తలంచుచున్నారు. మరి కొంతమందికి తమలోని బలహీనతలు శ్రీ స్వామివారిలో కనిపించి వారిని మానవాకారం ధరించిన భగవంతుడుగా గుర్తించలేకున్నారు. వివిధ భక్తులకు వారితో గల అనుభవాలు చాలా స్వల్పంగా వివరించాను. ఈ అనుభవాల దృష్ట్యా వారు భగవంతుని ప్రతిరూపమేనని రూఢి అవుతుంది.

వారెంతటి మహనీయుడో తెలియనిదే హృదయ పూర్వకమైన భక్తిశ్రద్ధలతో నమస్కరించలేము. అందరూ నమస్కరిస్తున్నారు గనుక మనమూ నమస్కరిస్తాము. వారెంతటి గొప్ప మహనీయులో తెలియజేసి వారి ఎడల మన హృదయాలలో తగు విధమైన భక్తిశ్రద్ధలు ఏర్పడునట్లు చేయడమే ఈ చిన్ని పుస్తకం ఆశయము.

భగవంతునికి మూడు లక్షణాలు చెప్పారు.

1. **సర్వవ్యాపకుడు** : అందుగలడిందులేడని సందేహము వలదు అన్నట్లు విశ్వమందంతటనూ ఉన్నవాడు.

2. **సర్వజ్ఞుడు:** సర్వ విషయములు తెలిసినవాడు. సృష్టిలోని ప్రతిదాని గురించి భూత, భవిష్యత్, వర్తమానములన్నీ తెలిసినవాడు.

3. **సర్వసమర్థుడు:** ఏమైనా చేయగల సామర్థ్యము గలవాడు.

శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామివారు భక్తులకనుగ్రహించిన అనుభవాలలో పై మూడు లక్షణాలు వారికున్నట్లు తెలుస్తుంది. గనుకనే వారిని మానవాకారం ధరించిన భగవంతుడని చెప్పగలుగుచున్నాను.

\- **పెనల సుబ్బరామయ్య**

# మహనీయులను ఎలా సేవించుకోవాలి

శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారి ప్రవచనాల్లో చెప్పినట్లు "సమస్త జీవరాశి కూడా తెలిసో తెలియకో శాశ్వతమైన తృప్తి, శాంతి, ఆనందాల కోసం మాత్రమే జీవిస్తున్నారు. చాలామంది ధనం వల్లనో, అధికారం వల్లనో మరే ఇతర వాటి వల్లనో ఈ తృప్తి, శాంతి, ఆనందాలు వస్తున్నాయని తలుస్తున్నారు. కానీ చాలా కొద్దిమంది ఆత్మజ్ఞానం వలన మాత్రమే లభ్యమవుతుందని నమ్మి అందుకోసం ప్రయత్నిస్తున్నారు. ఇలాంటివారికి మహనీయుల (సద్గురువుల) కృప చాలా ముఖ్యము. ఇలాంటి వారిని ఉద్ధరించడానికి భగవంతుడే వివిధ మహనీయుల రూపాలలో వచ్చి సరైన మార్గంలో నడుపుతారు. మరి ఈ మహనీయులను గుర్తించేదెలాగో, వారిని ఎలా సేవించాలో ఆచార్య భరద్వాజగారు వివరించారు, ఆచరించి చూపారు." మహనీయులైన దర్గాస్వామిని మనకు తెలియచేసిన పరమాత్మకు కృతజ్ఞతలు తెలుపుతూ మనం స్వామిని సేవించి తరిద్దాం.

1. దర్గాస్వామి సన్నిధిలో వీలైనంతసేపు గడపాలి. **"తడి గుడ్డలతో నిప్పు దగ్గరున్న వ్యక్తి నా గుడ్డల చెమ్మ పోగొట్టమని"** ఆ అగ్నిని ప్రార్థించనక్కరలేదు. అలానే మహనీయుల సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన మనము సాధనతో నిర్మూలించుకోలేని దుష్టసంస్కారాలన్నీ వాటికై అవే మననుండి దూరమౌతాయి.

ఆచార్య భరద్వాజగారు ఫిబ్రవరి 8, 1963లో షిరిడీ సాయిబాబా సమాధి దగ్గర సమాధి స్థితి ననుభవించినా తరువాత వారానికొకసారి ఎన్ని ఇబ్బందులైనా చీరాలస్వామి దర్శనానికి వెళ్ళేవారు. ఆ రోజుల్లో విద్యానగర్ నుండి చీరాల వెళ్ళటానికి కనీసం 6 గంటలైనా పట్టేది. శనివారం కాలేజీ అయిన తర్వాత ప్రయాణించి

ఆదివారం స్వామి సన్నిధిలో గడిపి మరలా సోమవారం ఉదయం కాలేజీకి వెళ్ళేవారు. ఆ రోజుల్లో రాను పోను ప్రయాణపు ఖర్చులు 100 రూపాయలు. వారి జీతము 940 రూపాయలు మాత్రమే!

2. దర్గాస్వామి దగ్గరకు వెళ్ళిన తరువాత లౌకిక వ్యవహారములు మాట్లాడటం మాని దర్గాలకి ప్రదక్షిణలు, అమ్మయ్యగారి సమాధికి ప్రదక్షిణలు, నామస్మరణ, సద్గ్రంథ పఠనంలో కాలము గడుపుట చేయాలి.

3. ప్రపంచంలో అన్నింటిలోకి అతి విలువైనది మన మనస్సు. దానినెంతో పవిత్రంగా ఎటువంటి దుర్గుణములు (లౌకిక వ్యవహారములు మాట్లాడుట, కోపించుట, విమర్శించుట, బద్ధకము మొ॥) చేరకుండా శ్రీ స్వామివారి స్మరణకు మాత్రమే వినియోగిస్తే శ్రీ స్వామివారు మన సేవల నంగీకరించి ప్రసన్నులౌతారని మనం గుర్తించాలి. అలా చేయలేనప్పుడు మన సేవలన్నీ వ్యర్థమే.

4. దర్గాల దగ్గరకి వెళ్ళినప్పుడు స్కూలు పిల్లలకి అన్నాలు వడ్డించటము, స్కూలు ఖాళీ పీరియడ్‌లలో స్వామి లీలలు చదివి వినిపించటం, ఇంకా ఏదైనా పనులుంటే చొరవ తీసుకుని స్వామి సేవగా చేయాలి.

పాకలపాటి గురువుగారు చెప్పినట్లు "ఎంతో పుణ్యముంటే గానీ సద్గురు దర్శనం కాదు. ఇంకా ఎంతో పుణ్యముంటే తప్ప ఆయన చెప్పినట్లు ఆచరించలేము." మనము కూడా స్వామి చెప్పినట్లు తు॥చ॥ తప్పక ఆచరించాలంటే ఏమి చేయాలి?

1. సద్గురు దర్శనం పుణ్యం - స్పర్శనం పాపనాశనం అని చెప్పినట్లు **వీలైనన్ని సార్లు (వీలు చేసుకొని) దర్గాస్వామి దర్శనం చేసుకోవాలి.**

2. దర్గాస్వామి మనకనుగ్రహించిన అనుభవాలను ప్రతిరోజూ ఉదయం నిద్రలేవగానే స్మరించుకోవాలి. భావయుక్తంగా పూజ,

పారాయణ చేసుకోవాలి.

3. అన్నం వండేటప్పుడు, తినేటప్పుడు నామస్మరణ చేయాలి.

4. మనమేపని చేస్తున్నా అది పరమాత్ముని సేవ ఎలా అవుతోందో అనేది గుర్తించి ఆ భావంతో క్షుణ్ణంగా ఆ పని చేయాలి.

5. అన్నం తినే ముందర భక్తి పూర్వకంగా మనకు ఆహారం ఇచ్చిన పరమాత్మను తలుస్తూ కాకబలి సమర్పించాలి.

6. హొటల్లో తిన్న ఇష్టమైన కూరను, మనకు నచ్చిన సినిమా హీరో గురించి ప్రక్కవారితో చెప్పుకోవడానికి ఉత్సాహపడే మనము, మన స్నేహితుల తోటి స్వామి లీలలు చెప్పుకోవడానికి వెనుకాడటమెందుకు? ఇలా చెప్పుకోవటం వల్ల స్వామికి మనపై వున్న ప్రేమను తెలుసుకోగలిగి స్వామి మీద ప్రేమ, విశ్వాసాలు బలపడతాయి.

7. సద్గురు స్మరణ వలన సర్వులూ ఇలాంటి దివ్యానుభూతులు పొంది వారి కృపకు పాత్రులు కావాలనే సత్సంకల్పంతో భక్తులు తమ తోటి వారితో స్వామి లీలలు చెప్పుకుని భక్తి, శ్రద్ధలను దృఢపరచుకోవాలి. **సద్గురు స్మరణ కన్నా మించిన జ్ఞానం లేదు కదా!**

## సద్గురువును గుర్తించడమెలా?

1. ఎవరి సమక్షములో మన మనస్సు ప్రశాంతత నొంది కాలగతి తెలియకుండా పోతుందో అది సద్గురు సన్నిధి అని తెలుసుకోవాలి.

ఇలాంటి అనుభవం తనకు కలిగినప్పటికీ ఆధ్యాత్మికత తెలియనివారు అది మహాత్ముని సన్నిధియని గుర్తించలేరు. అలాంటివారికొరకు మరొక చక్కని పరీక్ష చెప్పారు.

2. మనం మహనీయుడు అవునా కాదా అని పరీక్షించే వారి దగ్గర సాధారణంగా జరిగేందుకు వీలులేని ఒక అనుభవం జరుగవలెనని, ఆ అనుభవం ఇంత టైంలో జరగాలని, అలా అనుగ్రహించమని మనం మన నోటితో అడగకుండా మానసికంగా

చెప్పుకొని వారి సన్నిధిలో కూర్చొనేది. కూర్చున్నంతసేపు సాయినామం మానసికంగా జపిస్తూ ఉండు. మనం మానసికంగా చెప్పుకున్న టైం లోపలే ఆ అనుభవం జరిగితే వారు సిద్ధపురుషులని తెలుసుకొనేది.

3. మూడవ విషయం: నిజమయిన మహనీయులెవ్వరు కూడా తమ పూర్వ చరిత్ర వారి నోటివెంట బయటపెట్టుకోరు. సన్నిహితులైన భక్తులు మరలా మరలా అర్థించినప్పుడు "కక్కిన కూటికి ఆశ పడతామా?" అన్న సందర్భాలున్నాయి. షిరిడీ సాయి, అక్కల్‌కోట స్వామి వంటి మహనీయులైతే కొందరికి మాదిగవారమని, మరికొందరికి సత్‌బ్రాహ్మణులమని, మరికొందరితో ఆ విషయం అడిగితే చెప్పుతో కొడతానని అన్నారు.

4. నాలుగవ లక్షణం: వారు భక్తులనుండి ఏమీ ఆశించరు. భక్తులమీద ఎనలేని ప్రేమను అనుక్షణం కురిపిస్తుంటారు. వారి అన్నపానీయాలు పోషణ, పాలన భగవంతుడే చూడాలి.

5. ఐదవ లక్షణం: కరచాలనంతో వస్తువులను సృష్టించరు. అలా సృష్టించి ప్రజలను భ్రమకొల్పేవారిని మనం దర్శించనక్కరలేదు.

6. ఆరవ లక్షణం: మనకేదైన ఆపద రాబోతుంటే పరోక్షంగా మనలను హెచ్చరించి ఆ ఆపద రాకుండా చేస్తారు. వారి మాటలకు నిజమైన అర్థం మనకా ఆపద తప్పిపోయాక మనకు అర్థమౌతుంది.

శ్రీ సమర్థ సద్గురు దర్గారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 1

## శ్రీ స్వామి వారి జీవితం

పూర్వాశ్రమంలో వీరి పేరు సుబ్బరాయుడుగారు. శ్రీ దర్గాస్వామివారు కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం, పెద్దశెట్టిపల్లి అనే గ్రామంలో గంగిశెట్టి పెద్ద చలమయ్య - సుబ్బమ్మ అనే పుణ్య దంపతులకు 6-7-1931 సం॥ అధిక ఆషాడ బహుళ షష్ఠి సోమవారం రాత్రి 9-00 గంటలకు జన్మించారు.

### దర్గాస్వామి తన చిన్నతనం గూర్చి చెప్పిన విషయాలు:

దర్గాస్వామి అమ్మగారు ఉదయం 5 గంటలకు స్వామిని నిద్ర లేపి, స్వామి చేత ప్రార్థన చేయించేవారు. తరువాత తెల్లవారాక "శ్రీ సూర్యనారాయణా, వేదపారాయణా, లోకరక్షాయణా......." అని చదువుతూ ఉండేవారు. సాయంత్రంపూట ఒక కాయకు సూదితో కన్నం పెట్టి, అందులో గుజ్జు తీసివేసి, వత్తిపెట్టి, నూనె పోసి, దీపం వెలిగించి, ఆ దీపం మీదుగా ఆంజనేయస్వామిని చూస్తూ ధ్యానం చేసేవారు. అలా చేస్తే వాళ్ళ అమ్మగారు రోజూ ఒక గోధుమ రొట్టె, నెయ్యి పెడతానని చెప్పేవారు. చిన్నప్పుడు వాటిమీద ఇష్టం వల్ల స్వామి అలా చేయడం మొదలుపెట్టారు. 5వ సంవత్సరం వచ్చేటప్పటికే రామాయణం, భారతం, భాగవతం చదవడం పూర్తి అయిపోయింది. సత్యహరిశ్చంద్ర నాటకం కూడా అప్పటికే చూశారు. బడి చదువులు ఆ తరువాత ప్రారంభం అయ్యాయి.

### సాయిబాబాను పూజించడం గురించి స్వామి చెప్పినవి:

"నా దగ్గర చిన్నప్పుడు ఒక సాయిబాబా పటం చిన్నది వుండేది. దానికి పైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల బొమ్మలు ఆ పటంలో వుండేవి. నేను ఎప్పుడూ ఆ పటంనే చూస్తుండేవాణ్ణి. నా చిన్నప్పుడు నాకు ఏమైనా కావలసి వస్తే మట్టితో సూదులు చేసేవాడిని. వాటితో సాయిని సాధించి సంపాదించుకునేవాడిని".

స్వామివారు ఆంజనేయ స్వామి భక్తులు. చిన్ననాడే అనేక స్తోత్రాలు నేర్చుకున్నారు. అందులో ముఖ్యమైనది నారాయణ శతకమని స్వామివారే చెపుతారు. స్వామివారికి విద్యార్థి దశలో ఒక సాధువు తారసపడి దగ్గరకు పిలిచి నీకు ఒక గుర్రం, ఒక ఖడ్గం, ఒక వజ్రం ఇస్తాను అవి నీకు మేలు చేస్తాయి అన్నాడట. పసివాడు కాబట్టి మన స్వామికి అప్పుడు అర్థం కాలేదు. తరువాత తెలుసుకున్నారు. **గుర్రం అంటే మనస్సని, ఖడ్గం అంటే వైరాగ్యమని, వజ్రమంటే ప్రకాశిస్తున్న ఆత్మజ్యోతియని, మనస్సుని, ఇంద్రియాలను ఖడ్గంతో ఖండించినచో శుద్ధ చైతన్య రూపమైన ఆత్మ అనే వజ్రం ప్రకాశిస్తుంది.** ఆ స్థాయికి చేరినవారు ఇతరుల మనస్సులలోని విషయాలను, కష్టనష్టాలను గమనించి వారి బాధలను తొలగించగల తపశ్శక్తి సంపన్నులు. ఆ శక్తిసామర్థ్యాలు మన దర్గాస్వామికి సంపూర్ణంగా ఉన్నాయని మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము.

స్వామి 1947వ సం॥లో యస్.యస్.యల్.సి పాసై అదే సంవత్సరంలో మద్రాసు పచ్చయప్ప కళాశాలలో యఫ్.ఎ (ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ - ఇప్పటి ఇంటర్మీడియట్‌కు సమానం) చేరి, మొదటి సంవత్సరం పూర్తి చేశారు.

1951 ప్రాంతంలో స్వామివారికి హంపి క్షేత్రంలో తుంగభద్రా నదిపై కడుతున్న భద్రావతి ఆనకట్ట ప్రాజెక్టులో సూపర్‌వైజరుగా ప్రభుత్వోద్యోగము వచ్చినది. స్వామివారు అక్కడ వున్న ఆంజనేయస్వామి పూజ చేస్తూ ధ్యానంలో గంటల తరబడి నిమగ్నులైపోయేవారు. అందువలన ఆఫీసుకు సకాలంలో వెళ్ళటం సాధ్యం అయ్యేది కాదు. అయినప్పటికీ పై అధికారులు స్వామిని ఏమీ అనకుండా చాలా మర్యాదగా చూసేవారు. అది అలా వుండగా ఒకరోజు ముగ్గురు సాధువులు స్వామి దగ్గరికి వచ్చి 'నాయనా! ఈ ఉద్యోగం నీలాంటి వాడికి వద్దు. అందువలన దీనికి రాజీనామా ఇచ్చి మీ ఊరికి వెళ్ళు. మేము త్వరలో తగిన ఉద్యోగం యిస్తాము' అని చెప్పి వెళ్ళిపోయారు. వెంటనే స్వామివారు ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రొద్దుటూరు చేరుకున్నారు. స్వామిలాంటివారికి ఉద్యోగాలు, భాగ్యాలు, హోదాలు తృణప్రాయాలు!

## అమ్మయ్యగారితో  వివాహం:

"నీలకంఠరావుపేట శ్రీ కొణిజేటి అనంతయ్య, సుబ్బమ్మగార్లు మాతాజీగారికి తల్లిదండ్రులు. వీరు చాలాకాలం సంతానం లేక ఎన్నో పుణ్యక్షేత్రాలను దర్శించి సేవించి, తుదకు పండరి క్షేత్రం వెళ్ళి శ్రీ పాండురంగస్వామిని కొంతకాలం సేవించారు. తత్ఫలితంగా జన్మించిన బిడ్డయని తల్లిదండ్రులు 'రంగనాయకమ్మ' అని పేరు పెట్టి పెంచి పెద్ద చేశారు. ప్రాథమిక విద్యను చెప్పించారు."

1951 డిసెంబరులో స్వామివారికి పెళ్ళిచూపులు జరిగాయి. అమ్మయ్యగారు స్వామికి వరుసకు మేనరికం అవుతారు. స్వామి వాళ్ళ అమ్మగారు ఆమెను చేసుకోమని స్వామికి చెప్పారు. తరువాత ధ్యానంలో సాయిబాబా కనిపించి "నీవు ఆ అమ్మాయిని వివాహం చేసుకో. ఆమె ఆంజనేయుని అంశ" అని చెప్పారు. తర్వాత పెళ్ళి చూపులు అయినాక అమ్మయ్యగారు అదే పనిగా ఏడుస్తున్నారు. అప్పుడు స్వామివాళ్ళ అమ్మగారు 'ఎందుకమ్మా ఏడుస్తున్నావు?' అని అడిగితే "మా అవ్వ, తాత నన్ను సాకారు. వాళ్ళు పెళ్ళిచూపులకు రాలేకపోయారు" అని చెప్పారు. అప్పుడు స్వామి అమ్మగారు 'దానికోసం ఏడవడం ఎందుకు?. ఇక్కడకు అయితే మీ అవ్వ, తాత మాత్రమే వస్తారు. మిగిలిన బంధువులు చూడడం కుదరదు. నేను మా వాడిని నీతో పంపిస్తాను. మీ అవ్వ వాళ్ళ ఊరు తీసుకు వెళ్ళు. అప్పుడు అక్కడున్న మీ వాళ్ళందరూ చూడవచ్చు' అని చెప్పి స్వామివారిని అమ్మయ్యగారితో పంపించారు.

కాబోయే వధూవరులు - వివాహం కాకముందే మరొక గ్రామం పోవడానికి పెద్దలు అనుమతించడము ఎంత గొప్ప సంస్కారమో ఆలోచించండి. వారు అనుమతించినా వీరు తమ శీలాన్ని కాపాడుకున్న పవిత్రమూర్తులు.

స్వామికి, అమ్మయ్యకు తే॥ 31-1-1952 న (మాఘ శుద్ధ పంచమి గురువారం నాడు) నీలకంఠరావుపేటలో వివాహం జరిగింది.

## స్వామి తల్లిగారు చనిపోవటం (1953) గురించి స్వామి చెప్పినవి:

"మా అమ్మగారికి ఆఖరి రోజులు వచ్చినప్పుడు ఆమె నాతో "ఇక నా రోజులు అయిపోతున్నాయి. నువ్వుగానీ, మీ గురువు సాయిబాబా గానీ నన్ను రక్షించలేరు" అని అన్నారు. ఆమె అన్నట్లుగానే కొద్దిరోజులలో చనిపోయారు. అప్పటినుంచి నాకు, సాయిబాబాకు మధ్య మాట లేదు. ఆయనది సుమారు ఒక అడుగు విగ్రహం ఉండేది. దానిని చూపుతోనే పగలగొట్టాలని చూస్తూ వున్నాను. ఆ తర్వాత బాబాయే నా లోపల నుంచి ఇలా చెప్పారు. "ఎందుకు నాపై కోపం పెట్టుకుంటావు? నేను మీ అమ్మను రక్షించలేదని ఎందుకు బాధపడతావు? తనను రక్షించమని మీ తల్లి నన్ను అడుగలేదు. నీవు కూడా ఆమెను బ్రతికించమని అడుగలేదు. ఆమె వచ్చిన పని పూర్తయింది, కాబట్టి ఆమెను తీసుకు వెళ్ళాను" అని చెప్పారు. అప్పటినుండి బాబాతో మరలా మామూలుగా ఇంతకు ముందువలెనే ఉండేవాడిని."

స్వామివారి జీవితంలో మాతృనిర్యాణం ఒక ముఖ్యమైన మలుపు. అప్పటి స్వామి మనోవైఖరి చూసి అమ్మయ్య స్వామికి పిచ్చి పట్టిందని షోలింగర్‌కి తీసుకువెళ్ళి పూజలు, రుద్రాభిషేకం చేయించింది.

## తమ భౌతిక గురువును గురించి స్వామి చెప్పినవి:

"నాకు ఇంతకు ముందటి ఋణానుబంధం వలన నా భౌతిక గురువు లభ్యమయ్యారు. ఆయన తమ పాదాన్ని నా గుండెలపై పెట్టారు. నుదుటిపై ముద్దు పెట్టుకున్నారు. శరీరమంతా తవిడారు".

ఆ తరువాత స్వామి ఎక్కడికో వెళ్ళి వచ్చేటప్పటికి, ఆయన గురువుగారు కనపడలేదు. అప్పుడు స్వామి ఎంతో బాధపడుతుంటే వాళ్ళ గురువుగారు **"అంతరాత్మనై నేను ఎక్కడ లేను? అంతటా ఉన్నాను"** అని స్వామికి ఆత్మబోధగా చెప్పారు. వారికి గురువుగారు ఉర్దూలో వ్రాసిన ఆరు ఆకులు ఇచ్చారు. అవి ఎవరికి అర్థం కావు. అవి అరిషడ్వర్గాలకు గుర్తు. ఈ దర్గాల వద్దకు వచ్చేటప్పటికి ఐదు పోయాయి. ఇక చివరిది మత్సరం మిగిలినది. **మత్సరం అంటే నేను, నాది అనే భావం**.

ఇక్కడకు వచ్చాక అది కూడా పోయింది.

అమ్మయ్య ఒక సందర్భంలో గురు బంధువులతో మాట్లాడుతూ "స్వామికి వారి గురువు దగ్గర ఒక్కరోజు మాత్రమే వుండగలిగే అవకాశం కలిగింది. మనం చాలా అదృష్టవంతులం స్వామితో ఎక్కువసేపు వుండగలిగే అవకాశం భగవంతుడు ఇచ్చాడు. ఆ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకుందుము గాక!"

ఒకసారి అమ్మయ్యగారితో దర్గాస్వామి వాళ్ళ నాన్నగారు 'అమ్మా! మా వాడికి నీతో వివాహం కాకుంటే ఈ పాటికి ఏ అడవిలో ఏ పుట్టక్రింద తపస్సులో ఉండేవాడో! మాకు దక్కేవాడు కాదు. 1948లో గాంధీ మహాత్ముడు మరణించినప్పుడు, మహాత్ముల జీవితాల గురించి ఆలోచిస్తూ స్మశానాలలోనే గడిపేవాడు' అని చెప్పారు. అప్పుడు అమ్మయ్యగారు "ఇప్పుడిక మనకు అలాంటి భయం లేదు, ఆయనకు సద్గురువు దొరికారు. సరైన సాధనా మార్గం లభించింది" అని చెప్పారు

## ఈ మహనీయుడు దర్గాల దగ్గరకి విచ్చేయడం

ఈ స్వామివారికి వివాహం కాకముందునుంచీ తరచుగా స్వప్నంలో ఇద్దరు మనుషులు కనిపించి మాకు దీపం పెట్టు నిన్ను పోషిస్తాము అని చెప్పేవారు. వివాహమయ్యాక శ్రీ అమ్మయ్యగారికి, శ్రీ స్వామివారికి ఇద్దరికీ అలాగే కనిపించి చెప్పసాగారు. నేను దర్గాల దగ్గరకు వెళ్ళేటప్పుడు సాంబ్రాణి కడ్డీలు తీసుకువెళ్ళాను. అప్పటికి దర్గాలలోని మహనీయుల పైన నాకు ఎలాంటి పూజ్య భావము లేదు. మీలో శక్తి వుంటే ఈ కడ్డీలు వెలిగించే మార్గం చూపండి అని చెప్పుకున్నాను. మరుక్షణంలోనే అక్కడ అంతకు ముందు లేని ఒక అగ్గిపుల్ల, అగ్గిపెట్టెకు ప్రక్కనుండే చెక్క నా కంట పడ్డాయి. వాటితో సాంబ్రాణి కడ్డీలు వెలిగించాను. రెండవసారి ఊరకనే వెళ్ళి నమస్కరించి వచ్చాను. మూడవసారి వెళ్ళి అక్కడే వుండసాగాను. పదిహేను రోజులు కేవలం నీళ్ళతోనే జీవించాను.

అలాగే చేసి సమాధులను సేవిస్తుంటే, హిందువులు వచ్చి ముస్లిమ్ సమాధులను సేవించడం అక్కడి ముస్లింలకు గిట్టలేదు. అందుచేత ఆ ముస్లిములు రాత్రి సమయంలో వచ్చి శ్రీ స్వామివారిని మంచంతో సహా

ఎత్తుకుపోయారు. శ్రీ స్వామివారు నవ్వుకుంటూ సమాధులలో వుండేవారికి ఏది ఇష్టమైతే అదే జరుగుతుందని తలచారు. పాములు తమపై పడ్డట్టు ఆ ముస్లింలకు దర్శనం కావడంతో తిరిగి మంచంతో సహా శ్రీ స్వామివారిని తెచ్చి సమాధుల చెంత చేర్చారు. సమాధుల దగ్గరకొచ్చాక అక్కడి అడవిలో కూర్చొని దంపతులిద్దరూ ఘోరంగా తపస్సు చేశారు. వీరి గురువుగారు అరబ్బీమంత్రాలు వ్రాసిన కాగితాలను శ్రీ స్వామివారికి ఇచ్చారు. వాటిని ఒకరోజు ఎ. రంగారావుగారికి చూపారు.

## ఒక మంత్రగాడి విషయమై దర్గాస్వామి చెప్పిన వివరాలు:

ఒకసారి ఒక మంత్రగాడు దర్గాల వద్దకు వచ్చి స్వామి చేతి మీద సర్పంతో కాటు వేయించాడు. స్వామి స్పృహ తప్పి పడిపోయారు. అతడు గర్వంతో చుట్టుప్రక్కల వున్న ఊళ్ళ నుండి వెడుతూ, తనకు ఎదురుపడ్డ వాళ్ళతో 'నేను స్వామిని పడగొట్టేశాను. ఇక ఆయన లేవరు' అని గర్వంగా చెప్పుకుంటూ వెళ్ళిపోయాడు. అది విన్న వారు ఆత్రంగా స్వామిని చూడటానికి దర్గాల వద్దకు వెళ్ళేటప్పటికి ఆయన దర్జాగా కాలు మీద కాలు వేసుకుని మాట్లాడుతూ వున్నారు. ఆ మంత్రగాడు స్వామిని ఏమీ చేయలేక పోయాడు.

## స్వామి ఉరుసు జరపకూడదని ముస్లింల అభ్యంతరం

దర్గాలో ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమినాడు ఇద్దరు బాబాలకు మూడురోజులపాటు ఉరుసు ఉత్సవం జరుగుతుంది. దీనికి కుల, మత, భాష, ధనిక, బీద తేడాలు లేకుండా భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. 1959వ సం॥లో జరిగిన ఉరుసుకు భక్తులు అసంఖ్యాకంగా హాజరైనారు. ఆ ఉరుసు ద్వారా స్వామివారికి చాలా డబ్బు వచ్చి ఉంటుందని నీలకంతరావుపేటలోని ముస్లింలు కొందరు భావించారు. ఆయన హిందువు, ముస్లింకాదు. అది నెపంగా ఉరుసు ఆయన నిర్వహించరాదని వారు అభ్యంతరం లేవదీశారు. ఆయన హిందువు. ఆయనకు ఉ పనయనం ముస్లిం సాంప్రదాయం ప్రకారం జరుగలేదు. ఆయన భార్య హిందూ పద్ధతిలో బొట్టుపెట్టుకుంటుంది. ఇవీ వారి ప్రధాన

అభ్యంతరాలు. అందుకు వారితో స్వామీజీ "నేను సమాధిలోని మహాత్ముల ఆదేశానుసారమే సేవ చేసుకుంటున్నాను. తద్వారా నేనేమీ డబ్బు సంపాదించుకొనడం లేదు. భక్తుల సమస్యలకు ఆ మహాత్ములు సూచనలు, పరిష్కారాలు నాద్వారా ఇస్తున్నారు" అని చెప్పారు. అయితే వారు ఈ సమాధానాన్ని అంగీకరించలేదు. మరు సంవత్సరం (1960) ఉరుసుకు తాడిపత్రిలోని పెద్దలను పిలిపించి వారి ఆధ్వర్యంలో ఉత్సవం జరపాలని నిశ్చయించుకున్నారు. అలానే రెండు సంవత్సరాలు వారి ఆధ్వర్యంలోనే ఉరుసు జరిగింది. ఉత్సవం ద్వారా వచ్చిన ఆదాయాన్ని వారు తీసికొని వెళ్ళిపోయేవారు. స్వామీజీ మాత్రం నిర్విచారంగా దర్గాకు దక్షిణంగా ఉన్న తన ఆశ్రమంలో ఉండేవారు.

మూడవ సంవత్సరం ఉరుసు ప్రారంభమైంది. పెద్దలందరూ ఆసీనులై ఉన్నారు. ఒక ముస్లిం యువకుడు ఆవేశంగా స్వామీజీని నోటికి వచ్చినట్లు తిట్టడం ప్రారంభించాడు. ఎవ్వరూ అతనిని వారించలేదు. స్వామీజీ మాతాజీలు ఇద్దరూ మౌనంగా ప్రశాంతంగా కూర్చొని ఉన్నారు. మాతాజీకి ఆ యువకుడు వాడుతున్న అసభ్య భాషవలన లోపలబాధగా ఉన్నా పైకి ఏమీ చలించకుండా నామజపం చేసుకుంటూ ఉండి పోయారు. ఉన్నట్లుండి ఆ యువకుడు ఎవరో వెనుక నుంచి తనను బలంగా కాలితో తన్నినట్లు క్రింద పడి మూర్ఛపోయాడు. అందరూ భయపడ్డారు. అక్కడున్న పెద్దలు ఎంత ప్రయత్నించినా ఆ యువకుడికి స్పృహ తెప్పించలేకపోయారు. అప్పుడు వారికి జ్ఞానోదయమైంది. తమ తప్పు తెలిసికొన్నారు. ఆ యువకుడిని కరుణించవలసిందని స్వామివారిని ప్రార్థించారు. స్వామీజీ వారితో "నాదేమీలేదు, దర్గాలోని మహాత్ములను ప్రార్థించండి" అన్నారు. వారు అలాగే చేశారు. అప్పుడు ఆ యువకునికి స్పృహ వచ్చింది. "సమాధిలో ఉన్న హజరత్ దర్బార్ ఆలీషావలీ వారు నన్ను వెనుక నుంచి బలంగా తన్నడం వలన నేను క్రిందపడి స్పృహ కోల్పోయాను" అని చెప్పుకున్నాడు. ఆనాటి నుండీ నేటి వరకు ఆ ఉరుసును స్వామివారే జరిపిస్తున్నారు. దిగ్విజయంగా జరుగుతోంది. ఈ సంఘటనలో మనకు ప్రస్ఫుటంగా గోచరించేది మాతాజీ స్థిత

ప్రజ్ఞత్వము. తన కళ్లెదుట తన భర్తను అసభ్య పదజాలంతో దూషిస్తుంటే మౌనంగా ఓర్పుగా తన నామజపంలో ఉండి పోవటం, అదే స్థితప్రజ్ఞ లక్షణం.

## స్వామివారు తన తండ్రిగారికి సద్గతి ప్రసాదించడం :

మా నాన్నగారు 23 రోజులలో చనిపోతారనగా, మా తమ్ముని దగ్గర 10 రూపాయలు తీసుకుని ఆయనకు ఇచ్చాను. ఇలా పితృఋణం తీర్చుకున్నాను. అప్పటి నుండి ఆయనను నా బిడ్డగా చేసుకుని జ్ఞానం ఉపదేశించాను. 20 రోజులలో ఆయనకు జ్ఞానం కలిగింది. అప్పుడు నేను ఉత్తరాభిముఖంగా పద్మాసనం వేసుకుని కూర్చుంటే ఆయన నా ఒడిలో తలపెట్టుకుని ప్రాణం విడిచారు.

# కాంతా కనకములను పరిత్యజించుట

## కాంతను వదులుట:

ఋణానుబంధం వలన వివాహం జరిగింది కానీ సామాన్య మానవులవలె శారీరక సంబంధం లేదు. వధూవరుల జీవితంలో మరుపురాని మొదటి రాత్రి కొద్ది గంటలలో రాబోతుంది. రెక్కలు గలిగిన దేవదూత వచ్చి నీ భార్యతో శారీరక సంబంధం శాశ్వతంగా నిషేధిస్తూ పై వాళ్ళు ఆజ్ఞాపించారు. అది నీకు చెప్పడానికే వచ్చాను అని అన్నాడు. "భలేవాడివయ్యా నేను అంగీకరించినా ఆమె ఎంత నిరాశ చెందుతుందీ వార్త విని'' అని శ్రీ దర్గాస్వామివారంటే 'ఆమె హనుమంతుని అంశావతారం, ఆమెనడిగి చూడు' అన్నాడు దేవదూత. ఆమెగారినడిగితే **"అంతకంటే మహాభాగ్యమా"** అని అన్నారు. నాటి నుండి తల్లీబిడ్డలవలె ఒకే చోట, ఒకే ఇంట్లో జీవితాంతం నివసించడం మానవమాత్రులకు వీలు కాదు, అదీ ఒంటరిగా. **ఏకాంతమున ప్రియురాలిని గాంచి మాతృభావమున మరలు వాడే ఘనుడు** అన్నారు పెద్దలు. కఠోర బ్రహ్మచర్య వ్రతాన్ని ఆచరిస్తూ దైవస్వరూపులైనారు ఆ దివ్య దంపతులు.

శ్రీ రామకృష్ణ పరమహంసగారు, శారదాదేవిగారు అలా ఒకచోట ఉన్నారు గదా అని మీరనవచ్చు. శ్రీ శారదామాతగారు పరమహంస దగ్గరికి

వచ్చేసరికే పరమహంసగారికి అమ్మ దర్శనమై పిచ్చివాడనే పేరుతో విరాజిల్లుచున్నారు. ఇక్కడ శ్రీ దర్గాస్వామివారు కొన్ని క్షణాలలో మధురమైన మొదటి రాత్రికి సిద్ధమైయున్న సమయములో దేవదూత రావడం, శాశ్వతంగా భార్యను తల్లిగా ఆరాధించుటకు ప్రారంభం కావడం జరిగింది. ఇది మానవమాత్రులు చేయలేని త్యాగం. అందుకే వారు దైవం మానుషరూపేణ అయినారు.

## కనకములను వదులుట:

స్వామివారి తండ్రిగారు పెద్ద లక్షాధికారి. బంగారం అంగడి వుండేది. అమ్మయ్యగారు జమీందారి కుటుంబమునకు చెందినవారు. ఈమె ఒక్కరే బిడ్డ అయినందున చాలా గారాబంగా సాకారు. శ్రీ దర్గాస్వామివారిని వివాహమాడాక శ్రీ స్వామివారు తన ఆస్తిని, అమ్మయ్యగారి ఆస్తిని యావత్తు దానధర్మాలకు వినియోగించి రిక్తహస్తాలతో నిలిచారు. ఇదంతా కనకమును పరిత్యజించుట అవుతుంది.

దర్బార్ సాయి (భవనము) శంకుస్థాపనకు గొలగమూడికి శ్రీ స్వామివారు వచ్చారు. శంకుస్థాపన జరిగే చోట శ్రీ స్వామివారు అక్కడకొచ్చిన భక్తులందరినీ భక్తితో తోచినది సమర్పించమని అడుగుతున్నారు. కొంతమందినైతే "ఐదువేలు ఇస్తామని చెప్పు శ్రీ వెంకయ్య తాతగారు నీ జబ్బు నయం చేస్తారు" అని మరికొందరిని "పదివేలిమ్మని" అడుగుతున్నారు. వాళ్ళు ఇంటికి వెళ్ళి చెపుతాము స్వామీ అంటే "ఇంటికి వెళ్ళాక ఇవ్వడం - చెప్పడం ఇక్కడే" అని నవ్వుతున్నారు. వేలు ఇచ్చినవారు కూడా దూరంగానే వున్నారు. ఒక పేదరాలు అంతమందిలో ఒక్కరూపాయి సమర్పించింది. ఆ తల్లి రెండు చేతులూ శ్రీ స్వామివారు పట్టుకొని ఈ తల్లి భక్తితో ఒక రూపాయి సమర్పించింది. అదే నాకు పదివేలని మెచ్చుకున్నారు. చూచే ప్రేక్షకులలో కొందరు 'ఇదెక్కడి స్వామిరా బాబూ! ఇంత గొప్ప డబ్బు పిచ్చి వుండేవారిని తీసుకువచ్చారు' అని అనుకుంటున్నారు.

శ్రీ స్వామివారు అన్నాల హాలుకు నడిచిపోతున్నారు. ఒక భక్తుడు మధ్య దోవలో శ్రీ స్వామివారి పాదాలు పట్టుకొని వదలలేదు. కారణం

చెప్పమని శ్రీ స్వామివారు ఎంతో అనునయంగా అడిగినా చెప్పలేదు. తన తనివి తీరాక ఆ భక్తుడు లేచి తానొక మందిరం కట్టిస్తున్నానని వారి చేత్తో ఏమైనా ఇవ్వమని అర్థించాడు. శంకుస్థాపన దగ్గర వచ్చిన డబ్బంతా రిసీవర్‌గారికి ఇచ్చేశారు. ఇక వారి దగ్గర డబ్బు లేదు. రిసీవర్‌గారిని పిలిచి "ఇంటికి వెళ్ళాక నీకు పంపుతాను నాకు ఐదువేలు అప్పుగా ఇవ్వు" అని అడిగి తీసుకొని ఆ భక్తునికిచ్చారు. అంతేగాక "నీ అడ్రస్సు ఇచ్చిపో మరికొంత డి.డి. తీసి పంపుతాను" అని చెప్పారు. శంకుస్థాపన దగ్గర అందరినీ డబ్బులిమ్మని అడుగుతుంటే ఈయనకు డబ్బుపిచ్చి అనుకున్న వాళ్ళు ఇప్పుడు ఈ సన్నివేశం చూచారో లేదో మరి. వారు గొలగమూడికి వచ్చి సంపాదించినది ఐదు వేల రూపాయల అప్పు.

కొంతమంది సాధువులు మేము డబ్బు తాకము అని చెపుతూ భక్తులు తమకు ఇచ్చే డబ్బు మరొకరి దగ్గర వుంచుతారు. **డబ్బు మనస్సుతో తాకకూడదు. చేతులతో తాకితే ఏమీ కాదు.** శ్రీ స్వామివారు ఎన్ని లక్షలు ఎలా దానం చేస్తారో, ఎన్ని వివాహాలను చేయిస్తారో, ఎందరు విద్యార్థులను చదివిస్తారో లెక్క వుండదు. ఈ విషయంలో వీరు షిరిడీ సాయిని పోలి వుంటారు. ఇంతటి మహనీయమూర్తి మనకు మానవ రూపంలో లభించారు. **వారికి మనం సమర్పించే కానుకల కంటే మనం నిత్య జీవితంలో ఆచరించే సత్యం, ధర్మమే గొప్ప కానుకలని ఎరిగి, వారు మన లోపల, బయట నిరంతరం సాక్షీభూతంగా ఉన్నారనే గుర్తింపుతో వారిని సేవించి తరిద్దాం.**

ఈ మహనీయుడు మనందరిలాగే మానవరూపంలో వుండి ఒకప్పుడు మనలాగే అన్నం తిన్నారు. అమ్మయ్యగారిని వివాహమాడారు. కానీ ప్రస్తుతం రోజుకొక గ్లాసు ఆవుపాలుగానీ, లేక కొబ్బరికాయ నీళ్ళుగానీ తీసుకుంటూ మనకంటే ఎక్కువ హుషారుగా ఉంటారు. లోకంలో మానవమాత్రులు చేయలేని గొప్ప పనులు చేసారు.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 2

## మహాత్ములకు పుట్టినిల్లు

స్వామివారి ఆశ్రమము దర్బారు నగరము, నీలకంఠరావుపేట, రామాపురం మండలం. నీలకంఠుడు (శివుడు) ఇక్కడ పార్వతీదేవికి రామశబ్దం ఉపదేశించాడని ఇతిహాసమున్నది. ఆ పవిత్ర రామశబ్దం నీలకంఠునిచే ఉపదేశింపబడిన స్థలం కాబట్టి ఆ ప్రాంతానికి ఆ గ్రామానికి ఆ పేర్లు వచ్చాయని ప్రజల విశ్వాసం. అటువంటి పుణ్యస్థలంలో చాలా కాలం క్రిందట "దుర్గ" అనే ఆధ్యాత్మిక జిజ్ఞాసువు ముక్తి సాధనకై ప్రస్తుతము దర్గా వున్న ప్రదేశంలో తపస్సు చేసిందని, ఆ దుర్గయే మన మాతాజీగా జన్మించిందని పెద్దల నమ్మకం. అలాగే ఈ దర్బారు నగరం చుట్టూ తొమ్మిది శివక్షేత్రాలున్నాయని కూడా పెద్దల నానుడి. 1958 నుండి మాతాజీ, స్వామీజీల నివాస స్థానమై మరింత పవిత్రతను సంతరించుకున్నది.

స్థల పురాణం ప్రకారం 1474వ సంవత్సరంలో శ్రీ సద్గురు హజరత్ దర్బారు ఆలీషావలీ వారు వారి గురువు ఆదేశం ప్రకారం ఆ ప్రదేశానికి వచ్చారట, వారు ఆరేబియా దేశస్థులు. భారత దేశమంతటా పర్యటించి ఈ ప్రాంతం చేరుకున్నారు. వారి గురువు ఇచ్చిన జువ్వినేరేడు కొమ్మలు ఎండిపోయినవి. ఆ రెండింటినీ అక్కడికి చేరిన రాత్రి నాటారు. ఆ రెండు కొమ్మలు మరునాటి ఉదయానికి చిగురించాయి. ఆ సంకేతంతో గుర్వాజ్ఞ మేరకు వారు అక్కడే సమాధి అయ్యారు. అ జువ్వి చెట్టునుండి ఓంకార నాదం వినబడుతుందని ప్రజల నమ్మకం. ఆ తర్వాత 200 ఏండ్లకు 1674లో మరొక ముస్లిం మహాత్ముడు సద్గురు హజరత్ జలీల్ మస్తాన్ వలీ కూడా ఆ ప్రదేశానికి వచ్చి స్థల మాహాత్మ్యాన్ని గుర్తించి అక్కడే మహా సమాధి అయ్యారు. ఇద్దరూ దత్త సంప్రదాయానికి చెందిన

మహిమాన్వితులు. **వారి సమాధుల నుండి ఈనాటికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు జరుగుతుంటాయి. అందువలననే ఆ సమాధుల చుట్టూ ఎన్నిసార్లు మూత వేయించినా వగుళ్ళుబారి నెర్రెలిడుచుండును.** ఇక్కడి వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంటుంది. పరిసర నైసర్గిక దృశ్యం చాలా అందంగా ఆహ్లాదకరంగా ఉంటుంది.

దర్గా అంటే సూఫీ మహాత్ముడి సమాధి మీద కట్టిన కట్టడం. ఉరుసు అంటే పరిమితమైనది అనంతమైన దానిలో ఐక్యమవటం. ప్రతి సంవత్సరం మహనీయుని సమాధి అయిన రోజున ఉత్సవం చేసుకుంటారు. కొవ్వొత్తులతో, విద్యుద్దీపాలతో దర్గాను అలంకరిస్తారు.

ఒకసారి ఉరుసు ఉత్సవానికి దర్గాల దగ్గరకు ఎక్కడ నుండో ఒక మహాత్ముడు వచ్చాడు. అప్పుడు స్వామి "వేరే చోట్ల ఉరుసు ఉత్సవం ఎంతో ఆడంబరంగా జరుగుతూ వుంటే మీరు ఇక్కడకు ఎందుకు వచ్చారు?" అని అడిగారు. అప్పుడు ఆ మహాత్ముడు **"అక్కడ ఎంతో ఆర్భాటంగా జరుగుతుంది. కానీ అక్కడ వెలుగు లేదు. ఇక్కడ ఆ వెలుగు ఉండటం వలన ఇక్కడకు వచ్చాను"** అని చెప్పారు. "ఆ మహాత్ములే నన్ను నిర్భయుణ్ణి చేసారు" అని చెప్పారు.

ఇలాంటి ఉత్సవాలలో **భగవంతుని మెప్పించేది భక్తి, శ్రద్ధ (వెలుగు)** కానీ అట్టహాసం కాదు అని ఆ మహనీయుడు బోధిస్తున్నాడు. సాధ్యమైనంతసేపు భక్తులందరూ పారాయణ, ధ్యానము, నామస్మరణ, భజనలు చేయాలని, అదీ శ్రద్ధాభక్తులతో చేయాలని ఆ మహనీయుని ద్వారా భగవంతుడు మనకు బోధిస్తున్నాడు.

అలానే మరొక అవధూత ఒకామె దర్గాల వద్దకు వచ్చి వుంటుండేవారు. స్వామి ఒక పూజారిని పిలిచి ఆమెకు అన్నం పెట్టమని చెప్పారు. అతడు స్వామి మాట కాదనలేక అలానే తీసుకు వెళ్ళాడు. అప్పుడామె "అందరి వద్ద అడుక్కుని నాకు తెచ్చావు. అదైనా అన్నయ్య తెమ్మన్నాడని తెచ్చావు కదూ!" అన్నారట. అతడు స్వామి వద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పగా "ఆమె అన్నదాంట్లో తప్పేమీ లేదు. నీవు పూజారివి.

అందరి వద్ద అడిగి తీసుకుంటూ వుంటావు. అలానే నేను చెప్పడం వల్లనే కదా నీవు ఆమె వద్దకు పోయావు. లేకుంటే వెళ్ళేవాడివి కాదు కదా!" అన్నారు.

శ్రీ స్వామివారు షోలింగర్‌లో (తమిళనాడు) వుండేటప్పుడు ఒకరోజు అమ్మయ్యగారు సమాధుల దగ్గర హారతిస్తున్నారు. అప్పుడొక దుర్మార్గుడు ఆమెకు హాని చేసే తలంపుతో అమ్మయ్యకు 10 అడుగుల దూరం వరకు వచ్చాడు. సమాధులలో వుండే ఒక మహనీయుడు ఆ దుర్మార్గుని చెంపమీద కొట్టడంతో అతడు క్రిందపడి దభేలుమని శబ్దమైంది. ఈ శబ్దం ఏమిటా అని అమ్మయ్యగారు వెనక్కు తిరిగి చూచారు. అప్పుడతడు లేచి పరుగెత్తి పోతున్నాడు. అది మొదలు ఎవ్వరూ ఇలాంటి దుష్ట తలంపులతో ఆ నిర్జన ప్రదేశంలోకి వచ్చేవారు కాదు. ఆ విధంగా ఆ సమాధులలోని మహనీయులు వారిని అనుక్షణం కాపాడుతున్నారు. అప్పుడు అమ్మయ్యగారి వయసు 20 సంవత్సరములుంటాయి.

ఇక్కడి దర్గాల సమీపాన ఒక చెట్టు వుంది. ఆ చెట్టునుండి రెండు పాములు బయటకొచ్చి దర్గాలకు ప్రదక్షిణలు చేసి ఆ చెట్టులోకి పోయేవి. ఒకరోజు కొందరు గ్రామస్తులు ఆ చెట్టును కొట్టాలని గొడ్డళ్ళు తీసుకువచ్చారు. ఆ రెండు పాములు వారిపైన పడడంతో వాళ్ళు గొడ్డళ్ళు అక్కడ పారేసి దూరంగా వణుకుతూ ఆయాసపడుతూ నిలుచున్నారు. వాళ్ళబాధ చూచి శ్రీ స్వామివారే తిరిగి ఆ గొడ్డళ్ళను తీసుకుపోయి ఇస్తే నమస్కరించి వెళ్ళారు.

స్వామిసేవలో వున్న శంకరయ్య ఇలా చెప్పాడు.

ఆశ్రమంలో చాలా ఎలుకలు వున్నా ఒక్క బియ్యం బస్తాకు కూడా కన్నం వేయలేదు. ఆశ్రమంలో ఎప్పుడూ కొన్ని బస్తాల బియ్యం వుంటూనే వుంటాయి.

## జనవరి 30, 2011న శ్రీ దర్గాస్వామివారి దివ్య భాషణ

ఆ పరమాత్ముడిక్కడ ఉన్న ఆ సమాధుల్లో ఉన్నవారి దగ్గరకు మమ్మల్ని చేర్చారు. ఆయన పేరేమిటో తెలుసా? ‘‘హజరత్ దర్బార్ అలీషా వలీ రహంతుల్లా’’ అంటారు. మేమిక్కడకు వచ్చాక ‘‘శ్రీ సద్గురు’’ అని పేరు పెట్టాము. శ్రీ సద్గురు హజరత్ దర్బారు ఆలీషా వలీ. అలీ అంటే ఆంజనేయులు. షా అంటే చక్రవర్తి, వలీ అంటే ఋషి సాంప్రదాయం. ఆ భగవంతుడు, ఆ పరబ్రహ్మ స్వరూపమైన పరమాత్ముడు రహంతుల్లా కరుణామయుడైన ఆ దేవుణ్ణి హృదయంలో నింపుకున్నాము. ఆ పుణ్య పురుషుడు మా సద్గురువు సమస్తము చేయించాడు. అన్నీ చేసాడు. ఇక్కడున్న వాళ్ళకు స్కూలు పెట్టించాడు. ఇక్కడ ఉన్న సమస్త బిల్డింగులు అన్నీ కట్టించాడు. ఆ భక్త సులభుడు, ఆ సత్య స్వరూపుడు, నిండు సమాధిలో ఉన్నాడు. ఆయనే దర్బార్ అలీషావలీ. అలీ అనే ఆయన మన సాయినాథుని చరిత్రలో దత్తాత్రేయుని అంశలో వచ్చినవాడు సద్గురువే అయ్యేను. ఆయన సన్నిధిలో ఒక వ్యక్తిగా వున్నవాడే ఆయన గురువు దగ్గర రెండు పుల్లలు తెచ్చి ఇక్కడ నాటి వాటిని నిలబెట్టుకుంటూ వచ్చారు. జువ్వి చెట్టు వుంది. నేరేడు చెట్టు లేదు. అప్పుడు అక్కడ సమాధి అయినారు. ఇక్కడ వుండి నిలబడినవారు తెలుసా: శివతత్వం నమామీశ్వరం సద్గురుం సాయినాథం అంటామే అటువంటిదే. అలీషావలీ రహంతుల్లా కరుణామయుడు ఆంజనేయులంటామే ఆ సద్గురువుగారు ఇదే టైములో 1957లో పాదం పెట్టాడు. రాత్రిపూట నొసళ్ళు పిసికాడు. తనలోని అంతశ్శక్తిని నాలోపల ప్రవహింపజేసి ప్రపంచంలో వున్న వస్తువులు నీ వెంట రావు, ఇవి శాశ్వతం కావు అని బోధ ఇచ్చి ఇక్కడకు పంపించి ఆ సద్గురు సన్నిధిలో నిలిపారు. మీరు ఇక్కడకు వచ్చి భజనలు, పూజలు చేస్తున్నారంటే మీ మనోభీష్టాలు, కోరికలు నెరవేరుతాయి. పరబ్రహ్మ స్వరూపుడైన పరమాత్ముడైన ఆ సద్గురువు దర్బార్ ఆయనే సాయినాథుడు. దర్బార్ సాయిరూపంలో ఇక్కడకు

వచ్చి నిలిచాడు. పంచలోహాలతో వస్తానన్నాడు. పంచలోహాలతో వచ్చారు. అందరి పూజలు అందుకుంటున్నాడు. అటువంటి పరబ్రహ్మ స్వరూపుడి యొక్క భజన చేసి మనమందరమూ ఈ రోజు భక్తిపూర్వకంగా వారి వారి మనోభీష్టాలను కోరుకున్నవి లభించాలని ఆ పరమాత్మ స్వరూపుడైన శిరిడీ సాయిని నా హృదయంలో ధ్యానించి మీ అందరికీ ఆశీస్సులీయమని కోరుకుంటున్నాము.



**సద్గురు హజరత్ దర్బార్ ఆలీషావలీ, సద్గురు హజరత్ జలీల్ మస్తాన్‌వలీల సమాధులు**

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 3

## గురుసేవ

శరీరమింద్రియం ప్రాణం అర్థ స్వజన బాంధవాన్
ఆత్మదారాదికం సర్వం సద్గురుభ్యన్నివేదయేత్

తాత్పర్యము: శరీరమును, ఇంద్రియములను, ప్రాణములను, ధనమును, భార్యాపుత్రాది స్వజనమును సద్గురువునకు నివేదించవలెను.

పరమాత్మ తప్ప అన్యమేదీ భూమి మీద లేదు గనుక నిజమైన గురుభక్తుడుగా తనను తాను గురువుగారి పాదాలకు అంకితం చేసుకున్నారు. తనను ఆశ్రయించిన వారందరి కర్మలు, తన సేవకుల కర్మలు తన తపోశక్తితో క్షాళణ చేస్తారు. తపోశక్తితో క్షాళణ చేయలేనివి, తప్పనిసరిగా ఆయా శరీరాలు అనుభవించవలసి ఉంటే అలాంటి కర్మలను తన శరీరం మీదకు తీసుకొని తానా బాధను అనుభవిస్తూ ఆయా వ్యక్తులకు బాధ విముక్తి చేస్తున్నారు.

**"సాధు దర్శనం పుణ్యం - స్పర్శనం పాపనాశనం"** అన్నారు పెద్దలు. రోజుకొక గ్లాసు ఆవుపాలు గానీ, లేక కొబ్బరికాయ నీళ్ళు మాత్రమే తీసుకునే మన స్వామి గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి లాగా తన వృద్ధాప్యాన్ని కూడా లెక్క చేయక శ్రద్ధాభక్తులు గల అమాయకులైన తన భక్తులకు దర్శనమిచ్చేందుకు ఎన్నో ఇబ్బందులు, కష్టాలను సంతోషంగా ఓర్చుకొని అనేక గ్రామాలు, పట్టణాలలో జరిగే మందిర శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు, భక్తుల వివిధ సత్సంకల్పాలను నెరవేర్చటానికి సంచరిస్తున్నారు.

నీలకంఠరావుపేటలో ఏదన్నా పండుగలకు, ఉత్సవాలకు మాత్రమే భక్తుల రద్దీ ఎక్కువగా వుంటుంది. మిగిలిన సమయాల్లో స్వామికి విశ్రాంతే కదా అనవచ్చు. స్వామి దినచర్యను చూస్తే కానీ స్వామి ఎంత శారీరక శ్రమ చేస్తారో తెలియదు. ఉదయం 4 గంటలకు

మందిరము తెరచి గుడ్డతో మందిరం చుట్టూ వున్న దుమ్మును తోసుకోవాలి. 5గం॥ 15 ని॥ల ఆరతికి కావలసిన సామాన్లు సిద్ధం చేసుకోవాలి. తరువాత గోవింద నామాలు, భజన, సద్గ్రంథ పఠన 7 గంటల దాకా జరుగుతుంది. ఉదయం 9 గంటలకు దర్గాల దగ్గర దీపాలు పెట్టిన తర్వాత, వచ్చిన భక్తులకు వాళ్ళు వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. భక్తుల ప్రశ్నలు తరచూ తలతిక్కగా వుంటాయి. అన్నింటికీ సావధానంగా సమాధానమివ్వాలి. మధ్యాహ్న ఆరతి, తర్వాత సాయంత్రం మరలా వచ్చే భక్తులకు సమాధానమివ్వాలి. సాయంత్రం 6 గం॥ 30 ని॥లకు సాయం ఆరతి, భజన, సద్గ్రంథ పఠనం తర్వాత రాత్రి 10 గంటలకు పవళింపు ఆరతి అయిన తర్వాత స్వామి విశ్రాంతి తీసుకోవటానికి ఉపక్రమిస్తారు. అర్ధరాత్రిపూట దర్గాల దగ్గర పడుకున్న భక్తులకు స్వామి అరుపులు అప్పుడప్పుడూ వినబడతాయి. ఏ విధంగా ఏఏ భక్తులను రక్షిస్తున్నారో స్వామికే ఎరుక!

సద్గురువులోనే విశ్వమంతా ఉన్నది, విశ్వమధ్యములో శ్రీ గురుడు ఉన్నాడని గురుగీతలో చెప్పినట్లు తననాశ్రయించిన భక్తులకు ఇబ్బందులు వస్తే స్వయంగా తన గురువుగారికే వచ్చాయని తలచి సచ్ఛిష్యుడిలాగా సకల ఉపచారాలు చేస్తారు స్వామి. ఒకరోజు డా॥ మల్లిఖార్జున రెడ్డిగారు కాలు పట్టేస్తోందంటే ఊదీ కాలంతా పూసి సాధారణత్వం అంటే ఎలా వుంటుందో చూపుతున్నారు స్వామి.

ఇంతటి నిత్య కార్యక్రమములో టెలిఫోను ద్వారా స్వామి ఆశీస్సుల కోసం మాట్లాడేవారు ఎంతమందో! **ఆఖరికి అర్ధరాత్రిపూట కూడా ఫోను మ్రోగితే స్వయంగా స్వామే ఫోనులో మాట్లాడి సమాధానపరుస్తారు.**

కొంత మంది భక్తులు స్వామిని ప్రార్థించి వారానికి ఒకరోజు మాట్లాడాలని ఫోను చేసి మాట్లాడుతూ ఉంటారు. ఎప్పుడైనా వారు ఫోన్ చేయలేక తరువాతరోజు ఫోన్ చేస్తే ఎందువలన ఫోనుచేయలేదు అని గుర్తుంచుకొని అడుగుతారు.

ఇంతటితో స్వామివారు అలసిపోతారా అంటే లేదే! తన చుట్టూ

వున్న భక్తుల మనస్సులో తలెత్తిన దుష్టతలంపులను తీసివేయటానికి కోపముతో అరచి హెచ్చరిస్తారు. అంతేకాక తననాశ్రయించిన వారు ఏమరుపాటుగా ఉంటే వారిని తగు విధంగా సంస్కరిస్తారు.

వేణుగోపాల్ గారు, చెన్నై ఇలా చెపుతున్నారు: విల్లివాకంలో స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించిన సాయిబాబా మందిరంలో ప్రతిరోజు ఉదయం ఆరతి, తర్వాత గోవింద నామాలు, భజన చేస్తాము. అక్టోబరు, 2010లో ఒకరోజు బద్ధకంగా నేను, శ్రీకాంత్‌గారు ఆరతి, గోవిందనామాలు చేసాము. ఏదో అయింది అనిపించాము కాని ఉత్సాహంగా చేయలేదు. ఆరోజు సాయంత్రం గోవర్ధన్‌గారు స్వామి దగ్గరనుండి వస్తూనే ఏమిటీ! ఆరతి బద్ధకంగా చేశారా! **ఉదయం స్వామి మీరు బద్ధకంగా చేస్తున్నారని చెప్పి ఈ రెండు బిస్కెట్లు మిమ్మల్ని తినమని** చెప్పారు అని చెప్పేసరికి మాకు ఆశ్చర్యంతో నోటమాటరాలేదు. అంటే మేము చెన్నైలో చేసే ప్రతి చేష్ట ఆయనకు తెలుస్తోందని మాకు తెలియచేసి మమ్మల్ని సరైన మార్గంలో పెట్టారు.

ఇప్పుడు చెప్పుకున్న స్వామి నిత్యకార్యక్రమము మనం చూస్తే అర్థమయ్యేది. మనకు అర్థం కాకుండా ఇంకెన్ని పనులు నిర్వర్తిస్తున్నాడో ఆ పరమాత్మకే ఎరుక. ఇంతకీ స్వామి రోజులో తీసుకునేది ఒక గ్లాసుడు ఆవు పాలు లేదా కొబ్బరి నీళ్ళు మాత్రమే!

స్వామీజీ, మాతాజీలు భక్తుల వివాహాలు జరిపించడమేగాకుండా ఇతర విధాలుగా కూడా పేదలను, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకొనేవారు. ఎంతో మంది పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, వారికి పుస్తకాలు వగైరా కొని ఇవ్వడం, వారికి పరిపాటి. చిన్నక్లాసుల నుండి - పి.జి, ఇంజనీరింగ్ వగైరా పెద్ద చదువులు చదువుతున్నవారికి కూడా మాతాజీ ధన సహాయం చేసేవారు. ఆ విధంగా అమ్మయ్యగారు చదివించినవారు మనదేశంలోనే గాక విదేశాలలోను గొప్ప ఉద్యోగాలలో ఉన్నారు. వారు ఈనాటికి మాతాజీ దానశీలత, ఉదారత, అనురాగం, ఆప్యాయత మరచిపోలేదు, మరచిపోలేరు కూడా. స్వామీజీ, మాతాజీ సంకల్పించిన మరొక మహత్తర సేవాకార్యం గ్రామీణ పేద విద్యార్థులకు రెసిడెన్షియల్

హైస్కూల్ స్థాపించడం, దర్బారు నగరంలో అనంత కల్యాణ మండపం హాలు వెనుకనే ఈ స్కూలు భవనం నిర్మించబడింది. రెండు అంతస్తులు గల ఈ భవనం ప్రతి అంతస్తులోను 12 తరగతి గదులు, ఒక ధ్యాన మందిరం ఉన్నాయి. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ స్కూలుకు ప్రభుత్వ గుర్తింపు ఉన్నది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచిత మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. స్కూలు బస్సు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి విద్యార్థులను తీసుకు వస్తుంది. ఎక్కువమంది విద్యార్థులు స్కూలులోనే ఉంటారు. వారికి ఉచిత వసతి సదుపాయం ఉన్నది. (ప్రస్తుతం ఈ స్కూలు ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తుంది.) ఈ విధంగా అన్నదానం, విద్యాదానం, జ్ఞానదానం చాలా గొప్పవని స్వామి, మాతాజీ మనకు పరోక్షంగా బోధిస్తున్నారు. దానితో పాటు మనం నేర్చుకోవలసినది దానానికి ప్రాతి పదికలు ప్రేమ, కరుణ, త్యాగశీలత అని.



**స్వామివారి గురువుగారు**

**శ్రీ సమర్థ సద్గురు దర్గారు సాయినాథాయ నమః**

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 4

## సర్వజ్ఞుడు - సర్వసమర్థుడు

**సాధన ద్వారా సద్గురు కృపను పొంది, వారి అనుగ్రహం వలన ఆత్మజ్ఞానం పొందిన మహనీయులే సిద్ధ పురుషులు.** శాస్త్రాలలో భగవంతునకు చెప్పబడ్డ సర్వజ్ఞత్వం, సర్వసమర్థత, సర్వ వ్యాపకత్వం అట్టివారిలో సంపూర్ణంగా ప్రకటమవడం భక్తులకు అనుభవైకవేద్యము. ఇట్టి మహనీయులు ప్రపంచంలో ఎక్కడ ఏమి జరుగుతున్నదో అనుక్షణము తెలుసుకుంటూ అద్భుతరీతిన తమ భక్తులను అనేక సంకటముల నుండి రక్షిస్తుంటారు. ఈ అధ్యాయంలో శ్రీస్వామివారి యొక్క సర్వజ్ఞత్వం, సర్వసమర్థత్వం చూస్తాము.

### శ్రీ పెనల సుబ్బరామయ్యగారు, గొలగమూడి

1. దర్గాస్వామివారితో నా ప్రథమ అనుభవము: 2001వ సంవత్సరము వరకు వివిధ భక్తుల అనుభవాలు వినడం తప్ప నాకే అనుభవాలూ లేవు. 2001వ సంవత్సరములో గొలగమూడిలో శ్రీ బ్రహ్మంగారి మఠం పునరుద్ధరించే పని శ్రీ వెంకయ్యస్వామివారు నాకు ప్రసాదించారు. శ్రీ దర్గాస్వామివారు ఆ పవిత్ర ప్రదేశానికి వచ్చి "డబ్బు ఆయనే తెప్పించుకుంటారు నీవు స్లాబు వేయి. సిమెంటు రేకులు వద్దు" అని అన్నారు. ఈ పనికి గాను నాకు తెలిసిన పెద్దమనిషిని చందా అడగాలని వెళ్ళాను. వెంటనే ఆయన 'మందిరాలు కట్టిస్తారు. దీపాలు పెట్టే దిక్కు వుండరు. కట్టించటం కాదు ఆ తరువాత నిర్వహణ సమస్య' అని అన్నారు. నేను వెంటనే ఆయనను అడగకుండా వచ్చేశాను. ఆ ప్రక్కరోజు నుండీ శ్రీ దర్గాస్వామివారు నీలకంఠరావుపేట నుండి నాలుగుమార్లు నలుగురి చేత "దీపం పెట్టే దిక్కు వుండదు అని అన్నారు, అది ఎలా పెట్టరో చూస్తాను. పని త్వరగా కానిమ్మని

చెప్పు'' అని చెప్పి పంపారు. నేను స్వామివారిని కలవలేదు. ఆ మాట అన్న పెద్దమనిషి వారికి ఆ మాట తాను అన్నట్లు చెప్పరు. మరి వారికి ఆ మాట ఎట్లా తెలిసింది? వారు సర్వాంతర్యామి కానిదే అలా చెప్పలేరు కదా!

2. నన్ను స్వామివారు బ్రహ్మంగారి మఠానికి రసీదు పుస్తకాలు అచ్చు వేయించమన్నారు. కానీ నా మనస్సులో ఇష్టం లేదు. ఎందుకు అంటే కొంతమంది రసీదు పుస్తకాలు తీసుకువెళ్ళి తిరిగి తెచ్చి ఇవ్వరు. ఇది శ్రీ వెంకయ్యస్వామివారి ఆశ్రమంలో నాకు అనుభవం. శ్రీ దర్గాస్వామివారు గొలగమూడి వస్తూనే నాతో మొదట పలికిన మాట "రసీదు పుస్తకాలు వేయించు, అవి తిరిగి రాకుంటే నాది బాధ్యత'' అని అన్నారు. ఇది నా మనసులోని అనుమానానికి సమాధానం. వారు సర్వభూత హృదయాంతర్వర్తి కానిదే నా మనస్సులోని అనుమానం తెలుసుకోలేరు.

3. 2001వ సంవత్సరంలో గొలగమూడిలోని బ్రహ్మంగారి మఠం పునరుద్ధరించే పని శ్రీ వెంకయ్యస్వామివారు నాకు అనుగ్రహించారు. అది ఆ మహనీయుని యొక్క పవిత్రసేవ అని, ఆ ఆదేశాన్ని తప్పక పాటించాలని తెలుస్తూ వుంది. కానీ నాలోని హీన సంస్కారాలు - అంటే పిసినిగొట్టుతనము, ధనవ్యామోహము లాంటివి ఆ సేవను చక్కగా చేయకుండా అడ్డుపడుతున్నాయి. ఒక భక్తుడు ఇచ్చిన డబ్బుతో పడిపోయిన పూరిపాకను తిరిగి అదే సామానుతో కప్పించాలనుకున్నాను. తాటాకు కూడా తెచ్చిపెట్టాను. శ్రీ స్వామివారు నా మనస్సు మార్చారు. ఈ తాటాకు పని ప్రతి సంవత్సరమూ కష్టమే. ఇంకొక వెయ్యిగాని రెండువేలుగానీ సొంతంగానైనా ఖర్చు పెట్టి మూడు సిమెంటు రేకులు వేస్తే ఇక ఎప్పటికీ పని ఉండదని 3 మీటర్ల సిమెంటు రేకులు తెప్పించాను. నాలుగు మూలల్లో కంకర, సిమెంటు, కమ్ములతో చేసిన నాలుగు స్థంభాలు నాటి చుట్టూ నాలుగు అంగుళాల గోడ సగం పెట్టించాను.

ఆ సమయంలో సద్గురు శ్రీ దర్గాస్వామివారు గొలగమూడి

విచ్చేశారు. ఆ మహనీయుడు తన పాదస్పర్శతో పవిత్రం చేస్తే ఈ బ్రహ్మంగారి మఠం పని పూర్తవుతుందని వారిని అర్థించి మఠ నిర్మాణ స్థలానికి తీసుకువచ్చాను. ఆ మహనీయుడు "తలా ఒక పువ్వు వేస్తే పూలమాల అవుతుంది. నీవు సిమెంటు రేకులు గాకుండా స్లాబే వేయమ"ని ఆదేశించారు. "స్లాబు వేయాలంటే డబ్బు కావాలి కదా స్వామీ! నేనందుకు చాలను" అని విన్నవించాను. "బ్రహ్మంగారే డబ్బు పంపుతారు. ఆరు కమ్మిలు, పది బస్తాల సిమెంటు సరిపోతుంది, స్లాబు వేయించు" అని చెప్పి వెళ్ళిపోయారు. నాకు పచ్చి వెలక్కాయ గొంతున పడినట్లయింది.

ఆ మహనీయుడు చెప్పినట్లు చేసేందుకు తెంపురాదు. వారు ఆజ్ఞాపించారు కనుక చేయకుండా వుండలేను. కనీసం నెలరోజులు పని ఆపి ఆలోచిస్తున్నాను. ఈలోగా నేను పని చేయించని విషయం తెలిసే కాబోలు పని ఎంతవరకు వచ్చింది అని గొలగమూడి నుండి వెళ్ళిన భక్తులను నాలుగుసార్లు అడిగారు. వేసవికాలమైనందున బ్రహ్మంగారి బావి ఎండిపోయింది. నేను పని చేయించక పోవుటకు కారణం దొరికింది. వెంటనే శ్రీ స్వామివారికి బావి ఎండిపోయిన సంగతి లెటరు వ్రాసి నీరు వస్తే పని చేస్తానని తెలిపాను.

ఆ మహనీయునకు నా ఆత్మలోని బాధ తెలియకపోలేదు. క్యాన్సరు వ్యాధిని శ్రీ స్వామివారి ఆశీస్సులతో పోగొట్టుకున్నవారు స్వామివారికి కృతజ్ఞతలు తెలిపేందుకు నీలకంఠరావుపేట పోతే గొలగమూడిలో నిర్మించే బ్రహ్మంగారి మఠం చూసి వెళ్ళమన్నారు. ఆ భక్తుడిక్కడికి వచ్చి నా బాధంతా విని 'సార్! ఏమైనా సరే మీరు స్వామివారు చెప్పినట్లే చేయండి. దానికవసరమైన కమ్మిలు, సిమెంటు నేనిస్తానన్నాడు'. సరేనన్నాను. వారు 60 కమ్మిలు, 30 బస్తాల సిమెంటు పంపారు.

యుగంధర్ అనే భక్తుడు 'ఫలానారోజు నా యింటికి స్లాబు పోస్తున్నాను. ఆ రోజే బ్రహ్మంగారి మఠానికి స్లాబు పోయాలని' పట్టుబట్టి పని జరిపించారు. మంచి వేసవి, బావిలో చుక్క నీరు లేవు. ఆ భక్తుడు 300 గజాలకు పైన రబ్బరు పైపులు జాయింటు చేసి స్లాబుకే కాక

క్యూరింగ్‌కు కూడా నీళ్ళు సరఫరా చేసాడు.

ఈ లోగా నా అభ్యర్థన లేకుండానే అనేక భక్తుల సహకారంతో మఠం మాత్రమే గాకుండా పూజారికి రెండు రూములు సిమెంటు రేకులతో వేసాము. చుట్టూ ప్రహరీ గోడ, గేటు ఏర్పడ్డాయి. ఒక భక్తుడు 5 అడుగుల బ్రహ్మంగారి పటమిచ్చాడు. మఠంపైన కలశం పెట్టాలి. ఒకరి ద్వారా ఆర్డరు ఇచ్చి డబ్బు ఇస్తానన్నాను. చిత్రంగా ఆ వ్యక్తి ఆ కలశం ఖర్చు తానే భరించాడు. 26-11-2001 నాడు సద్గురు శ్రీ దర్గాస్వామివారి కరకమలములతో మఠ ప్రారంభోత్సవం దివ్యంగా జరిగింది.

ఇంతటి పని నేను చేయిస్తానని కలలో కూడా అనుకోలేదు. స్వామివారి దివ్య ఆశీస్సులే ఈ కార్యమంతా చేయించింది.

## నా మిత్రుడు హైదరాబాదు నుండి ఇలా వ్రాస్తున్నారు.

"నేను దర్గాస్వామివారి దర్శనార్థం వెళ్ళాను. నా భార్య ఆరోగ్య విషయం అడగాలని తలచాను. నేను వారికి నమస్కారం చేయగానే తన ఎడమ చేత్తో కుడిచేతి జబ్బ మీద కొట్టుకుంటున్నారు. నేను నా భార్య ఆరోగ్య విషయమై వారికి చెప్పనేలేదు. నేను మాట్లాడకముందే వారన్నారు "నేను నీ భార్యకు నొప్పి ఉండేచోట కొడుతున్నాను. తగ్గిపోతుందిలే" అన్నారు. నిజంగా నా భార్యకు అక్కడే (జబ్బ మీదే) నొప్పి, అది అడగాలనే వచ్చాను. నేను ఏమీ చెప్పకుండానే వారే అలా పలికారు. అనతికాలంలో ఆమె నొప్పి నుండి విముక్తి పొందింది. వారు సర్వజ్ఞులనీ, సర్వసమర్థులనీ, సర్వవ్యాపకులనీ నిస్సందేహంగా చెప్పుచున్నాను. వారిని తగు విధంగా సేవించే భాగ్యం ప్రసాదించమని సద్గురుమూర్తిని ప్రార్థిస్తున్నాను.

## శ్రీ దారా నాగేశ్వరరావుగారు, దమ్మపేట, ఖమ్మంజిల్లా

1994లో శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామివారి దర్శనార్థం వెళ్ళినప్పుడు శ్రీ స్వామివారు నాగేశ్వరరావుగారిని శ్రీ గురు చరిత్రను ఎక్కడో ఒక చోట తెరవమన్నారు. వారు తెరిచిన చోట 10వ అధ్యాయంలో వల్లభేశుడిని దొంగలు చంపబోతే శ్రీ శ్రీపాదులవారు రక్షించిన సన్నివేశం వచ్చింది.

దీన్ని నిత్యం శ్రద్ధగా పారాయణ చేస్తుండమని చెప్పారు. నాగేశ్వరరావుగారు అలాగే చేస్తూ వచ్చారు. 1996వ సం॥లో వీరు శ్రీ పాదస్వామివారి దర్శనార్థం కురువపురం పోతూ కృష్ణానదిని బుట్టపడవలో దాటవలసి వచ్చింది. బుట్ట నది మధ్యలోకి వెళ్ళేసరికి బుట్టకు రంధ్రం పడి నీళ్ళు బుట్టలోకి వచ్చేస్తున్నాయి. బుట్ట నడిపేవాడు 'బుట్ట మునిగిపోతుంది, అందరూ నదిలో దూకెయ్యండి, ఈత వచ్చినవాళ్ళు ఒడ్డుకు చేరుతారు అని' అరుస్తూ తాను నీటిలోకి దూకేశాడు. అతని తోటి మిగిలిన అందరూ దూకేశారు. కానీ ఒక ఆడమనిషి, పదిహేను సం॥ల వయస్సుగల ఆమె కుమార్తె, నాగేశ్వరరావుగారు ఈత రానందున బుట్టలో వుండిపోయారు. నిమిషంలో బుట్ట ప్రక్కకు ఒరిగిపోయి నాగేశ్వరరావు నీటిలో వున్నారు. ప్రాణభీతిచే తనను రక్షించమని శ్రీ పాదస్వామిని ప్రార్థిస్తూ బిగ్గరగా అరుస్తున్నాడు. బుట్టవాడు అందులో ఉన్న ఆమెను రెక్క పట్టుకొని ఒడ్డుకు తీసుకుపోతున్నాడు. ఈలోగా నదిలో తేలుతున్న బొగ్గులమూట దొరికినందున దాన్ని నాగేశ్వరరావుగారు పట్టుకున్నారు. ఆ మూట ఒక బండకు తగిలి ప్రవాహంలో కొట్టుకుపోకుండా ఆగింది. అది అలా ఆగకుంటే వారు ఆ ప్రవాహంలో కొట్టుకుపోయేవారే! బుట్టవాడు వచ్చి వారిని ఒడ్డుకు లాక్కుపోయాడు. ఈ ప్రమాదంలో 15 సం॥ల అమ్మాయి చనిపోయింది. శ్రీ దర్గాస్వామివారు 2 సంవత్సరాలకు ముందే శ్రీ శ్రీపాదులవారి దగ్గర ఈ ప్రమాదం జరుగుతుందని తెలిసే వల్లభేశుని వృత్తాంతం నిత్యం పారాయణ చేయమన్నారు. మానవాకారం ధరించిన దైవమే శ్రీ దర్గాస్వామివారని వారి దృఢనమ్మకము.

## రోకలి బండతో భర్తను కొట్టేందుకే:

ఆ రోజు గొలగమూడిలోని శ్రీ బ్రహ్మంగారి మఠం ప్రారంభోత్సవంలో శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామివారు ఉపన్యసిస్తున్నారు. చాలా మంది భక్తులు కిక్కిరిసియున్నారు. అదే రోజు ఆ గ్రామంలోని ఒక గృహప్రవేశమునకు చాలామంది బంధువులు వచ్చి వున్నారు. ఉపన్యాసం మధ్యలో ఒకామె హఠాత్తుగా లేచి 'స్వామీ! ఈ సంసారం, భార్య, పిల్లలు ఇదంతా ఎందుకు

స్వామీ?' అని అడిగింది. "ఎందుకేమిటమ్మా! కలర్ టీవీలు, నగలు తెచ్చివ్వలేదని మొగుణ్ణి రోకలి బండతో కొట్టేందుకమ్మా" అని చెప్పి స్వామి తమ ఉపన్యాసం కొనసాగించారు. ఆమె కిం అనకుండా కూర్చుంది.

గృహప్రవేశం దగ్గర మగవాళ్ళంతా భోంచేసి తాంబూలం సేవిస్తూ పెద్దగా నవ్వుకుంటున్నారు. విషయమేమిటని కనుక్కుంటే ఇందాక శ్రీ స్వామివారు రోకలిబండతో భర్తను కొట్టేందుకే ఈ సంసారమని చెప్పారు గదా! ఆ ప్రశ్న అడిగిన ఆమె తన మొగుణ్ణి రోకలిబండతో కలర్ టీ.వీ తేలేదని కొట్టింది అని చెప్పారు.

ఎంత చిత్రమో చూడండి. శ్రీ స్వామివారు ఎప్పుడూ వారి గ్రామం పోలేదు. ఆ విషయం వారికి తెలియదని మనం అనుకుంటాము. ఆమె అడిగిన వెంటనే ఏమీ తడుముకోకుండా ఆమె తప్పును కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పేశారు. అదే సర్వజ్ఞత్వం - సర్వవ్యాపకత్వం. ఇట్టి మహనీయుడు మన మధ్య వున్నా వారి నిజస్థితిని తెలుసుకోలేని మన అంధత్వం, అజ్ఞానం ఎంత గొప్పగా వున్నాయో గదా!

## కామిరెడ్డి వెంకట్రామిరెడ్డి,శ్రీ దత్త గురు పీఠం, రాయచోటి

1971లో ఒకసారి నేను, నా స్నేహితుడు స్వామివారి దర్శనానికి బయలుదేరాము. ఆశ్రమం చేరుకునేటప్పటికి రాత్రి 10గంటలు అయ్యింది. మా రాక గురించి ఆశ్రమంలో ఎవరికీ తెలియదు. అయితే అప్పటికే స్వామివారు అమ్మయ్యతో ఇద్దరు భక్తులు తమ దర్శనానికి వస్తున్నారని భోజనం పెట్టాలని చెప్పి వున్నారు. ఈ విషయం మాతాజీ స్వయంగా మాతో చెప్పింది. ఆ ఇద్దరు భక్తులము మేమే.

## ముల్లంగ శేషయ్య శెట్టి, చిన్న మండెం, కడపజిల్లా

స్వామివారిని గురించి మా గ్రామస్థుల ద్వారా తెలుసుకొని దర్గాకు వచ్చాను. అప్పుడు నా ఆరోగ్యం బాగా లేదు. అందువలన రెండు నెలలు దర్గా వద్ద వుండి సేవ చేసుకున్నాను. దానితో ఆరోగ్యం మెరుగు పడింది. 20 ఏండ్ల క్రితం ఒక అమావాస్య రోజున రాత్రి తొమ్మిది గంటలప్పుడు ఆశ్రమానికి నడిచి వస్తున్నాను. అప్పుడు ఆశ్రమంలో భోజనాలు

అవుతున్నాయి. అప్పుడు స్వామివారు అమ్మయ్యతో "చిన్నమండెం నుండి శేషయ్య వస్తున్నాడు, అన్నం తీసి పెట్టు" అని చెప్పారు. ఆ విషయం ఆశ్రమం చేరిన తర్వాత అమ్మయ్య నాతో చెప్పారు. ఆ దివ్య దంపతులకు నా సాష్టాంగ దండ ప్రణామాలు అర్పించుచున్నాను.

## కృష్ణారెడ్డిగారు, నెల్లూరు

దర్గాల దగ్గర సాయిబాబా మందిరం కట్టక ముందు ఒకరోజు స్వామి అక్కడ వున్న ఇసుకలో కూర్చుని రాత్రి 7గంటలప్పుడు స్వామి ఇంట్లోకి పోతూ "ఎవరో వస్తున్నారు నా దగ్గరకి. అడ్రస్సు తెలియక తిరుగుతున్నారు. రానీ రానీ వస్తారులే" అని చెప్పారు. అరగంట తర్వాత కావలి నుండి వ్యానులో వచ్చిన వారు ఇదే మొదట రావటం. అడ్రస్సు తెలియక అటూ ఇటూ తిరిగి ఇప్పటికి రాగలిగాము. స్వామి బయటకు వచ్చి వాళ్ళతో "ఇంతకుముందే మీరొస్తున్నారని కృష్ణారెడ్డికి చెప్పా"నన్నారు.

## జి. గోపాల్, వెంకటగిరి

1. నేను వెళ్ళగానే నాతో చాలా కఠినంగా మాట్లాడారు - ఉద్యోగం వస్తుందని చెప్పాను గదా! మరలా వచ్చావెందుకురా లంజకొడకా అంటూ తిట్టారు. తర్వాత ఎవరినీ లోనికి రానీయకుండా నన్ను మాత్రం హారతికి రానిచ్చారు. గేటుకు అవతలనే చాలామందిని నిలిపేశారు. శ్రీస్వామివారు సాయి మందిరంలో దీపారాధన చేస్తున్నారు. వారికి గేటు దగ్గర వుండే వాళ్ళు కనపడే అవకాశమే లేదు. వారి మాటలు వినపడే అవకాశమే లేదు. ఒక తల్లి హారతికి పోవాలని గేటు దగ్గరకి వచ్చింది. గేటు దగ్గర కావలి వుండే ఆయన నోటికడ్డం వేలు పెట్టి శబ్దం చేయవద్దని సైగ చేస్తూ ఆమెను ప్రక్కకు వెళ్ళమని చేత్తో సైగ చేశాడు. ఎక్కడో లోపల వున్న శ్రీ స్వామివారు "అశుద్ధ బ్రహ్మలారా! ఎక్కడ దాపురించారురా మీరు? ఆ తల్లిని లోపలికి రానీయండిరా" అని గట్టిగా అరచారు. వారెక్కడున్నా ఈ విశ్వములో ఏ మూల ఏం జరుగుతోందో తెలుస్తూనే వుంటుంది. అనుక్షణం ఎవరేమి మాట్లాడినా వారికి తెలిసిపోతుంది.

2. బిడ్డ తలనీలాలు సమర్పించిన ఒక ముస్లిం స్త్రీ అక్కడకొస్తే

ఆమెతో నవ్వుతూ చాలా ఆనందంగా మాట్లాడుతున్నారు. నేను ఇది చూచి ఇక్కడ ముస్లిం జనాభా అధికము గనుక వారితో సుహృద్భావంతో మెలగకుంటే వారి నుండి ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని గాబోలు శ్రీ స్వామివారు ఆమెతో అంత ప్రేమగా మాట్లాడుతున్నారు. హిందువునైన నన్ను ఘోరంగా తిట్టారు అని మనస్సులో అనుకోగానే శ్రీ స్వామివారు నా వైపు తిరిగి "నాకెవరిని చూచినా భయం లేదోయ్" అన్నారు. మనస్సులో కలిగే ప్రతి భావనా, ఆలోచనా వారికి తెలుస్తూనే వుంది.

3. ఒకరోజు కొందరు స్వామి దగ్గరకు వస్తూ సాంబ్రాణీ కడ్డీలు తెచ్చారు. వాటిని వెలిగించి అక్కడ కడ్డీలు వెలిగించే పాత్రలో ఉంచమన్నారు దర్గాల దగ్గర వున్న భక్తులు. వచ్చిన వారిలో ఒక వ్యక్తి వెలిగించిన కడ్డీలు సమాధుల దగ్గరుండే చిన్న దిన్నెపై పెట్టి నమస్కరించుకున్నాడు. కొంతసేపు అయ్యాక శ్రీ స్వామివారు దర్గాల దగ్గరకు వచ్చి ఆ కడ్డీలు చూచి ఉగ్రులైపోయి "ఇక్కడ కడ్డీలు వెలిగించి పెట్టిన లంజకొడుకు ఎవరు?" అని అరిచారు. అక్కడున్న ఆరు మందిలో ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. అంతమందిలో శ్రీస్వామివారు ఒకరివైపు చూపిస్తూ "ఒరేయ్ బుద్ధిలేనివాడా అక్కడ వెలిగే సాంబ్రాణీ కడ్డీలు పెట్టింది నీవేనా?" అని గట్టిగా అరిచారు. వెంటనే వాడు 'నేను కాదు స్వామి' అన్నాడు. "ఈ సమాధులలో వున్న స్వాములు సత్యమైనవారు. నీవు అబద్ధం చెపుతున్నావు. సాయంకాలానికి నీ అంతు తేల్చుకుంటారు" అనేసరికి బిక్క చచ్చిపోయాడు. రెండు గంటలసేపు ఆలోచించి 'నేనే స్వామీ కడ్డీలు వెలిగించాను క్షమించండి' అని కాళ్ళ మీద పడ్డాడు.

## స్వరూపగుప్తాగారి తమ్ముడు అమర్‌నాథ్ ఇలా చెపుతున్నారు

స్వామికి చెప్పకుండా మేము ఇంటికి వచ్చేవారం కాదు. కానీ ఒకరోజు రాత్రి 10గం॥ 30ని॥లకు స్వామి ఇంటి లోపలకి వెళ్ళారు. మరలా బయటకు వస్తారో లేదో అనీ, ఇప్పటికే ఆలస్యం అయ్యిందని నేను, నా స్నేహితుడు రాజాగారు మెయిన్‌రోడ్డుకి వచ్చాము. ఒక బస్సు ఖాళీగా వెళ్ళుతున్నప్పటికీ మమ్మల్ని చూసికూడా ఆపకుండా వెళ్ళిపోయాడు ఆ

డ్రైవరు. అర్థగంటైనా ఒక్క వాహనం ఆగలేదు. ఇంతలో స్వామి దగ్గరనుండి ఒక భక్తుడు వచ్చి స్వామి ఇమ్మన్నారని ప్రసాదం ఇచ్చాడు. మేము ఏమి జరిగింది అని అడిగితే మేము స్వామి దగ్గరనుండి వచ్చిన కొంతసేపటికి స్వామి బయటకు వచ్చి "అమర్, రాజా ఏరిరా?" అని అడిగి వెళ్ళిపోయారని తెలుసుకుని నా చేతికి ప్రసాదం ఇచ్చి వాళ్ళు అక్కడ మెయిన్‌రోడ్డులో వుంటారు. వెళ్ళి ప్రసాదం ఇచ్చిరా అని చెప్పి పంపారు. స్వామి ప్రసాదం చేతికందిన తర్వాతనే మాకు బస్సు దొరికి మేము ఇంటికి వెళ్ళగలిగాము. మేమెక్కడ, ఎప్పుడు వుండేది స్వామికి ఎంత స్పష్టంగా తెలుసునో కదా!

మా అమ్మ కమ్మలలోని డైమండ్లు పోయాయి. ఇల్లంతా వెదికినా కానీ కనిపించలేదు. మా అమ్మ దాని విషయమై చాలా బాధపడుతోంది. నేను దర్గాల దగ్గరకి వెళ్ళి మనస్సులో 'ఏమిటి స్వామీ! ఈ వయస్సులో మా అమ్మను ఏడిపిస్తున్నారే అని, అవి దొరికితే కొంత డబ్బు దక్షిణగా అమ్మయ్యకి సమర్పిస్తానని' మ్రొక్కుకున్నాను. మ్రొక్కుకున్న రెండవరోజుకల్లా కనపడని డైమండ్లు జండూబామ్ సీసాలో కనపడ్డాయి. మ్రొక్కు తీర్చాలని స్వామి దగ్గరకెళ్ళగానే నేనేమి చెప్పకుండానే "దొరికింది కదరా! మీ అమ్మ హుండీలో వేసుకో పోరా" అని అన్నారు. నా మనస్సులొ అన్ని ఆలోచనలు స్వామికి తెలుస్తాయని స్వామి మీద నమ్మకం మరింత దృఢపడింది.

**ఖమ్మం జిల్లా, దమ్మపేట గ్రామ వాస్తవ్యులు** పసుమర్తి శీను అనే వారికి ఎన్ని సంబంధాలు చూసినా వివాహం కాలేదు. మిత్రుల సలహా మీద అరుణాచలం వెళ్లి గిరిప్రదక్షిణ చేస్తున్నాడు. కొండచుట్టూ తిరిగితే పెండ్లవుతుందా? అని పదే పదే అనుకుంటూ ప్రదక్షిణ చేశాడు. ఆ తర్వాత వారు శ్రీ దర్గాస్వామివారి దగ్గరకొచ్చాడు. ఆ యువకుడు చెప్పకముందే "ఏమయ్యా! కొండ చుట్టూ తిరిగితే పెండ్లవుతుందా? అని అనుకుంటూ ప్రదక్షిణ చేస్తావేమిటి? నీవు శ్రీ రామ చంద్రునికి వివాహం చేయించు పెండ్లవుతుంది" అని చెప్పారు. శ్రీ రామ చంద్రునికి

వివాహం చేయించగానే అతని వివాహం కూడా చక్కగా జరిగిపోయింది.

ఎక్కడో అరుణాచలంలో అతని మనస్సులో మెదిలిన సంశయాన్ని శ్రీ స్వామివారు నీలకంఠరావుపేటలో చెప్పడమెంత చిత్రమో చూడండి. శీను విషయమేగాక మన ఆలోచనలు, మాటలు సర్వం శ్రీ స్వామివారికి తెలుస్తుంటాయనడానికిది మంచి నిదర్శనం.

## మోహన్‌రావుగారు, దమ్మపేట

1. 6-10-2003న ఉదయం కాకడ హారతి అయిన తర్వాత శంకరయ్యగారిని పిలిచి "స్వీట్సు ముక్కలు చేసి ఎందుకు పంచినావు? నేను 130 మంది వస్తారు, 130 తీసుకు వెళ్ళు అంటే 100 స్వీట్లు తీసుకువెళ్ళి ముక్కలు చేసి పంచి పెడతావా" అని తిట్టినారు. అప్పుడు ఎంతమంది వచ్చేది వారికి సర్వం తెలుసు అని వారి సర్వజ్ఞత్వం అలా వెల్లడి చేసినారు.

2. ఒకసారి నన్ను "నీవు ఏమి తీసుకువచ్చావు" అని అడుగగా మీకు ఏమీ తీసుకురాలేదు, బాబాకు వస్త్రాలు తీసుకువచ్చాను అని చెప్పాను. "నీవు నాకు లడ్డూ తీసుకురాలేదా?" అని అడిగిన తర్వాత నాకు స్వామికోసం లడ్డూ తీసుకు వచ్చిన సంగతి గుర్తుకు వచ్చింది. తెచ్చిన భక్తుడు మరచిపోయినా శ్రీ స్వామివారు తన వస్తువు అడిగి తీసుకున్నారు.

## శ్రీమతి చంద్రావతిగారు, దమ్మపేట సత్సంగ సభ్యురాలు

వీరికి పది సంవత్సరముల క్రితం నుండి ఉదయము ఏ ఆహారమూ తీసుకోకుండా గురు చరిత్ర, ఇతర మహనీయుల చరిత్రలు నిత్యం శ్రద్ధగా పారాయణ చేసుకుని, భోజనం తిని మరలా రాత్రి భోజనం మాత్రమే తినటం అలవాటు. వీరి భర్తగారైన శ్రీ రామకృష్ణగారు ఇలా చేస్తుంటే నీరసపడి బలహీనమవుతావు అని అభిప్రాయపడేవారు. ఇటీవల శ్రీ దర్గాస్వామివారిని దర్శించినప్పుడు రామకృష్ణగారు ఈ విషయం గూర్చి స్వామివారితో చెప్పుకున్నారు. అప్పుడు శ్రీస్వామివారు "ఏమైంది? ఆ అమ్మాయికి ఈ పది సంవత్సరాల్లో ఒక్క మందుబిళ్ళ అయినా కొని తెచ్చావా? ఇచ్చావా?" అని అన్నారు. అనారోగ్యం లేనందు వలన ఏ

ఒక్క మందూ వాడవలసిన అవసరం లేకపోయింది. ఇదే విషయం శ్రీ స్వామివారు ప్రస్తావించడంతో శ్రీ స్వామివారి సర్వజ్ఞతకు ఎంతో ఆశ్చర్యపోయారు. వారి మనస్సు కుదుటపడింది.

## సాయి సుబ్రహ్మణ్యం, దమ్మపేట

నేను బెంగుళూరులో చదువుతుండగా తరచూ శ్రీ దర్గాస్వామివారికి ఫోను చేస్తూండేవాడిని. ఒకరోజు మా నాన్నగారు నాకు ఫోను చేసి ఫలానా రోజు మంచి ఉపనయన ముహూర్తమని, దాన్ని నిర్ణయించామని చెప్పారు. ఆ రోజు దర్గాస్వామివారికి ఈ విషయం చెపుదామని ఫోను చేసినా టెలిఫోను లైను కలవలేదు. కానీ ఆ రోజు రాత్రి నా కలలో నేను స్వామి దగ్గరకి వెళ్ళి 'స్వామీ! ఫలానారోజు ముహూర్తం మంచిదని నా ఉపనయనం నిర్ణయించారు' అని చెప్పగానే వెంటనే స్వామివారు "అదేమీ గట్టి ముహూర్తం కాదు. మామూలుదే" అని రెండు మూడుసార్లు చెప్పారు. స్వప్నం అంతరించింది. తర్వాత మూడవరోజు మా నాన్నగారు ఫోను చేసి నాతో 'ముహూర్తం పెట్టిన శాస్త్రిగారు మరలా వచ్చి ముహూర్తానికి నక్షత్రం కలిసింది కానీ తార కలవలేదు అందుకు ఆ ముహూర్తం మామూలుదే అని చెప్పి ఇంకొక రోజు నిర్ణయించారు' అని చెప్పారు. శ్రీ దర్గాస్వామివారు సర్వజ్ఞులు కానిదే ముహూర్తం పెట్టిన సంగతి నేను చెప్పకుండానే నాకు స్వప్నదర్శనమిచ్చి ముహూర్తబలం గురించి చెప్పలేరు. సర్వప్రేరణాధికారిగా ముహూర్తం పెట్టిన శాస్త్రిగారికి మరలా ముహూర్తం గురించి చూసేటట్లు చేశారు. స్వప్నదర్శనమిచ్చి వారి సామర్థ్యాన్ని, ప్రేమను ఎరుకపరచిన ఆ సర్వసమర్థునికి నా హృదయపూర్వక నమస్కారములు.

## తొండెపురాజుగారు, దమ్మపేట, ఖమ్మం జిల్లా:

1. శ్రీమతి లక్ష్మిగారు, శ్రీ నాగేశ్వరరావు మాష్టర్‌గారు మొదలగు వారితో శ్రీ దర్గాస్వామివారి దర్శనానికి నేను మొదటిసారిగా వెళ్ళాను. కొందరు శ్రీ దర్గాస్వామివారు గొప్ప మహనీయులంటే మరికొందరు కాదంటున్నారు. అందరమూ కలసి ఆ రాత్రికి ఒక నిర్ణయానికి వచ్చాము. 'మనమంతా శ్రీ మాష్టారి మార్గంలో ఉన్నాము. మనం అడగకుండానే

శ్రీ దర్గాస్వామివారు మీరు శ్రీ భరద్వాజ మార్గంలో ఉన్నారని' చెపితే వారు మహనీయులని నమ్మాలనుకున్నాము. తెల్లవారి అందరికీ తీర్థమిస్తూ నేను వచ్చినప్పుడు నీకేమి కావాలని మూడుమార్లు అడిగినా నేను నాకేమీ వద్దని మూడుమార్లు అలాగే చెప్పాను. ఒకవైపు సాయిబాబా, మరియొకవైపు శ్రీ మాష్టరుగారు ఉన్న ఫోటో నా జేబులోనుండి వారే తీసుకుని ఆ ఫోటోను చూపిస్తూ "ఈయన మార్గంలో నడుస్తున్నాను అని కావాలి కదా? ఇంకేమీ అవసరం లేదు కదా" అన్నారు. నేను, మా గ్రూపు అదే కోరుకున్నాము గనుక వారు నిజమైన మహాత్ములని రూఢి అయ్యింది.

2. నేను లౌకిక విషయాలేవీ వారిని అడగలేదు. వారు నా దగ్గరున్న అవధూతలీల గ్రంథం తీసి ఒక చోట తెరిచారు. అక్కడ వెంకమ్మగారికి మామిడిపండుకు పుండు పుడితే అది ఓర్చుకుంటే ఎంత ఫలింపు వస్తుందని చెప్పే ఘట్టం వచ్చింది. ఈ ఘట్టం నిత్యం చదవమన్నారు. ఇదే విధంగా నాకు అనేక ఇబ్బందులు వచ్చాయి. ఏడురోజులు ఒంగోలులో భరద్వాజ మాష్టరుగారి సమాధి దగ్గర ఉన్నాను. క్రమంగా అన్నీ సర్దుకున్నాయి. శ్రీ దర్గాస్వామివారు అవధూతలీల గ్రంథం తెరిచి చదవమన్న ఘట్టం నా జీవితంలో యథాతథంగా జరిగిపోయింది.

3. శ్రీ దర్గాస్వామివారి దర్శనార్థం వెళ్ళిన మా గ్రామస్థులందరూ శ్రీ స్వామివారికి నమస్కరించుకుని వారి నివాసం నుండి బయటకు వచ్చారు. నేనొక్కడినే వెనుకబడి పోయాను. ఈ లోగా శ్రీ స్వామివారు కాలు మీద కాలు వేసుకొని మెట్టుపై కూర్చున్నారు. వారు రెండు కాళ్ళు భూమి మీద ఉంటే పాదాలకు నమస్కరించుకోవాలని కోరుకుంటూ వెళ్లి వెనుక నిలుచొని యున్నాను. వారు రెండు కాళ్ళు భూమి మీద పెట్టి కూర్చొని "ఇప్పుడు నమస్కరించుకో" అని అన్నారు. నా మనసులోని పవిత్ర కోరికను అలా తీర్చారు.

4. అందరమూ బయటిగేటు వరకు వచ్చేశాము. నేను, శ్రీ నాగేశ్వరరావు మాష్టరుగారు 'శ్రీ స్వామివారి నివాస గృహం వరకు వెళ్ళాము, కానీ వారు ప్రసాదమివ్వకుండానే పంపారే' అని

అనుకుంటున్నాము. వెంటనే వారు గేటు వరకు వెళ్ళిన వారిని వెనక్కు పిలచి ఆపిల్‌పండు ముక్కలు చేసి ఇస్తూ "ఏం ప్రసాదం పెట్టకుండా పంపేస్తున్నానని అనుకుంటున్నారా? ఇదిగో ప్రసాదమ"ని ఇచ్చారు. ఆ మహనీయుల సర్వజ్ఞత్వం అడుగడుగునా కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. మనమెక్కడ ఉండి ఏమి చేసినా, ఏమి ఆలోచించినా, ఏమి మాట్లాడినా వారికి తెలుస్తుందని నిరంతరమూ గుర్తెరిగి నడుచుకుంటుంటే వారి అండ మనకెప్పుడూ ఉంటుంది.

5. నేనొకప్పుడు కరెంటు పనిచేస్తూ కరెంటు స్థంభం నుండి గోతిలో పడ్డాను. అప్పుడు వచ్చిన నడుము నొప్పి తగ్గనే లేదు. పని చేసినా, పడుకున్నా విపరీతమైన నొప్పి వచ్చేది. ఒకరోజు శ్రీ స్వామివారికి చెప్పాను. శ్రీ స్వామివారు తన దండంతో మెడ నుండి నడుం వరకూ తాకి నా వీపున దండంతో తట్టారు. ఆనాటి నుండి ఈ రోజు వరకు నడుంనొప్పి మరలా రాలేదు. ఎంత పని చేసినా, బరువులు పట్టినా నొప్పిలేదు. సంకల్పమాత్రంతో సాటి జీవుల బాధలు తీర్చే కరుణామయులకు కృతజ్ఞతలు ఎలా తెల్పాలో తెలియడంలేదు.

6. 27-8-94 నేను శ్రీ స్వామివారి దర్శనానికి వెళ్లినప్పుడు స్వామి "ఏరా! నాకు రోజూ పాలు పోస్తావా?" అని అన్నారు. నేను పోస్తాను స్వామీ అన్నాను. శ్రీ స్వామివారు "నీవు పాలు పోయవురా. నీళ్ళే పోస్తావు" అని అన్నారు. నేను ఇంటికి వెళ్ళిన రోజు నుండీ రోజూ ఒక గ్లాసు పాలు శ్రీ స్వామివారికి నైవేద్యం పెట్టేవాడిని. అలా రెండు సంవత్సరాలు చేసి తర్వాత అశ్రద్ధ వలన మానేసి గ్లాసుడు నీళ్ళు పెట్టేవాడిని. నేను శ్రీ స్వామివారి వద్ద కొస్తూనే "ఏరా! నాకు పాలు పోయట్లేదు. నీళ్ళే పోస్తున్నావు గదా!" అన్నారు. 27-8-94 న శ్రీ స్వామివారన్న మాట రెండు సంవత్సరాల తర్వాత మరలా ఖచ్చితంగా అదే అన్నారు. ఇంతటి సర్వజ్ఞమూర్తిని మనతో వుంచుకొని కూడా మనం సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురుసేవ చేయకుండా జీవితాలను వ్యర్థం చేసుకోవడం ఎంత అవివేకమో గదా!

## వెంకట్రావు, దూరదర్శన్ కేంద్రం

నాకు దేవుడంటే అంత నమ్మకముండేది కాదు. స్వామి దగ్గరకు వస్తున్న కొత్తల్లో ఒక గురువారం నాడు నా భార్య నన్ను ఇంట్లో దీపం పెట్టి వెళ్ళు అన్నది. దీపంలో ఏమున్నదని దీపం పెట్టకుండా దర్గాలకి వెళ్ళాను. నేను అభిషేకానికి నీళ్ళు అందిస్తున్నాను. స్వామి చికాకుగా "ఛ! అక్కడ పెట్టమంటే పెట్టలేదు కానీ ఇక్కడేదో అందిస్తాడట, పెడతాడట, దిగు ఇక్కడి నుండి" అని అరుస్తున్నారు. వెంబడే నేను ఇంట్లో దీపం పెట్టకపోవటం గుర్తు వచ్చి స్వామి నన్నే హెచ్చరిస్తున్నారని గుర్తించాను.

ఇంట్లోని క్యాలెండర్‌లో వున్న స్వామి ఫోటోకి నమస్కారం చేసి ముద్దు పెట్టుకున్నాను. తర్వాత దర్గాల దగ్గరకి వెళ్ళి గురువారం అభిషేకానికి నీళ్ళు అందిస్తుంటే స్వామి నాతో "ఇప్పుడే తాకి వచ్చావు. మళ్ళీ తాకద్దు" అని నేను ఇంట్లో స్వామి పటానికి నమస్కారం చేసింది స్వామికి చెందినది అని నాకు హృదయగతమైంది.

## యస్. రాజకుళాయి, రిటైర్డు టీచర్, రవీంద్ర నగర్, కడప

నేను మొదటిసారి 1971లో కడపలో శ్రీ తలుపుల మల్లిఖార్జునగారింట్లో స్వామివారిని దర్శనం చేసుకున్నాను. నాకు అప్పుడప్పుడూ స్పృహ తప్పి పడిపోయే జబ్బు వుండేది. అది స్వామివారికి మనవి చేసుకున్నాను. స్వామివారు "శుక్రవారం దర్గాకు వచ్చి నిద్ర చెయ్యి, శనివారంనాడు చెప్తాను" అన్నారు. నేను అలాగే చేశాను. దర్గా వద్ద మాతాజీగారి దర్శనం కూడా చేసుకున్నాను. స్వామివారు "నీవు స్పృహ తప్పి పడిపోవటం నాగదోషం వలన. మీ తండ్రిగారు 40 లేదా 50 ఏండ్ల క్రితం నాగుపామును చంపి వుంటారు. దాని వలన ఇది వచ్చింది" అన్నారు. నేను ఇంటికి వచ్చి మా అమ్మను అడుగగా మా అమ్మ నిజమేనని చెప్పింది. మరలా వచ్చి స్వామివారికి ఈ విషయం చెపితే స్వామి "ఒకరోజు ఉపవాసం వుండి నాగపూజ చేస్తే ఆ దోషం పోతుంది" అని చెప్పారు. నేను అలాగే చేసాను. అంతటితో నా స్పృహ తప్పి పడిపోయే జబ్బు పోయింది.

## జె.బాలార్క (జె.వి.నారాయణ మూర్తి గారి కోడలు), నెల్లూరు

నేను శాస్త్రీయ సంగీతం పాడతాను. మొట్టమొదటిసారి దర్గాబాబాను చూడటానికి వెళ్ళుతున్నాను. మా మామగారు అక్కడ నా చేత కీర్తనలు పాడిస్తాను అని అన్నారు. దర్గాబాబా అంటే ముస్లిమేమో కదా, ఆయనకు సంగీతంలో ఏమి అభిరుచి వుంటుంది అన్నాను. స్వామి దగ్గర కూర్చున్నాక "ఏమి కావాలి?" అన్నారు. అంతకుముందు కొన్ని రోజుల క్రితమే మా నాన్నగారు చనిపోయారు. స్వామితో 'మా నాన్నంటే ఇష్టం. నా చిన్నప్పుడే ఆయన వెళ్ళిపోయారు' అన్నాను. "అలా ఎందుకు బాధపడతావు, నాలో మీ నాన్నను చూసుకో" అన్నారు. ఆ మాట వినగానే చాలా ఎమోషనల్‌గా ఫీల్ అయ్యాను. నేను సంగీతం పాడతాననగానే 'గీతార్థము-సంగీతార్థము' అనే పాట వచ్చా? అని అడిగి, ఇంకా రెండు పాటలు అడిగి పాడించుకున్నారు. నేను చాలా ఆశ్చర్యపోయాను. మధ్యాహ్నం భోజనాలు అయిన తర్వాత మళ్ళా పిలిపించి "ఎంత వేడుకుందు రాఘవా" అనే కీర్తన పాడించుకోవాలి అన్నారు. ఆ కీర్తన పల్లవి-అనుపల్లవి మాత్రమే గుర్తు వున్నాయి. చరణం గుర్తు లేదు. అది కాకుండా ఇంకొక రెండు కీర్తనలు పాడాను. కానీ స్వామి పట్టుపట్టి "నీవు ఎంత వేడుకుందు రాఘవా పాడాలి" అన్నారు. మనస్సులో ఇంత ఇబ్బంది పెట్టేస్తున్నారే అని అనుకుంటూ కీర్తన ప్రారంభిస్తే నాకు ఏ రెండు లైన్లు గుర్తు లేవో అవి స్వామి నా కందించారు. నేను చాలా ఆశ్చర్యపోయాను. **స్వామికి సంగీతము కూడా కరతలామలకమే.** స్వామి అశీర్వదిస్తూ "నీవు మంచి స్థాయికి వెళతావు. ఎప్పుడు కచేరీకి వెళ్ళినా నన్ను తలుచుకొని వెళ్ళు, కొంచెం మజ్జిగ చుక్క త్రాగి వెళ్ళు" అన్నారు.

ఒకసారి దసరాలకి నెల్లూరు సాయిబాబా గుడిలో కచేరీ వుంది. స్వామికి ఫోను చేస్తే ఆశీర్వదించారు. ఆ రోజు చివరి కీర్తనగా 'భో శంభో' అనే కీర్తన పాడుతుంటే నాకు స్వామి ఎదురుగా వున్న భావనతో చాలా బాగా పాడటం జరిగింది. ఇంటికి వచ్చి రాత్రి 11గం॥లకి ఫోను చేసాను. 'స్వామీ! కచేరీ అయిపోయింది' అన్నాను. స్వామి వెంటనే "ఆ! నువ్వు శంభో అనే కీర్తన శివుడి మీద పాడావు. అది పాడినప్పుడు నాకైతే

ఆనందంతో నృత్యం చేయాలనిపించిందమ్మా!! చాలా చక్కగా పాడావు. నేనొచ్చాను. నువ్వు చూడాలేదా? నేను కనపడలేదా?'' అని అన్నారు. సర్వవ్యాపకుడైన స్వామి అన్నివేళలా మనల్ని చూస్తూనే వున్నా, మనకి కొన్ని సందర్భాలలో మాత్రమే స్వామి ఎదురుగా వున్న భావన కలగటమే స్వామి రావటంగా భావించవచ్చు.

## శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామివారు స్వయంగా చెప్పిన లీల:

నీలకంఠరావుపేటలో ఒక ముస్లిం కుర్రవానికి చాలా కాలంగా మాటలు లేవు. వాళ్ళొచ్చి శ్రీ స్వామివారిని ప్రార్థించారు. శ్రీ స్వామివారు అతని నాలుకపై వ్రాశారు. అతనికి మాటలు వచ్చాయి. ఈ విషయం అచ్చటి ముస్లింలు నమ్మలేదు. ఆ కోమటాయన వచ్చి నాలుక మీద వ్రాస్తే మాట వచ్చిందా? అది వట్టిదేనన్నారు. కొద్ది రోజుల తర్వాత సమాధుల దగ్గర ఏదో కార్యక్రమం జరుగుతుంటే ఆ మాటలు వచ్చిన ముస్లిం మరి కొందరి మిత్రులతో అక్కడ పని చేశాడు. పని పూర్తయిన తర్వాత అక్కడ చేతులు, ముఖము కడుక్కోవటానికి నీళ్ళు లేవు. అక్కడొక గుంటలో మూరెడు లోతు నీళ్ళు వున్నాయి. కానీ దానిలో కంప ముండ్లు పడి ఆకు రాలి బాగా పురుగులు పట్టి ఉన్నాయి. శ్రీ స్వామివారికా సంగతి చెప్పారు. "పురుగులు లేవు, ఏమీ లేవు పోయి ఆ ముండ్లు తీసేసి కడుక్కో"మన్నారు స్వామి. వారు వెళ్ళి ముండ్లు తీసేసి పై నీళ్ళు అలా చల్లేశారు. పరిశుభ్రమైన నీళ్ళు వున్నాయి. వాళ్ళు కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కోవటమే గాక కడుపారా నీరు త్రాగి వెళ్ళారు. మహనీయుల సంకల్పబలమంటే ఏమిటో ఆ ముస్లింలకు తెలిసిందో లేదో మరి!

## మనోజ్‌కుమార్, దమ్మపేట

మా యింటి దగ్గర వున్న ఒకతని పదవ తరగతి సర్టిఫికేట్‌లో పేరు తప్పు పడింది. నేను హైదరాబాద్‌లో వున్నానని నన్ను పేరు మార్పించమని నాకు ఆ సర్టిఫికేట్ ఇచ్చారు. నేను నా స్నేహితునితో కలిసి పదవ తరగతి ఎస్. ఎస్. సి బోర్డుకి వెళ్ళబోతుంటే నా స్నేహితుడు వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాదులో పెట్టిన వినాయకుడ్ని దర్శించి రేపు వెళదాం

అని చెప్పేసరికి నేనూ సరే అన్నాను. అతను వెళ్ళి రూములో ఆ సర్టిఫికేట్ పెట్టి వచ్చాడు. మేము రూముకి తిరిగి వచ్చేసరికి రూములో వుంటున్న మిగతా స్నేహితులు రూము మారటం వలన ఆ సర్టిఫికేట్ కనబడలేదు. రెండు రోజులు వెతికినా కనపడకపోయేసరికి దర్గాస్వామికి ఫోను చేస్తే స్వామి "మీ రూములో నుండి వెళ్ళిన వాళ్ళ సామానుతో పోయింది. అక్కడ వెతుకు" అన్నారు. నేను మరలా రెండు సార్లు వాళ్ళ రూములో వెతికి సర్టిఫికేట్ కనపడక స్వామికి ఫోను చేస్తే "వెధవా! అక్కడే వుంది, సరిగ్గా వెతుకు" అన్నారు. వెతికినా దొరకక పోయేసరికి నా సొంత డబ్బులు (5000 రూపాయలు) పెట్టి డూప్లికేటు తెప్పించి పేరు మార్పించాను. డూప్లికేటు వచ్చిన వారం రోజులకి రూము మారిన స్నేహితుడు ఫోను చేసి నేను వెతుకుతున్న సర్టిఫికేట్ వుందని చెప్పి నాకందచేశాడు. నేనంతా వెదికిన కనపడని సర్టిఫికేట్ అంత ఖచ్చితంగా ఎక్కడో వున్న దర్గాస్వామి చెప్పారంటే స్వామి సర్వత్రస్థితుడని, సర్వవ్యాపకుడని అర్థమవుతోంది.

## డా॥ శ్రీధర్‌రెడ్డిగారు, నెల్లూరు

మా అబ్బాయికి మెదడుకి సంబంధించిన వ్యాధితో పాటు చర్మ వ్యాధి కూడా వచ్చింది. డాక్టర్లకు చూపిస్తేకూడా పూర్తిగా పోలేదు. స్వామికి చెపితే పిల్లవాడికి 12 1/2 సం॥లకు తగ్గుతుంది అని చెప్పారు. అలానే మావాడికి 12 1/2 సం॥లకు రెండు వ్యాధులు పోయి ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు.

నేను ఒక స్థలం చూసి కొందామనుకుని నెల్లూరు నుండి స్వామికి ఫోను చేసి చెప్తే "అరెయ్ స్థలంలో నైరుతి పెరిగి ఉంది. చూసుకో. అలా ఉంటే బిడ్డలకి ఇబ్బంది" అని అన్నారు. విచారిస్తే అది నిజమని, ఆ యిల్లు అమ్మే ఆయన బిడ్డ చనిపోయాడని తెలిసింది.

## సురేంద్రగారు

మా తమ్ముడు స్వామి సలహామీద రొయ్యల వ్యాపారంలో దిగాడు. అందరూ నష్టాలతో దాదాపు దివాళా తీసిన పరిస్థితి వస్తే మా తమ్ముడికి ఏమాత్రం యిబ్బందీ, నష్టమూ కలుగలేదు. స్వామి చెప్పినట్లు వచ్చిన

రాబడిలో కొంత దాన ధర్మాలు చేస్తున్నాడు.

ఒక స్థలం మా ఊరిలో చూసి, కొందామనుకుని స్వామిని అడిగితే "అది రిజిష్టర్ అవ్వదు. లీజుకి తీసుకోమన్నారు". మా ఊరిలో అలా మాకు ఎందుకు రిజిష్టరు అవదో అని అనుమానంతో విచారిస్తే ఆ స్థలం మాఫీ చేయబడి ఉందనీ, దాన్ని రిజిష్టరు చేయటానికి లేదనీ తెలుసుకొని స్వామి చెప్పినట్లు లీజుకి తీసుకున్నాము.

## శ్రీమతి జె. బాలార్క, నెల్లూరు

గురుపూర్ణిమ రోజు స్వామికి ఫోను చేసి "స్వామీ! ఈ రోజు గురుపూర్ణిమ, మీ ఆశీస్సులు కావాలి" అని అడిగాను. స్వామి ఆశీర్వదిస్తూ "నీ మనస్సులో కోరిక నెరవేరిందా? అపార్టుమెంటు కొనుక్కోవటం నీకిష్టమే కదా! 8 లక్షలకు బేరం కుదిరింది కదా!" అని అడిగారు. మేము ఆ రోజే అపార్టుమెంట్ కొందామని అడ్వాన్సు ఇచ్చిన విషయమే స్వామి చెప్పేసరికి ఇంటిల్లపాదీ ఆనందించాము.

## మోహనరావుగారు, దమ్మపేట వారు చూసిన సన్నివేశం:

ఎవరో భక్తులు ఏదో సమస్య విషయం అడగాలని శ్రీ దర్గాస్వామివారి దగ్గరకు నీలకంఠరావుపేట వచ్చారు. ఆ వచ్చిన వ్యక్తి ఆరోగ్యంగా వున్నాడు. కొంతకాలానికి నీకు చాలా ప్రమాదకరమైన జబ్బు చేస్తుంది, దేవుడు రక్షిస్తాడు అని స్వామి చెప్పారు. ఆ వచ్చినవారికి ఇదేమీ అర్థం కాలేదు. వారు ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకు ఆయనకు మెంటల్ వచ్చినట్లు ప్రవర్తించసాగాడు. ఎంతో తెలివిగలవాడు, ఏమీ మాట్లాడకుండా ఇంట్లో ఒక మూల కూర్చో సాగాడు. వాళ్ళు చేతబడులు, స్పెషలిస్టు డాక్టర్లు, యంత్రాలు, మంత్రాలు అన్నీ చేసి విఫలమైనారు. ఆయన తల్లిగారు మాత్రం ఏమారకుండా శ్రీ స్వామివారిని స్మరించి తన కుమారుని పరిస్థితి మానసికంగా శ్రీస్వామివారికి విన్నవించుకుంటుండేది. ఒకరోజు ఆయనకు నెల్లూరు ఆస్పత్రిలో ఆపరేషన్ చేసారు. ఆయన తల్లిగారికి ఆయన మంచం చుట్టూ ఒక చంద్రబింబంలాంటి వెలుగులో శ్రీ దర్గాస్వామివారు అభయహస్తం చూపుతున్నారు. ఆ వెలుగులో శ్రీస్వామివారు ఆయన

చుట్టూ తిరుగుతున్నట్లు దర్శనమైంది. ఆ తల్లి నీలకంఠరావుపేటలో శ్రీస్వామివారిని దర్శించి ఆస్పత్రిలో నాకు ఇలా నా బిడ్డ మంచం చుట్టూ తమరొక వెలుగులో అభయహస్తం చూపుతూ తిరుగుతున్నారు. కనుక నా బిడ్డకు ఆరోగ్యం తమరి కృప వల్లనే చక్కపడింది అని బల్లగుద్ది చెపుతుంది. శ్రీస్వామివారు "నీవు అలా చెప్పకూడదమ్మా" అని ఎంతో అనునయంగా చెపుతున్నారు. వారే ఆమెకు దర్శనమిచ్చి వారికి నయం చేసినా అందరి ఎదుట అలా తమ మహిమను ప్రచారం చేయటం ఇష్టంలేని శ్రీ స్వామి అలా చెప్పకూడదమ్మా అని అంటున్నారు.

నిజమైన సత్పురుషుల లక్షణమిది. నేను అల్లాకు మాత్రమే బానిసను. నా నుండి ప్రకటమయ్యే లీలలన్నీ గురుకృపకు నిదర్శనమే అని శ్రీ శిరిడీ సాయి చెప్పిన దానికిది సరిపోయినది.

## ముత్తా సత్యనారాయణగారు, దమ్మపేట:

వీరి అబ్బాయి పుల్లారావుకు కాలు మీద నీరు, చీము వచ్చింది. 2002లో 30,000/- ఖర్చుతో ఆపరేషన్ చేయించారు కానీ తగ్గలేదు. ప్రతినెలా విజయవాడ ఆసుపత్రిలో రెగ్యులర్‌గా చెకప్ చేయిస్తున్నారు. ప్రతినెలా 1,000/- ఖర్చు. వ్యాధి తగ్గలేదు. దర్గాస్వామి భక్తుడు మోహన్‌గారు వారితో 'స్వామి ఫోటో పెట్టుకుని ప్రదక్షిణలు చేయండి, వ్యాధి తగ్గాక స్వామి దర్శనానికి వెళ్ళమ'ని చెప్పారు. ప్రదక్షిణలు 4,5 రోజులు చేసేసరికి బాధ, వాపు చాలావరకు తగ్గిపోయాయి. రెండు మాసాలు ప్రదక్షిణలు చేసిన తర్వాత స్వామి దర్శనానికి వెళ్ళారు. "ఏమిటీ నీ బాధ?" అని స్వామివారు అడిగారు. మీ ఫోటో పెట్టి ప్రదక్షిణలు చెయ్యడం మొదలు పెట్టిన తర్వాత బాధ తగ్గింది. ఇప్పుడు కొంచెం వాపు ఉంది. అది కూడా తగ్గిస్తారని మీ దగ్గరకు వచ్చానని సత్యనారాయణగారు చెప్పారు. స్వామి అతని అబ్బాయి కాలు చూసి "ఇంతకు ముందు ఆపరేషన్ చేయించారు అది సక్సెస్ కాలేదు. మళ్ళీ ఆపరేషన్ చేయాలి" అని అన్నారు. ఇంతకుముందే 30,000/- ఖర్చు అయ్యింది మరలా అంత ఖర్చు పెట్టలేము అని ముగ్గురూ (తల్లి, తండ్రి,

పిల్లవాడు) కాళ్ళమీద పడి ఏడ్చారు. ఈ రోజు రాత్రి దర్గాల దగ్గర నిద్ర చేయండి, రేపు చూస్తాము అని స్వామి అన్నారు. తర్వాతరోజు సత్యనారాయణగారితో "మీ అబ్బాయికి వ్యాధి తీసేశాను. ఆపరేషన్ అవసరం లేదు, హైదరాబాదులో నిమ్స్ హాస్పిటల్‌కి వెళ్ళి డాక్టరు ఇచ్చే ఆయింట్‌మెంట్ రాయ"మని చెప్పారు. 20 రోజుల తర్వాత నిమ్స్‌లో చెకప్ చేయిస్తే ఆపరేషన్ చేయాలి, 20,000/- రూపాయలు తీసుకురమ్మని చెప్పి, 10 రోజులు ఉండేటట్లుగా రమ్మన్నారు. ఈ విషయం మోహన్‌గారికి చెప్పి స్వామిని అడగమని చెప్పారు. ఆ విషయం చెబితే స్వామివారు "అక్కడ ఏముందని ఆపరేషన్ చేస్తారు, ఆపరేషన్ అవసరం లేదు, వాళ్ళే తర్వాత దర్శనానికి వస్తారు" అని చెప్పారు. మోహన్‌గారు స్వామి చెప్పిన మాటలు చెప్పి, 'మీరు భయపడవలసిన అవసరం లేదు, డబ్బులు తీసుకుని వెళ్ళండి, ఆపైన స్వామి చూసుకుంటారు' అని చెప్పారు. హైదరాబాదు ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన తర్వాత ఆపరేషన్ థియేటర్‌లో స్వామి ఫోటో పెట్టి సర్వబాధ్యతలు నీవేనని చెప్పి ఏడ్చారు. డాక్టర్లు పరీక్షచేసి జబ్బు లేదు అందువలన ఒక రోజుండి అవసరమైతే రేపు చూసి ఆపరేషన్ చేద్దాము అన్నారు. ఆ తర్వాత రోజు కూడా ఆ వ్యాధి లక్షణాలు కనపడలేదు. తర్వాత కేరళ డాక్టరును కూడా పిలిపించి చూపించారు. ఆయన పరీక్ష చేసి ఏమీ లేదు ఆపరేషన్ అక్కరలేదు అన్నారు. ఆయింట్‌మెంటు, మాత్రలు ఇచ్చి పంపారు. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత విజయదశమికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికి దర్గాస్వామి దర్శనానికి వెళ్ళారు. స్వామి వీరిని చూచి "ఒరేయ్ సత్తీ! ఏముందని ఆపరేషన్ చేస్తార్రా డాక్టరు?" అని ఆ సంగతంతా భక్తులకు చెప్పి అంతా దైవలీల అని, పరమాత్మ లీల అని చెప్పారు.

## నారు సిద్ధేశ్వరం, ఉపాధ్యాయుడు, లక్కిరెడ్డి పల్లె, కడపజిల్లా

1. 2000వ సంవత్సరంలో మా పెద్దబ్బాయి శశిధర్‌కు (10 సం॥) మోకాళ్ళక్రింద పిక్కల్లో నొప్పులు వచ్చి నిలబడలేక, నడవలేకపోయేవాడు. పద్మాసనంలో కూర్చోలేడు. కాళ్ళు ఎడంగా పెట్టుకుని కూర్చోవాలి లేదా

పడుకోవాలి. కర్నూలు, తిరుపతి స్విమ్స్, హైదరాబాదు నిమ్స్ ఆసుపత్రులలో చూపిస్తే అన్ని చోట్ల రిపోర్టుల్లో ఏమీ కారణం కనబడలేదు. 40,000 రూపాయల దాకా ఖర్చు అయ్యింది. పిల్లవాడికి నొప్పులు అలానే వున్నాయి. ఆ సమయంలో మా స్కూలు సీనియర్ అసిస్టెంట్ వరలక్ష్మిగారికి మాటల సందర్భంలో పిల్లవాడి విషయం చెపితే ఆమె చాలా ప్రోద్బలం చేసి దర్గాస్వామి దర్శనానికి వెళ్ళేటట్లు చేసింది. మేము వెళ్ళే సమయానికి స్వామి దర్గాల దగ్గర దీపాలు పెడుతున్నారు. తర్వాత మమ్మల్ని పిలిస్తే నేను చేసిన ప్రయత్నాలన్నీ చెప్పి మీ ఆశీస్సులు కోసం వచ్చామని చెప్పాను. అప్పుడు స్వామి "ఇదేముంది లేరా పోతుంది పో దర్గాల చుట్టూ ఒక చుట్టు వేయమను" అన్నారు. మా అబ్బాయి నిలబడలేకపోతే నేను, మా అన్నయ్య పట్టుకొని త్రిప్పుతుంటే స్వామి అరచి "వదలరా వాడ్ని. తిరుగుతాడు వాడు" అని అన్నారు. మా అన్న వదలినా నేను వదలకుండా ఒక చుట్టు త్రిప్పుకొని వచ్చాను. అక్కడ వున్న చిన్నపుల్ల నాకిచ్చి "అరెయ్, పుల్ల యివ్వరా! దానితో తిరిగేస్తాడు" అన్నాడు. ఆ పుల్ల తీసుకొని రెండవ చుట్టు తిరుగుకొని వచ్చాడు. అప్పటికీ ఓ మాదిరిగా నడువగలిగాడు. మూడవ చుట్టు తిరిగేసరికి మామూలుగా తిరుగగలిగాడు. అక్కడ వున్న వాళ్ళందరికీ జబ్బు చేసి వచ్చినతను ఇతనేనా అని ఆశ్చర్యపోయారు. అప్పుడు స్వామివారు 40 రోజులు దర్గా వద్ద వుండి సేవ చేసుకోమన్నారు. మేమలాగే చేశాము. అప్పటి నుండి ఏ యిబ్బందీ లేదు. యిప్పుడు బి.టెక్ చదువుతున్నాడు.

2. 2004వ సంవత్సరంలో మా అన్నయ్యకు తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో పరీక్ష చేయిస్తే హెచ్.వి.ఎస్ పాజిటివ్(పచ్చకామెర్లు) అని వచ్చింది. ప్రఖ్యాత డాక్టరు కృష్ణమోహన్ గారు మా అన్నయ్య రిపోర్టు చూసి పచ్చ కామెర్లు చివరి స్టేజీ అని చెప్పి, లివర్ మార్చటానికి వీలు కాదు కాబట్టి ప్రాణాలు పోతాయని చెప్పారు. నామ మాత్రంగా మందులు ఇచ్చారు. ఇంత జరిగినా స్వామికి చెప్పలేదు. డాక్టర్ల వల్ల కాలేదని స్వామి దగ్గరకి వెళ్ళి 12గం॥లకి మధ్యాహ్న ఆరతికి హాజరయ్యాము. ఆరతి తర్వాత స్వామి తీర్థం ఇస్తూ మా అన్నయ్య తీర్థం తీసుకునేటప్పుడు స్వామి మా

అన్నయ్యతో "పోయింది పోరా నీ ఖర్మ" అన్నారు. స్వామికి జరిగిన విషయం చెపితే "నేను చెప్పినా కదరా బాబా దగ్గర, పోయింది పో! ఏం లేదు" అన్నారు స్వామి. డాక్టర్లు యిచ్చిన మందులు 15రోజులు వాడి తర్వాత స్విమ్స్ ఆస్పత్రికి చెకప్ కోసం వెళితే రిపోర్టుల్లో పచ్చకామెర్ల వ్యాధి లక్షణాలు ఏమి కనపడలేదు. కృష్ణమోహన్‌గారు రిపోర్టులు చూసి ఆశ్చర్యపోయి మరలా ఆయన స్వయంగా లాబ్‌లో పరీక్ష చేసాడు. మరలా ఏం వ్యాధి లక్షణాలు లేకపోయేసరికి తనతో పాటు పనిచేసే డాక్టర్లకు 15 రోజుల క్రితం రిపోర్టులు, ఇప్పటి రిపోర్టులు చూపించేసరికి వాళ్ళెంతో ఆశ్చర్య పోయారు. ఇదంతా దర్గాస్వామి దయ వలన జరిగిందని విని స్వామి దర్శనం చేసుకోవాలనుకుంటున్నానని డాక్టరు కృష్ణమోహన్‌గారు చెప్పారు. తర్వాత కూడా మా అన్నయ్యకు ఏమీ యిబ్బంది లేదు. ఇప్పటికీ వ్యవసాయం చేసుకుంటున్నాడు.

మా అన్నయ్య కొడుకుకి నవంబర్ నెలలో ఉద్యోగం వస్తుందని స్వామి చెప్పారు. నవంబరులో వాడికి టి.సి.ఎస్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

## కొంచాట శ్రీనివాసరావు గారు:

11 సంవత్సరాల క్రితం ఒకరోజు నిద్రలేచేసరికి కాలు పట్టేసి (మోకాలు దగ్గర) ముడవలేక పోయారు. ముడవయత్నిస్తే బాగా పోటు వచ్చింది. మోకాలు వద్ద, పాదం వద్ద చాలా లావు, వాపు వచ్చింది. వెంటనే రాజమండ్రి అరవింద ఆసుపత్రిలో చూపించారు. వారు మందులు, ఇంజక్షన్లు వేస్తే కాలు ముడవగలిగారు. కానీ ఆ వాపు, నొప్పి పూర్తిగా తగ్గలేదు. (నొక్కితే సొట్టలు పడేవి, నీరు వున్నట్లు ఉబ్బేది). **అప్పటి నుండి 4 సంవత్సరాలుపాటు ఎన్ని మందులు వాడినా ఆ వాపులు, నొప్పి పూర్తిగా ఎన్నడూ తగ్గలేదు. మందులు తీసుకుంటే 10% మాత్రమే తగ్గేది. ఎప్పుడైనా మందులు వేసుకోవడం మానేస్తే వెంటనే విపరీతంగా నొప్పులు ఎక్కువయ్యేవి. రోజూ 10, 11 మాత్రలు వేసుకుంటుండేవారు.** రాజమండ్రి ఇక్కడకు

దూరమవడంతో, ఏలూరులో స్నేహా ఆసుపత్రిలో మూడు సంవత్సరాలు మందులు వాడారు. వారికి ఎక్స్‌రే తీసి కీళ్ళు అరిగాయని మొదటే చెప్పారు. తరువాత ఏలూరు ఫణీంద్రకుమార్ ఆసుపత్రిలో, తరువాత కొన్ని సంవత్సరాలు మరికొన్ని చోట్ల, దమ్మపేట రామకృష్ణగారి దగ్గర చూపించుకుంటూ **గత 11 సంవత్సరాలుగా మందులు వాడుతునే వున్నారు. కానీ పూర్తిగా అసలు నొప్పి, వాపులు తగ్గిన రోజే లేదు. మందులకు 10% మాత్రమే తగ్గుతూ, మానేస్తే హెచ్చుతూ వుండేది.** ఇలా వుండగా ఏప్రిల్ 26, 2000 రాత్రి 9 గంటలకు వాంతి అయ్యి రక్తం పడింది. వెంటనే డాక్టరుగారిని పిలిస్తే చూచి (నీరసంగా వుంటే) సెలైను ఎక్కించి ఈ రోజు అన్నం పెట్టవద్దు. రెండు ఇడ్లీలు పెట్టండి అన్నారు. మందులిచ్చి వెళ్ళారు. తరువాత ఆయన ఒక ఇడ్లీ తిని ఇక చాలు అని (సహించక) పడుకోడానికి మంచం దగ్గరకు వెళ్ళారు. వెళ్ళి పడుకున్న వెంటనే 'దుర్గా, దుర్గా' అని పిలుస్తూ వాంతి చేసుకోవడంతో భళ్ళున చాలా రక్తం పడి స్పృహ పోయింది. దుర్గ 'బాబా! బాబా! దత్తాత్రేయా!' అని అరుస్తూ (ఆ రోజు గురువారం గుడి నుండి తెచ్చిన) విభూతి నొసటన పెట్టి వళ్ళంతా పూసాక స్పృహ వచ్చి ఏంటి, ఏం జరిగింది అని అడిగి మళ్ళీ స్పృహ కోల్పోయారు. డాక్టరుగారిని తీసుకురాగా వారి ఎదుటనే మళ్ళీ వాంతులు, చాలా రక్తం పడింది. వెంటనే ఆ రాత్రి సత్తుపల్లి తీసుకువెళ్ళారు. వెంటనే రక్తం ఎక్కించారు. వారికి మందులు అధికంగా వాడిన కారణంగా అల్సర్ వచ్చిందని చెప్పి మందులు ఇచ్చి 3 రోజుల తర్వాత అన్నం పెట్టమన్నారు. ఆ విధంగా మూడవ రోజున అన్నం తినడంతో మళ్ళీ అలాగే వాంతి అయి కుప్పకూలిపోయారు. విజయవాడ తీసుకువెళ్ళారు. **డాక్టరు వారం రోజులు వుంచి మందులు, ఇంజక్షన్లు ఇస్తూ 80 సెలైను బాటిల్స్ ఎక్కించారు.** కేవలం వ్యక్తులు పట్టుకుని లేవదీసి నడిపిస్తే తప్ప లేచే స్థితి లేదు. వారం తరువాత ఇంటికి తీసుకువెళ్ళమన్నారు. స్కానింగ్ తీయిస్తే ఊపిరితిత్తులలో గాలిగోడల దగ్గర రెండు రాళ్ళున్నాయని తెలిసింది. డాక్టరు 12వేలు అవుతుంది. ఆపరేషన్ చేసి తీయాలి అన్నారు. అప్పటికే ఇల్లు అమ్మి వచ్చిన 44వేలతో

మొన్నటి వరకూ వైద్యం చేయించడానికి సరిపోయింది. ఇక శక్తిలేక చేయించలేదు. డాక్టరు టమోటో, క్యారట్, పాలు, టీ మొదలగునవి తీసుకోవద్దన్నారు. ఇంతకు ముందు మొక్కుకున్న ప్రకారం 2001 డిసెంబరు 20న సుబ్రహ్మణ్య షష్ఠిరోజున ఎర్రగుంటపల్లిలో నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోయడానికి వెళదామని చెబితే ఆ రోజు తలంటుకొని ఆటోలో అందరూ బయలుదేరి వెళ్ళి పోసి వచ్చారు. వచ్చిన మధ్యాహ్నం నుండీ జ్వరం, కాళ్ళవాపులు, నొప్పులు తీవ్రంగా వచ్చాయి.

ఇలా జ్వరం, నోరు ఎండిపోవడం అన్నీ ఉండడంతో దుర్గగారు భయపడి తట్టుకోలేక వెంటనే దర్గాస్వామికి ఫోను చేసింది. వెంటనే ఫోను లిఫ్ట్ చేశారు. 'నేను దమ్మపేట నుండి చేస్తున్నాను. దుర్గను స్వామీ! మా నాన్నగారికి చాలా బాగా జ్వరం, నొప్పులు వచ్చాయి. మీ వద్దకు రావాలని వుంది' అంది. స్వామి "రండమ్మా, బియ్యం ఇస్తా, వండుకుని తిందురు, హోమియో మందులు వాడండి, డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళండి. ఫరవాలేదు తగ్గుతుంది. కంగారు పడకండి" అని అన్నారు. ఇంతలో ఫోను వారి అబ్బాయి తీసుకున్నారు. స్వామీ నేను మెకానిక్‌ని, ఇక్కడ పనులేం లేవు. వేరొకచోటికెళ్ళి పని చేద్దామనుకుంటున్నాను. ఏం చేయమంటారు? అన్నాడు. స్వామి "కొన్నాళ్ళు సహనం వహించు. అవే చక్కపడతాయి. ఎక్కడకూ వెళ్ళవద్దు" అని చెప్పారు. వాళ్ళ నాన్నగారు ఫోను అందుకొని (వాళ్ళ అబ్బాయికి ముందే వారు మాట్లాడారు) 'స్వామీ! నాకు ఇలా ---- అనారోగ్యంగా వుంది' అని చెప్తే స్వామి "**సాయినాథుడు మీ అండ వున్నారు, ఫరవాలేదు, తగ్గిపోతుంది. ఏం కంగారు పడకండి**" అని చెప్పి ఈ ముగ్గురూ మాట్లాడాక ఫోను పెట్టేశారు. ఒక్క వాళ్ళమ్మగారు మాత్రమే మాట్లాడలేదు. ఆమె 'అయ్యో! స్వామితో నేనొక్కదానినే మాట్లాడలేక పోయాను' అని చాలా బాధ పడ్డారు. వారి భర్తకు అనారోగ్య కారణంగా తెల్లవార్లూ నిద్రపోలేదు. తెల్లవారేసరికి జ్వరం చాలా ఎక్కువగా పెరిగి మనిషి నుంచునే స్థితిలో కూడా లేకపోవడంతో డాక్టరును తీసుకువచ్చారు. డాక్టర్లు మందుబిళ్ళలు వేయించి మజ్జిగ త్రాగించమన్నారు. త్రాగగానే వాంతయ్యింది. అప్పుడు వెంటనే క్రిందటిసారి

ఒకసారి వాంతి అయ్యి సీరియస్‌గా అవడం గుర్తొచ్చి అలా అవుతుందేమోనని చాలా కంగారుపడ్డారు. డాక్టరు వాంతి అవకుండా టాబ్లెట్, ఇంజెక్షను చేసి వెళ్ళారు. ఉదయం 10 గంటలకు దర్గాస్వామివారికి ఫోను చేసి "స్వామీ! మళ్ళీ ఫోను చేస్తున్నానని కోప్పడకండి" అని అనగానే (ఇంకేం చెప్పకుండానే) "ఎవరూ? దమ్మపేట దుర్గా?" అని స్వామి అడిగారు.

దుర్గ:- స్వామీ మళ్ళీ వాంతయింది. జ్వరం తీవ్రంగా వుంది. భయం వేస్తోంది

దర్గాస్వామి:- డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళమన్నాను కదా! హెూమియోపతి మందు ఇప్పించమన్నాను కదా! ఏమ్మా! వెళ్ళలేదా?

దుర్గ:- ఇలా చాలా ఎక్కువగా వుండడంతో తీసుకు వెళ్ళలేదు. భయమేస్తోంది.

(దుర్గ తల్లిగారు ఫోను తీసుకుని స్వామితో)

దుర్గ తల్లి:- స్వామీ! నాకేం వద్దు. సిరిసంపదలూ, ధనధాన్యాలూ వద్దు. ఆయన ఆరోగ్యం బాగుంటే చాలు. మీ ఆశీస్సులు కావాలి. ఆయన మోకాళ్ళు, కీళ్ళనొప్పులు చాలా సంవత్సరాలనుండీ తగ్గలేదు. ఊపిరితిత్తులలో రాళ్ళు వున్నాయట. కీళ్ళు అరిగాయి అన్నారు స్వామీ! (ఎక్స్‌రే తీయించి డాక్టరు కూడా అదే చెప్పారు.)

దర్గాస్వామి: **హెూమియోపతి మాత్ర ఒక్కటి వెయ్యి, చాలు తగ్గిపోతుంది. రాళ్ళు లేవు, ఏమీ లేవు. నేను చెబుతున్నాను కదమ్మా పిచ్చితల్లీ! ఎందుకు ఏడుస్తావు? ఏమీకాదు. సాయినాథుడు నీ అండన వున్నాడు. ఆయనను గట్టిగా పట్టుకో!!**

దుర్గ తల్లి :- బాబాను నేను గట్టిగానే పట్టుకున్నాను స్వామీ! రోజూ పూజిస్తున్నాను స్వామీ!

దర్గాస్వామి:- ఊపిరితిత్తులలో రాళ్ళూ లేవు, ఏమీ లేవు. అక్కడ సత్సంగానికి వెళ్ళండి. ఊదీ తెచ్చి వ్రాయండి. అమ్మా ఇక్కడకు రావాలంటే 500 కి.మీ. ఇప్పుడేం వస్తారు? అక్కడ లక్ష్మిగారింటికి వెళ్ళి **ఊదీ, తీర్థం తెచ్చి త్రాగే వాటిల్లో, తినే వాటిల్లో అన్నింటిలో వేసి ఇవ్వండి.**

**ఏం అమ్మా! ఇస్తున్నారా?**

దుర్గ తల్లి:- ఇస్తున్నాం స్వామీ! అక్కడకు రావాలని వుంది.

దర్గాస్వామి:- అమ్మా! గొలగమూడికి జంగిల్‌బాబాగారు శిష్యులతో వస్తున్నారు. అప్పుడే నేను కూడా వస్తున్నాను. అప్పుడు అక్కడకు వద్దురు గాని. ఇప్పుడు లక్ష్మి ఇంటికి వెళ్ళి తెచ్చుకోండి.

దుర్గ తల్లి 'స్వామీ! మీ చరిత్ర మా దగ్గర వుంది' అని అనగానే స్వామి ఫోను పెట్టేశారు. స్వామి ఓదార్చిన విధానం, ఆయన ప్రేమపూర్వకమైన, వాత్సల్యపూరితమైన లాలనకు ఆమె ఎంతో ఊరట పడ్డారు. కన్న తండ్రిలాగా మాట్లాడారు.

11:00 గంటలకు కొంచెం జ్వరం తగ్గింది. 12గంటలకు గ్లూకోజ్, నీళ్ళు, రొట్టె ఇచ్చారు. అవి తీసుకొని చలితో రగ్గు కప్పుకుని సాయంత్రం 6 గంటల వరకూ పడుకున్నారు. 6 గంటలకు వారే లేచి **ఆశ్చర్యంతో ఇదేంటీ నా కీళ్ళ నొప్పులు, ఏమీ లేవు ఏమయ్యాయి? జ్వరం తగ్గిపోయింది అని ఎంతో ఆనందంగా చెప్పారు. వారి కాళ్ళు, చేతులు ఆ స్థితిలో ఏ వాపూ, నొప్పీ లేకుండా వుండడం 11 సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇదే మొదటిసారి. ఆ రోజు సాయంత్రం నుండీ పాలు, కాఫీ అన్ని రకాల కూరలు తీసుకోవడం మొదలు పెట్టారు.**

స్వామి హోమియోపతి మాత్ర వేయమన్నారు కదా! కానీ ఇప్పుడు స్వామికృప వలన తగ్గిపోయింది కదా! ఇక వేయడమెందుకు అని అనుకున్నారు. లక్ష్మిగారిని అడిగారు. స్వామి వేయమన్నారు కదా వేస్తే సరి అన్నారట. అప్పుడు వారు ఇప్పుడేం లేదు కదా? దేనికని వేస్తాము? వేయమంటారా? అని అడిగారట. అప్పుడు లక్ష్మిగారు సరే మళ్ళీ ఏమైనా వస్తే వేయండి అన్నారట.

అప్పటి నుండి పూర్తి స్వస్థులయినారు. కొంచెం బలహీనంగా వుండటం తప్ప ఏ విధమైన వాపులు, నొప్పుల బాధలు లేవు. 2002 ఫిబ్రవరి 6వ తేదీన ఎడమకాలు మోకాలు దగ్గర, పాదం దగ్గర కొంచెం నొప్పి మొదలయింది. అప్పుడు స్వామి చెప్పారు కదా! హోమియో

మందు ఇప్పించమని అని గురువారం జంగారెడ్డి గూడెం వెళ్ళి 15 రోజులకు మందు తెచ్చుకున్నారు. కొంచెం నొప్పి తగ్గింది. వారిపై అత్యంత భక్తిశ్రద్ధలతో పారాయణ, పూజలు, ప్రదక్షిణలు చేస్తున్నారు. సత్సంగంలో పాల్గొంటున్నారు.

## ఖమ్మంపాటి వేణు, దమ్మపేట ఇలా వ్రాస్తున్నారు:

నాకు మహనీయులన్నా, దేవుళ్ళన్నా నమ్మకముండేదికాదు. 2003వ సంవత్సరము, జనవరి నుండి బాగా దగ్గుగా వుండడం వల్ల రాజమండ్రి, సత్తుపల్లి, ఏలూరు, విజయవాడ, పాల్వంచలలోని డాక్టర్ల మందులు ఎన్ని వాడినా ఏమాత్రం తగ్గడం లేదు. పది నెలలు జరిగిపోయింది. మా బంధువు ఒకామె 'ఇంత ప్రయత్నిస్తున్నావు. మౌనబోధ అనే పుస్తకం 40 రోజులు చదివి శ్రీ వెంకయ్యస్వామివారి దర్శనానికి వస్తాను. నా బాధ నివారించమని మ్రొక్కు చెప్పుకోమన్నది'. సరేనని మౌనబోధ పారాయణ 25 రోజులు చేయగానే మా గ్రామస్థులు గొలగమూడి వెళ్తుంటే నేనూ, నా భార్య వెళ్ళాము. అందరూ ముందు దర్గాస్వామివారి దగ్గరకు వెళ్ళి తర్వాత గొలగమూడికి పోదామని తీర్మానించి అలా వెళ్ళాము. అక్కడకు వెళ్ళి శ్రీ స్వామి ముందు కూర్చొని నా ఆరోగ్యం బాగాలేదు స్వామీ అని చెప్పగానే "నీకు చెస్ట్ దగ్గర నొప్పిగా వుంది. ఊపిరితిత్తుల్లో నీరు, దగ్గ ఉంది. అదేమీ చేయదులే. రోజూ రాగిరొట్టె తిను అని తయారు చేసే పద్ధతి కూడా వారే చెప్పారు". అప్పటి నుండి రాగి రొట్టె తింటున్నాను.

అదేమీ చిత్రమోగాని స్వామి దగ్గరకు పోయేటప్పుడు మా రెండు సంచులూ నా భార్యే మోసుకొచ్చింది. కానీ తిరుగుప్రయాణంలో ఆ రెండు సంచులూ నేనే మోసుకొచ్చాను. కాళ్ళ నొప్పులు, చేతుల నొప్పులు, చెస్ట్ నొప్పి ఎలా పోయాయో తెలియదు. అంతా శ్రీ స్వామివారి అనుగ్రహం. అది మొదలు మహనీయులు, దేవుడు, మందిరం అంటే నమ్మకమేర్పడి నిత్యం మందిరానికి వెళ్ళడం, పారాయణ చేయడం లాంటి మంచి మార్గంలో నడుస్తున్నాను.

## నేనే నీ వద్దకు వస్తాను

ఎమ్. సూర్యప్రకాశ్‌గారికి ఒకరోజు రాత్రి విపరీతమయిన మానసిక ఆందోళన, చికాకుగా వుంది. ఎంతకూ మనస్సు ప్రశాంతమవక, నిద్రపట్టక ఎంతో బాధపడుతున్నారు. తీవ్రమయిన ఆ మానసిక కలవరంతోనే రాత్రి 12:00 గంటలు అయ్యింది. వారి వద్ద సద్గురు దర్గాస్వామివారి ఫోను నెంబరు వుంది. వారికి ఫోను చేసి మాట్లాడాలనిపించి, మళ్ళా వద్దనుకొని అలా కొద్దిసేపు ముందూ వెనుకాడి రాత్రి 12:00గంటల పైన ఫోను చేశారు. దర్గాస్వామి ఫోను ఎత్తి వారి వివరాలు అడిగి టైము ఎంత అని అడిగారు. వీరు చెప్పగా **"ఈ టైములో నువ్వు ఫోను చేయాలా నేనే నీ వద్దకు వస్తాను"** అన్నారు. **మాట్లాడి ఫోను పెట్టేశాక అదేమి చిత్రమో వీరికి అసలు అంతకు ముందు అంత అశాంతిగా వున్నది కాస్తా ఏమాత్రం లేకుండా హాయిగా ఆనందంగా నిద్ర పోయారు.** ఆ మరురోజు తన విద్యార్థి ఒకరు అనుకోకుండా సాయిసన్నిధి గ్రంథం ప్రకాశరావుగారి గారి ఇంటికి తీసుకువెళ్ళి ఇచ్చారు. వారు దాన్ని తెరువగానే స్థానము - మీరున్నచోటు అన్నపేజీ తెరువబడడం, వారు దాన్ని చదివి నిన్న రాత్రి స్వామి నేనే నీ దగ్గరకు వస్తాను అంటే ఈ విధంగానేమో అన్నారు. ( ఆ పుస్తకరూపంలో)

## శేఖర్‌రాజు గారు, బి.టి.ఎమ్. టెంపుల్, బెంగుళూరు

ఒకసారి మా అబ్బాయి వ్యాపారంలో మంచి ఫలితాలు రావడం లేదు అని చెప్పినప్పుడు స్వామివారు 2010 మార్చి తరువాత మెరుగవుతుంది అని అన్నారు. అదే ప్రకారంగా మార్చి 12, 2010 నుండి మార్పు వచ్చి బండి కదలటం అయ్యింది. కృతజ్ఞతగా నా కొడుకుని స్వామివారి దగ్గరకి వెళ్ళి "స్వామీ! మీరు చెప్పినట్లు నా కొడుకు వ్యాపారంలో మంచి మార్పు వచ్చింది" అని చెప్పినప్పుడు వెంటనే స్వామివారు **"నేను చెప్పలేదు, నా గురువుగారు చెప్పారు"** అని అన్నారు. నిజమైన సత్పురుషుల లక్షణమిది. నేను అల్లాకు మాత్రమే బానిసను. నా నుండి ప్రకటమయ్యే లీలలన్నీ గురుకృపకు నిదర్శనమే

అని శ్రీ షిర్డీ సాయి చెప్పిన దానికిది సరిపోయినది.

నా కుమారుడిని ఇష్టదైవమేమని స్వామి అడిగితే సుబ్రహ్మణ్యస్వామి అని మా అబ్బాయి చెప్పాడు. అప్పుడు సుబ్రహ్మణ్యస్వామి బీజాక్షరాన్ని స్వామివారు ఉపదేశించి, నిరంతరం స్మరణ చెయ్యి భగవంతుని ఆశీస్సులు వుంటాయి అని చెప్పారు.

మా అమ్మాయి అశ్వనిని స్వామివారు ఏం కావాలి అని అడిగినప్పుడు మీ అనుగ్రహ ఆశీస్సులు కావాలని అడిగింది. స్వామి సంతోషంగా దీవెనలు ఇచ్చారు.

ఇప్పుడు మేము స్వామివారిని అవకాశం వున్నప్పుడు దర్శించుకుంటూ భక్తి, శ్రద్ధలతో సేవించుకుంటున్నాము.

## కిరణ్, రాయచోటి

నేను ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న రోజులలో మా పిన్నమ్మ నాకు దర్గాస్వామి గూర్చి చెప్పింది. నేను, మా అమ్మ, చెల్లి, ఇద్దరు పిన్నమ్మలు కలిసి స్వామి దర్శనానికి వెళ్ళాము. నా జాబ్ గురించి అడిగినప్పుడు స్వామి "3 నెలల్లో వస్తుంది" అని అన్నారు. సరిగ్గా 3వ నెల చివరి రోజున ఇంటర్వ్యూలో వున్నాను. నాకు ఆ రోజే ఇంటర్వ్యూ క్లియర్ అయ్యి జాబు వచ్చింది.

## శ్రీకాంత్ :

నేను స్వామివారిని ఉద్యోగం కోసం అడిగితే "బెంగుళూరుకి వెళ్ళు, వస్తుంది" అని అన్నారు. అలాగే నేను బెంగుళూరుకి వచ్చాను. నాకు జాబ్ వచ్చి సంతోషంగా వున్నాను.

## భరత్, రాయచోటి

స్వామివారి ఆశీస్సుల వలనే నాకు మంచి మార్కులు ఇంటర్మీడియెట్, ఇంజనీరింగ్‌లలో వచ్చాయి. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు స్వామివారు "బాబాకి పల్లకీ మొయ్యరా, ఉద్యోగమిప్పిస్తాము" అని అన్నారు. అలాగే చేస్తే నాకు బెంగుళూరులో ఉద్యోగం వచ్చింది.

## ఛాయగారు, మదనపల్లి

1. నేను సప్తగిరి గ్రామీణ బ్యాంకు మదనపల్లికి 50కి॥మీ దూరంలో వున్న పెద్దమండ బ్రాంచిలో పనిచేస్తున్నాను. ఒక సంవత్సరం పనిచేసిన తర్వాత ఇంక అక్కడ పనిచేయలేననుకున్నాను. స్వామికి చెప్తే "పోమ్మా! అదే మీ ఊరు వస్తుంది" అన్నారు. నేను మరలా ఉద్యోగం గురించి ప్రస్తావిస్తే అదే మాట అన్నారు. తర్వాత కొన్ని రోజులకే భారత గవర్నమెంటు ఒక తీర్మానం చేసింది. ఏదైనా గ్రామీణ బ్యాంకు సరిగ్గా పనిచేయకుంటే దగ్గరలో ఉన్న పట్టణానికి మార్చవచ్చు. దాని ప్రకారం మదనపల్లికి 18కి॥మీ దూరంలో వున్న రెడ్డివారిపల్లె బ్రాంచి సరిగ్గా పనిచేయక పోవటం వలన దానిని మదనపల్లికి మార్చారు. ఆ బ్రాంచికి నన్ను క్లర్కుగా వేసారు.

2. మా అమ్మాయిని హైదరాబాద్‌లో బి.టెక్. చదివించమన్నారు. అక్కడ 10-12 లక్షలు ఖర్చు అవుతుందని తమిళనాడులోని హొసూరులో చేర్పించనా అని అడిగితే స్వామి "నీ ఇష్టం" అని అన్నారు. ఆ మాటనర్థం చేసుకోకుండా హొసూరులో 40,000 కట్టి చేర్పించాను. మా హైదరాబాదు చిన్నాన్న స్వామికి ఫోను చేసినప్పుడల్లా "హైదరాబాద్‌లో సీట్ దొరుకుతుందేమో" చూడమన్నారు. స్వామి దయవలన హైదరాబాదులో సీట్ దొరికింది. హొసూరులో 40,000 కట్టి ఉన్నాము. ఆ కాలేజీవారు కట్టిన డబ్బు ఇప్పటిదాకా వెనక్కు ఎవరికీ ఇవ్వలేదు. నేను స్వామికి చెప్తే వాపసు యిస్తారని చెప్పారు. అలానే స్వామి దయవలన చిత్రాతిచిత్రంగా మేము కట్టిన డబ్బు వాపసు ఇచ్చారు.

## ఛాయాగారి చెల్లెలు యిలా చెప్పుతున్నారు

కడప అవధూతేంద్రస్వామి చరిత్రలో దర్గాస్వామి గురించి తెలిసి స్వామి దగ్గరకి రావటం జరిగింది. ఒకసారి దర్గాలకి వచ్చినప్పుడు మనస్సులో సాయిబాబాతో 'బాబా! నీవు, స్వామి ఒకటే అయితే స్వామి నా దగ్గరనుండి 11 రూపాయలు అడగాలి' అని చెప్పుకున్నాను. నేను స్వామి దగ్గర సెలవు తీసుకుంటుంటే స్వామి నాతో "11 రూపాయలు నేను అడగాలని బాబాను అడుగుతున్నావు కదా" అని అన్నారు. అంతటితో

విశ్వాసం దృఢపడింది.

స్వామికి నచ్చిన సంబంధము చేసుకుందామని 1993వ సం॥లో ఒక సంబంధము గురించి చెపితే స్వామి "అమ్మా! ఆయనకు ఇప్పుడు ఏమీ లేదు. కానీ జీవితములో నీకేమీ లోటు రాదు" అని చెప్పి ఆ సంబంధమును ఖాయం చేసారు. అలానే పెళ్ళి చేసుకున్నాను. అప్పుడు మా ఆయనకు నెలకు 600 రూపాయల జీతం. కానీ స్వామి ఆశీర్వాదంగా ప్రస్తుతానికి 50 వేల పైన జీతం వస్తోంది. పైగా కొన్ని ఆస్తులు కూడా వున్నాయి. ఎంతో ఆనందంగా వున్నాము. స్వామి వాక్కు అమృతవాక్కు!

2010 డిసెంబరులో ఒంట్లో బాగోక స్వామి దగ్గరకి వెళ్ళితే నా శరీరమంతా చూచి నాకు క్షయరోగం ఉంది మందులు తీసుకోమన్నారు. నేను హైదరాబాదులోని ప్రముఖ హాస్పిటల్లో చెకప్ చేయించి క్షయ రోగముందా అని అడిగినా వారు లేదని నిర్ధారించారు. మూడు నెలల తర్వాత మా స్నేహితురాలి భర్త దగ్గర చెకప్ చేయిస్తే క్షయ ఉందని నిర్ధారించారు. నేను మందులు తీసుకుంటున్నాను. మరలా దర్శించినప్పుడు తగ్గిపోతుందని భరోసా యిచ్చారు.

## పద్మజ, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా

మా అమ్మాయి యం.పి.సి మొదటి సంవత్సరం చదువుతోంది. స్వామి దగ్గరకి తీసుకెళ్ళినప్పుడు స్వామి మా అమ్మాయిని "ఏమి చదువుతున్నావు?" అని అడిగారు. మా అమ్మాయి "మొదటి సంవత్సరం' అని మాత్రమే చెప్పింది. ఇంకేమీ చెప్పకుండానే స్వామి "యం.పి.సి, ఇంజనీరింగ్ చేస్తావు'' అని ఆశీర్వదించారు. ప్రతి ఒక్కరి పుట్టుపూర్వోత్తరాలు స్వామికి తెరిచిన పుస్తకమే.

## వెంకటేశ్వరరావుగారు, హైదరాబాదు

1. నా భార్య, పాపలను తీసుకొని పాసుపోర్టు ఆఫీసు కెళ్ళాను. నేను బయట కూర్చొని అప్లికేషన్‌లను ఇచ్చి రమ్మన్నాను. కౌంటర్‌లో వున్న అతను అప్లికేషన్‌లో వివరాలు పూర్తిగా ఇవ్వలేదని పూర్తి చేయమని బాగా అరిచేసరికి నాభార్య, పిల్ల వెనక్కొచ్చి వెళ్ళిపోదామన్నారు. **నేను వారితో**

**ఒక్కసారి దర్గాస్వామిని తలుచుకుని, వెళ్ళండి అన్నాను. అలానే తలచుకున్న తర్వాత మరలా వెళ్ళితే అదే గుమాస్తా 5 నిముషాలలో అప్లికేషన్‌లో ఉన్న కొన్ని వివరాలు అతనే అడిగి నింపి మా అప్లికేషన్‌ను తీసుకున్నాడు.**

2. మా ఆవిడ యాత్రలకెళ్ళినప్పుడు మా పెద్దమ్మాయి, నేను యింట్లో ఉన్నాము. ఒకరోజు అర్ధరాత్రి 12గం॥లకు మా అమ్మాయికి కడుపులో నొప్పి వచ్చి తట్టుకోలేక నా దగ్గరకొచ్చి డాక్టరు దగ్గరకెళదామంది. నేను గాఢనిద్రలో నుండి లేచి ఈ సమయంలో పిల్లని తీసుకెళ్ళటం ఎలా అని, మా అమ్మాయితో అమ్మా 'స్వామిని తలచుకో, గురుచరిత్ర ఒక అధ్యాయం చదువు' అని చెప్పిన తర్వాత మా అమ్మాయి నాతో 'ఏంటి నాన్న! కడుపులో నొప్పి వస్తే పుస్తకాలు చదవమంటావు' అని అన్నది. నేను మరలా 'స్వామిని తలుచుకో, గురుచరిత్ర 20వ అధ్యాయం చదువు' అని చెప్పాను. అలానే చేసింది. కడుపులో నొప్పి ఏమైందోగానీ హాయిగా నిద్రపోయింది.

## రాజీవ్, హైదరాబాదు

నేను సాయిబాబా మందిరంనుండి హాలుకి వస్తూంటే కుడికాలి బొటనవేలి మీద తేలు కుట్టింది. శంకరయ్య నన్ను వెంటనే స్వామి దగ్గరకు తీసుకు వెళ్ళారు. కుట్టిన చోట విబూది పెట్టమని, అంతా బాగుంటుందని స్వామి చెప్పారు. చాలా త్వరగా నాకు నొప్పి తగ్గిపోయింది. తర్వాతరోజు స్వామి చెప్తూ పాము కరవటం కానీ, తేలు కుట్టటంకానీ మన పూర్వ చెడ్డ కర్మవల్ల మాత్రమే అని అన్నారు.

## నటరాజగారు, రాయచోటి

ఒకరోజు నేను దర్గాస్వామి నివాసంలోకి వెళుతుంటే హాలు ఎంట్రన్సులో వుండే ఇనుపగ్రిల్ తగిలి బాగా నొప్పి పుట్టింది. స్వామి ముట్టుకోగానే నొప్పి అంతా పోయింది.

నేను 20 సంవత్సరముల నుండి బట్టలంగడి నడుపుతున్నాను. వ్యాపారం అంతంత మాత్రంగా జరుగుతుండేది. ఒకరోజు స్వామి,

అమ్మయ్యలు రాయచోటికి వచ్చినప్పుడు నా అంగడికి కూడా వచ్చారు. నేనడగకుండానే స్వామి నాతో "ఈ బట్టలంగడి తీసేసుకో, నీకిది కలిసిరాదు" అని చెప్పారు. అలా చెప్పిన తర్వాత కూడా 3 సం॥లు బట్టలంగడి మీద వ్యామోహంతో అదే వ్యాపారం చేసాను. ఏమాత్రం కలిసి రాలేదు. తర్వాత ఆ వ్యాపారం తీసేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించాను. వ్యాపారం బాగా కలిసొచ్చింది.

## వీర ప్రతాప్, ఎమ్.టెక్, ఎన్.ఐ.టి, కాలికట్

1. నేను 2010 డిసెంబర్‌లో దర్గాస్వామి దర్శనానికి నా స్నేహితులతో వెళ్ళాను. ఒకరోజు ఉదయం ఒక గ్రామం నుండి వచ్చిన గ్రామస్థులు నవ్వుకుంటూ వుంటే కారణమేమని అడిగాను. వాళ్ళు యిలా చెప్పారు.

కొన్ని కక్షల కారణంగా మా మీద కొంతమంది బాంబులు వేసారు. మేము 'సద్గురుదేవా, సద్గురుదేవా' అని స్వామిని తలుచుకున్నాము. ఆ బాంబులు మా ప్రక్కనే పడినా అవి పేలలేదు. మాకు అనుమానం వచ్చి వాటిని తీసి దూరంగా విసిరేస్తే అవి అక్కడ పేలాయి. అంతా స్వామి దయ!

మహనీయుల చరిత్రలలో జరిగిన మహిమలు చదువుకోవటమే కదా అనుకుంటే దర్గాస్వామి చేసిన లీల విన్న నాకు ఎంతో ఆనందం వేసింది.

2. నేను అమ్మయ్య సమాధి దగ్గరవున్న పటాలకు పూలు పెడుతూ దర్గాస్వామి పటాలకు  పూలు పెట్టాలంటే భయము , అంత అర్హత లేదని తలచి పెట్టకుండా పూలు పట్టుకొని అటూ ఇటూ తిరుగుతుంటే నాకు తెలిసిన ఒకాయన నాతో 'దర్గాస్వామి అక్కడ కూర్చుని వున్నారు. నమస్కారం చేసుకో' అని చెప్పారు. వెంటనే వెళ్ళి నమస్కరించి లేచేసరికి, స్వామి "పటాలకు పూలు పెట్టు, పో" అని నా హృదయంలో వచ్చిన సంశయాన్ని, భయాన్ని తొలగించి స్వామి సర్వజ్ఞుడు అని నా మనస్సులో దృఢపడింది.

3. 2011 జనవరి 1వ తేదీన స్వామి ఏదైనా బోధించాలనుకున్నాను. స్వామి మాట్లాడుతూ "రాముడు కూడా మానవుడిగా వచ్చినప్పుడు

మాయలోపడి చిన్నపిల్లాడిగా ఆడుకుంటుంటే వశిష్ట మహర్షి నాలుగు లక్షణాలు బోధించారు : **తృప్తి, శాంతి, విచారణ, సత్సావాసము** ఇవి మనం అలవరచుకోవాలి" అని చెప్పారు.

4. ఆశ్రమనివాసి శంకరయ్యగారు చెప్పగా విన్నది.

ఒక జంట స్వామి దర్శనమునకు వచ్చి బిడ్డలు కావాలని అడిగారు. కొంతకాలానికి ఒక బిడ్డ జన్మించి మరణించింది. ఆ చనిపోయిన బిడ్డను తీసుకు వచ్చి స్వామితో 'స్వామీ! బిడ్డనిమ్మంటే ఇలా చనిపోయిన బిడ్డను ఇచ్చారేమీ! స్వామీ' అని విన్నవించుకున్నారు. స్వామి ఆ బిడ్డ కాళ్ళు ఒక చేత్తో పట్టుకొని దర్గాల దగ్గర గిరగిరా త్రిప్పారు. అంతే! ఆ బిడ్డ గుక్కపట్టి ఏడవడం మొదలుపెట్టింది. అంతటితో స్వామి సమర్థత తెలిసి ఆ దంపతులు స్వామికి ప్రణమిల్లారు.

## శంకర నారాయణ, ఆశ్రమ నివాసి (శంకరయ్య)

1998 నుంచి జరిగిన అనుభవములు

1. ఒకరోజు స్వామి 4గం॥లప్పుడు నిద్రలేపి "దొంగలుబడ్డారు, లేవరా హుండీ ఎత్తుకు వెళుతున్నారు, లాంతరు వేసి చూడు" అని అన్నారు. లాంతరు వెలిగించి అంతా వెతికాను హుండీ భద్రంగానే ఉంది. తదుపరి కొద్దిరోజులకి మా ఊరిలోని నా పూర్వపు గురువుగారి మందిరంలో దొంగలుబడి హుండీ ఎత్తుకెళ్ళారు అని తెలిసింది. స్వామి నన్ను నిద్రలేపిన రోజునే అది జరిగింది. ఈ లీల ద్వారా స్వామి సర్వజ్ఞులనీ, తమనాశ్రయించిన భక్తులకు ఎంత చిత్రంగా విశ్వాసాన్ని దృఢపరుస్తారో తెలుస్తోంది.

2. ఒకసారి గంగానది స్నానం చేసిరావాలని అనుకుంటున్నాను. స్వామి స్వప్నంలో గంగాజలం చూపించి నెత్తిమీద చల్లుకోమన్నారు.

3. కాశీ, ఉత్తరకాశీ, బదరి, కేధార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి మొదలగు పవిత్ర స్థలములను చూసి రమ్మని స్వామి అనుజ్ఞ ఇచ్చారు. నేను ఎలా వెళ్ళాలిరా అనుకుంటూ బయలుదేరాను. కొందరు పైన పేర్కొనిన యాత్రలకు వెళుతూ తారసపడ్డారు. వారంతటవారే మాతోబాటు

తోడుగా వస్తారా అని అడిగారు. నేను ఇది అంతా స్వామి కృప అని మనసులో అనుకొని సరే అని అన్నాను.

వారు నాకు అన్ని ప్రదేశాలు 10 రోజులు దగ్గర ఉండి చూపించడమే కాకుండా తిరుగు ప్రయాణం ట్రైన్ టికెట్టు కూడా ఇచ్చారు. మొత్తం ఖర్చు 3,000 రూపాయలు మాత్రమే అయ్యింది.

4. నేను కేదార్‌నాథ్ వెళ్ళేటప్పటికి అక్కడ 7 రోజులుగా జోరుగా వర్షం పడుతోంది, మరి ఒక కొండచరియ విరిగి దారికి అడ్డంగా పడింది. నేను తిరిగి స్వామి దగ్గరకి వెళుతానో లేదోనని భయంతో ఫోన్ చేసి స్వామికి విషయం చెప్పాను. స్వామి భయంకరంగా కోప్పడి, సుమారు 2 గం॥లు ఫోన్‌లో తిడుతూనే ఉన్నారు. తరువాత ఫోను పెట్టేసారు. మరుసటిరోజు ఉదయం వాతావరణం అంతా చక్కబడి మంచి ఎండ కాసింది.

## ఉమామహేశ్వరరావుగారు, గంగపట్నం

ఒకసారి నెల్లూరు నుండి ఐదుగురం స్వామి దగ్గరకి మారుతీ వ్యాన్‌లో వెళ్ళుతున్నాము. దామరమడుగు దగ్గర చాలా వేగంగా వెళ్ళుతున్న మా వ్యాన్ రోడ్డు ప్రక్క 5,6 అడుగుల క్రిందలో వున్న కాలువలో పడిపోయింది. వ్యాన్ సగం మునిగింది. కానీ మాలో ఎవ్వరికీ ఏ దెబ్బా తగల్లేదు. ఇది ఏదో కాకతాళీయమనుకుంటామని ప్రమాదం జరిగిన తర్వాత మేము లేస్తుంటే ఒక సాధువు కనపడి "మీరు కడపకి కదా వెళ్ళుతున్నారు" అని అడిగాడు. మేము ఔననగానే "మీకేమీ కాదు" అని చెప్పి అదృశ్యమవగానే మాకు దెబ్బ తగలకపోవటం స్వామి దయ అని గుర్తించాము. అదృశ్యమవకుంటే మాకు స్వామే రక్షించాడని గుర్తించలేకపోతామని స్వామి అలా చేసారు

## కృష్ణారెడ్డిగారు, నెల్లూరు

ఒకసారి ఒక భక్తుడు (నెల్లూరు వాస్తవ్యులు) స్వామి దగ్గరకి వెళ్దామని నన్ను ఉదయం 5గంటలకి రమ్మన్నారు. కానీ కొన్ని కారణాల వలన 7గం॥ 30ని॥లకి బయలుదేరగలిగాము. ఎట్లాగైనా మధ్యాహ్న ఆరతికి

వెళదామని ఆయన అడగడంతో వ్యానుని వేగంగా పోనిస్తున్నాను. మైదుకూరు అవతల 15 కి.మీ. సింగిల్ రోడ్డు వుంది. అకస్మాత్తుగా 7,8 సం॥ పిల్లవాడు రోడ్డుకి అడ్డంగా రావటం, వ్యానుకి గుద్దుకోవటం జరిగి అతను ఎగిరి అవతల క్రింద పడిపోయాడు. గంటకి 100 కి.మీ. వేగంతో వెళ్తున్నాము కాబట్టి పిల్లవాడు చనిపోయి వుంటాడనుకున్నాను. కానీ చాలా చిత్రంగా ఒక్కచోటకూడా నెత్తురు గాయమవలేదు. జనం పోగై డాక్టరు దగ్గరకి తీసుకు వెళ్ళమన్నారు. డాక్టరు పరీక్ష చేసి ఇంజెక్షను వేసాడు. కొంతసేపటికి పిల్లవాడు లేచి నడవగలిగాడు. ఈ తతంగమంతా అయ్యి స్వామి దగ్గరకి వెళ్ళేసరికి మధ్యాహ్నం ఒకటిన్నర గంటయ్యింది. నాతో వచ్చినాయన 'స్వామీ! ఆరతికి వద్దామనుకున్నాము కానీ రాలేకపోయాము' అని అన్నాడు. స్వామి వెంటనే "దార్లో అబ్బాయి పడ్డాడు. ఆ అబ్బాయికి ఏమీ కాలేదు. ఆ వ్యానులో ఎప్పుడూ నేనున్నాను" అని మేము చెప్పకుండా స్వామి చెప్పి గంటకి 100కి.మీ. వేగంతో వెళ్ళే వ్యానుకు తగిలి చిన్న పిల్లవాడికి దెబ్బ తగలకపోవటము స్వామికృపేనని మనస్సుకు హత్తుకునేటట్లు చేసారు.



# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 5

## భూతనియంత

నిర్మలం, నిష్కళం, నిత్యం, నిర్వికల్పం, నిరంజనం అయినట్టి ఆ పరమాత్మ తాను అనేకమవ్వాలనే దివ్య సంకల్పంతో ధరించిన రూపమే ఈ స్థూలజగత్తు. మన శరీరం మనస్సుకధీనమైనట్లు, మన మనస్సు ఆత్మకధీనము. సద్గురువు త్రిమూర్త్యాత్మకుడైన సాక్షాత్తు పరబ్రహ్మమే గనుక ఈ విశ్వమంతా వారి అధీనమై ఉంటుంది. ఈ విషయం సద్గురువు ద్వారా ప్రకటమయ్యే దివ్యలీలల ద్వారా భక్తులకు తెలుస్తుంది. అనంతమైన ఈ ప్రకృతిని శాసించగల సద్గురువు సామర్థ్యమును చవిచూచిన భక్తులకు, గురువు యందు విశ్వాసం ధృఢపడి శ్రద్ధాభక్తులతో వారిని సేవించి తరించగలరు.

**మనజీవిత సంఘటనలను శాసించగల దైవశక్తి ఒకటున్నదన్న విశ్వాసం మనకు కల్గించాలని, తద్వారా నిత్య జీవితములో వివేకము, వైరాగ్యము గల్గి ధార్మిక జీవితము త్రికరణ శుద్ధిగా మనచేత ఆచరింపజేయాలనే సద్గురుని యొక్క తపనే ఇట్టి లీలలకు మూలము.**

వారు మన నుంచి ఆశించునది అట్టి పవిత్ర జీవన విధానమే. మనం అలా జీవించినప్పుడే మనం నిజంగా వారికి దక్షిణ సమర్పించిన వారమవుతాము. అలా చేయనప్పుడు లీలా రూపంలో మనపై వర్షించిన సద్గురుకృప అడవిగాచిన వెన్నెలవలె వ్యర్థమగును.

### మోహనరావుగారు, దమ్మపేట:

(1) నన్ను విజయదశమికి రెండు రోజులు ముందుగా రమ్మని చెప్పినారు. అరటి తోట తడపాలి నాకు వీలుపడదు అని ఫోటో రూపంలో వున్న స్వామితో గురువారం రోజు చెప్పినాను. ఆ రోజు రాత్రి 7 దుక్కుల వర్షం పడింది. ఇక తోట పని ఏమీ లేదని శుక్రవారం బయలుదేరి

స్వామి వద్దకు వెళ్ళినాను. నన్ను చూచి స్వామి “ఒరే మోహనా! నీవు వర్షం పడకపోతే రానన్నావుట, వర్షం పడిందటగా, వర్షం సరిపోతుందా? ఇంకా కావాలా?” అని అడిగినారు. వారి సర్వజ్ఞత్వం, సర్వ సమర్థత్వం అలా వెల్లడి చేసినారు. ఈ లీలను హృదయగతం చేసుకొని స్వామే స్వయంగా తమ దగ్గరకు రమ్మని చెప్పినప్పుడు ఎంత నష్టమైనా వెళితే ఆయన ఎంత సంతోషిస్తారో కదా!

(2) ఒక రోజు “ఒరే మోహనా! నీకు తెలుసుగా, అమ్మయ్యని అడిగి బియ్యం తీసుకుని వండుకుని తిన్న తర్వాత పడుకోండి. రేపు ఉదయం చెపుతాను” అని స్వామి అన్నారు. వెనకాల వచ్చిన 9 మందికి కూడా మోహన్‌గారే వండాలి అన్నారు. మరియు ఎవరూ ఎటువంటి సాయమూ చేయలేదు. ఇంతమందికి ఎంత బియ్యం వండాలో తెలియని మోహన్‌గారు ఒక కేజీ బియ్యం తెచ్చి స్వామి మీద నమ్మకంతో శ్రీ గురు చరిత్రలోని భాస్కరశర్మ చేసిన భిక్ష సన్నివేశాన్ని గుర్తు చేసుకుని వండారు. ఆ వండిన అన్నాన్ని ఆ 11 మంది తినటమే కాక మరొక నలుగురికి ఇచ్చారు. మరియు ఇంకా మిగిలిన ఇద్దరు, ముగ్గురికి సరిపోయే అన్నాన్ని అక్కడ వున్న కుక్కలకు పెట్టారు. అంటే 1 కేజీ బియ్యం 18 మందికి సంతృప్తిగా సరిపోయింది. ఇది శ్రీ గురుడి సన్నిధిలో భాస్కరశర్మ చేసిన భిక్షను పోలివున్నది.

## శ్రీ రామశాస్త్రిగారు (దమ్మపేట) చూసిన సన్నివేశం:

ఒకసారి దర్గాల దగ్గర జెండా ఉత్సవం చేసే రోజు ఉదయం హోమం జరుగుతుంటే వర్షపు చినుకులు పడుట ప్రారంభమయినాయి. స్వామి ఆకాశం వైపు చూసి “ఆగు” అన్నారు. తర్వాత సజావుగా కార్యక్రమం జరిగింది. సాయంత్రం పల్లకీ సేవకి ముందర మబ్బుకట్టి వర్షం మొదలైంది. మేమంతా ఈరోజు పల్లకీ సేవ జరగదనుకున్నాము. కానీ చిత్రంగా వర్షం ఆగిపోయింది. మబ్బులు విడిపోయాయి. పల్లకీ సేవ అయిన తర్వాత స్వామి ముందర కూర్చున్నాము. స్వామి మాతో “పల్లకీ సేవ జరగదనుకున్నారు కదా!” అని అన్నారు. ‘అవును, స్వామీ! వర్షమొచ్చి పల్లకీ సేవ ఆగిపోతుందనుకున్నాము’ అని అన్నాము.

**"పరమాత్ముడున్నాడు. ఆయనే అన్నీ చేస్తాడు"** అన్నారు స్వామి. సంకల్పమాత్రంతో పంచభూతాలను శాసించగల స్వామి ఎంత నిరాడంబరంగా ఆయన చేసే లీలలన్నీ కూడా పరమాత్ముడే చేస్తున్నారని చెపుతున్నారు. ఎంత సాధారణత్వమో కదా!

## పాండురంగారావు. ప్రొద్దుటూరు

జూన్ 4,5,6న ప్రొద్దుటూరులో అమర్త్యేశ్వరస్వామి మందిర ప్రతిష్ఠ కోసమై స్వామి వచ్చారు. 4వ తారీఖు ఉదయం కార్యక్రమం మొదలైనప్పుడు చిన్నగా చినుకులు మొదలైనాయి. స్వామి శివలింగం వంక చూస్తూ " ఏమి శివా! నీకు వర్షం కావాలా? నీ త్రిశూలం పంపించు" అని అన్నారు. వెంటనే వర్షం ఆగింది. 6వ తారీఖు మధ్యాహ్నం 3గంటల కల్లా కార్లు తీసుకురమ్మన్నాము స్వామిని తీసుకు వెళ్ళటానికి. ఆ కార్లు సమయానికి రాకపోయేసరికి కారణం అడిగితే వచ్చేచోట బ్రహ్మాండంగా వర్షం పడుతోందని ఒక్క ప్రొద్దుటూరులోనే వర్షం పడట్లేదని చెప్పారు. కార్యక్రమం అయిన తర్వాత స్వామిని తీసుకొని ప్రొద్దుటూరు దాటాము. కొంతసేపటికి మాకు ఫోను వచ్చి ప్రొద్దుటూరులో బ్రహ్మాండంగా కుంభవృష్టి కురుస్తోందని తెలిసింది. అప్పుడుగానీ స్వామి సర్వభూతనియంతని అర్థం కాలేదు.

## కె. శ్రీనివాసరెడ్డిగారు, నెల్లూరు

1. నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు దగ్గర స్వామి ఆశీస్సులతో నిర్మించిన సాయిబాబా మందిర ప్రతిష్ఠ మే 13వ తారీఖున ఖాయమైంది. మే నెల ఎండలకి భయపడి మే 12 న నగరోత్సవం ఇంత ఎండలలో చేస్తే ఇబ్బంది అవుతుంది కదా చేద్దామా వద్దా అని స్వామిని అడిగాము. స్వామి "ఏం ఫరవాలేదు నాయనా! మీరు మీ పని చేసుకోండి, ఏం ఇబ్బంది లేదు, నగరోత్సవం చేసుకోండి" అని అభయమిచ్చారు. మే 12న ఎండ చాలా తక్కువగా వుండటం వలన మేము **మధ్యాహ్నం 12గంటలకు బయలుదేరి ఒక నాలుగు గంటలపాటు చెప్పులు లేకుండా నగరోత్సవంలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నాము.** తరువాత రోజు

కూడా ఎండ తీవ్రత చాలా తక్కువగా వుండి మందిర ప్రతిష్ఠ కార్యక్రమము చాలా బ్రహ్మాండంగా జరిగింది. మే నెలలో ఆ రెండు రోజులు ఎండ తీవ్రత లేకుండా వుండటం చాలా ఆశ్చర్యము, అద్భుతము.

2. మేము నిర్మించిన మందిరం ఎక్కువ మంది భక్తుల రాకతో ఇరుకైంది. అందువలన వెనుకనున్న స్థలం కొందామనుకుంటే ఆ స్థలం వారు (ఆరుగురు భాగస్వాములు) ఇల్లు కట్టుకోవాలని అమ్మమన్నారు. స్వామి దగ్గరకి వెళ్ళి 'స్వామీ! మీరు మందిరం వెనుకనున్న స్థలం తీసుకోమన్నారు కానీ వాళ్ళు ఇవ్వట్లేదు ఇప్పుడు ఏమి చేసేది' అని అడిగాము. దానికి స్వామి **"మీకెందుకు నాయనా! బాబాను ప్రార్థించుకోండి. ఆ స్థలం మనది. ఏ రోజుకైనా మందిరం కట్టాలి"** అన్నారు. తర్వాత ఆ ఆరుగురు భాగస్వాములు ప్లాను తెచ్చుకొని గుంటలు కూడా త్రవ్వుకున్న తరువాత వారిలో వారికి గొడవలొచ్చి వారంతట వారే అమ్ముతామని అన్నారు. స్వామికి ఇలా తక్కువకి ఇస్తున్నారని తెలిపితే స్వామి "బాబా తత్వం అది కాదు నాయనా! మార్కెట్ ధరకే తీసుకోండి" అన్నారు. అలానే స్వామి చెప్పినట్లు స్థలం తీసుకున్నాము.

## డా॥ శ్రీధర్‌రెడ్డిగారు, నెల్లూరు

మా సొంత యిల్లు కట్టుకోవటానికి స్వామివారే శంకుస్థాపన చేసి బావి త్రవ్వటానికి స్వామివారే స్వహస్తాలతో టెంకాయ కొట్టి గడ్డపార వేసారు. ఆయన దయవలన ఎంతటి ఎండకాలమైనా మా బావిలోని నీరు పుష్కలంగా ఉంటుంది. పొగతోటలో మా యింటి చుట్టుప్రక్కల వారు ఎండాకాలంలో ఆ బావినీరే తీసుకొని వెళతారు.

## అనూరాధ (ఎస్. శ్రీనివాసులుగారి కూతురు)

మేము ఇల్లు కొందామనుకుంటున్నామని స్వామికి చెప్తే "ఇప్పుడుంటున్న ఇల్లు కొనుక్కోమని" చెప్పారు. కావలిలో నీటి ఎద్దడి ఎక్కువగా వుంటుంది. బోరు వేసినా కూడా చాలామందికి నీళ్ళు పడలేదు. మేము మా ఇంట్లో ఎక్కడ బోరు వేసుకోవాలో అని స్వామి దగ్గరకి ఇంటి ప్లాను కాగితం తీసుకొని వెళ్ళాము. స్వామికి చెపితే "నాకు ప్లాను కాగితాలు

అక్కర్లేదు కానీ బావి ప్రక్కన ఈశాన్యంలో చిన్న బాబా విగ్రహం పెట్టి ఒక కొబ్బరికాయ కొట్టి గంగమ్మ తల్లికి నమస్కారం చేసుకో"మన్నారు. మేము అలానే చేశాము. మంచినీళ్ళు పడ్డాయి.

## చీమకుర్తి సుబ్బారావుగారు దమ్మపేట

మా పొలంలో ఒక ప్రక్క పాముపుట్టలో సగభాగం పొలంలోకి వచ్చి ఉంది. అది మాములు పుట్ట అనే ఉద్దేశ్యంతో అది కొట్టించి పొలంలో నేలను చదును చేశాను. అలా చేసిన దగ్గరనుండి పొలంలో పాములు తిరుగుతూ కనపడేవి. తర్వాత దర్గాస్వామి దగ్గరకెళ్ళినప్పుడు 'స్వామీ! పొలంలో ఈ మధ్య పాములు కనపడుతున్నాయి' అని విన్నవించుకున్నాను. నేను ఇంకేమి చెప్పకుండానే స్వామి నాతో "నీ పొలంలో ఒక ప్రక్కనున్న పుట్టను కొట్టేశావు. దాంట్లో నిన్ను కాపాడే దేవతలు ఉన్నారు. అవేవి చేయవు కానీ సంవత్సరానికి ఒకసారి పాలు పోస్తుండు" అని చెప్పారు. అప్పటినుండి స్వామి చెప్పినట్లు చేయటం ప్రారంభించాను. మరలా అలా పాములు తిరుగుతూ కనపడలేదు. ఎక్కడో దమ్మపేట పొలంలో కొట్టేసిన పుట్ట గురించి చెప్పటమే కాక ఏమి చేస్తే అలా పాములు కనపడవో చెప్పటం, అలా పాములు కనపడనివ్వకుండా చేయటం ఆ సర్వసమర్థునికే సాధ్యం.





# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 6

## సకల సాధు, దేవతా స్వరూపము

నిర్గుణుడు, నిరాకారుడు అయిన భగవంతుడు సామాన్య మానవుల ఇంద్రియాలకు, మనస్సుకు గోచరించడు. తపోనిష్ఠులైన మహర్షులకు మాత్రమే ధ్యానంలో గోచరిస్తాడు. సామాన్యులను ఉద్ధరించడానికి ఆయనయే పరిపూర్ణులైన మహనీయుల రూపాలలో భూమి మీద లభిస్తుంటాడని భాగవతాది సద్గ్రంధాలు చెపుతున్నాయి. మహనీయుల రూపాలు వేరైనా వారిలో విరాజిల్లే సద్గురు (దత్తాత్రేయ) తత్త్వం ఒక్కటే.

**దేవతలంటే రూపాలు గాదు. అతీతమైన శక్తిసామర్థ్యాలే. సిరిసంపదలనిచ్చేది లక్ష్మియనీ, విద్యనిచ్చేది సరస్వతియనీ, యిలా దేవతలగూర్చి శాస్త్రాలు చెబుతాయి. తమనాశ్రయించిన భక్తులకు రోగాలు నివారించినందు వలన దర్గాస్వామియే ధన్వంతరి. ధనధాన్యాలు ప్రసాదించడం వలన ఆయనయే లక్ష్మీదేవి. అందుకే సద్గురువు సకల సాధు స్వరూపి, సకల దేవతా స్వరూపి.**

చూడటానికి సద్గురువు సామాన్య మానవునిలాగే వున్నా ఆయన యొక్క శక్తి సామర్థ్యాలు మాత్రం అపారము. సద్గురు లీలలను చింతన చేస్తే భగవంతుని తత్త్వంపై మనకు స్థిరమైన భక్తిశ్రద్ధలు కలుగుతాయి. సద్గురువు భక్తులకిష్టమైన మహనీయులతో తాదాత్మ్యము, తానే సకల దేవతా స్వరూపము అనే అనుభవాలిచ్చి తద్వారా ఆయా రూపాలలో వున్న భగవంతుని తత్త్వంపై విశ్వాసాన్ని మరింత దృఢపరుస్తూ అంతటా వున్న భగవంతుడిని పదే పదే జ్ఞప్తికి తెస్తారు. ఈ అధ్యాయంలో వివిధ భక్తులకు జరిగిన అనుభవాలే దానికి నిదర్శనము.

# ప్రొద్దుటూరు శ్రీ కృష్ణయ్యస్వామితో అభేదము

30-1-11 ఆదివారం సాయంత్రం 4 గంటల పైన శ్రీ శ్రీ శ్రీ కృష్ణయ్యస్వామి ప్రొద్దుటూరు వారు శ్రీ దర్గాస్వామి దగ్గరకొచ్చారు. ప్రతి ఆదివారము ప్రొద్దుటూరులో ఒక భక్తుడు తన కారును తెచ్చి శ్రీ కృష్ణయ్యస్వామివారి దగ్గర ఉంచుతారట. శ్రీస్వామివారు వచ్చి ఎక్కి ఎక్కడకి పొమ్మంటే అక్కడికి తీసుకుపోతుంటారట. ప్రొద్దుటూరు నివాసులైన శ్రీ దర్గాస్వామివారి తమ్ముని కొడుకులు, వారి చుట్టాలు కొందరు దర్గాల దగ్గర జరిగే అఖండనామ స్మరణకు వచ్చి దర్గాల దగ్గర వున్నారు. శ్రీ స్వామి వస్తున్న కారును చూచి శ్రీ కృష్ణయ్యస్వామి వస్తున్నారని పదే పదే అనడంతో అందరూ దర్గాల దగ్గరున్న హాలు బయటకు వచ్చి సంతోషంగా అరుస్తున్నారు. త్వరగా పోనీయ్ అని అరుస్తూ డ్రైవ్ చేస్తున్న భక్తుని వెనుక సీటులో నున్న స్వామి డ్రైవర్ భుజం మీద కొడుతున్నాడు. అప్పటికి శ్రీ దర్గాస్వామివారు వయోభారం వలన అతి ప్రయాసతో శ్రీ కృష్ణయ్యస్వామివారి కారు దగ్గరకొచ్చారు. ఈ భక్తులలో ఎవరో శ్రీ కృష్ణయ్యస్వామివారి పాదాలు కడగాలని చెంబుతో నీళ్ళు తెచ్చి కారు వద్దకు వచ్చారు. శ్రీ కృష్ణయ్యస్వామి కారు దిగకుండానే ఆ చెంబు లాక్కొని తన అలవాటు ప్రకారం అందులోని నీళ్ళు భక్తులపై విసిరారు. (నీళ్ళు పైపుతో పట్టి భక్తులపై చల్లడం శ్రీ స్వామివారి అలవాటు). వెంటనే ఆ చెంబును భక్తులపైన పడేసి ఒక పెద్ద కమలా పండు తీసుకొని శ్రీ దర్గాస్వామివారి దోసిట్లో పెట్టారు. శ్రీ కృష్ణయ్యస్వామి కొన్ని కిస్‌మిస్ పండ్లు, పచ్చి శెనగలు భక్తులపై విసిరారు. అవి భక్తులు ఏరుకున్నారు. కారులోనుండి దిగనే దిగలేదు. భక్తులు కారు చుట్టూ మూగి సంతోషముతో కేరింతలు కొడుతున్నారు. ఈ భక్తసమూహమును చూచి గాబోలు శ్రీ కృష్ణయ్యస్వామి డ్రైవ్ చేస్తున్న భక్తుని వీపు మీద గుద్దుతూ కారు వెనక్కు త్రిప్పమని అరుస్తున్నారు. చేసేది లేక కారును వెనక్కు త్రిప్పి వెంటనే వెళ్ళిపోయారు. శ్రీ దర్గాస్వామివారు ఆ కమలాపండు వలిచి తలాకాస్తా పెట్టమని ఒక భక్తుని చేతికిచ్చారు.

శ్రీ కృష్ణయ్యస్వామి కొన్నిసార్లు శ్రీ దర్గాస్వామివారి వద్దకొచ్చి వెళ్ళారు.

భక్తులు చూసినప్పుడు మాత్రం వారిరువురూ సంభాషించుకున్న సందర్భము లేదు. ఒకరినొకరు చూచుకున్న తర్వాత శ్రీ కృష్ణయ్యస్వామి తిరిగి వెళ్ళేవారు.

**వేణుగోపాల్‌గారు, కల్పాకం ఇలా చెపుతున్నారు:**

దర్గాస్వామి దర్శనం చేసుకొని **ప్రొద్దుటూరు కృష్ణయ్యస్వామిని** దర్శించుకుందామని నేను, నా భార్య, నా అత్తగారు, నా సహోద్యోగి, ఇంకొక ఇద్దరు భక్తులము గొలగమూడి నుండి బయలుదేరాము. స్వామి ఎంతో ఆప్యాయంగా మమ్మల్ని దగ్గరకు తీసుకొని మాట్లాడారు. ప్రొద్దుటూరు కృష్ణయ్యస్వామి దర్శనానికి వెళదామనుకుంటున్నాము స్వామీ! అని చెపితే స్వామి "కృష్ణయ్యస్వామి దర్శనం చేసుకుంటారా" అని వెంటనే **"ఏయ్ కృష్ణయ్యా! వీళ్ళకి దర్శనం యివ్వు"** అని గట్టిగా అన్నారు. తర్వాత మేము బయలుదేరి ప్రొద్దుటూరులో స్వామి వుండే నివాసానికొచ్చేసరికి రాత్రి 8గం॥లు అయ్యింది. అప్పుడు స్వామి భోజనం చేస్తున్నారు. ఉదయమే దర్శనం అని అక్కడ వున్నవారు చెప్పారు. కానీ దర్గాస్వామి దయవలన మాకు కృష్ణయ్యస్వామి దర్శనం కిటికీ గుండా జరిగింది. తరువాత స్వామి ప్రసాదం లభించింది. ఎప్పుడూ ఆ సమయంలో రాని ప్రొద్దుటూరులో వుండే భక్తులు ఆ సమయానికి వచ్చేసరికి వాళ్లకి స్వామివారు ఇచ్చిన అనుభవాలను అడిగి, రికార్డు చేయగలిగాను. తర్వాత రోజు స్వామి దర్శనం అయ్యాక స్వామిని వీడియో తీస్తుంటే స్వామి తనమీద వున్న చొక్కా తీసి నా మీదకి కొట్టారు. అది మహా ప్రసాదంగా స్వీకరించాను. మా అత్తగారికి 2,3సం॥ల నుండీ తలకాయనొప్పిగా వుండేది. ఏమి అడగకుండానే స్వామి తనంతట తానే విసన కర్ర వెనుకకు త్రిప్పి మా అత్తగారి తలమీద కొట్టారు. అప్పటినుండీ గత 2,3 సం॥ నుండీ వున్న తలకాయనొప్పి మాయమయింది. మరలా ఆనొప్పి రాలేదు. ఇలా అద్భుతంగా కృష్ణయ్యస్వామి దర్శనం, ప్రసాదం లభించటానికి దర్గాస్వామి ఆశీస్సులే అని తలుస్తున్నాను. కారణం నేను సేకరించిన భక్తుల అనుభవాలతో ఒక చిన్న పుస్తకం గొలగమూడి శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్టు వారు ప్రచురించారు.

# కడప అవధూతేంద్రస్వామితో ఆధ్యాత్మిక మైత్రి

శ్రీ సద్గురు దర్గాస్వామివారి శిష్యులు చాలామంది కడపలో వున్నారు. అది 1960వ సంవత్సరం అక్టోబరు నెల శ్రీ సద్గురు దర్గాస్వామివారు కడప విచ్చేసి కొందరు భక్తులను ఆశీర్వదించి చేతిలో ఒక ఖర్జూరపు పండును ఉంచుకొని వై.వి.చలం వీధిలో వస్తున్నారు. శ్రీ అవధూతేంద్రులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద గొంతు కూర్చుని ఉన్నారు. ఆ మహనీయుని చూడగానే శ్రీ సద్గురు దర్గాస్వామివారికి ఆయనను పలుకరించవలయునని తలంపు కలిగింది. దగ్గరకు వెళ్ళి చేతనున్న ఖర్జూర ఫలమును స్వామివారికి సమర్పించబోయారు. అవధూతేంద్రులు ఖర్జూరము గ్రహించడానికి అన్నట్లుగా ఎడమ చేయి ముందుకు చాపి తల దక్షిణము వైపు త్రిప్పి "హూ" అన్నారు.

శ్రీ దర్గాస్వామి : ఎడమ చేయి చాపావే! కుడి చేయి పట్టు ఇస్తాను.

అవధూతేంద్రులు: కుడి ఎడమలు ఉన్నాయా?

శ్రీ దర్గాస్వామి: నిన్ను కదిలించేదానికే అలా అడిగాను

అవధూతేంద్రులు లేచారు. చిన్నగా వై.వి.చలం వీధిలోకి వెళ్ళిపోయారు. శ్రీ సద్గురు దర్గాస్వామి ఆయనను అనుసరించారు.

అవధూతేంద్రులు: మళ్ళీ వచ్చావా?

శ్రీ దర్గాస్వామి: నేను నిన్ను వదిలేదానికి రాలేదు.

అవధూతేంద్రులు: ఏమి తీసుకుందామని వెంటాడుతావు? పోతావా లేదా అని హుంకరించారు.

శ్రీ సద్గురు దర్గాస్వామివారు పట్టు వదలక స్వామివారిని అలాగే వెంబడించారు. అవధూతేంద్రులకు భోజనం ఏర్పాటు చేసారు. శ్రీ దర్గాస్వామివారు తర్వాత కొన్ని అరటి పండ్లు కొని అవధూతేంద్రులకు సమర్పింపబోయారు. ఏమనుకున్నారో ఏమో అవధూతేంద్రులు ఒక్కమారు ఆగ్రహావేశపరులై తన కుడి చేతితో శ్రీ దర్గాస్వామివారి చెక్కిలిపై ఒక చురక అంటించారు. అంతటితో ఆగక తన పవిత్ర పాద పద్మములతో శ్రీ సద్గురు దర్గాస్వామివారిని ఒక్క త్రోపు తోశారు. ఆ త్రోపుకు ఇరువురు

స్వాములు క్రింద పడ్డారు.

వీరిద్దరి వింత ప్రవర్తన అక్కడున్న ఎవ్వరికీ బోధపడటం లేదు. ఆ మహనీయులిద్దరికీ ఆ సంఘటన సర్వ సహజముగా వున్నదే కానీ తాము ఏదో ప్రత్యేకంగా ప్రవర్తిస్తున్నామన్న స్ఫురణ కలగటం లేదు. అవధూతేంద్రులు లేచి వై.వి.చలం వీధి వెలుపలకు దారి తీశారు. శ్రీ సద్గురు దర్గాస్వామివారు ఆయనను అనుసరించారు. వీరిరువురు దారి వెంట వెడుతుంటే ఆ వింతను చూడటానికి ఎందరో జనులు ప్రోగయ్యారు. వదలక వారు ఈ స్వాముల వెంట వెళ్ళుతున్నారు. కడపకు దక్షిణంగా అగ్రహారం అనే ఒక చిన్న పల్లె వున్నది. ఆ పల్లెకు దక్షిణంగా “బుగ్గవంక” అనే వాగు సాగుతుంది. అవధూతేంద్రులు, శ్రీ సద్గురు దర్గాస్వామివారు ఆ ప్రదేశం చేరుకున్నారు. అప్పటికి సాయంత్రం అయ్యింది. వారు అంతరంగంలో సంభాషించుకున్నది ఏమిటో తెలియదు కానీ అక్కడికి వెళ్ళాక శ్రీ అవధూతేంద్రులు ప్రసన్నులయ్యారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. శ్రీ అవధూతేంద్రులు శ్రీ దర్గాస్వామి శిరస్సుపై ఆశీర్వాదపూర్వకంగా హస్తముంచారు. వర్ణనాతీతమైన బ్రహ్మానందంలో ఆ యిరువురూ ఓలలాడారు.

పై సంఘటనలు జరిగిన మరుసటి దినము అవధూతేంద్రులు కడప పాతబస్టాండు వద్ద కూర్చుని వున్నారు. అప్పుడు అక్కడికి దర్గాస్వామివారు వచ్చారు. శ్రీ దర్గాస్వామివారు కొన్ని ఇడ్లీలను అవధూతేంద్రులకు సమర్పించారు. శ్రీ అవధూతేంద్రులు వాటిని చేతిలోకి తీసుకుని ఆరగిస్తున్నారు. అంతలో దారిన పోయే ఒక మేక వాటిని ఆశించి వచ్చింది. అవధూతేంద్రులు “ఆ॥ పో॥” అని అదిలించారు. అందుకు శ్రీ దర్గాస్వామివారు “అది కూడా బ్రహ్మమే కదా! దానికిస్తే ఏమి?” అని ప్రశ్నించారు. శ్రీ అవధూతేంద్రులు ఆయనను సూటిగా చూసి “ఆ” అన్నారు. తర్వాత ఇడ్లీ తినలేదు. మిగిలిన ఇడ్లీని శ్రీ సద్గురు దర్గాస్వామివారు, ఆయన బృందం స్వామివారి ప్రసాదంగా స్వీకరించి ఆరగించారు.

శ్రీ అవధూతేంద్రులకు, శ్రీ సద్గురు స్వామివారికి అవ్యాజమైన

అనుబంధమేదో వున్నది. ఒకనాడు శ్రీ అవధూతేంద్రులను శ్రీ దర్గాస్వామివారు అనుసరించారు. స్వామివారు నేరుగా వెళ్ళి బుగ్గవంకలోని మురికి నీటిలోకి దిగారు.

**అవధూతేంద్రస్వామి: ఈ మురికి నీటిలోకి నీవు రాగలవా?**

మున్సిపాలిటీ కాలువల గుండా బుగ్గవంక చేరుకున్న ఆ మురికి నీరు మహా దుర్గంధ భూయిష్టంగా ఉంటుంది. నల్లనిరంగులో క్రిములకు, మలమాలిన్యాలకు నిలయమై చూపరులకు జుగుప్స కలిగించే విధముగా వుంటుంది.

దర్గాస్వామి: ఊ!

అని అంటూ ఆ నీటిలోకి దిగారు. అంతేగాకుండా **శ్రీ అవధూతేంద్రుల పాదోదకమని భావించుకొని ఆయన పాదముల క్రింద నీటిని చేతిలోనికి తీసికొని తీర్థంగా ఆపోసనం పట్టారు.**

శ్రీ అవధూతేంద్రుల పరీక్ష నెగ్గటం అంత సులువైన పని కాదు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను మాటను అక్షరసత్యంగా భావించారు. ఆయన అసహ్యించుకునే పదార్థమంటూ సృష్టిలో ఏదీ లేదు. అన్నింటా పరమాత్మనే దర్శిస్తూ తన శిష్యునికి కూడా దానినే ఉద్బోధించారాయన. అవధూతేంద్రుల వద్దకు ఎందరో యోగపురుషులు వచ్చి వెళ్ళేవారు. అదృశ్యంగా కూడా ఆయన వద్దకు మహనీయులు రావడం జరిగింది.

# ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారితో ఆధ్యాత్మిక మైత్రి

## కె.వి. రంగారావు, ఒంగోలు

పూజ్యశ్రీ దర్గాస్వామీజీ వారిని నేను ప్రథమంగా దర్శించడం కేవలం ఆచార్య భరద్వాజ గారి అనుగ్రహం వలననే. తర్వాత చాలాసార్లు స్వామీజీ, మాతాజీల దర్శనం చేసుకున్నాను. వారి అనుగ్రహం, ఆశీర్వాదం వల్ల నా కుమారుని విద్య, మా పెద్దమ్మాయి వివాహం అన్నీ అనుకోని విధంగా జరిగిపోయాయి.

1. మాష్టారుగారి శిష్యులు కడప రామచంద్రయ్యగారు నన్ను

స్వామివారి దర్శనానికి రమ్మన్నారు. నేను "ఆచార్యులవారు వారిని చూడలేదు కదా! వద్దులే" అని అన్నాను. 'కాదు రండి వూరికే చూద్దాము' అని అన్నారు. సరే నేను వారిని దర్శించటం మాష్టారుగారికి ఇష్టమైతే స్వామివారే నాకు దక్షిణ ఇవ్వాలి అని మనస్సులో చెప్పుకున్నాను. దారి పొడుగునా ఈయన మహాత్ముడా? సిద్ధుడా? జ్ఞానా? అని ఇదే నా ఆలోచన. అక్కడ నన్ను చూస్తూనే "ఓహో రంగనాయకమ్మ కొడుకా" అని పిలిచి, "మా ఆవిడ పేరు కూడా రంగనాయకమ్మే" అని స్వామివారు అన్నారు. తరువాత అందరూ దక్షిణ ఇచ్చారు. నేను ఇవ్వలేదు. వారే నాకు 5 రూపాయలు దక్షిణ ఇచ్చి ఇది నీ గురుప్రసాదం అని అన్నారు. ఈ సన్నివేశముతో నాకు వారిపై గురుత్వం ఏర్పడింది.

2. ముఖ్యముగా శ్రీ ఆచార్య భరద్వాజగారు ఈ మహాత్ముని వద్దకు పంపించినందునే నా కుమారుడు బి.టెక్ మరియు నా పెద్దమ్మాయి ఎమ్. ఎస్‌సి చదివే ఖర్చులు శ్రీ స్వామివారు, అమ్మయ్యగారు, వారి భక్తులు సుమారు 80 వేల రూపాయలు భరించారు. కనుకనే వారు ఇద్దరూ చదవగలిగారు కానీ నా వల్ల అయ్యే పని కాదు.

శ్రీస్వామివారు చెప్పిన మాటలు గమనించదగినవి "**నీ గురువు సిద్ధి పొందుతూ నిన్ను చూడమని నాకు చెప్పారు. నీ బిడ్డల చదువులకు ఇచ్చేదంతా గత జన్మలో నీ డబ్బే**" అని అన్నారు.

ఆ ప్రాంతపు పల్లె జనాలకి వారు సాక్షాత్తు భగవంతుడే. ఇతరుల నుండి ఏమీ ఆశించకుండా తనకున్న లక్షల ఆస్తిని అందరికీ పంచుతూ హారతి కర్పూరం చేసిన మహనీయులు. ప్రతివారిని శ్రీ సాయిలీలామృతము, శ్రీ గురు చరిత్ర పారాయణ చేయమని చెపుతున్న వారిలో నాకు నా గురుదేవులు శ్రీ భరద్వాజగారే కనిపిస్తారు. ఆచార్యులవారిని శ్రీ దర్గాస్వామివారు పరబ్రహ్మ స్వరూపులుగా భావిస్తారు. వారు మీకు దొరకటం మీ అదృష్టం అని అంటారు.

**డా॥ ఆర్. సుబ్బారెడ్డి, పులివెందుల, కడప జిల్లా**

నేను 1972లో విద్యానగర్ (వాకాడులో) ఇంటర్‌మీడియెట్

చదువుతున్న రోజుల్లో శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారి ద్వారా శ్రీ దర్గాస్వామి, శ్రీ దర్గామాతల గురించి విన్నాను. ఆ తర్వాత ఆ ఇద్దరు దివ్యదంపతులను దర్శించుకోవాలన్న తలంపే రాలేదు. అయితే ఉద్యోగంలో చేరిన తర్వాత సాయి అనే భక్తుని సలహా మేరకు మొదటిసారిగా దర్గాస్వామివారిని దర్గా వద్ద దర్శించుకున్నాను. ఆ తర్వాత కుటుంబ సమేతంగా అనేకసార్లు శ్రీ దర్గాస్వామివారిని, శ్రీ దర్గా మాతాజీని దర్శిస్తూ ఉండేవాడిని.

నేను ధ్యానం చేసుకుంటూ వుంటాను. 2001వ సంవత్సరంలో ధ్యానంలో కూర్చున్నప్పుడల్లా ఇల్లు కట్టు అని పదే పదే అనిపించేది. నా చేతిలో 5000 రూపాయలు మాత్రమే వున్నాయి. ఇలా పదే పదే అనిపించటం గూర్చి స్వామికి చెపుదామని వెళితే అక్కడ చాలామంది వుండటం వల్ల నేనేమి చెప్పలేదు. స్వామి నన్ను చూసి అమ్మయ్యతో ''అమ్మయ్యా! సుబ్బారెడ్డికి అన్నం పెట్టాల'' అని స్వామి తన అమృతహస్తాలతో విస్తరి వేసి అమ్మయ్య వండుకున్న అన్నం వడ్డించారు. **తరువాత నేనేమి చెప్పకుండానే స్వామి ''నీ ముందర వుండి ఇల్లు కట్టిస్తా'' అన్నారు. ఆ అభయంతో గృహనిర్మాణం మొదలుపెడితే స్నేహితుల ద్వారా డబ్బు సమకూరి 5 నెలల్లో ఇల్లు పూర్తయింది.** గృహప్రవేశ సమయానికి స్వామివారు, అమ్మయ్యగారు ఇరువురూ వచ్చి మా దంపతులిద్దరినీ ఆశీర్వదించి మా నూతన గృహాన్ని పావనం చేశారు.

## వీర ప్రతాప్, ఎమ్.టెక్, ఎన్.ఐ.టి, కాలికట్

నేను బి.టెక్ చదివేటప్పుడు దర్గాస్వామి గురించి మా స్నేహితుడి ద్వారా విన్నాను కానీ చూడలేదు. 2009 జూన్‌లో హైదరాబాద్‌లో దత్తాత్రేయస్వామి గుడిలో ప్రదక్షిణలు చేస్తూ మనస్సులో దర్గాస్వామి సాయిబాబా అవతారమైతే దర్గాస్వామి దర్శనం కావాలని చెప్పుకున్నాను. తర్వాత జులైలో దర్గాస్వామి దర్శనానికి వెళదామని ఆలోచన కలిగి మొదటిసారి నాకేమి తెలియదు కదా అందువలన నా స్నేహితుని

తల్లిదండ్రులకు ఫోను చేసాను. వారికి అమ్మయ్య ఆరాధన లోపల వెళదామని లేకున్నా, కానీ నేను ఫోను చేసేసరికి అంతకంటే భాగ్యమా అని నన్ను దర్గాస్వామి దర్శనమునకు తీసుకువెళ్ళారు. సరిగ్గా ఆరోజు గురుపూర్ణిమ అవడంతో దర్గాస్వామి, సాయిబాబా వేరు కాదని మనస్సులో దృఢపడింది.

## దమ్మపేటలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ:

మేము మా దమ్మపేట నుండి విగ్రహప్రతిష్ఠకు 6 సంవత్సరముల ముందు పదిమంది సత్సంగబంధువులం శ్రీ దర్గాస్వామివారిని దర్శించుటకు వెళ్ళాము. అప్పుడు శ్రీ దర్గాస్వామివారితో విగ్రహము కొరకు ప్రయత్నిస్తున్నామని, ప్రసాదరావుగారు ఇస్తున్నారని చెప్పినాము. అప్పుడు శ్రీ స్వామివారు "ఆయన ఎలక్షన్‌లో గెలవరు కానీ విగ్రహం ఇస్తారని, ప్రతిష్ఠకు నేను వస్తాను" అని అన్నారు. మేము ప్రతిష్ఠకు ఆహ్వాన పత్రిక పంపితే సరిగ్గా ఆ రోజునే శ్రీ స్వామినుండి "ఏ రూపంగానైనా వచ్చేదే" అని వ్రాసిన జాబు చేరినది. ప్రసాదరావుగారు నిమిత్తమాత్రమేనని వారికా బుద్ధి పుట్టించి ఇప్పించిన విశ్వగురుడైన, సకల సాధుస్వరూపుడైన శ్రీ సాయి, తాము ఒక్కటేనని గ్రహించమన్నట్లు భావించాము. జ్యోతిగారు దర్శించగా శ్రీ స్వామి "మీ మందిరంలో బాబా విగ్రహ రూపంలో వుండి మీ పూజలు, నివేదనలు స్వీకరిస్తున్నామని" చెప్పారు.

## శ్రీ లక్ష్మిగారు, బెంగుళూరు

1. నేను స్వామిని కొన్ని ప్రశ్నలు అడగటానికి వెళ్ళాలనుకున్నాను.కానీ కొన్ని కారణాల వలన స్వామి దగ్గరకి వెళ్ళలేకపోయాను. తరువాత నేను ఆఫీస్‌లో ఇంటర్‌నెట్‌లో సాయిబాబా గురించి చదువుతున్న దాంట్లో "బాపూ! గుడ్డ పీలికలు ఎందుకు దొంగిలిస్తావు, నీకు మంచి జరీ శాలువా ఇస్తాను" అని సాయిబాబా అన్న మాట మనస్సుకు హత్తుకుంది. ఆ మాటని బట్టి "నువ్వు ఎవ్వరి దగ్గరకు వెళ్ళకు, అన్నీ నేనే చూసుకుంటాను" అని బాబా చెప్పినట్లు అనిపించింది. తరువాత రెండోసారి దర్గాస్వామివారి

దగ్గరకి వెళ్ళాలనిపించింది. బాబా ప్రశ్నలు అడగవద్దన్నారు కదా అందువలన నేను ప్రశ్నలు అడగను, మీరే చెప్పించండి అని సాయిబాబాను వేడుకున్నాను. తరువాత మేము నీలకంఠరావుపేట వెళ్ళాము. అక్కడ దర్గాలో సాయంత్రం సత్సంగంలో ఆచార్య భరద్వాజ మాస్టరు వ్రాసిన శ్రీ సాయి లీలామృతము చదువుతున్నారు. అప్పుడు చదివిన దాంట్లో కూడా మొదటిసారి దర్గాస్వామి దగ్గరకు రాలేకపోయినప్పుడు నా మనస్సుకు హత్తుకున్న సాయిబాబా మాట మరలా వచ్చింది. స్వామి నోటి నుండి ఒక్క మాట కూడా రాలేదు అనుకున్నాను. పారాయణ మొత్తం అయిన తర్వాత దర్గాస్వామి "ఏమి కావాలన్నా ఇంకెవ్వరినీ అడగవద్దు" అని నా మనస్సులో వున్న బాబా మాటను పైకి చెప్పి, బాబానే నమ్మమన్నారు.

2. నాకు కొంతమంది మీద కోపం ఎక్కువ అయ్యింది. నేను దర్గాస్వామివారి దగ్గరకి వెళ్ళాను. అక్కడ స్వామివారు ఒక భక్తురాలితో "గుడి చుట్టూ ప్రదక్షిణ చెయ్యి, నీ కుమారునికి బాగుంటుంది" అని అన్నారు. నాకు వెంటనే ప్రదక్షిణం చెయ్యాలి అనిపించి మొదలుపెట్టాను. ఇంతలో స్వామికి హారతి ఇచ్చారు. అక్కడ వున్న భక్తులు మమ్మల్ని లోపలికి రమ్మన్నారు. అంతకుముందు నేను బెంగుళూరు 'బి.టి.ఎమ్.'లోని బాబా గుడిలోనూ, దర్గాస్వామి దగ్గర మనస్సులో నన్ను మంచిబిడ్డగా మార్చు తండ్రీ! అని ప్రార్థించాను. మేము దర్గాస్వామి దగ్గరకి వెళ్ళాక స్వామి మాతో "అమ్మా! ఎవరు అనుకున్నారు. ఇక్కడ దర్బారు సాయి అందరినీ మంచిబిడ్డలుగా మారుస్తార"ని ఆ ఆశీర్వచనాన్ని చాలా సార్లు అన్నారు.

## పేరు ప్రచురించటానికి ఇష్టం లేని దమ్మపేట సత్సంగ భక్తురాలు

నేను సాయిబాబాను పూజిస్తూ ఉంటాను. పూజలో సాయిబాబాకు ఉదయం పాలు, సాయంత్రం నీళ్ళు, వేసవికాలంలో మధ్యాహ్నం పూట కొబ్బరినీళ్ళు నివేదించేదానిని. సాయిసన్నిధి పారాయణ, మిగిలిన మహనీయుల చరిత్ర పారాయణలు చేస్తుండే దానిని దమ్మపేట నుండి 10,15 మంది సత్సంగసభ్యులము దర్గాస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు

స్వామి నన్ను ఉద్దేశించి "పాలు పెడతావా, నీళ్ళు పెడతావా, కొబ్బరి నీళ్ళు పెడతావా" అని అడిగారు. అంటే నేను సాయిబాబాకు నివేదించేవి స్వామికి చెందుతున్నాయని తెలిసి సాయిబాబా, దర్గాస్వామి వేరుకాదు ఒకటేనని స్ఫురించి స్వామి మీద విశ్వాసం పెరిగింది.

తర్వాత స్వామి నాతో "అమ్మా! నీవు చేసే పారాయణలన్నీ చూస్తున్నాను. నీకు త్వరలో ఇబ్బందులు రాబోతున్నాయి. సాయిబాబా చూసుకుంటారు" అన్నారు. తర్వాత ఒకేసారి నా ఇద్దరు తమ్ముళ్ళు చనిపోయారు. చాలా ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. తర్వాత నిదానంగా కోలుకొని పిల్లలు మంచి చదువులు చదువుకున్నారు. మా పిల్లవాడు ఒకరోజు ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళబోతూ దేనికో వెతుకుతుంటే వెంకయ్యస్వామి ఫోటో చేతిలోకొచ్చింది. స్వామి కనపడ్డారన్న విశ్వాసంతో ఈసారి తప్పకుండా ఉద్యోగం వస్తుందనుకొని వెళ్ళాడు. స్వామి దయవలన ఉద్యోగం వచ్చింది. శ్రీ సాయిబాబా, శ్రీ దర్గాస్వామి, శ్రీ వెంకయ్యస్వామి ఒకటేనని నమ్ముతున్నాను.

## రవిగారి తల్లిగారు, దమ్మపేట గ్రామం:

మా బంధువులు మోసం చేసి మా ఆస్తి అంతా హస్తగతం చేసుకొన్నారు. చదువురాని నేను మానసిక ఒత్తిడులకు, విపరీతమైన అనారోగ్య బాధలకు గురి అయ్యాను. ఆస్తి పోవుటచే నా కొమార్తె వివాహం చేయలేకపోయాము. నాకు పిచ్చి పట్టిందని, చనిపోతానని అందరూ తలచారు. ఇంట్లో ఎవ్వరూ అన్నం తినడం లేదు. మేము చేసే ప్రార్థనలకు అంతే లేదు.

ఒక రాత్రి ఆజానుబాహుడు, బొజ్జ గల్గి, నుదుట నామాలు ధరించిన వారు పద్మాసనంలో కూర్చొని కనిపించి "ఎందుకమ్మా బాధపడుతున్నావు? నేనున్నానుగా, మీరు ధర్మంగా, మంచిగా ఉండండని" అని ఎంతో ప్రేమగా, లాలనగా చాలాసేపు ఓదార్చారు. కేవలం ఈ కల ప్రభావం వలన తెల్లవారేసరికి ఎంతో ధైర్యం వచ్చి అంతా వారు చూసుకుంటారు అనే భావంతో 90% కోలుకోవడం గొప్ప

వింత. ఆ స్వప్నంలో నన్ను ఓదార్చిన వ్యక్తి ఇలా వున్నారని చెపితే వారు అక్కల్కోటస్వామి అని నా కొమార్తె పుస్తకంలోని వారి బొమ్మ చూపించింది. అచ్చం అలాగే వున్నారు.

కొన్నాళ్ళ తర్వాత మా స్థలంలో మా బంధువులు షాపులు కట్టించి ఇతరులకు అమ్మేశారు. మరలా నాకు బాధ మొదలైంది. నేను శ్రీ వెంకయ్యస్వామివారిని తలచుకొని 'స్వామీ! వారికి డబ్బు బలం వుంది కనుక మీరేమీ చేయలేకున్నారా?' అని నిష్ఠూరాలాడాను. నిద్రపట్టి స్వప్నం వచ్చింది. స్వప్నంలో శ్రీ దర్గాస్వామివారు మా ఇంటికి వచ్చి తృప్తిగా భోంచేశారు. "నేనెప్పుడూ నీకు తోడుగా వుంటాను. నీవు దేనికీ కంగారు పడవద్దు'' అని వెళ్ళిపోతున్నారు. **వెంటనే శ్రీ దర్గాస్వామివారు కాస్తా షిరిడీ సాయి అయ్యారు. అదుగో బాబా అంటూ ఇంట్లో అందరినీ దర్శించుకోమంటున్నాను. తర్వాత శివపార్వతులు, విష్ణమూర్తి, లక్ష్మీదేవి, మూడు ముఖాలతో శ్రీ దత్తాత్రేయస్వామి దర్శనమిచ్చి స్వప్నం అదృశ్యమైంది.**

ఈ విధంగా నడి సముద్రంలో ఉన్న నన్ను శ్రీ దర్గాస్వామివారు దత్తుని రూపాలైన ఇతర మహాత్ములు తన రూపమేనని చెప్పడం ద్వారా బేధభావం మాని దైవం ఒక్కరేననే ఎరుక పోగొట్టుకోకుండా జీవించండని శ్రీ స్వామివారు బోధిస్తున్నారు.

## సూర్య చంద్రారావుగారు, దమ్మపేట:

నేను శ్రీ దర్గాస్వామివారిని దర్శించాను కానీ వారు నాకే దేవతగాను దర్శనమివ్వలేదే అనుకునే వాణ్ణి. శ్రీ దర్గాస్వామివారి నుండి వచ్చిన రెండవ రోజున శ్రీ స్వామివారు ఒక కొండ మీద గల పెద్ద బండ మీద కూర్చొనియున్నారు. **నేను చూస్తుండగానే పది శిరస్సులు గల సుబ్రహ్మణ్య స్వామిగా మారిపోయారు.** చాలా స్పష్టంగా చూస్తున్నాను. ఆ విషయం తలుచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. నాకు చిన్నప్పటి నుండీ శ్రీ సుబ్రహ్మణ్యస్వామి అంటే ఎనలేని ప్రీతి. నా ప్రీతిననుసరించి శ్రీ దర్గాస్వామివారు నాకు అలా దర్శనమిచ్చి నేను సద్గురువునని నాకు నమ్మకం కల్గించారు. శ్రీ సద్గురు దర్గాస్వామే శ్రీ

సుబ్రహ్మణ్య స్వామి కదా!

## గొట్టిపూళ్ళ లక్ష్మి, విజయవాడ

1. మా అన్నయ్య శ్రీ చినజీయరు స్వామిని ఆరాధిస్తారు. దర్గాస్వామి గురించి అసలు తెలియదు. ఒకరోజు రాత్రి మా అన్నయ్య కలలో ఒక మహనీయుడు తెల్లని బట్టలతో, గడ్డంతో కనపడ్డారు. తరువాత రోజు ఇంట్లోవాళ్ళకి కల గురించి చెప్పాడు. తరువాత రెండు రోజులకి ఒక వాహనం కొనాలని కడప వెళ్ళాడు. అక్కడ దర్గాస్వామి గురించి తెలిసి దర్శనానికి వెళ్ళి చూస్తే రెండురోజుల క్రితం మా అన్నయ్య కలలో దర్శనమిచ్చిన మహనీయుడు శ్రీ స్వామివారే.

2. మా కుటుంబం అంతా దర్గాస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు మేమేమీ చెప్పకుండానే నన్ను చూసి "నీలో విజయవాడ కనకదుర్గ దర్శనమవుతోంది. అక్కడికి వెళ్ళకుండా దర్శనమిచ్చావు మా భాగ్యం!" అని అన్నారు. అంటే నేను విజయవాడ నుండి వచ్చానని ఎంత స్పష్టంగా చెప్పారోనని స్వామి యొక్క సర్వజ్ఞత్వం మనస్సులో దృఢపడింది.

## రాజేష్ చంద్ర, లక్ష్మీవిలాస్ బ్యాంక్ ఉద్యోగి, నెల్లూరు.

చిన్నప్పుడు మా నాన్నగారితో పాటు సాయిబాబా భజనలలో పాల్గొనటం వలన సాయిబాబా మీద భక్తి కలిగి గురు భావంతో ఆరాధిస్తుండేవాడ్ని. 2006లో డా॥ సురేంద్రగారు 'టి.టి.డి' ప్రాంగణంలోని సాయి మందిరంలో ఉన్న దర్గాస్వామి దగ్గరకు తీసుకొని వెళ్ళి భజనలు, పాటలు పాడతానని స్వామికి చెప్పగానే స్వామి నన్ను దగ్గర కూర్చోపెట్టుకొని పాట పాడమన్నారు. పాడిన తర్వాత స్వామి ఆశీర్వదించారు. ఆరోజే(మంగళవారం) నాకు లక్ష్మీవిలాస్ బ్యాంకు వ్రాత పరీక్షకి రమ్మని లెటరు వచ్చింది. ఆ తర్వాత ఇంటర్వ్యూకు వెళ్ళే ముందర స్వామి దర్శనం చేసుకుంటే ఇంటర్వ్యూకి మజ్జిగ త్రాగి వెళ్ళమని చెప్పారు. ఇంటర్వ్యూ ముందర రోజు హైదరాబాద్‌లో సాయిబాబా గుడికెళితే మా కుటుంబంలో నాకొక్కడికే పూజారి పూలు ఇచ్చారు. అంతకు ముందు స్వామి నన్ను ఇంటర్వ్యూకి జేబులో పూలు పెట్టుకెళ్ళమని స్వామి చెప్పిన మాటలు

స్ఫురించి అవి స్వామి ప్రసాదంగా తీసుకున్నాను. తర్వాత రోజు ఇంటర్వ్యూ బాగా చేసాను. అక్కడికక్కడే నేను సెలక్ట్ అయ్యానని చెప్పారు. ఇంతకు ముందు వ్రాత పరీక్షకు కూడా పిలవని నన్ను దర్గాస్వామి దర్శనం మాత్రంతోనే నాకు ఉద్యోగం ఇచ్చారు.

ఒకరోజు రాత్రి స్వప్నంలో దర్గాస్వామి కన్పడి నీకేం భయం లేదు. నీ వెంట నేనుంటాను. నిన్ను నేను నడిపిస్తాను అని చెపుతున్నారు. దర్గాస్వామి వెనుకాల సాయిబాబా కన్పడి ఆశీర్వదించారు. ఆ స్వప్నదర్శనం తర్వాత దర్గాస్వామి మీద విశ్వాసం పెరిగి గురుభావం దృఢపడింది.



శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 7

## దయా సాగరుడు

**పరమ కారుణ్యమూర్తియైన శ్రీస్వామివారు తమను సంపూర్ణంగా నమ్ముకున్న భక్తులు ఈ విశ్వములో ఎచ్చట ఉండి స్మరించిననూ వెంటనే వారిని చిత్రమైన రీతులలో ఆదుకొనేవారు. భరించలేని భయంకరమైన వ్యాధులతో బాధపడుతూ, బాధ భరించలేక శ్రీస్వామివారిని ప్రార్థించినప్పుడు అట్టివారి బాధను శ్రీస్వామివారు తన శరీరం పైకి తీసుకొని తానే అనుభవించి ఆ భక్తుని బాధ తీర్చేవారు.**

### మోహనరావుగారు, దమ్మపేట:

స్వామి దగ్గరకు వెళ్ళే ముందు ఒకరోజు తీవ్రంగా జ్వరం వచ్చింది. 'స్వామీ! ఇంత జ్వరం పెడితే ఎలా తట్టుకోగలను' అని స్వామివారిని ప్రార్థించాను. 10 నిమిషాల్లో జ్వరం తగ్గింది. ఆ తర్వాత నేను శ్రీస్వామివారి దగ్గరకి నీలకంఠరావుపేట వెళ్ళాను. స్వామి నన్ను చూచి "ఒరే! మోహనా! నీవు ఒక్కరోజు బాధ కూడా అనుభవించకుండా నన్ను తిట్టినావురా!" అని అన్నారు. అంటే దమ్మపేటలో వుండి ప్రార్థించిన వెంటనే నీలకంఠరావుపేటలో వున్న స్వామికి తెలిసింది అంటే వారు అంతటా వ్యాపించియున్నారు, వారు సర్వసమర్థులు కానిదే అలా నా జ్వరం తగ్గించలేరు.

### శ్రీ సి. సూర్యప్రకాశరావుగారు, రిటైర్డు హెడ్‌మాస్టర్, కావలి

పూజ్య గురుదేవులు దర్బార్ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ సద్గురు దర్గాస్వామివారి పాదపద్మాలకు సాష్టాంగ ప్రణామములు. మేము తరచూ దర్గాకు పోయి శ్రీ స్వామి దంపతుల ఆశీస్సులు గొని వచ్చేవారము. ఎప్పుడు ఏది ఇచ్చినా స్వీకరించక **"మీరు తింటే నేను**

**తిన్నట్లే. మీరు తిన్నవన్నీ నా పొట్టలో ఉన్నాయి. కాబట్టి ఇవి అన్నీ అందరికీ పంచి మీరు తినండి"** అనేవారు. అంతేగాక మేము కారియర్ మూత తీయకముందే అవి ఏమిటో చెప్పేవారు. ఆ విధంగా వారి సర్వజ్ఞత్వం వెల్లడయ్యేది.

1996 ఆగస్టులో నాకు మలేరియా వ్యాధి వచ్చింది. 21 రోజులకు కూడా తిరుగు ముఖం పట్టలేదు. భయంకరమైన మందులతో చాలా బాధగా వుండేది. రోసోచిన్ మాత్రలు వేసుకున్నప్పుడు కడుపులో అగ్నిగోళాలు తిరిగినంత మంటగా వుంది. 26వ తేదీ సాయంకాలం ఆ బాధ భరించలేక మానసికంగా శ్రీ స్వామివారితో ఇలా చెప్పుకున్నాను. 'మేము మీ దగ్గరకొచ్చినప్పుడల్లా మేము తింటున్న సమస్తం మీలోకి చేరుతున్నట్లు చెప్పారు గదా! ఇప్పుడు నేను మ్రింగుతున్న రోసోచిన్ మాత్రలు గూడా మీ పొట్టలోకి చేరుతున్నాయా? చేరితే వాటి ప్రభావం మీ మీద చూపటం లేదా? మా పూర్వ జన్మ ప్రారబ్ధం కొద్దీ మేము అనుభవిస్తున్న ఈ బాధను మీరు కూడా అనుభవించకపోతే తగ్గించవచ్చు కదా! అని అనుకొని కండ్లు మూసుకున్నాను. పది నిమిషాలలో ఒళ్ళంతా చెమటపోసి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. అది మొదలు ఇక జ్వరం రాలేదు.

ఒకవారం తరువాత కావలికి శ్రీ స్వామివారిని ఆహ్వానించేందుకు మిత్రులతో కలసి నీలకంఠరావుపేటకు వెళ్ళాను. నాకు జ్వరం వచ్చిన విషయం శ్రీ స్వామివారికి చెప్పబోతే ఆపి కృష్ణారెడ్డిగారిని పిలిచి, పోయిన వారం జరిగిన సంగతి చెప్పమన్నారు. కృష్ణారెడ్డిగారు ఇలా చెప్పారు: "పోయిన వారం శ్రీ స్వామివారికి, అమ్మయ్యగారికి బాగా జ్వరం వచ్చింది. చాలా బాధపడ్డారు. మాత్రలు వేసుకోమంటే "ఉండరా ఇప్పటికే కడుపునిండా మాత్రలు వేసియున్నారు" అని చెప్పి మందు తీసుకోలేదు. ఆ రాత్రికి జ్వరం తగ్గిపోయింది. మరుసటి రోజుకు మామూలుగా ఆరోగ్యంగా వున్నారు" అని చెప్పాడు.

చిత్రమేమంటే నాకు జ్వరం తగ్గిన సమయంలోనే శ్రీ స్వామివారు, అమ్మయ్యగారు జ్వరాన పడ్డారు. నేను బాధతో వారిని స్మరించిన

క్షణంలోనే వారు జ్వరాన్ని తమ శరీరం మీదకు తీసుకొని నా బాధను తీర్చారు. **ఎంతో దూరంలో వున్న నా ప్రార్థన విన్నారంటే వారు సర్వవ్యాపకులై ఉండాలి. నా జబ్బును తన శరీరంపైకి తీసుకున్నారంటే సర్వసమర్థులని అర్థం. గనుక దైవమే మానవాకారంలో మనముందు నిలచిన రూపమే శ్రీ దర్గాస్వామివారు.** నాకు గల గత అనుభవాలెన్నో ఈ విషయం ఋజువు చేస్తున్నాయి. వారిని తగువిధంగా సేవించి, వారియందు విశ్వాసం గల్గి నడుచుకునేటట్లు చేయుమని శ్రీ స్వామివారిని ప్రార్థిస్తున్నాను.

ఒకరోజు కావలి భక్తులు టెంకాయబొండాలు తీసుకుని వచ్చారు. రాగానే వాళ్ళను తెగతిట్టి వీడు రోగం పోవాలని, వీడు డబ్బు కావాలని, వీడు మూట కావాలని వచ్చారు. మాకింకేమీ పని లేదా? పోండిరా పోండి అని గేటు వరకు తరిమి వేశారు. వాళ్ళక్కడనే నిలుచొని వున్నారు. కొంతసేపయ్యాక దగ్గరకు పిలిచి టెంకాయబొండాలు అక్కడ పెట్టమని, నిజమైన ఆర్తితో, తీవ్రమైన కోరికతో, దృఢమైన విశ్వాసంతో ఈ కొబ్బరికాయ తీసుకోండి. వారి కోరిక తప్పక నెరవేరుతుందని సవాలు చేసినట్లు ఉచ్ఛకంఠంతో పలికారు. చేయి పట్టిన వాళ్ళకంతా ఇచ్చేశారు. వారిలో ఒకాయన కొన్ని బాధలలో వచ్చారు. అంతకు ముందురోజు అక్కడున్న సమాధులకు నమస్కరిస్తుంటే అభయహస్తం ఆ సమాధుల మధ్య స్పష్టంగా కనిపించింది. అదేదో భ్రమ అనుకొని దాన్ని తన మిత్రుడు గోపాల్‌కు చెబితే అలాంటివి పట్టించుకోవద్దన్నాడు. ఇప్పుడు ఈ టెంకాయబొండా కొరకు తాను దోసిలి చాపాడు. వెంటనే శ్రీ స్వామి "నిన్న నీకు అభయహస్తం ఇచ్చాను గదా! ఇంకా మళ్ళీ ఇదెందుకూ" అంటూ అతనికి టెంకాయ ఇవ్వలేదు. అంటే నిన్న ఆయనకు అభయహస్తం కనిపించిన విషయం ఎవరూ చెప్పకుండానే వారికి తెలిసింది. ఆ అభయహస్తం ఇచ్చింది నేనేనని చెపుతున్నారు. ఆ సమాధుల్లో మహనీయులకు, నాకూ బేధం లేదని చెపుతున్నారు.

ఒకరోజు ఎ.సి. కార్లలో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారు దగ్గరకు వచ్చి ఏమీ పలుకకక ముందే "ఒరేయ్! దొంగ వెధవల్లారా నా ఇత్తడి చెంబు దొబ్బుకు పోయింది మీరే, బుద్ధిలేదు పోండి ఇక్కడ నుండి" అని ఉచ్ఛనీచాలు తిడుతూ వారిని బయటకి నడవమన్నారు. వారు హడలిపొయ్యారు. కొన్ని క్షణాల తర్వాత "ఆ ఇక లోపలకు రండి" అని ఆదరంగా పలికారు. ఆ తిట్లద్వారా వారిలో ఏ ఖర్మలను క్షాళన చేస్తున్నారో మనకేమి తెలుస్తుంది!



శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 8
## ఆశ్రిత కల్పవృక్షము

### ఎ. రంగారావుగారు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, కావలి

1. ఒకరోజు నా భార్య స్కూలులో పడిపోయింది. టీచర్స్ అంతా ఆమెను వైద్యశాలకు తీసుకుపోయారు. ఆ డాక్టరు ఇంజక్షన్లు వాడి ఆమెకు గుండెజబ్బు, ప్రమాదస్థితి అన్నారు. నెల్లూరు తీసుకుపోయాము. వాళు ్ళ అన్ని పరీక్షలు చేసి, ప్రమాద పరిస్థితి అని చెప్పి, హైదరాబాద్ వెళ్ళమన్నారు. ఇక తప్పదని శ్రీ స్వామివారి దగ్గరకి వెళ్ళాము. "ఆమెకు ఏమీ లేదు బాగుంది. గొలగమూడి వెళ్ళి మూడు నిద్రలు చేయమన్నారు" శ్రీ స్వామివారు. అలా చేస్తే అంత ప్రమాద స్థితి ఏమైందోగానీ ఆమె ఏ వైద్యం లేకుండా ఆరోగ్యంగా వుంది. వారు భగవంతుడు కానిదే అలా చేయలేరు.

2. నేను కుటుంబ సమేతంగా తుంగభద్రా పుష్కరాలకు మంత్రాలయం వెళ్ళాను. యాత్రికుల రద్దీ వలన అక్కడ రూమే దొరకలేదు. చూచిన వరకు చాలని ఇంటికి రాబోతున్నాము. ఎవరో చిన్న పిల్లవాడు వచ్చి ఎవరో నన్ను పిలుస్తున్నారని తీసుకువెళ్ళాడు. ఆ పెద్దమనిషి నీకు రూము కావాలా అని అడిగి గెస్ట్‌హౌస్ ఇమ్మని చీటీ పంపారు. ఆ గెస్ట్‌హౌస్‌ను చూసి బాడుగ చాలా ఎక్కువగా ఉంటుందని బాడుగ ఎంత అని అడిగాను. ఫ్రీగా ఇమ్మని వ్రాశారండీ అని చెప్పారు. నాకు మతిపోయింది. తిరిగి ఇంటికి పోదామనుకునే సమయంలో గెస్ట్‌హౌస్ ఫ్రీగా ఇమ్మనడమేమిటి? ఫ్రీగా ఇప్పించేటట్లు ఎవరు చేసి వుంటారు? దీనికంతా మూలకారణం శ్రీ స్వామివారేనని తెలుసుకున్నాను. శ్రీ స్వామివారికి నా మీద ఎంత దయ! ఏమిచేసి వారి ఋణం తీర్చుకోగలను.

3. ఇదేవిధంగా మా పెద్దబ్బాయి రామకృష్ణకు ఇంజనీరింగ్ సీటు వచ్చింది. కానీ ఫ్రీ సీటు కాకుండా డొనేషన్ కట్టాలన్నారు. నాకంత శక్తి

లేదు. అకోలాలో రహమాన్ అనే వారు కలసి మీరు పూసద్ వెళ్ళి నా పేరు చెప్పండి, ఫ్రీ సీటు ఇస్తారని చెప్పారు. చివరి ఆశగా వెళ్ళాము. వారి పేరు చెప్పగానే ఫ్రీ సీటు ఇచ్చారు. ఈ రహమాన్ ఎవరు? నన్నెట్లా కలిశారు? నాకెందుకు ఫ్రీ సీటు ఇప్పించారు? ఈ నాటకానికంతకూ మూలపురుషుడు శ్రీ స్వామివారేనని గట్టిగా నమ్ముతున్నాను. ఆ కృతజ్ఞతతోనే నమస్కరించుచున్నాను.

4. మా పెద్దమ్మాయి శ్రీ దర్గాస్వామివారు చెప్పిన సంబంధమే చేసుకుంటాను అని పట్టు పట్టింది. తరువాత వరుడు పెండ్లిచూపుల సందర్భంలో ఆ అమ్మాయిని 'షిరిడీ హారతులు నాలుగూ వచ్చునా' అని అడగగా ఆ అమ్మాయి నాకు ఒకటే వచ్చు అని సమాధానం చెప్పింది. తరువాత వారు అడిగిన కట్నం ఇచ్చి పెండ్లి చేయటం కష్టం అని నేను సందేహించి శ్రీ స్వామివద్దకు వెళ్ళగా శ్రీ దర్గాస్వామివారు పెండ్లికొడుకు పలికిన మాటలు "షిరిడీ హారతులు వచ్చునా అని అడిగినట్లు, వారి అమ్మాయి ఒకటే వచ్చు అని చెప్పినట్లు" చెప్పి ఆ సంబంధమునే నిశ్చయించి చేయమన్నారు. వరుడు కడప నివాసి. శ్రీ స్వామివారికి దగ్గర వూరు. తరువాత కట్నమునకు కావలసిన సొమ్ము అంతయు సమకూర్చి, వివాహము శ్రీస్వామివారి అనుగ్రహముతో చక్కగా జరిపించినారు.

5. ఒకరోజు నేను శ్రీ స్వామివారి సన్నిధిలో ఉన్నాను. "ఒరే రంగా! మీ ఇంటి దొడ్డి తలుపు గడియ వేయకుండానే పడుకున్నారు. అక్కడుండే సైకిల్ ఎవరైనా తీసుకుపోయినా పోతారు గదా!!" అని స్వామి అన్నారు. తెల్లవారి ఇంటికి వెళ్ళాక విచారిస్తే అది అక్షరాల నిజమని తేలింది.

## డి. జయచంద్రారెడ్డిగారు, నెల్లూరు

1. 1993వ సం॥లో రంగారావుగారు మా దంపతులను వెంటనే శ్రీ దర్గాస్వామివారిని దర్శించుకోమని ఫోను చేశారు. ఆ సమయంలో రొయ్యల పరిశ్రమలో లక్షలు నష్టపోయి అప్పులతో దిక్కు తోచక ఉన్నాను. నా భార్య ప్రోద్బలముతో శ్రీ దర్గాస్వామివారి దర్శనార్థం నీలకంఠరావుపేట వెళ్ళాము. మా ఆవిడ శ్రీ స్వామివారికి దగ్గరలో కూర్చొనుంది. నేను దూరంగా వున్నాను. శ్రీస్వామివారు నా వైపు చూచి "ఒరే నాయనా! నీ

గురువు ఇక్కడ కూడా ఉన్నారు లేరా! నీ బాధ ఏమిటో చెప్పుకోరా!!" అన్నారు. నేను వారికి పాదాభివందనం చేసి నా కష్టం చెప్పుకున్నాను. "నీవు మరలా అదే పరిశ్రమలో దిగు, బయటపడగలవు" అని అన్నారు. 'నా దగ్గర చిల్లిగవ్వ లేదు. రెండు లక్షల పెట్టుబడి ఎక్కడ తేగలను' అంటే "అదంతా నాకు తెలియదు ఈసారి నీ సమస్య తీరుతుంది" అంటూ నవ్వుతూ "అలా తీరితే నాకేమి ఇస్తావు?" అన్నారు. ఈయన ప్రతిఫలం ఆశించేవాడుగా ఉన్నాడే, సమస్య తీరితే ఏదో ఒకటి ఇస్తాములే అనుకొని వచ్చేశాము. నేను తిరిగి రొయ్యల పరిశ్రమలో దిగాను. ఆ తర్వాత మూడు నెలలోనే నా అప్పులన్నీ తీరి బయటబడ్డాను. నేను 1,116 రూపాయలు శ్రీ స్వామివారికి పంపితే అక్కడ జరుగుతున్న అన్న సంతర్పణకిమ్మన్నారు. ఆ దైవస్వరూపులైన మహనీయులు తమ ఒక్క దర్శనముతో, వారి అమృతవాక్కుతో నన్ను బాధాకరమైన పరిస్థితి నుండి బయటపడేసారు.

2. మా కొమార్తెకు రెండు సంవత్సరముల నుండి పెండ్లి సంబంధాలు చూస్తూ వారి దగ్గరకు తీసుకుపోయాము. "మీ నాయన నిన్ను అమెరికా పంపాలంటున్నాడు. పోతావా? పోతావులే" అని అన్నారు. శ్రీ స్వామివారు ఈమె జాతకం చూచి "ఈమెది పుష్యమి నక్షత్రం - పునర్వసు నక్షత్రం వుండే పిల్లవాడు కావాలి. కుదురుతుందిలే" అన్నారు. శ్రీ స్వామివారు ఒకరోజు ఫోనుచేసి "ఇప్పుడు వచ్చిన సంబంధం నక్షత్రాలు కలిసాయి. మంచిదే. కానీ మీరనుకున్న దానికంటే ఒకటి రెండు లక్షలు ఎక్కువ అడుగుతారు. ఈ సంబంధం పోనీయవద్దని" చెప్పారు. 29-9-2000 నిశ్చితార్థం, 11-10-2000 వివాహం, 31-10-2000 దంపతులు అమెరికా పోవడం. అక్కడే అబ్బాయి ఉద్యోగం చేయడం జరిగింది. వారి మాట వేదవాక్కు.

## మోహనరావు గారు, దమ్మపేట

1. మా పెద్దమ్మాయిని ఇంటర్‌మీడియెట్ అయిన తర్వాత తీసుకువెళితే స్వామి మా అమ్మాయితో "హైదరాబాదులో చేరితే మీ నాయనకి ఎక్కువ ఖర్చు అవుతుంది, గంగారాం సాయిస్ఫూర్తి కాలేజీలో

సి.ఎస్. ఇంజనీరింగ్ గ్రూపులో చేర”మంటే మా అమ్మాయి ఇ.సి.ఇ. గ్రూపులో చేరతానన్నది. స్వామి “సరే నీ ఇష్టం” అని అన్నారు. కౌన్సిలింగ్‌కి వెళ్ళినప్పుడు సి.ఎస్‌లో 2 సీట్లు, ఇ.సి.ఇలో 10 సీట్లు వుండేసరికి సి.ఎస్ గ్రూపుకే ఎక్కువ డిమాండ్ వుందని సి.ఎస్ గ్రూపు తీసుకున్నది. తర్వాత స్వామి దగ్గరకి వెళ్ళినప్పుడు మేమేమీ చెప్పకముందే స్వామి మా పెద్దమ్మాయితో “సి.ఎస్ గ్రూపు తీసుకోనన్నావు, మరి అదే ఎందుకు తీసుకున్నావు” అని అడిగారు. దీనితో ఆయన సర్వజ్ఞత్వం మరియు తనను నమ్ముకున్న మోహన్‌రావుగారికి ఆర్థిక ఇబ్బంది లేకుండా చేయటం స్పష్టమౌతోంది.

2. మా రెండవ అమ్మాయి ఇంటర్మీడియెట్ అయిన తర్వాత స్వామి దగ్గరకి తీసుకు వెళ్ళి ఏమి చేయించమంటారు అని అడిగితే స్వామి “బి.టెక్ చదివించు, సీటు వస్తుంది. అక్కా చెల్లెళ్ళు ఒక చోటే వుంటారు. గంగారాం సాయి స్ఫూర్తి కాలేజీలో సీటు వస్తుంది” అని చెప్పారు. ఏ సీటు తీసుకోమంటారు స్వామీ అని అడిగితే “ఐ.టి. (ఐ.టి. అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సీటు వస్తుంది” అని స్వామి చెప్పారు. తర్వాత మా అమ్మాయికి ఎంసెట్‌లో 82,000 ర్యాంకు వచ్చింది. ఆ ర్యాంకుకు సీటు రాదు. స్వామి దగ్గరకి వచ్చి ‘స్వామీ! మీరు గంగారాం సాయి స్ఫూర్తి కాలేజీలో సీటు వస్తుందన్నారు. మా అమ్మాయికి 82,000 ర్యాంకు వచ్చింది అ ర్యాంకుకి ఎక్కడా సీటు వచ్చే సూచనలు కనపడటం లేదు. ఎలాగ స్వామీ!’ అని అన్నాను. స్వామి “సీటు వస్తుంది” అని మూడుసార్లు అన్నారు. “హైదరాబాదులో కౌన్సిలింగుకి వెళ్ళితే ఖర్చు ఎక్కువవుతుంది. గుంటూరుకి వెళ్ళు” అని స్వామి చెప్పారు. అలాగే మర్నాడు కౌన్సిలింగ్ అయితే ముందర రోజే వెళ్ళి విచారిస్తే అప్పటికే గంగారాం సాయి స్ఫూర్తి కాలేజీలో సీట్లు అయిపోయి వారం అవుతోంది. మరునాడు ఉదయం 11 గంటలదాకా ఆ కాలేజీలో సీట్లు లేవు. టెన్షన్ పడి స్వామికి ఉదయం 11:30గం॥లకి ఫోను చేశాను. స్వామితో ‘స్వామీ! మీరు సీటు వస్తుందన్నారు. సీట్లు లేవు. మమ్మల్ని మధ్యాహ్నం 2 గంటలకి పిలుస్తారు. నన్ను ఏం చేయమంటారు’ అని అడిగితే స్వామి తన ప్రక్కనున్న శంకరయ్యగారితో

"అరే శంకరా! మోహన్‌గాడు, వాడి బిడ్డ గుంటూరు కౌన్సిలింగ్‌కి వెళ్ళారు. సీటు లేదని కొట్టుకు చస్తున్నాడు. సీటు వుందిరా అంటున్నా వినటం లేదు" అని చెప్పి నాతో "రేపు ఉదయము 9 గంటలకి సీటు ఇస్తారు. నువ్వు వుండు. వెళితే సీటు రాదు" అన్నారు. నేను మరలా 'కాదు స్వామీ, ఈ రోజు 2 గంIIలకి కౌన్సిలింగ్ అంటే రేపు ఉదయం 9 గంIIలకి వస్తుందంటున్నారు. అసలు అర్థం కావట్లేదు' అని అడిగాను. స్వామి వెంటనే "సీటు వుంది. వస్తుంది. రేపు ఉదయం 9గంIIలకి ఇస్తారు. నువ్వు వెళ్ళబోకు" అని చెప్పారు. సరే అని 2గంIIలకి మమ్మల్ని పిలుస్తారని ఎదురు చూస్తుంటే అనివార్య కారణాల వలన నెట్ పనిచేయట్లేదు అందువలన ఈ రోజు జరగవలసిన కౌన్సిలింగ్ రేపటికి వాయిదా వేసారని తెలిసింది. తర్వాత రోజు కూడా ఆ కాలేజీలో ఏమీ ఖాళీలు లేవు. మా ముందర సత్తుపల్లి అమ్మాయి వెళ్ళి గంగారాం కాలేజీలో సీటు కావాలంటే లేవని చెప్పి ఆ అమ్మాయిని కరీంనగర్ కాలేజీలో తీసుకోమని చెప్తే ఆ అమ్మాయి అలానే ఆ కాలేజీలో చేరుతోంది. మమ్మల్ని పిలిస్తే మేము కూడా గంగారాం కాలేజీలో సీటు కావాలంటే వాళ్ళు 'మీ ముందరే కదా ఆ అమ్మాయికి కరీంనగర్‌లో తీసుకోమన్నాము' అని చెప్తుంటే మా అమ్మాయి ఏడవటం మొదలు పెట్టింది. అంతలోనే కంప్యూటర్‌లో గంగారాం కాలేజీలో ఐ.టి. సీటు ఒకటి వుందని చూపెట్టింది. వెంటనే దాన్ని మా అమ్మాయి పేరున వ్రాస్తూ మీకు బలమైన దైవకృప వుంది అందువలననే మీకు ఈ క్షణం దాకా లేని సీటు వచ్చింది. ఫీజు కట్టేసి బయటకొచ్చాక స్వామికి ఫోను చేస్తే స్వామి "రాదన్నావు కదరా! డబ్బేట్టి కొనుక్కుంటానన్నావు కదరా, ఆ సీటు మనదిరా, నేను దాచిపెట్టి వుంచాను" అని చెప్పారు. కేవలం స్వామి దయ వలన మాత్రమే మా అమ్మాయికి ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. దానికి ఈ క్రింది సన్నివేశంలో స్వామి ఇచ్చిన అభయమే కారణం.

స్వామి మా అమ్మాయికి సీటు వస్తుందన్న తర్వాత ఒకసారి స్వామి దగ్గరకి వెళితే స్వామి "అరే మోహనా! మీ అమ్మాయికి డొనేషన్ కట్టుకో" అని అన్నారు. వెంబడే నా మనస్సులో 'ఇంతకు ముందు సీటు

ఇప్పిస్తానన్నారు, ఇప్పుడు డొనేషన్ కట్టుకోమంటారు. లక్ష రూపాయల డొనేషన్ ఎక్కడనుండి తేవాలి, ఇప్పుడు అమ్మాయిని డిగ్రీలో చేర్చటానికి కూడా లేదు  అందువలన తర్వాత రోజు స్వామికి చెప్పకుండా వెళ్ళిపోదామ'నుకున్నాను. ఆ రోజు రాత్రి అమ్మయ్య సమాధి దగ్గర అమ్మయ్యకు విన్నవించుకొని పడుకున్నాను. ఆ రోజు రాత్రి కలలో **అమ్మయ్య స్వామితో "మీరు మోహన్‌కి మొదట సీటు ఇప్పిస్తానన్నారు. మరలా ఇప్పుడు డొనేషన్ కట్టాలంటున్నారు" అని అడిగింది. దానికి స్వామి "వాడ్ని 11 రూపాయలు దక్షిణ ఇవ్వమను, సీటు వస్తుంది" అన్నారు. అమ్మయ్య నాతో "అరే మోహనా! 11 రూపాయలు దక్షిణ ఇవ్వు" అని చెప్పారు. స్వామి కాగితాల మీద సంతకం చేసి "ఇదుగో సీటు తీసుకో" అని ఇచ్చారు.** అంతటితో ఆ స్వప్నం ముగిసింది. ఆ తర్వాతరోజు ఉదయ ఆరతి అయిన తర్వాత ఎవరికైనా స్వప్నాలుకానీ, సందేశాలు కానీ వచ్చాయా, అవి చెప్తే వాటిని వివరిస్తాను అని స్వామి అన్నారు. నేను మాట్లాడలేదు. నన్ను పేరు పెట్టి పిలిచి నాలుగుసార్లు అడిగినా నేను చెప్పలేదు. స్వామి వెళ్ళిన తర్వాత శంకరయ్యకు చెపితే ఆయన **'తప్పు కదా స్వామి అడినప్పుడు చెప్పకుండా వుండటం. నువ్వు అమ్మయ్యకు వెళ్ళి క్షమాపణ చెప్పు. స్వామే నిన్ను పిలుస్తారు'** అని చెప్పారు. నేను అమ్మయ్య సమాధి దగ్గరకి వెళ్ళి అమ్మయ్యకు అంతా చెప్పి **'అమ్మా! తల్లి దగ్గర భయం వుండదు కనుక చెప్పాను, స్వామికి చెప్పాలంటే నాకు భయం. నువ్వే స్వామితో చెప్పు'** అని, (స్వామి అడిగినప్పుడు చెప్పనందుకు) ప్రాయశ్చిత్తంగా అమ్మయ్య సమాధి చుట్టూ మూడు మోకాళ్ళ ప్రదక్షిణలు చేసాను. తర్వాత నా సామానులు సర్దుకుని బయటకు వచ్చి బయటనుండే స్వామికి వెళ్ళి వస్తానని చెపుతున్నాను. స్వామి లోపలికి రమ్మంటే నేను రానంటే, ఒకమాట మాట్లాడాలి రమ్మని పిలిచారు. వెళితే "అమ్మయ్య ఏం చెప్పింది"అని అడిగితే రాత్రి వచ్చిన స్వప్నం గురించి చెప్పాను. స్వామి వెంటనే "మరి 11 రూపాయలు ఇచ్చావా"? అని అడిగారు. నేను దర్గాల దగ్గర హుండీలలో

దక్షిణ సమర్పించాననగానే "ఇంక ఆ సీటు నీదే" అని, ఒక పేపరు మీద సంతకం చేసి అభయమిచ్చారు. ఈ అభయం వలననే మా అమ్మాయికి 82,000 ర్యాంకు వచ్చినా మా ఇంటికి దగ్గర కాలేజీలో స్వామి చెప్పినట్లు ఐ.టి.గ్రూపులో సీటు వచ్చింది.

3. మా స్వంత వూరిలో (జక్కవరం) 3 ఎకరాల మామిడి తోటకి అన్నీ చేసినా చేతికి సంవత్సరానికి 5,000 రూపాయలు మాత్రమే వస్తోంది. స్వామికి చెప్తే కొట్టించెయ్‌మన్నారు. నేను కొట్టించేద్దామని బేరం పెడుతూంటే మా అన్నా వాళ్ళకి తెలిసి 'ఆ స్వామేదో చెప్పాడని ఇలా చేస్తావా? కాసే పంటను అలా వదులుకుంటావా' అని అడ్డుపడ్డారు. నేను అప్పుడు గమ్మున వుండి తర్వాత ఎవరికీ చెప్పకుండా కొట్టేయటానికి ఒకాయన దగ్గర అడ్వాన్సు తీసుకొని నేను గొలగమూడి వెళ్ళినప్పుడు కొట్టేయమని చెప్పాను. అలాగే ఒకరోజు ఒక 20 చెట్లు నరికేసరికి మా అన్నా వాళ్ళకి తెలిసి అడ్డుపడితే చెట్లు నరికించే అతను నేను వ్రాసిన కాగితం చూపించి మీ తమ్ముడి చేత చెప్పిస్తే ఆపుతాము లేకపోతే ఆపము అన్నారు. నా అన్నా వాళ్ళు నేను గొలగమూడి వెళ్ళానని తెలియక మా ఇంటికి ఫోను చేసి చెప్తే, మా పెద్దమ్మాయి నాకు ఫోను చేసి అడిగింది. ఇది స్వామి ఆజ్ఞ అని చెప్పేసరికి ఇంకేమీ మాట్లాడలేదు. చెట్లన్నీ నరికేశారు. ఇంటికి వెళ్ళిన తర్వాత ఇంట్లోవారికి చెప్పి ఇది స్వామి ఆజ్ఞ అని చెప్పాను. తర్వాత స్వామి దగ్గరకి వచ్చి చెప్తే "ఆయిల్ పామ్ చెట్లు వచ్చి వున్నాయి అవి వేయి" అని స్వామి అన్నారు. ఆయిల్ పామ్ చెట్లంటే మనకు అప్లై చేసిన 6 నెలలకి వస్తాయి కదా, ఏమో స్వామి ఇలా అంటున్నారు అనుకున్నాను. ఇంటికి వచ్చేసరికి మా చిన్నాన్న కొడుకు ఆయిల్ పామ్ చెట్లు వేద్దామనుకుని అతను లీజుకి తీసుకున్న నా పొలంలో కూడా అదే వేద్దామని నా పొలానికి కావల్సిన చెట్లు తెప్పించి కాంట్రాక్టుకు ఇచ్చి వేయించేసాడు. అప్పుడు అర్థమైంది స్వామి అన్న మాటలు. ఇప్పుడు సంవత్సరానికి 20,000 రూపాయలు వస్తోంది. సద్గురువు భుక్తి, ముక్తి ప్రదాయకుడు.

4. 2011లో నాకు 5 రోజులపాటు జ్వరం ఉండి 6 వ రోజు నుండీ

104 డిగ్రీలకి హెచ్చింది. స్వామితో ఫోనులో మాట్లాడటం కుదరలేదు. ఒకరోజు ఉదయం డాక్టరు నాతో ఇదేదో మలేరియాలాగా ఉంది. ఎందుకైనా మంచిది మధ్యాహ్నం ఇంజక్షన్ చేసి గ్లూకోజ్ ఇస్తాను జ్వరం, నీరసం తగ్గుతాయి. సాయంత్రం వెళ్ళి రక్త పరీక్ష చేయించుకోండి అన్నాడు. మధ్యాహ్నం డాక్టరు దగ్గరకు వెళ్ళే ముందర స్వామికి ఫోన్ చేస్తే శంకరయ్య రాత్రి 8గం॥లకి ఫోన్ చెయ్యమన్నాడు. సాయంత్రం రక్త పరీక్షకు వెళ్ళి వచ్చాను. రాత్రి 7.05ని॥లకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయ్యలేదు.

ఏమీ స్వామీ! 5 రోజులునుండి మాట్లాడటానికి వీలు పడలేదు. మమ్మల్ని మర్చిపోయావా అని మనస్సులో ప్రార్థిస్తున్నాను. తర్వాత ఫోను చేస్తే స్వామి మాట్లాడుతూ నేనేమీ చెప్పకమునుపే "ఏరా ఈ టైమ్‌లో ఫోన్ చేసావేంటి"? అన్నారు. 'ఈ టైమ్‌లో ఏంటి స్వామి 4 రోజులనుండీ చేస్తున్నాను. మీరు మాతో మాట్లాడటం కుదరలేదు. 104 డిగ్రీల జ్వరం, భయమేస్తోంది. పిచ్చి పిచ్చి కలలు వస్తున్నాయి' అన్నాను. "పిచ్చోడా నీకు భయమేంట్రా! నీవెనుకమాలే ఉన్నాను. రక్త పరీక్ష కూడా చేయించుకొచ్చా. మలేరియా అటాక్ అయ్యే సూచనలు ఉన్నాయి. కాబట్టి మలేరియాకు సంబంధించిన మందులు రేపు చెపుతానన్నాడు కదా ఆ మందులు 5 రోజులు వాడితే తగ్గుతుంది. తగ్గిపోయిందని మానవద్దు, తగ్గిపోయినా మరలా వస్తుంది. మందులు వేసుకో. ఉండనా, ఇంక ఫోను పెట్టేయనా" అన్నారు. 'నాకు భయమేస్తోంది, నిద్ర కూడా పట్టట్లేదు, పిచ్చి పిచ్చి కలలు వస్తున్నాయి' అని నేను చెప్తే "జ్వరం రాదు రాదు రాదు, తగ్గిపోయిందని నాలుగు సార్లు చెప్పి" ఫోను పెట్టేసారు. తర్వాత నుండీ జ్వరం రాలేదు.

## చిరుదల విశాల, గాలివీడు గ్రామం, కడపజిల్లా

ఈ మధ్య నాకు కడుపులో బాధ వచ్చింది. రాయచోటి ఆస్పత్రికి పోతే వాళ్ళు స్కానింగ్ చేసి కడుపులో గడ్డ వుంది. ఆపరేషన్ ఒక్కటే మార్గమని చెప్పి డబ్బు తెమ్మన్నారు. ఆపరేషన్ అంటే ఆర్థికంగాను, శారీరకంగాను భయపడి నేను శ్రీ దర్గాస్వామివారిని ఆశ్రయించాను. ఆ

మహనీయుడు చూసి "నీకు గడ్డలేదు, ఏమీ లేదు. 25 రోజులు ఇక్కడ వుండు బాగుంటుందని" చెప్పారు. స్వామివారి ఆశ్రమంలో నేను మూడు నెలలు వున్నాను. ప్రస్తుతం నాకు కడుపులో బాధ, నొప్పి ఏమీ లేవు. నేను ఏ మందులూ వాడలేదు. శ్రీ దర్గాస్వామివారి కృపవల్ల హాయిగా వున్నాను. శ్రీ స్వామివారి ఆజ్ఞ తీసుకొని ఇంటికి వెళ్ళాను.

ఒక సంవత్సరం క్రిందట నా భర్త రమణయ్యగారికి పిచ్చి వచ్చింది. బెంగుళూరులో మందులు వాడాము. తగ్గినట్లే వుండి మరలా వచ్చింది. ఇక భరించలేక శ్రీ దర్గాస్వామివారి పాదములనాశ్రయించాము. ప్రస్తుతం ఏ మందులు, వైద్యాలు లేకుండానే ఆరోగ్యంగా వున్నాడు.

## జి.ఆర్.కె. సాయి సుబ్రహ్మణ్యం:

శ్రీ దర్గాస్వామిని దర్శించినప్పుడు "ఒరేయ్! నీ మీద బండ పడబోతుంది. జాగ్రత్తగా సాయిని వదలకుండా పట్టుకోరా!" అని చెప్పారు. బాగా ఆరోగ్యంగా వున్న నాకు ఆ మాట ఎందుకు చెపుతున్నారో తెలియలేదు. వారు చెప్పినట్లుగానే నాలుగు నెలలలో పెద్ద అనారోగ్యమే వచ్చింది. బెంగుళూరులో స్పృహ లేకుండా పడిపోయి వున్నాను. మా కంపెనీ డాక్టరు లేరు. ఒక గంట ఎ.సి. రూములో వుంచి పంపేశారు. నాకు స్పృహ వచ్చింది. మా నాన్నగారికి 3 సార్లు ఫోను చేసినా అందలేదు. శ్రీ దర్గాస్వామివారికి ఫోను చేసినా అందలేదు. ఇక లాభం లేదని గొలగమూడి వచ్చేశాము. సమయానికి మా అమ్మ నాతో ఉండబట్టి సరిపోయింది. లేకుంటే నేను మానసికంగా చాలా బాధపడేవాడిని. గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామివారి సన్నిధిలో ఉంటూ డాక్టర్ల మందులు వాడుతున్నాను. పిహెచ్.డి. కూడా 2 సంవత్సరాలలో పూర్తయింది. నేనడుగకుండానే నాకు రాబోయే అనారోగ్యాన్ని గూర్చి చెప్పడమే గాక అదృశ్యంగా ఎంతో మేలు చేకూర్చిన శ్రీ స్వామివారికి అనంతకోటి కృతజ్ఞతాభివందనములు చెల్లిస్తూ మమ్ములనెప్పుడూ ఇలాగే వదలక రక్షించమని వేడుకొంటున్నాను.

## లక్ష్మి, శ్రీనివాసుగారి భార్య, దమ్మపేట.

1994 లో పెళ్ళికాకముందు దర్గాస్వామి దగ్గరకి వెళ్ళినప్పుడు నాతో "1995లో గురుకృప కలుగుతుంది. తర్వాత నీకొక కోరిక వుంటుంది. అది నెరవేరుతుంది" అన్నారు. 1995 లో నాకు పెళ్ళి అయింది. తర్వాత నాకు 7సం॥ల వరకు సంతానం కలగలేదు. డాక్టర్లు పిల్లలు పుట్టరని చెప్పారు. నేను గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి 'మౌనబోధ' పుస్తకం 108 సార్లు పారాయణ ప్రదక్షిణలు చేస్తూ చేసాను. దర్గాస్వామిని సంతానం అడుగుదామని వెళ్ళేటప్పుడు ముందుగా గొలగమూడి వెంకయ్యస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు అక్కడ సత్సంగంలో శ్రీ సుబ్బరామయ్యగారికి దర్గాస్వామిని ఏమి అడగబోతున్నానో చెప్పాను. దానికి సుబ్బరామయ్యగారు "**అమ్మా! బిడ్డలు పుట్టలేదని బాధపడతాము కానీ బిడ్డలు పుట్టిన వాళ్ళందరూ బాగున్నారా? పిల్లలు పుట్టాక ఏమి ఇబ్బందులు వస్తాయో! తర్వాత వాళ్ళకోసం ఎన్ని కోరికలు కోరాల్సి వస్తుందో కదా! మనకేది మంచిదో ఆయనకి తెలుసు. అంతేగాక సరైన సమయంలో ప్రసాదిస్తారు. మనమెప్పుడూ స్వామికృప కోసం ఆశీస్సులను అడగాల**"ని చెప్పారు. నాకు ఈ ప్రార్థన హృదయగతమై స్వామి దగ్గరకి వెళ్ళినప్పుడు స్వామి "ఏం కావాలని" రెండు, మూడుసార్లు అడిగినా మీ ఆశీస్సులు కావాలని అడిగాను. నా ప్రార్థనతో సంతృప్తి చెందిన స్వామి అక్కడున్న వారితో నన్ను చూపిస్తూ "మా అమ్మాయికి బిడ్డ పుడతాడని" చెప్తూ నా వైపు తిరిగి "మీ బిడ్డ పుట్టినప్పుడు మీ ఊరు వస్తాను" అని అన్నారు.

యింటికి వచ్చిన తర్వాత సంక్రాంతి పండుగకు ఆరోగ్యం కొంచెం తేడాగా వుంటే పండుగ అయిన తర్వాత డాక్టరు దగ్గరకి వెళదామనుకున్నాను. ఆరోజు రాత్రి స్వామి నా కలలో నా పొట్ట నిమురుతూ "నువ్వు గర్భవతివమ్మా" అని చెప్పారు. డాక్టరు దగ్గరకి వెళితే నేను గర్భవతినని, నాకు సెప్టెంబరు 10వ తారీఖుకి ప్రసవం అవుతుందని చెప్పారు. ఆరోజు రాత్రి స్వామి కలలో కనపడి "అమ్మా! నీకు సెప్టెంబరు 3వ తారీఖు ప్రసవం అవుతుంది" అన్నారు. నేను పారాయణ, ప్రదక్షిణలు

చేసుకుంటున్నాను. సెప్టెంబరు 3వ తారీఖు మంగళవారం అయ్యింది. నేను చేసే గురుచరిత్ర సప్తాహ పారాయణ బుధవారం అవుతుంది కాబట్టి నేను దర్గాస్వామి ఫోటోకి "స్వామీ! గురుచరిత్ర పారాయణ అయిన తర్వాత నాకు ప్రసవం ఆయ్యేటట్లు చూడండి" అని చెప్పుకున్నాను. సెప్టెంబరు 3వ తేదీ రాత్రి నొప్పులు వచ్చి ఆగిపోయాయి. సెప్టెంబరు 4వ తేదీన నా పారాయణ అయిన తర్వాత నొప్పులు మొదలయ్యి సాయంత్రానికి నాకు బిడ్డ పుట్టాడు.

చాలా చిత్రంగా అదేరోజు దమ్మపేట సాయిబాబాగుడి బీరువాలో వుంచిన దర్గాస్వామి చిత్రపటాన్ని మందిర కమిటీవారు బయటకు తీసి వెంకయ్యస్వామి ఫోటో ప్రక్కన వుంచారు. అదీ మా అబ్బాయి పుట్టిన 10 నిమిషాలకి. ఇలా మాబిడ్డ పుట్టిన తర్వాత మా ఊరు వస్తారన్న మాటను పటం రూపంలో నిజం చేశారు.

పై లీలను చూస్తే స్వామికి భవిష్యత్తులో ఏమి జరుగుతుందో చాలా స్పష్టంగా తెలుసని, పటానికి చెప్పుకున్న విన్నపాలను అన్నివేళలా సర్వవ్యాపకుడై ఆలకించి తగువిధంగా మనకు శ్రేయస్కరమైనవి సర్వసమర్థుడై చేస్తున్నారని తెలుస్తోంది.

## గంగిశెట్టి వెంకట శివప్రసాద్‌గారు, ప్రొద్దుటూరు

నాకు బెల్లంపల్లి గ్రామం నుండి వివాహ సంబంధం వచ్చింది. పెళ్లి చూపులు అయినాయి. స్వామి మా ఇంటికి వచ్చినప్పుడు స్వామికి అమ్మాయిని చూపించాలని వారికి ఫోను చేస్తే 'ఎప్పుడు పడితే అప్పుడు ఎలా చూపిస్తాము' అని అన్నారు. స్వామికి చెప్తే "వాళ్ళే మరలా ఫోను చేస్తారులే" అన్నారు. తర్వాత వారే ఫోను చేసి రమ్మన్నారు. స్వామి "వెళ్ళనక్కరలేదు" అన్నారు. కానీ నాకు స్వామి అమ్మాయిని చూస్తే బాగుంటుంది అని కొంచెం పట్టుబట్టాను. స్వామి, అమ్మయ్యలు నన్ను ప్రక్కనున్న దేవుడి గదిలోకి తీసుకెళ్లి అమ్మాయి రూపురేఖలు చక్కగా వర్ణించారు. నేను చూసి వున్నాను కాబట్టీ స్వామి చాలా స్పష్టంగా చెప్పారని తెలిసింది. ఆ అమ్మాయి అన్నివిధాల సరిపోతుంది అని చెప్పి, ఇప్పుడైనా,

కొన్ని సంవత్సరాలైనా ఆ అమ్మాయే నీకు భార్య అని చెప్పారు.

నేను సి.ఏ చేద్దామని మద్రాసు వెళ్ళాను. అయితే స్వామివారు నన్ను వ్యాపారం చేయమన్నారు. నేను మెడికల్ ఏజెన్సీ తీసుకున్నాను. అది కలిసి వచ్చి ఉన్నత స్థితికి వచ్చాను. నాకు ఏది శ్రేయస్కరమో స్వామికి ఎంత స్పష్టంగా తెలుసునో కదా!

నాకు మనస్సులో ఆడపిల్ల కావాలని కోరిక. ఒకరోజు స్వామి నన్ను "ఒరెయ్ శివయ్య! రారా, నీ భార్యను పిలవరా" అన్నారు. ఆ రోజే బహిష్టు అయింది. అందువలన నేను "అంటు స్వామీ!" అని చెప్పాను. స్వామి వెంటనే "అంటు, సొంటు మీకు కానీ మాకు కాదురా! మీ ఆవిడ్ని పిలవరా" అన్నారు. మేమిద్దరం వెళ్ళగానే నీకు అమ్మాయి కావాలని కోరికతో వున్నావు కదరా! ఎందుకు అమ్మాయి కావాలిరా?" అని ప్రశ్నించారు. 'ఏమో స్వామీ! అమ్మాయంటే ఇష్టం' అన్నాను. స్వామి "మా అమ్మను ఇస్తానురా నీకు, భగవతి అని పేరు పెట్టుకో" అన్నారు. మీ దయ స్వామీ అన్నాను. "లేదు. మీ తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను కనుక్కో ముందర భగవతి అని పేరు పెట్టటానికి ఏమైనా అభ్యంతరముందేమోనని". అందరూ అక్కడే వున్నారు. మా తల్లిదండ్రులు 'మాదేముంది స్వామీ! మీ మాట కాదనేదేముంది' అని అంటే స్వామి "భగవతి అని పుట్టకముందే పేరు పెట్టాల, అలా అయితేనే ఇస్తాను" అన్నారు. 'సరే స్వామీ' అని మ్రొక్కుకున్నాను. మా అమ్మను ఇస్తున్నాను" అన్నారు. 'చిన్న కోరిక స్వామీ!' అన్నాను. "ఏమి నాయనా" అంటే మగపిల్లలిద్దరితో చాలా కష్టాలు పడ్డా స్వామీ, మా ఆవిడకి పాలు లేవు. పాలు దొరకక డబ్బాపాలు ఇవ్వాల్సి వచ్చింది అని చెప్పాను. "ఏమీ కష్టపడాల్సిన పని లేదు. మా అమ్మ పాలు అన్నీ తెచ్చుకుంటుంది" అని చెప్పారు. ఫిబ్రవరి 2వ తారీఖు ఎక్కడికీ పోకు నాయనా అన్నారు. ఏమీ స్వామీ అంటే అమ్మాయి డెలివరీ అవుతుంది అన్నారు. సరిగ్గా ఫిబ్రవరి 2వ తారీఖున డెలివరీ అయింది. నామకరణానికి స్వామి, అమ్మయ్యలు వచ్చి భగవతి అని పేరు పెట్టి ఆశీర్వదించి, "ఆ అమ్మాయిని కొట్టకూడదు, తిట్టకూడదు, ఆ అమ్మాయి మీకు అనుకూలంగా నడుచుకుంటుంది"

అని స్వామి చెప్పారు. 8సం॥ల వరకు దగ్గుగానీ, పడిసంగానీ ఏమీ లేదు. ఒక్కసారి జ్వరం వస్తే స్వామికి చెప్తే "పోతుందిరా పో" అన్నారు. అప్పటినుండి ఏ సమస్యలూ లేవు. ఇప్పుడు బి.టెక్ చదువుతోంది. బి.టెక్‌లో ఇప్పటిదాకా 75% మార్కులు వచ్చాయి.

## మునగా బాలసుబ్రహ్మణ్యంగారు, లక్కిరెడ్డిపల్లె, కడప జిల్లా

1. కొన్ని నెలలు నేను ఒక విధమైన చర్మవ్యాధితో బాధపడుతూ వుండే వాడిని. అనేక రకాల మందులు (ఇంగ్లీషు, హోమియోపతి) వాడినా లాభం లేకపోయింది. ఆ విషయం స్వామివారికి విన్నవించుకోగా "అదేమి లేదులే నాయనా! కొంచెం (ఊదీ) విభూది తీసుకో తగ్గిపోతుంది" అన్నారు. అలాగే విభూది తీసుకున్నాను. జబ్బు తగ్గిపోయింది.

2. 1999వ సం॥లో నా శ్రీమతిని మెడికల్ పి.జి. కౌన్సిలింగ్ కొరకు విజయవాడ తీసుకువెళ్ళాను. తిరుగు ప్రయాణం బస్సులో రాత్రి 10గం॥లకు నాకు కడుపునొప్పి ప్రారంభమైంది. ఒంటి గంట నుండి వాంతులు కూడా మొదలైనాయి. ప్రయాణం చేయలేక కావలిలో బస్సు దిగి దగ్గరలో వున్న నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాము. అక్కడి డాక్టర్లు దత్తాత్రేయస్వామి భక్తులు. వారు ఇంజక్షన్లు ఇచ్చి మరొక డాక్టరుని పిలిపించి స్కానింగ్ చేయించి కిడ్నీలో రాళ్ళు వున్నాయని తేల్చారు. మరుసటి దినం వారే టిఫిన్, భోజనము ఏర్పాటు చేసి దగ్గరుండి రైలు ఎక్కించి పంపినారు. మా వూరు చేరిన తర్వాత స్వామి దర్శనానికి దర్బారు నగరం వెళ్ళాము. లోపలికి అడుగు పెట్టిన వెంటనే స్వామివారు "అమ్మయ్యా! ఇదిగో రాత్రంతా యుద్ధం చేసిన వీరుడు వచ్చాడు" అన్నారు. నాకు నోట మాట రాలేదు. కొద్దిసేపు ఆగి ఏదో చెప్పబోయాను. స్వామివారు వెంటనే అడ్డు తగిలి "నాకంతా తెలుసులే" అన్నారు. అక్కడే వున్న రాజంపేట భక్తుడు శంకర నారాయణ నాతో 'ఆ రాత్రి అంతా స్వామివారు పొత్తి కడుపు నొప్పితో బాధ పడ్డారు, ఎవరిదో తెలియదు' అని అన్నారు. తర్వాత నాతో "ఏమీ ఫర్వాలేదు, ఆపరేషన్ ఏమీ చేయనక్కరలేదు. ఏదో ఆపద వచ్చింది, అది పోయింది" అని స్వామి అభయమిచ్చినా నాకు భయంగా వుంటే తర్వాత ఇంకొకసారి కూడా అలానే అభయమిచ్చారు. నా ఆందోళన

అలానే వుంది. ఒకరోజు రాత్రి స్వామి మూత్ర విసర్జన చేస్తున్నారు. నా మనస్సులో స్వామి మూత్రం అమృతంతో సమానం కదా! అని అనుకున్నాను. తర్వాత రోజు నేను మూత్రవిసర్జన చేసినప్పుడు మూత్రంతో పాటు రాళ్ళు బయటకి వచ్చాయి. తర్వాత డాక్టరుకి చూపిస్తే అంతా బాగుంది, ఆపరేషన్ అవసరం లేదు అని చెప్పారు. నేనేమీ అడగకపోయినా స్వామి నాకు ఎంతటి అభయమిచ్చారో కదా అని ఇప్పుడు తెలుస్తున్నది కానీ స్వామి చెప్పినప్పుడే మనస్సులో సంశయించకుండా వుండలేకపోయాను.

3. ఒకసారి టి.వి. రిలే యంత్రం చెడిపోయింది. టి.వి. కార్యక్రమాలకు అంతరాయం కలుగకుండా వుండాలని రిపేరు చేయడానికి చాలా ప్రయత్నించాను. అయినా అది పనిచేయలేదు. హారతికి వెళ్ళి వస్తామని దర్గాకు వచ్చాను. హారతి తర్వాత వెళ్ళి చూడగా యంత్రం మాములుగానే పని చేయుచున్నది.

4. ఒకరోజు లక్కిరెడ్డిపల్లె నుండి హారతికి దర్గాకు రావాలని మోటారు బైకుమీద బయలుదేరగా టైర్లలో గాలి తక్కువగా వున్నది. స్వామి వున్నారులే అని బయలుదేరాను. నేను కనపడగానే స్వామివారు ప్రక్కవారితో "వీడు టైర్లలో గాలి తక్కువగా వున్నా స్వామి వున్నారులే అని బయలుదేరాడు" అని అన్నారు.

## చలంబ్యాల సూర్యప్రకాశరావు, సీతాదేవి, కావలి

ఒకసారి కాశీలో పంచకోశ యాత్రలో పడవలో ప్రయాణిస్తుంటే పడవకు చిల్లుపడి పడవలోనికి నీళ్ళు రావడం మొదలైంది. మాకు భయం వేసింది. అయితే ఎదురుగా వున్న ముందు పడవలో స్వామివారు "నేనుండగా మీకేం భయం" అన్నట్లు అభయహస్తంతో నిలబడి దర్శనమిచ్చారు. మా భయం తొలగిపోయింది, ఏ ప్రమాదమూ జరగలేదు.

## శంకర నారాయణ (శంకరయ్య), ఆశ్రమవాసి, రాజంపేట

1. నాకు చిన్నప్పటినుండీ ఆస్త్మా ఇబ్బంది ఉంది. ప్రతిరోజు ఒక ఇంజెక్షన్ తీసుకుంటేగాని మామూలుగా ఉండలేను. దానివలన నా

చదువు కూడా సరిగ్గా సాగలేదు.అందువలన 8వ తరగతి వరకే చదివాను. పూర్వాశ్రమంలో కిరాణా షాపు నడుపుతుండేవాడిని. షాప్‌కి వెళ్ళడం, సినిమాలకు వెళ్లడం, మరియు మహాత్ముల దగ్గరకు వెళ్ళడం చేస్తూ ఉండేవాడిని.

నేను 1989-92 వరకు బోంబేస్వామివారి (గణేశపురి శ్రీ నిత్యానందస్వామి శిష్యులు) దగ్గరకి వెళుతుండేవాడిని. బోంబేస్వామివారు సమాధి చెందిన తర్వాత వారిని నా జన్మ తరించేది ఎట్లా స్వామి మీరే మాకు దిక్కు అని ప్రార్థించినప్పుడు బోంబేస్వామివారు దర్గాస్వామిని స్వప్నంలో చూపించి అంతర్ధానము అయ్యారు.

అప్పటికి దర్గాస్వామి గురించి నాకు తెలియదు. తరువాత నెల్లూరు వాస్తవ్యులు స్వామి గురించి చెప్పారు. 1994 ఆగష్టు నుంచి సెప్టెంబరు మధ్యలో దర్గాస్వామి వారి దగ్గరకి వచ్చాను. అప్పుడు రామకృష్ణానందస్వామివార్ల ఆశ్రమంలో (జనశంకర తపోవనం, మహానంది) ఉండాలని అనుకుంటూ దర్గాస్వామి దర్శనానికి వచ్చాను. దర్గాస్వామి వారి దర్శనం చేసుకున్నాను. అప్పుడు దర్గాస్వామి **"నీ స్థానం ఇదేరా, నీవు ఎక్కడికి పోయినా తిరిగి ఇక్కడికే వస్తావు పోరా!"** అని ఆశీర్వదించారు. దర్గాస్వామి దగ్గరకు వచ్చిన తర్వాత నా సంస్కారంలో మార్పు వచ్చింది. సినిమాలకు తిరగడం వంటివి మానుకున్నాను.

2. 1994-1998 వరకు స్వామి దగ్గరకు వస్తూ వెళుతూ ఉండేవాడిని. 1998 లో సాయిబాబా మందిర నిర్మాణం పూర్తి అయ్యింది. అప్పుడు ఒక 10 రోజులు నేను పూజకు సహాయం చేయటానికి అని ఉన్నాను. పదిరోజులు అవగానే స్వామి దగ్గర నుండి సెలవు తీసుకుందామనుకొని వెళ్ళినప్పుడు స్వామి "ఇక్కడినే ఉండిపోరా, నీకు ఏమి కావాలిరా" అనినప్పుడు నా ఆరోగ్య సమస్య(ఆస్మా) గురించి చెప్పాను. మండలం (40) రోజులుంటే నయం చేస్తానని స్వామివారు అన్నారు. ఒకరోజు దాని వలన బాధ భరించలేక స్వామివారి ముందు ఏడ్చేశాను. నా వంక తీక్షణంగా చూసి నాలుగు తిట్టి నా వ్యాధి తనలోకి తీసుకుని కొన్నిరోజులు ఇబ్బంది పడ్డారు. అప్పటినుండి నాకు ఉబ్బసం నుండి పూర్తిగా విముక్తి

కలిగింది. చాలా ఆనందంగా స్వామి సేవ చేసుకుంటున్నాను.

3. నేను ఇంటిలో పెద్దవాడిని, మా నాన్న నా చిన్నవయస్సులోనే కాలం చేసారు. స్వామి దగ్గరకి వచ్చేటప్పటికి(1998) నాకు కిరాణా షాపు, కన్నతల్లిని చూడవలసిన బాధ్యత,పెండ్లికాని తమ్ముడు ఉన్నాడని స్వామికి నా బాధ్యతల గురించి విన్నవించాను. "అన్నీ చక్కబడతాయి లేరా" అని అన్నారు.

1999 సం॥ చివరికల్లా నాకు వ్యాపారం మీద పూర్తిగా వ్యామోహం పోయినది. 2000సం॥లో నా తమ్ముడి వివాహము అయినది. 2001 సం॥లో నా తల్లిగారు కాలము చేసినారు. నేను స్వామి దగ్గర ఉంటే స్వామి నా బాధ్యతలు అన్నీ తీర్చినారు.

4. నా తమ్ముడి భార్య కానుపుకు ముందు ఉమ్మనీరు అంతా బయటకి వెళ్ళిపోయింది. లోపల ఉన్న బిడ్డ సంగతి గురించి మా తమ్ముడు ఎంతో ఆందోళనతో ఉండి దర్గాస్వామికి తన భార్య పరిస్థితి వివరించమని నాకు 11:00 గం॥లకు ఫోను చేశాడు. నేను స్వామివారికి విన్నవించాను. అప్పటినుండీ స్వామివారు నేను కనబడినప్పుడల్లా తిడుతున్నారు. ఇలా మరుసటిరోజు మధ్యాహ్నం 3గం॥ల వరకు తిడుతూనే ఉన్నారు. 3గం॥లప్పుడు మా తమ్ముడి భార్య పేరు చెప్పమని అడిగారు. అప్పుడు స్వామివారు తగ్గుతుందిలేరా అని అన్నారు. ఆరోజు సాయంత్రం నా తమ్ముడు ఫోన్ చేసి తల్లీ, బిడ్డా క్షేమమని చెప్పాడు.

## ఆశ్రమంలో మహనీయుల దర్శన, ఆశీస్సులు:

■ **సాయినాథుడు:** నేను దర్బార్ సాయినాథ్ దేవాలయంలో హారతి ఇచ్చిన తర్వాత తీర్థము ఇస్తున్నాను. చివరగా ఒక ముస్లిం యువకుడు వచ్చాడు. తీర్థమును నిరాకరించి సాయినాథుని విగ్రహం చేత్తో చూపించి తన వైపు చూపించాడు. (తను నేను వేరు కాము అన్నట్లు సంజ్ఞనలతో విగ్రహం వైపు చూపి, చెప్పి వెళ్ళిపోయినాడు) నేను స్వామి వారి దగ్గరకు వెళ్ళి జరిగినది విన్నవించాను. అప్పుడు దర్గాస్వామి "వచ్చినవాడు సాయినాథుడే" అని చెప్పారు.

■ **దర్బార్ అలీషావలీ:** ఒకరోజు ఉదయం 11గం॥లకు టిఫిన్ కోసం ఒక యువకుడు వచ్చి నలుగురికి టిఫిన్ ఉందా అని అడిగాడు. అప్పుడు నేను ఉన్నది అన్నాను. ఆ యువకుడు తన వెంట 20 మందితో లోపలికి వచ్చాడు. ఉన్న పదార్థాలు సరిపోవని చెప్పి ఆ యువకునికి భోజన పదార్థాలు చూపించి వడ్డించమన్నాను. అంతలో లావుగా ధృఢముగా ఉన్న ఒక ముస్లిం వచ్చి మొదట్లో కూర్చున్నాడు. ఆ యువకుడు అంతకుముందే వడ్డించడం ప్రారంభించడం వలన మొదట ఉన్న ముస్లింకు వడ్డించలేదు. అంతేగాక అతని వద్దకు వచ్చేసరికి బేసిన్‌లో పదార్థములు ఏమీ మిగలలేదు. నేను ఆ ముస్లింతో మీరు ఒక గంట తరువాత వస్తే భోజనం దొరుకుతుంది అని చెప్పాను. అప్పుడతను "అందర్ కో దేఖో" అని అన్నాడు. లోపలికి వెళ్ళి బేసిన్‌లో చూస్తే కొద్ది పదార్థము ఉంది. అది తీసుకొని వచ్చి వడ్డించాను. అతను అది తిని వెళ్ళిపోయాడు.

ఆరోజు జరిగిన విషయం స్వామివారికి విన్నవించితే "**వచ్చినవాడు దర్భార్ అలీషావలీ రా ఏమన్నా పెట్టి పంపించావా లేదా?**" అని అడిగారు. ఉన్న కొద్ది పదార్థములు వడ్డించాను అని చెబితే "నీ జన్మ ధన్యమైంది పో" అన్నారు.

■ **దర్బార్ జలీల్ మస్తాన్ బాబా :** నేను భోజనం చేస్తూ ఉన్నప్పుడు ఒక యువకుడు మురికి వస్త్రములతో వచ్చి నా ప్రక్కనే కూర్చుని అన్నం తిన్నాడు. అతడు ఎవరని దర్గాస్వామిని అడిగితే అతడే దర్బార్ జలీల్ మస్తాన్ బాబా అన్నారు.

■ **బ్రహ్మదేవుడు, వెంకటేశ్వరస్వామి:** నేను సాయినాథుని మందిరంలో ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకరికి విష్ణునామాలు, మరియొకరికి త్రిపుండ్రము నుదుటిమీద ఉండి గడ్డముతో ఉన్నాడు. నేను వారితో ఒక ప్రదక్షిణ మాత్రమే గర్భగుడిలో చేయాలి, బయట మాత్రం ఎన్ని ప్రదక్షిణలయినా చేసుకోవచ్చన్నాను. నామాట వినకుండా వారు మూడు ప్రదక్షిణాలు చేసి వెళ్ళారు. నేను వారిని కొంచెము కోప్పడ్డాను. వారు నాతో "నీవు ఇక్కడ పనికిరావని" వెళ్ళిపోయారు.

స్వామి దగ్గరకు వెళ్ళి విన్నవించాను. "అప్పుడు వచ్చిన వాళ్ళు ఎవరనుకున్నావు? సాక్షాత్తు వేంకటేశ్వరుడు మరియు బ్రహ్మ దేవుడురా వాళ్ళు నిన్ను శపించి వెళ్ళిపోయారు" అని అన్నారు.

'స్వామీ ఇందులో నా తప్పేమీ లేదు. నేను మీ ఆజ్ఞ ప్రకారం మాత్రమే ఒక్క ప్రదక్షిణము మాత్రమే గర్భగుడిలో చేయాలి' అని చెప్పాను. స్వామి చెప్పిన పని చేసినందుకు స్వామి నన్ను శాప ప్రభావం నుండి రక్షించినట్లుగా భావిస్తున్నాను.

## చెన్నా దివ్య మోహనరావు, ఏలూరు

1978వ సం॥లో నాకు ఒక ఆపరేషన్ జరిగింది. ఆ రోజు సద్గురు స్వామివారు నాకు కలలో దర్శనమిచ్చి వారి చేతిలోని కర్రతో ఆపరేషన్ జరిగిన చోట రుద్దినట్లనిపించింది. అప్పటినుండీ నాకు ఆపరేషన్‌కు సంబంధించిన నొప్పి ఏమాత్రం లేకుండా పోయింది. జీవితంలో కూడా ఏ సమస్య వచ్చినా స్వామివారిని స్మరించుకొని ప్రార్థిస్తే ఇట్టే పరిష్కారమయ్యేది. స్వామివారికి, అమ్మయ్యగారికి నా సాష్టాంగ నమస్కారాలు.

## డా॥ సంగమ్మ, డా॥ బయారెడ్డి

1996 లో మొదటిసారిగా స్వామిని దర్శించుకొని నా జీవితాన్ని గురించి, నా నాస్తికత్వాన్ని గురించి స్వామికి వివరంగా చెప్తే స్వామి ఓపిగ్గా విని "నాయనా! నీవొకసారి కుటుంబ సమేతంగా షిరిడీ వెళ్ళి బాబాను దర్శించుకో, శుభం జరుగుతుంది" అని ఆశీర్వదించి పంపారు.

1. వారం తరువాత స్వామి సలహా మేరకు కుటుంబ సమేతంగా షిర్డీ వెళ్ళి బాబాను దర్శించుకున్న తర్వాత త్రయంబకేశ్వర్ వెళ్ళాము. అక్కడ అడవి మార్గము ద్వారా కాలి నడకన గోదావరి పుట్టు స్థలము చేరుకున్నాము. అక్కడ కాసేపు విశ్రమించి క్రిందికి వస్తూ మార్గమధ్యములో ఒక చిన్న షాపు దగ్గర కుర్చీలలో కూర్చొని చెరుకు రసము త్రాగి త్రయంబకేశ్వర్ దర్శనానికి వెళ్ళాము. రద్దీ ఎక్కువ లేదు. దైవ దర్శనం సులభంగా అయ్యింది. దర్శనానంతరము ప్రసాదానికై శ్రీమతిని

డబ్బులివ్వమని అడిగితే అసలు హ్యాండ్‌బ్యాగే లేదు. మేము చెరుకు రసం త్రాగిన ప్రదేశంలో కుర్చీలో పెట్టి, వచ్చే సమయంలో మరచిపోయినాము. సాధారణంగా కుటుంబసమేతంగా ఎక్కడకైనా వెళ్ళే సమయాలలో డబ్బు నా శ్రీమతి దగ్గరే ఉంచుతాము ఎందుకంటే ఆమె చాలా జాగ్రత్తగా వుంటుంది. ఆ బ్యాగ్‌లో 30 వేల రూపాయల డబ్బు, పూనా నుండి కడపకు రావడానికి రిటర్న్ జర్నీ టిక్కెట్లు వున్నాయి. నాకు చాలా కోపం వచ్చింది స్వాములపై. ఏమయ్యా! నీవేమో దగ్గరకి రా అని పిల్చినావు. మా వూరి స్వామి కూడా నిన్ను దర్శనం చేసుకో శుభం జరుగుతుందని పంపినారు. మీరిద్దరూ కలసి మా డబ్బు, టిక్కెట్లు పోయేటట్లు చేశారు. ఈ విధంగా మనస్సులో ఆందోళనతో స్వాములనిద్దరినీ నిందిస్తూ బ్యాగ్ కోసం పైకి నడిచి వెళ్తున్నాం. కొంత దూరం పోయేసరికి మాకు ఎదురుగా ఒక పది సంవత్సరాల అబ్బాయి ఒక బ్యాగ్‌ను చేత్తో త్రిప్పుతూ (యే బ్యాగ్ కిస్ కా హై?) యీ బ్యాగ్ ఎవరిదీ? అని బిగ్గరగా అరుస్తూ క్రిందికి వస్తున్నాడు. చూస్తే ఆ బ్యాగ్ మాదే. ఆ అబ్బాయి మా బ్యాగ్ మాకిచ్చి, మేము డబ్బు ఇస్తే నిరాకరించి మళ్ళీ పైకి ఎక్కి వెళ్ళిపోయాడు. అప్పుడర్థమైంది ఆ స్వాముల యొక్క మహత్మ్యమనేది. ఇదే నా ఆధ్యాత్మిక జీవితానికి నాంది.

2. ఒకసారి ఉరుసు రోజున ఆశ్రమంలో బాగా రద్దీగా వుంది. మేము వచ్చేటప్పటికి స్వామికి విపరీతమైన జ్వరం వుంది. చేయి పట్టుకొని చూస్తే 104 ఫారన్‌హీట్ డిగ్రీల పైనే వుందనిపించింది. రాయచోటికి పోయి మందులు తీసుకు వస్తానని స్వామితో అన్నాను. అందుకు స్వామి "మందులా - ఊ - మందులా - మందులిస్తావా! నాయనా! లోపలికి పోయి భోజనం చేసి రండి తర్వాత యిస్తురు" అని అన్నారు. భోంచేసి వచ్చిన తర్వాత చూస్తే అసలా జ్వరమే లేదు. మాములుగా వున్నారు. అంతా దైవలీల.

3. మరియొకసారి స్వామికి కడుపు నొప్పి, చీముబేదుల వ్యాధి వచ్చింది. మందులిస్తామన్నాము. "మందులొద్దు నాయనా! మీ యిద్దరి

చేతులను నా కడుపుపై పెట్టి లింగాష్టకము పాడమ"న్నారు. అలాగే పాడినాము. స్వామికి నయమైంది.

4. ఒకసారి మా శ్రీమతికి చికెన్‌గున్యా జ్వరం వచ్చి తీవ్రంగా బాధపడుతూ పడక నుంచి లేవలేని స్థితిలో వుంది. రెండురోజుల్లో ఆమె లండన్‌కు పోవాలి. అమ్మాయి అక్కడే వుంది. టిక్కెట్టు కూడా బుక్ చేసి వుంది. అంతే కాకుండా మరుసటిరోజున బాబా మందిర వార్షికోత్సవము వుంది. హోమము వద్ద కూర్చోవాలి. ఈ విషయం స్వామికి విన్నవించడం జరిగింది. స్వామి కాసేపు మౌనం వహించి తర్వాత "నాయనా! నా బిడ్డ నిరభ్యంతరంగా లండన్‌కు పోతుంది. హోమము దగ్గర కూడా పూజలు చేస్తుంది" అని చెప్పి దీవించినారు. అదే విధంగా మరునాడు ఒంటరిగా ఎవరి సహాయం లేకుండా నడచి వచ్చి హోమము దగ్గర పూజలు చేసి మరుసటి దినం లండన్ పోయింది.

## స్వరూపగుప్తా, రాయచోటి

1. నేను, నా ప్రాణ మిత్రుడు ప్రసాదరెడ్డి, మా ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ నరసింహ గుప్తా, యింకొక రిటైర్డు టీచర్ నలుగురమూ తిరుపతిలో ఒక వివాహ కార్యక్రమం ముగించుకొని రాయచోటికి వెళ్ళడానికి పీలేరుకు వచ్చాము. అప్పుడు సమయం రాత్రి 11 గం॥లు. గంటసేపు వేచి చూచినా యెటువంటి వాహనమూ రాలేదు. నా మిత్రుడు ప్రసాదరెడ్డితో 'మనం త్వరగా ఇంటికి వెళ్ళాలి కానీ ఏ వాహనం కూడా రాలేదు. నేను సద్గురు దర్గా మాతను ప్రార్థిస్తాను దాని ఫలితాన్ని మనం చూస్తాము' అని చెప్పి సద్గురు దర్గామాతను ప్రార్థించాను. 15 నిమిషాల తర్వాత ఒక ఇండికా కారు సర్రున వచ్చి మా ముందు నిలబడింది. డ్రైవర్ మాత్రమే వున్నాడు. 'సార్ కారు రాయచోటికి పోతా వుంది మీరు రండి' అని అతను మమ్మల్ని ఎక్కించుకొని రాయచోటిలో దింపాడు. అతనితో ఏ పరిచయమూ లేదు. కానీ అతనికి మేము బాగా తెలుసని చెప్పాడు. రాయచోటిలో కారు దిగిన తర్వాత డబ్బులు ఇవ్వబోతే నిరాకరించాడు. పైగా అతను 'మీ దగ్గర ఎలా డబ్బులు తీసుకుంటాను.

మీరు అందించే సేవలు నాకు బాగా తెలుసు. శ్రీ నరసింహ గుప్తాగారు బాగా తెలుసు. మీ దగ్గర నేను డబ్బు తీసుకోను' అని చెప్పి వెంటనే వెళ్ళిపోయాడు. ఈ దినం వరకు ఆలోచించినా అతనెవరో మాకు గుర్తు రాలేదు. తరువాత మాకు ఎప్పుడూ కనపడలేదు.

సరిగా 3 నెలల తర్వాత శ్రీ సద్గురు దర్గాస్వామిగారు ఉచిత నీటి సరఫరా కార్యక్రమంలో దర్శన భాగ్యం కలిగించి మాటలలో "ఏరా! ఆనాడు నీవు మనస్ఫూర్తిగా నన్ను ప్రార్థించినందున నీకు పీలేరులో కారుని పంపలేదా! ఆర్తితో నన్ను కోరితే తప్పక ఏదో రూపంలో నేను సహకరిస్తాను కదా" అని అన్నారు. ఆశ్చర్యంలో మునిగిపోవడం నా వంతయింది. అమ్మయ్యను ప్రార్థిస్తే స్వామి కారు పంపటం బట్టి స్వామికి, అమ్మయ్యకు బేధం లేదని తెలుస్తోంది.

2. మా తల్లిగారి అస్థికలను నిమజ్జనం చేయటానికి మా కుటుంబ సమేతంగా కాశీకి వెళ్ళాను. అక్కడ నుండి గయ వెళ్ళి తిరిగి కాశీ రావాలి. ట్రైను వచ్చింది కానీ నిలబడుటకు కొంచెం స్థలం కూడా లేదు. యింతమందితో ఎలా? అందరూ క్రొత్తవారే ఎలా అని చెప్పి సద్గురు దర్గాస్వామిగారిని, మాతాశ్రీ గారిని ధ్యానంలో నిలిపాను. ఆశ్చర్యం మా వద్దకు ఒక రైల్వే కూలి వచ్చాడు. సార్ మీరు కాశీ వెళ్ళాలా? ఇలా ఇంతమందికి సీటు దొరకడం కష్టం కదా. నాతో పాటు రండి అని టిక్కెట్టు కలెక్టర్ దగ్గరకి తీసుకొని వెళ్ళి వీరు నాకు బాగా తెలిసినవారు, స్త్రీలు వున్నారు. వీరికి కాశీ వెళ్ళేందుకు సీట్లు ఇవ్వమని చెప్పి అందరికీ సుఖప్రయాణం అయ్యేలా సీట్లు యిప్పించి మా నుండి ఏమీ తీసుకోకుండా వెళ్ళిపోయాడు. మా అన్నదమ్ములం ముగ్గురం యిది శ్రీ దర్గాస్వామివారి కృపాకటాక్షమే అని కృతజ్ఞతలు అర్పించాము.

3. నా కుమార్తె ఒకరోజు ఫోను చేసి నా మనుమడి ఆరోగ్యం కుదుటబడాలంటే హైదరాబాదులోని పెద్ద ఆసుపత్రిలో కడుపుకు ఆపరేషను చేయించాలని చెప్పింది. మేము సకుటుంబముగా స్వామివారి వద్దకి వెళ్ళి విషయం వివరించి చెప్పాము. కొద్దిసేపు ధ్యానంలో వున్న స్వామీజీ "ఒరే! మీ అమ్మే కనుక వుండి వుంటే వీపుపై మర్దన చేస్తే ఈ

ఆపరేషన్లు చేయాల్సిన అవసరం లేదు. నీవు హైదరాబాదు వెళ్ళి డాక్టరు చెప్పినట్లు చెయ్యి, ఆపరేషన్‌కు పోవలసిన అవసరం వుండదు, జయం కలుగుతుంది'' అని చెప్పి బాబును దండంతో నిమిరి ఆశీర్వదించి మమ్ములను పంపారు. నా చిన్ననాటి స్నేహితుడు డా॥ చంద్రమౌళిగారి, ప్రముఖ ఆసుపత్రిలో తెలిసిన డా॥ నరేంద్రగారి సూచనల మేరకు అన్ని ఆరోగ్య పరీక్షలు జరిపించిన డాక్టరుగారు ఈ అబ్బాయికి ఆపరేషన్ అవసరం లేదు, 3 నెలలు మందులు వాడండి తర్వాత చెప్తానని చెప్పారు. 3 నెలల తర్వాత వెళ్ళగా మరో 6 నెలలకి మందుల డోసు తగ్గించి పంపించారు. అబ్బాయి ఆరోగ్యం చాలామటుకు మెరుగయ్యింది. తర్వాత వెళ్ళగా ఇంకాస్త మందులు తగ్గించి ఒక సంవత్సరం వాడమన్నారు. ఆరోగ్యంలో ఏ ఇబ్బందీ వుండదని చెప్పారు. ఇప్పుడు బాబు ఆనందంగా వున్నాడు. సద్గురు స్వామీజీ కృపకు మేము ఏ విధంగానూ ఋణం తీర్చుకోలేను. సద్గురు మాతాజీ ఆశీస్సులతో ప్రజలకు సేవలందించడం ద్వారా స్వామికృపకు మరింత పాత్రులమవ్వాలని కోరుకుంటున్నాను.

4. నా పెద్ద కుమార్తె అమెరికాలో వున్నది. తనకు రెండవ కాన్పు జరిపించుటకై నా భార్య అక్కడకు వెళ్ళాలని అనుమతినివ్వమని, అక్కడ ఏ ఇబ్బందులూ కలగకుండా క్షేమంగా చేర్చమని ప్రార్థించింది. స్వామీజీ ఆశీర్వదించి "నేను నీ వెంటనే అక్కడికి వస్తాను, వెళ్ళు''అని ధైర్యమిచ్చారు. ఆమె ప్రయాణంలో ఫ్రాంకుఫర్టు విమానాశ్రయంలో ఒక సూట్‌కేసు మిస్ అయ్యి అమెరికాలో ఆమెకు అందలేదు. ఈ విషయాన్ని తెలుసుకుని స్వామితో చెప్పాను. స్వామి "మీ వస్తువులు యెక్కడికీ పోవు. ఇంక కొద్దిసేపటికి అది జర్మనీ నుండి అక్కడికి చేరుతుంది. 24గంటలలో అది మీ ఇంటిలో వుంటుంది. ఈ విషయం వారికి చెప్పు''మన్నారు. నేను ఫోనులో వారికి ఈ విషయం చెప్పాను. సరిగా 18 గంటల తర్వాత మా అల్లునికి విమానాశ్రయం నుండి ఫోను వచ్చింది మీ వస్తువులు తీసుకెళ్ళమని. స్వామి చెప్పినట్లు 24గంటలలో క్షేమంగా సూట్‌కేసు ఇంటికి చేరింది ఏ వస్తువులు పోకుండా. **స్వామివారిని నమ్మినవారికి ఎటువంటి ఇబ్బందీ కలుగదు.**

5. అమెరికాలోని మా అమ్మాయి తనకు స్కానింగ్ అయ్యిందని, బహుశా అమ్మాయి కలుగవచ్చని ఫోనులో చెప్పింది. ఈ విషయం స్వామికి చెపితే స్వామి "చాలా సంతోషం నాయనా! అబ్బాయి పుడతాడని, ఏ కష్టం ఉండదని నేను ముందుగానే చెప్పాను కదా అని" అన్నారు. స్వామీ అక్కడ అమ్మాయి అని చెప్పారు అని అంటే "కొద్దికాలం వేచి చూడండి"అన్నారు స్వామి. 3 నెలల తర్వాత రిజల్టు వస్తే దాంట్లో అబ్బాయి అని నిర్ధారణ చేశారు. ఆశ్చర్యం! ఆనందం!! స్వామివారి వాక్కు ప్రకారం భగవంతుడు ప్రసాదించింది అబ్బాయినే.

6. నా బిడ్డ కాన్పుకై అమెరికా వెళ్ళిన నా శ్రీమతి 'ఇండియా వచ్చేటప్పుడు కలిసి వద్దాము, మీరు మీ మనుమడితో ఆడుకోవడానికి అమెరికా రండి' అని నాతో అన్నది. ఇక్కడ కొన్ని పనులు సర్దుబాటు చేసిన తర్వాత అక్కడికి వెళ్ళాలని నా తమ్ముళ్ళతో రాత్రి 10గం॥లకి చెప్పాను. మరుసటి దినం ఉదయం శ్రీ సద్గురు స్వామీజీగారు రాయచోటి బస్టాండు వద్ద చలివేంద్రం ప్రారంభించడానికి వచ్చారు. కారులో దిగుతున్న స్వామీజీ వద్దకు వెళ్ళి కారు డోరును తెరిచి స్వామివారికి నమస్కరించాను. "ఏరా! నా బిడ్డ వద్దకు ఎప్పుడు ప్రయాణం, రమ్మని కోరింది కదా త్వరగా బయలుదేరి వెళ్ళు! జయం కలుగుతుందని" స్వామి చెప్పారు. ఆశ్చర్యపోయి చూస్తున్న నన్ను నా భుజంపైన తట్టి "మా పాప పిలిచింది కదా బయలుదేరు" అన్నారు. నా మనస్సులోని కోరికను స్వామీజీ వాక్కు ద్వారా విని అవాక్కయ్యాము నేను, మా కుటుంబ సభ్యులందరూ! ఈ విషయం విన్న అమెరికాలోని నా భార్య, బిడ్డలు స్వామీజీ ఆశీస్సులతో ఆనందభరితులయ్యారు.

## కృష్ణారెడ్డిగారు, నెల్లూరు

నా కొడుకుకి 10వ సం॥లో ఫిట్సు వచ్చాయి. నెల్లూరు డాక్టరు చెన్నైలో డాక్టరు రవి దగ్గర చూపించమన్నారని చెన్నైకి వెళ్ళితే రవిగారు అమెరికా వెళ్ళి వున్నారని, వాళ్ళ నాన్నగారు డా॥ రాంమూర్తిగార్ని కలిస్తే మంచిదే కానీ ఆయన అపాయింట్‌మెంటు లేకుండా చూడరని అందువలన ఇంకొక డాక్టరు (శ్రీధర్)ని కలవమని అడ్రస్సు చెప్పారు. అక్కడకి వెళ్ళితే

ఆయన కూడా లేరని తెలిసి ఏమి చేయాలా అనే సందిగ్ధములో డా॥ శ్రీధర్‌గారి ఆస్పత్రిలో కూర్చొని స్వామిని తలుచుకుంటున్నాను. ఇంతలో ఇద్దరు వ్యక్తులు పంచె కట్టుకుని, తువ్వాలు పైన వేసుకొని నా దగ్గరకు వచ్చి ఏ వూరు అని అడిగారు. మాది నెల్లూరు అని ఎందుకొచ్చామో, ఏమి జరిగిందో చెప్పాను వారిద్దరికి. వారు బాగా తెలిసినట్లు “రాంమూర్తి వుంటాడు, పోండి” అని చెప్పారు. ఆటో మాట్లాడిన తర్వాత వారు కూడా వస్తారనేసరికి ఆటోలో ముగ్గురు కంటే ఎక్కువ మందిమి వెళ్ళలేము కదా అని అనుకుంటున్నాను. వారు “మేము తర్వాత వస్తాములే” అన్నారు. మేము వెళ్తే ‘అపాయింట్‌మెంటు లేకుండా రాంమూర్తిగార్ని కలవటం కష్టం, అందువలన చిన్న డాక్టరుని కలవండి’ అని నర్సులు చెప్పారు. కానీ స్వామి దయ వలన రాంమూర్తిగారు పిల్లవాడ్ని పరీక్ష చేసి ఉదయం ఒక మాత్ర, సాయంత్రం ఒక మాత్ర 3 సంవత్సరాలు క్రమం తప్పకుండా వెయ్యాలి. ఎప్పుడైనా మానేస్తే మరలా 3 సంవత్సరాలు వేసుకోవాల్సి వస్తుంది అన్నారు. ఒక మాత్ర 50పైసలు మాత్రమే. నెల్లూరు వచ్చిన పది రోజులకి నా భార్యను, నా పిల్లవాడిని మొదటిసారి దర్గాస్వామి దగ్గరకి తీసుకువెళ్ళాను. అందువలన నా భార్యకు స్వామియొక్క గొప్పతనం తెలియదు. స్వామి దగ్గరకెళ్ళితే స్వామి నాతో “ఈ మధ్య రాలేదు. ఎక్కడెక్కడికి వెళ్ళావు” అని అడిగేసరికి విషయం మొత్తం చెపుతుంటే స్వామి నాతో “చెన్నైలో నీ దగ్గరకి ఎవరు వచ్చారు?” అని అడిగితే నేను ఎవరూ రాలేదనని చెప్పాను. స్వామి గట్టిగా అడిగేసరికి ఇద్దరు వ్యక్తులు వచ్చారని చెప్పాను. స్వామి సంతోషంగా “డాక్టరు ఏమి వ్రాసిచ్చాడు” అని అడిగితే రోజుకు రెండు మాత్రలు 3 సంవత్సరాలు వేసుకోమని చెప్పారని స్వామికి చెప్పాను. స్వామి వెంటనే “ఆ మాత్రలు తీసుకుపోయి ఆ చెరువులో పారెయ్యి పోరా అని, అంత దూరం ఎందుకురా పోయినావు. నాకాడకొస్తే దెబ్బకి ఎగురకొట్టనా దాన్ని” అని చెప్తూ “నీకు 700 రూపాయలు ఖర్చు అయ్యింది కదా” అని నాకు అయ్యిన ఖర్చును చెప్పారు స్వామి.

ఆ రోజు రాత్రి మేము వెనుక రూములో వున్నాము. రాత్రికి మందు

వెయ్యాలని మా ఆవిడ పట్టుబట్టింది. స్వామి అక్కర్లేదు అన్నారు కాబట్టి నేను వద్దని చెపుతున్నా వినట్లేదు. మా మాటలు స్వామి వినటానికి ఆస్కారమే లేదు. కానీ మా రూము తలుపు దగ్గరకొచ్చి "మాత్ర వద్దంటే వేస్తున్నారు, ఎందుకని? మీకు నమ్మకం లేకపోతే వెళ్ళిపోండి" అని అరిచారు. గమ్మున నిద్రపోయాము. నా భార్యకి మనస్సులో బాధగానే వుంది.

తర్వాత రోజు స్వామి దర్గాల దగ్గర వున్నప్పుడు మమ్మల్ని పిలిచి ఏమి కావాలని అడిగారు. నా భార్యకి వెన్నుపూసలో నొప్పి గురించి చెపితే స్వామి దండంతో చూసి "అమ్మా! నీవు పిల్లలు పుట్టకుండా లూపు వేసుకున్నావు. దాని వలనే నీకు నొప్పులు. లూపు తీసేస్తే బాగుంటావు" అని చెప్పేసరికి స్వామి సర్వజ్ఞత్వము చూసి నా భార్య స్వామి కాళ్ళమీద పడింది. నిజానికి 10సం॥ల క్రితం లూపు వేయించుకున్నది ఇంకనూ తీయలేదు. సామాన్యంగా ప్రతి 3 సం॥లకి తియ్యాలి. ఈ విషయము స్వామికి తెలియటమే అత్యద్భుతము. ఈ సన్నివేశముతో నా భార్యకి స్వామి మీద విశ్వాసం ఏర్పడినది.

తర్వాత 3 నెలలకి మరలా నెల్లూరులో మా అబ్బాయికి ఫిట్సు వచ్చాయి. పిల్లవాడిని తీసుకొని స్వామి దగ్గరకి వచ్చేసరికి మా కోసమే ఎదురు చూస్తునట్లుగా స్వామి చూస్తున్నారు. మమ్మల్ని చూడగానే స్వామి "మరలా వచ్చిందా?" అని అడిగి ఔననగానే మా అబ్బాయికేసి 5 నిమిషాలపాటు తదేకంగా చూసి "పోయిందిరా పో" అన్నాడు. ఎండుద్రాక్ష ప్రసాదం ఇచ్చి తినమన్నాడు. ఆ తర్వాత నుండీ మరలా ఫిట్స్ రాలేదు. ప్రస్తుతం మా పిల్లవాడు ఇంజనీరింగ్ చేసి మస్కట్‌లో వున్నాడు.

## ఆదర్ష్, బెంగుళూరు

మా నాన్నగారు ఎవరికైనా చేతనైన సహాయం చేస్తారు. బాగా తెలిసినవారు ఎంతో నమ్మకంతో వారి ఇల్లు కట్టించమని, వారింట్లో జరిగే పెళ్ళిళ్ళకి పెళ్ళి పెద్దగా వ్యవహరించమని అడిగేవారు. మా నాన్నగారు అలానే చేసేవారు. మా నాన్నగారికి స్వాములంటే ఎక్కువ నమ్మకం లేదు.

కానీ మేము దర్గాస్వామి దగ్గరకి వెళ్తుంటే వెళ్ళద్దని అడ్డు చెప్పేవారు కాదు. పద్ధతి ప్రకారం పండుగలకు పూజలు చేసేవారు. మా అమ్మ దర్గాలకి వెళ్ళినప్పుడు ఒకసారి స్వామి "తనంతతానే మీ ఆయన ఇక్కడకొచ్చి దర్శనం చేసుకుంటాడని" చెప్పారు. మా నాన్న వైఖరి తెలిసిన మేము మాత్రం అలా కలలో కూడా జరగదనుకున్నాము.

ఒకసారి అమర్‌నాథ్ యాత్రకి వెళ్ళితే దారిలో బలిష్టంగా వున్న పూజారికి మా నాన్న, వారి స్నేహితులు కలసి కొంచెం సహాయం చేసారు. ఆయన ఒకచోట కూర్చుని మా నాన్నావారిని వెళ్ళమని చెప్పారు, చాలా చిత్రంగా రెండుసార్లు మా నాన్నావారి కంటే ముందర ఇంకొక చోట కూర్చుని కనిపించారు. ఆయనెవరో మహనీయుడని అనుకున్నారు.

అమర్‌నాథ్ యాత్ర చేసిన తర్వాత మా నాన్నకెందుకో తనంతతానే స్వామి దగ్గరకి వెళ్ళాలనిపించి ఒక గురువారం రోజు స్వామి దగ్గరకెళ్ళేసరికి స్వామి దర్గాలకు అభిషేకం చేస్తున్నారు. అభిషేకం అయిన తర్వాత దర్గాలకు వస్త్రాలు కప్పుతూ మా నాన్నగారిని పిలిచి కప్పమన్నారు. స్వామి ప్రక్కన కూర్చుని కప్పుతున్నప్పుడు స్వామి తనలో తాను "నీవు అమర్‌నాథ్ వెళ్ళావు. చాలా దూరం ప్రయాణం చేశావు. నేను నీకు తోడుగా వచ్చాను. పూజారిగా ఒకచోట కూర్చున్నవాడ్ని రెండుచోట్ల మీ కంటే ముందర వచ్చి కూర్చున్నాను. ఇవాళ నన్ను గుర్తుపట్టలేదా?" అని మాట్లాడుకుంటున్నారు. తర్వాత కానీ మా నాన్నకు స్వామి తనలో తాను మాట్లాడుకున్నదీ, అమర్‌నాథ్ యాత్రలో జరిగిన అనుభవం సమన్వయపడ్డాయి. మా నాన్నగారు చెప్పకుండానే స్వామి అంత స్పష్టంగా చెప్పగలిగారు అంటే స్వామి చాలా గొప్ప మహనీయులని తెలుసుకుని స్వామి దర్శనం చేసుకుంటుండేవారు.

## ఎన్. జానకి, మద్రాస్

దర్గాస్వామివారి దగ్గరకు మొదటిసారిగా వెళ్ళి దర్శనం చేసుకోమన్నది, మాకు ముందుగా తెలియజేసినది, గొలగమూడి శ్రీ పెసల సుబ్బరామయ్య మాస్టారుగారు.

1. 2009లో హైదరాబాదు నుండి చెన్నైకి షిఫ్టు అయ్యాము. మాకు చెన్నైలో బాగా దగ్గరి వారు ఎవరూ లేరు కనుక మావారు చెన్నైలో చాలా చోట్ల ఇళ్ళు గురించి తిరిగారు. ఒక్కటి కూడా దొరకలేదు. తరువాత భగవంతుని కృప వలన ఇద్దరు గురు బంధువులు రెండు ఇళ్ళు చూపారు. మావారు దర్గాస్వామివారి దగ్గరకి పోయి ఈ రెండు ఇళ్ళ గురించి చెపితే వాటిలో ఒకదాన్ని స్వామి ఓ.కె. చేస్తూ "నువ్వు ఇంట్లో దిగే ముందు గోవు పాదం పెట్టించు" అని అన్నారు. తర్వాత ఇంట్లో దిగే ముందు ఆవు గురించి పరిచయమయిన ఒక ఆవిడ్ని అడిగితే 'బాబూ! మేము ఆవుని చూసే చాలా సంవత్సరాలు అయ్యింది. ఇప్పుడు ఈ సమయంలో నీకెట్లా కుదురుతుంది' అని అన్నారు. స్వామివారు చెప్పారు కాబట్టి ప్రయత్నం చేయటం నా ధర్మం, ఆవు దొరకటం, దొరకకపోవటం స్వామి ఇష్టం అని మావారు ఇంటి మెయిన్ గేటు దగ్గరకి వచ్చేసరికి ఒక ఆవు కనపడింది. దాని వెనకాలే దాని దూడ కూడా వుంది. అప్పుడు టైము రాత్రి 11 గంటలు. మావారు 'అరె! ఈ సమయంలో ఆవు కనిపించటమేమిటి' అని అనుకుని పరిగెత్తుకుని పోయి గేటు బయటకొచ్చేసరికి ఆవు యజమాని సైకిలు మీద కర్ర పట్టుకొని కనిపించాడు. వెళ్ళి అతనితో మాట్లాడి రేపు తెల్లవారుఝామున 3-4గంటల లోపల మాకు గృహప్రవేశ ముహూర్తం వుంది. నువ్వు ఆ సమయంలో ఆవును తీసుకురాగలవా అంటే, తెస్తాను సార్ అని ఫోను నెంబరు కూడా ఇచ్చి వెళ్ళాడు. మాటల సందర్భంలో ఆవు యజమాని ద్వారా ఆవు ఆ రోజు మేతకు వెళ్ళి తప్పిపోయి సాయంత్రం 5గంటలకు తిరిగి ఇంటికి రావల్సింది రాలేదని ఆ ఆవు యజమాని దానిని వెతకటానికి పోయి ఆవు కనిపించిన తర్వాత దూడతో సహా ఇంటికి తీసుకొని పోతూ వుండగా ఇలా ఇప్పుడు మాకు కనిపించినది అని తెలిసినది. ఇది కాకతాళీయం అనుకోవడానికి ఒక శాతం ఆస్కారం కూడా లేదు. ఎందుకంటే రాత్రి 11 గంటలకి ఆవు వెళ్ళడమేమిటి? అది కూడా 6 అడుగుల వెడల్పు గల గేటులో వెళ్ళుతున్న ఆవు అతని కంటికి కనిపించటమేమిటి? మరుసటి రోజు ఉదయం మా కంటే ముందే అతను ఆవును, దూడను తీసుకు వచ్చాడు. ఆవు ఇంట్లోకి వచ్చిన తర్వాత

ప్రతి గదిలోకి వచ్చినది. లోపలకి వచ్చిన తర్వాత ఆవు పంచితం కూడా పోసింది. ఆవు తిరిగి వెళ్ళటానికి ఇష్టపడలేదు. చాలాసేపు అతను అదిలించినా వెళ్ళకపోయేసరికి దూడను ముందు బయటకు తెచ్చి అదిలించినా ఆవు కదలలేదు. చాలాసేపటి తర్వాత ఆవు యజమాని నెమ్మదిగా అదిలించగా బయటకు వెళ్ళింది. సాధారణంగా దూడను ఎవరైనా తీసుకుపోతుంటే ఆవు అసలు ఆగనే ఆగదు కదా! అయినా ఇక్కడ ఇలా జరిగింది అంటే ఇది స్వామికృప కాక మరేమిటి?

ఈ లీలను బట్టీ **స్వామి ఏమి చెప్పినా అది జరుగుతుందనే నమ్మకంతో స్వామి చెప్పింది ఎంతటి కష్టమైనా చేయటానికి ప్రయత్నిస్తే స్వామే అన్నీ చేయిస్తారని తెలుస్తోంది.**

2. ఒకరోజు రాత్రి దర్గాస్వామివారి దర్శనానికి మావారు (వేణుగోపాల్ గారు) వెళతానని బయలుదేరారు. నాకు అప్పటికే బాగా జ్వరం లాగా వుంది. మా వారు ఊరు వెళ్ళితే ఇంట్లో నేను, మాబాబు (8 సం॥లు) మాత్రం వుంటాము. కానీ నాకు ఎందుకో ఆయనను వెళ్ళవద్దు అని చెప్పాలనిపించలేదు. స్వామివారి దగ్గరకే కదా అని అనుకున్నాను. ఆ రోజు ఉదయాన్నే నాకు ఒక కల వచ్చింది. నేను ఎప్పుడు గొలగమూడికి పోయినా నెల్లూరు ఆర్.టి.సి. బస్టాండు దగ్గరగా వున్న హెూటల్‌లో భోజనం చేసి నిల్చుంటాను. ఆ తరువాత ఆటో లేదా బస్ ఎక్కి గొలగమూడి చేరుకుంటాను. ఆ కలలో కూడ నేను అలానే నిలబడి ఉన్నాను. వెంటనే ఒక కారు వచ్చి ఆగింది. దాని ముందు సీటులో డ్రైవరు మాత్రమే ఉండి వెనుక సీటులో స్కూలు పిల్లలు ఉన్నారు. వెనుక డోరు తీసి కూర్చోండి అన్నారు. నేను, మా బాబు ఎక్కి కూర్చున్నాము. నేను కారు ఎక్కడకి వెళుతోంది అని అడగగానే దర్గాస్వామి దగ్గరకు అని చెప్పారు. కారు బయలుదేరింది. బయట వర్షం పడి కొద్దిగా బురద, రోడ్డంతా గతుకులు, ఇసుక బాగా ఎక్కువగా వేసి చెదురుగా వుంది. రోడ్డంతా ఇలా వుంటే ఎలా ఇసుకలో మేము ఈ సామాను మోసుకొని నడవగలుగుతాము, అసలు ముందుకు పోవటం చాలా కష్టం, ఈ కారులో హాయిగా ఏ కష్టం లేకుండా వెళ్ళిపోతున్నాము, ఈ డ్రైవరు రూపంలో స్వామివారే మమ్ములను

తీసుకుపోతున్నారని అలా అనుకున్నాను. తర్వాత నిద్ర నుండి తెలివి వచ్చింది. అది కల అని తెలుసుకున్నాను. నాకు జ్వరం వదిలేసినట్లుగా పూర్తిగా ఒళ్ళంతా విపరీతంగా చెమటలు పట్టింది. అది మాములుగా జరిగింది అని నేను అనుకోకుండా నాకు ఎప్పుడూ బాగా జ్వరమొస్తే నోటి దగ్గర పై పెదవి మీద చర్మం చిన్న పొక్కులు ఏర్పడి చిట్లి పోతుంది. ఆ రోజు మధ్యాహ్నంలోగా చర్మం చిట్లి పోయినది. అంటే **మావారిని దర్గాస్వామి దగ్గరకి వెళుతుంటే వెళ్ళద్దు అని చెప్పనందుకు స్వామి కరుణించి నా జ్వరాన్ని తగ్గించారు.**

3. 2010 సంవత్సరంలో ఒకసారి స్వామివారి దర్శనానికి మా కుటుంబము బయలుదేరాము. కడపలో దిగి పాత బస్టాండులో నేను బాత్రూముకు పోవలసి వచ్చింది. నేను చాలా తొందరగా నడుస్తున్నాను. సడెన్‌గా ఒక బైక్ ప్రక్కనుండి నన్ను గుద్దటం జరిగింది. నేను క్రింద పడిపోయాను. వెంటనే అతడిని గట్టిగా తిట్టాలనుకున్నాను. **కానీ స్వామివారి దగ్గరకి వెళుతున్నాము కదా అతనితో తగవు పెట్టుకుంటే మనస్సంతా సరిగా వుండదు** అని స్ఫురించి, కోపంగా అతడిని వెళ్ళిపొమ్మన్నాను. నా కాలికి ఆ బైక్ గట్టిగా తగలటం వలన కొద్దిగా రాసినట్లయింది. కాలి వేలికి కొద్దిగా రక్తం వచ్చింది. తరువాత స్వామివారి దగ్గరకు చేరుకున్నాము. అక్కడ దర్గాల చుట్టూ ప్రదక్షిణలు అన్నీ మాములుగా చేసుకున్నాను. అదే రోజు సాయంత్రం అక్కడ నుండి వయా రాయచోటి, తిరుపతి మీదుగా ఆలస్యంగా రాత్రికి చెన్నైకి చేరుకున్నాము. ఇంటికి వచ్చిన తర్వాత కాలు చూసుకుంటే అది మోకాలి దాకా బాగా లావుగా వాచిపోయినది. బైకు తగిలిన దగ్గర రక్తం గడ్డ కట్టిపోయినది. అప్పుడు కొద్దిగా నొప్పి అనిపించి 2 రోజుల వరకూ నొప్పి వుండి ఏ మందులూ లేకుండా దానంతటదే తగ్గిపోయినది. **సాధారణంగా అయితే 1, 2 నెలలు నేను బెడ్ రెస్టు తీసుకోవలసిన దెబ్బ. కానీ ఒక ఇంజక్షను కూడా లేకుండా ఎక్కువ మందులు తీసుకోకుండా తగ్గిపోయింది.** కానీ మచ్చ మాత్రం 6 మాసాలైనా ఇంకా వుంది. ఇది జరిగిన తర్వాత వారం రోజులకి నేను ఉదయాన్నే బాత్రూములో జారి

పడిపోయాను. ఆ దెబ్బ దర్గాస్వామి దగ్గరకి వెళ్ళేటప్పుడు తగిలిన దెబ్బ కంటే చాలా చిన్నది. అప్పుడు మాత్రం బెడ్ మీద రెండు రోజులు పూర్తి రెస్టు తీసుకున్నాను. తర్వాత కూడా అది నెల రోజుల దాకా నొప్పి వుండి తగ్గింది. ఇప్పటికీ ఎక్కువగా నడిచినా ఆ నొప్పి తెలుస్తుంది. **అంతకుముందు స్వామిదర్శనానికి వెళ్ళినప్పుడు అంత పెద్దగా తగిలినా ఏ మందులూ లేకుండా తగ్గిపోయినది. రెండవది చాలా చిన్నగా తగిలినా విపరీతంగా బాధపడవలసి వచ్చినది. నా మనస్సుకు మాత్రం ఇది ఖచ్చితంగా స్వామివారి మహిమ అని అనిపించినది.** ఈ విధంగా స్వామి దర్శనానికి వెళుతుంటే పెద్ద ప్రమాదం జరగవలసి వుంటే చిన్న గాయంతో ఏ మందులూ వాడకుండా తగ్గించి నా కర్మను నివారించారు అని విశ్వసిస్తున్నాను.

## రాజీవ్, హైదరాబాదు

1. గత 15 సం॥లలో ఎప్పుడు దర్గాలకి వెళ్ళినా ప్రత్యేకంగా ఏదో ఒక అనుభవమయ్యేది. స్వామి తన దర్శనం కోసం వచ్చే భక్తుల ప్రయాణాలు జాగ్రత్తగా, సుఖవంతంగా జరిగేటట్లు చూసేవారని నా అనుభవము.

మేము ఎప్పుడు దర్గాలకి వచ్చి వెళ్ళేటప్పుడు కడప నుండి హైదరాబాద్‌కి వెళతాము. తిరుగు ప్రయాణపు బస్సు టిక్కెట్లు రిజర్వు చేయకపోయినా మాకు టిక్కెట్లు తేలికగా దొరికేవి. ఒకరోజు సాయంత్రం 5:30కి వెళదామని స్వామిని సెలవు అడిగాను. సామాన్యంగా వెళ్ళమనే స్వామి ఆ రోజు ఆరతి తర్వాత గోవిందనామాలు చెప్పి వెళ్ళమన్నారు. అలానే గోవిందనామాలు చేసి (రాత్రి 7:15కి) రామాపురం దగ్గరకి వచ్చేసరికి తెలిసిన విషయమేమంటే గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో ఒక పెద్ద వాహనం అడ్డంగా పడిపోయి ట్రాఫిక్ జామ్ అయ్యిందనీ, రాయచోటి నుండి కడపకి బస్సులు తిరగట్లేదని తెలిసింది. ఇంతలో ఒక మోటారు బైకుమీద ఒక వ్యక్తి వచ్చి కడపకు వెళ్ళాలా అని అడిగాడు. ఆశ్చర్యంతో స్వామికి కృతజ్ఞతలు చెప్పుకొని బైకు ఎక్కాను. ఒక పెద్ద పెట్రోలు ట్యాంకరు అడ్డంగా పడిపోయి 2, 3 కి.మీ. ట్రాఫిక్ జామ్ అయ్యింది. అప్పటికే

క్రేన్లు, పోలీసులు వుండటం చూసి సుమారు 3,4 గంటల క్రితం అలా జరిగి వుంటుందని తెలిసింది. మొత్తం ఈ సంఘటనని తలుచుకుంటే స్వామి నా ప్రయాణం గురించి ఎంతో జాగ్రత్తగా వుండి ఏమాత్రం ఇబ్బందీ లేకుండా నడిపిస్తారని తెలుస్తోంది. స్వామికి మా మీద ఎంత ప్రేమ కాకపోతే మేము తెలియకుండా వెళ్ళి ట్రాఫిక్‌లో నానా అవస్థ పడకుండా అదనంగా ఇంకొక రెండు గంటలు స్వామి సన్నిధిలో వుంచుకున్నారు కదా!

స్వామికృపను సంపూర్ణంగా పొందాలంటే స్వామి చెప్పినట్లు చేయటమేనని గుర్తించాలి.

2. దాదాపు గత 6 సంవత్సరాల నుండి గురక వల్ల సరిగ్గా నిద్ర పట్టేది కాదు. అందువలన ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసాను కానీ సరైన పరిష్కారం దొరకలేదు. ఎంతో ఇబ్బందిగా ఉన్నా ఇలాంటి చిన్న సమస్యను స్వామి దృష్టికి తీసుకు వెళ్ళటం ఇష్టంలేక నా మనస్సులోనే పెట్టుకున్నాను. 2011 జులై 21న జరిగిన స్వామి 80వ జన్మదిన వేడుకలకి వెళ్ళాను. తర్వాత 23 జులై (శనివారం) సాయంత్రం కడప నుండి ఒక గుజరాతీ ఆవిడ స్వామితో మాట్లాడటానికి వచ్చింది. ఆమె హిందీలో మాట్లాడుతోంది. స్వామి ప్రక్కన వున్న నాతో "ఆమె ఏమి అడుగుతోందో నాకు చెప్పు" అన్నారు. ఇంతకు ముందెప్పుడూ స్వామి నన్ను అలా అడగలేదు. పైగా స్వామి హిందీ బానే మాట్లాడతారు. ఆమె వాళ్ళ ఆస్తుల గురించి, పిల్లల పెళ్ళిళ్ల గురించి అడిగి చివర్లో 'నాకు అసలు నిద్ర పట్టట్లేదు స్వామీ!' అని విన్నవించింది. దానికి స్వామి "మీ కుటుంబంలో ఏ గురువుని తలుస్తారు?" అని అడిగారు. ఆమె 'ముక్తానందగారిని, మిమ్మల్ని, అమ్మవారిని పూజిస్తాము స్వామీ' అని చెప్పింది. వెంటనే స్వామి "అమ్మా! నీవు పడుకునే ముందర మీ గురువుగారిని తలచుకుని పడుకో!!" అని చెప్పారు. తర్వాత ఆమె వెళ్ళిపోయింది. ఇది విన్న నాకు స్వామి చెప్పింది నాకు కూడా వర్తిస్తుందని నేను స్వామిని స్మరించి నిద్రకుపక్రమిస్తుంటే హాయిగా నిద్ర పడుతోంది. నాకు చాలా ఆనందమేసింది. కరుణామయుడు, కృపాళుడు అయిన సద్గురువు నాకున్న సంకోచాన్ని

గ్రహించి, నా అడగలేనితనాన్ని మన్నించి పరోక్షంగా నా సమస్యకు పరిష్కారం చూపించి నా కష్టాన్ని తొలగించారు. పైగా స్వామి నాచేత ఆమె హిందీలో చెప్పేది తర్జుమా చేసి చెప్పమనటం వల్ల నన్ను జాగ్రత్తగా వారిద్దరి మధ్య సంభాషణ వినేటట్లు చేయటమే కాక స్వామి చెప్పింది నా సమస్యకు పరిష్కారం అని గుర్తించేటట్లు చేసారు.

3. మా చెల్లెలికి 2003లో వివాహం అయ్యింది. 2008 దాకా సంతానం కలుగలేదు. సంతానం కొరకు చేసిన ఎన్నో ప్రయత్నాలు ఫలించలేదు. నేను సూచించగా స్వామి దర్శనం చేసుకున్నారు. స్వామి మా చెల్లెలిని, బావని మరలా కొన్ని నెలల తర్వాత వచ్చేటప్పుడు ఖర్జూరపు పండ్లు తీసుకొచ్చుకోమన్నారు. వారు అలానే దర్శనం చేసుకున్నారు. స్వామి ఆశీర్వదించి ఆ పండ్లను తిరిగి వారికే ప్రసాదంగా చెరి సగం ఇచ్చినారు. ఒకసారి మా చెల్లెలు, బావగారు దర్శనానికి వచ్చినప్పుడు స్వామి నాతో "నాయనా! రేపు నెల్లూరు వెళ్తున్నాము. శంకరయ్యకి చెప్పి పెట్టినాను. నీవు నీ బావ చేత అశ్వత్థ నారాయణుడికి ఒక గ్లాసు పాలు, ఒక గ్లాసు నీళ్ళు పెట్టమను, ఏమైనా అడ్డంకులు వుంటే తొలగిపోతాయి" అన్నారు. మా బావ అలానే చేసారు. కొంతకాలం తర్వాత స్వామి ఆశీస్సులతో సంతానం కలిగింది. కానీ 8 నెలలకే (నెల తక్కువ) ఆడపిల్ల పుట్టింది. పుట్టిన బిడ్డ చాలా బలహీనంగా వుండి బరువు తక్కువగా వున్నది. స్వామి వాళ్ళని దర్గాలకు తీసుకువచ్చి దర్శనం చేసుకోమన్నా, బిడ్డ బలహీనంగా వుండటం వల్ల వాళ్ళు రాలేదు. నేను వెళ్ళినప్పుడు బిడ్డ విషయం చెప్పి, అందువలన మా చెల్లెలు వాళ్ళు రాలేదు అని స్వామికి చెప్పాను. స్వామి వెంటనే కోపంగా "అమ్మయ్య ఆశీర్వాదంతో పుట్టిన బిడ్డ అలా ఎందుకు వుంటుంది, బిడ్డని తీసుకు రమ్మ"న్నారు. చిత్రంగా స్వామి అలా అన్న నెల రోజులకే పాపాయి ఆరోగ్యం పుంజుకుని ఒళ్ళు చేసింది.

మా చెల్లెలు, బావగారు స్వామి దగ్గరకు వస్తున్నప్పుడు నేను వారితో వెళ్ళేవాడిని. ఒకసారి స్వామి దగ్గరకి వెళ్తూ మా బావగారితో 'రెండు, మూడు సం॥లనుండి స్వామి దర్శనం చేసుకుంటున్నావు కదా! మీ అనుభవం ఏమిటి?' అని అడిగాను. మా బావగారు చెప్తూ 'స్వామి దగ్గరకి

రాక ముందర ఆఫీసులో చాలా పని ఒత్తిడి వుండి శని, ఆదివారాల్లో కూడా పని చేయాల్సి వచ్చేది. స్వామి దగ్గరకి వస్తున్నప్పటి నుండి శని, ఆది వారాల్లో చేయాల్సి రావటం లేదు. పైగా పనిలో ఎన్ని ఆటంకాలు వున్నా వాటంతటఆవే సమసిపోతున్నాయి' అని అన్నారు.

మా చెల్లెలు, బావగారు స్వామి దర్శనం చేసుకున్నది సంతానం కోసం మాత్రమే. మా బావగారు స్వామిని ఏమీ అడగకుండానే ఆయన ఉద్యోగంలో వున్న అధిక పనిభారం, ఆటంకాలు తొలగించారు. స్వామి దర్శనమే మహా భాగ్యం! మనకి ఏది శ్రేయస్సో స్వామే అది మనమడగకుండానే చేస్తారని తెలుస్తోంది.

## చీమకుర్తి సుబ్బారావుగారు

1. నా భార్యకు కామెర్ల వ్యాధి వచ్చి ముదిరిపోయింది. విజయవాడలోని డాక్టర్ల వల్ల తగ్గింది కానీ శరీరంలో రక్తం తగ్గి నీరు పట్టి కాళ్ళు, చేతులు ఉబ్బాయి. డాక్టర్లు రక్తం పట్టే ఆహారం తీసుకోమన్నారు. అలాంటి ఆహారం తీసుకున్నా ఏమీ తగ్గలేదు. నడవలేకపోయేది. తర్వాత దర్గాస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామికి విన్నవించింది. స్వామి "రక్తం చెడిపోయింది. రక్తం ఎక్కించుకో, తగ్గుతుంది" అన్నారు. ఇంటికి వచ్చిన తర్వాత ఒక 12 బాటిల్స్ రక్తం ఎక్కించాము. ఉబ్బటం తగ్గి యిప్పుడు తన పని తాను చేసుకుంటున్నది. స్వామి సలహాతో వెంబడే నా భార్య బలహీనత, కాళ్ళు, చేతులు ఉబ్బటం తగ్గి ఆరోగ్యంగా ఉన్నది.

2. ఒకసారి ఆరుగురు భక్తులము కలసి దర్గాస్వామి ఆశీస్సులు తీసుకుని తిరుమల తిరుపతికి బయలుదేరాము. త్వరత్వరగా బస్సులు దొరికి చాలా త్వరగా తిరుమలకి చేరాము. అంతేకాక కేవలం ఒక గంటలో శ్రీ వేంటేశ్వరస్వామి దర్శనమయ్యింది. సద్గురు ఆశీస్సులతో ప్రారంభిస్తే మంచి ఫలితాలు లభిస్తాయని తెలుస్తోంది.

3. నాకు చిన్నప్పటినుండి చిన్న దెబ్బ తగిలినా చాలా సేపటి వరకూ రక్తం కారుతూ ఉంటుంది. ఒకసారి నేను, నా కుమారుడు స్వామి దగ్గరకి వస్తుంటే నా తలకి దెబ్బ తగిలి రక్తం కారుతోంది. నా కుమారుడు ఆస్పత్రికి వెళదామంటే నేను స్వామిని తలచుకొని తడిపిన గుడ్డతో తలకి కట్టు కట్టి

స్వామి దర్శనానికి బయలుదేరాము. మార్గ మధ్యలోనే రక్తం కారటం ఆగిపోయింది. అలా జరగటం చాలా అద్భుతం. స్వామికి ఈ విషయం చెప్తే "నా పేరు తలచుకుంటూ, దర్గాల దగ్గరకి వస్తుంటే కడప బాంబు వేసినా ఏమవుదు" అని అభయమిచ్చారు.

## చీమకుర్తి అన్నపూర్ణ, అశ్వారావుపేట

1. 1995లో మా కుటుంబమంతా దర్గాస్వామి దర్శనానికి వెళ్ళాము. సాయిబాబా గురించి తప్ప దర్గాస్వామి గురించి ఎక్కువ తెలియదు. మధ్యాహ్న ఆరతికి 10ని॥ ముందర స్వామి మమ్మల్ని "ఏ ఊరు నుండి వచ్చారు?" అని అడిగారు. ఎక్కువ మంది భక్తులు తరచూ దమ్మపేట నుండి స్వామి దర్శనం చేసుకుంటూ ఉంటారు. అందువలన మాది అశ్వారావు పేట అయినా దమ్మపేట అని చెప్తే మమ్మల్ని త్వరగా రమ్మంటారని 'దమ్మపేట స్వామీ!' అని అబద్ధం చెప్పాము. వెంటనే స్వామి కసురుకొని  మమ్మల్ని బయటికి పంపించారు. మేమేమి తప్పు చేశామో, ఎందుకు అలా బయటకు గెంటేశారో అర్థంగాక బయట ఒక చెట్టు క్రింద కూర్చుని శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతం గ్రంథాలు పారాయణ చేస్తున్నాము. అలా పారాయణ చేస్తున్నప్పుడు ప్రక్కవారు చెప్పుకుంటున్నది వినటం వలన మేము అబద్ధం చెప్పాము గాబట్టి స్వామి గెంటేశారని అర్థమై మనస్సులోనే స్వామికి క్షమాపణ చెప్పుకున్నాము. మధ్యాహ్నం స్వామి వచ్చి అక్కడ ఉన్న 100 మందిలో నన్ను, మావారిని రమ్మని పిలిచి "మీ ఆయన మంచి పేరు గడిస్తాడు, మీ పాపకు మంచి మెరిట్ వస్తుంది" అని చెప్పారు. సంతోషంగా ఇంటికి వచ్చాము. తర్వాత 3 సం॥లకి మా పాప 10వ తరగతిలో అశ్వారావు పేట మండలంలో మొదటి ర్యాంకు వచ్చింది. ఇప్పుడు ఐ.ఐ.ఐ.టి, నూజివీడులో ఇంటర్మీడియెట్ అయ్యి బి.టెక్. మొదటి సంవత్సరం చదువుతోంది. మాకున్న ఆర్థిక స్థోమతకు అలా అంత మంచి కాలేజీలో చదివించటం చాలా గొప్ప. అదే స్వామి దయ.

2. మా ఇంట్లో అద్దెకి భార్యాభర్తలు చేరారు. అతను రోడ్లు వేసే

ఇంజనీరు. భార్య పేరు పల్లవి. వారికి పెళ్ళయి 10 సం॥లైనా పిల్లలు లేరు. పల్లవి మేము చెప్పినట్లు శ్రీ గురుచరిత్ర, సాయిబాబా చరిత్రలు పారాయణ చేస్తూ, ప్రదక్షిణలు చేస్తూండేది. డాక్టర్లు పిల్లలు పుట్టటానికి అవకాశం ఉందని చెప్పేవారు కానీ పల్లవి అత్తగారు తన కుమారుడికి రెండవ పెళ్ళి సంబంధాలు చూస్తుండే సరికి పల్లవి భయపడింది.

అంతేగాక అదే సమయంలో పల్లవి భర్తకు ఉద్యోగం ఇంకొక చోటికి బదిలీ అయ్యింది. మా ఊరినుండి వెళ్ళటానికి ఇష్టం లేదు. కానీ అన్ని సామాన్లు సర్దుకొని మరునాడు వెళదామనుకుంటుంటే నేను ఫోనులో దర్గాస్వామితో మాట్లాడే అవకాశం కలిగింది. పల్లవి కూడా స్వామితో మాట్లాడదామనుకొని ఫోను తీసుకొనే సరికి ఏమీ చెప్పకుండానే స్వామి “నువ్వేమీ బాధ పడకు, ఇంకా 1 1/2 సం॥ అక్కడే ఉంటారు” అన్నారు. తర్వాత రోజే రెండు సంవత్సరాలు అశ్వారావు పేటలో ఉంటున్నట్లు ఆర్డరు వచ్చింది. మరలా ఒక వారానికి ఫోను చేసి ఈ విషయం చెప్పి, బిడ్డల గురించి అడిగితే స్వామి “సంవత్సరానికి మగ బిడ్డ పుడతాడు” అని చెప్పారు. అలానే స్వామి దయ వలన గురుపూర్ణిమ రోజు మగబిడ్డను ప్రసవించింది.

## విజయలక్ష్మిగారు, అశ్వారావుపేట

1. 2005లో మేము మా రైసు మిల్లు అమ్మేసి ప్రక్కనున్న ఇంకొక ఊరిలో మిల్లు పెడదామని స్థలం కొనటానికి అడ్వాన్సు ఇచ్చినాము. తర్వాత దర్గాస్వామి గురించి తెలిసి స్వామి దర్శనానికి వెళ్ళాము. స్వామికి మేము పెట్టబోయే మిల్లు గురించి అడిగితే స్వామి “మీరు భూమైతే తీసుకున్నారు. అది మీది అవదు, ప్రక్కన పెడతావులే, ఆ! అది కూడా చిరాకవుతుంది. చివరికి డబ్బులు ఖర్చయినా పెడతావులే” అన్నారు. కానీ మేము అడ్వాన్సు ఇచ్చేసాము కదా ఇంక ఆ స్థలం మాదే అని తలచి స్వామి మాటలు నమ్మబుద్ధి కాలేదు. మేము ఇంటికొచ్చిన తర్వాత ఎవరి దగ్గర స్థలం కొంటానికి అడ్వాన్సు యిచ్చామో అతనే వచ్చి స్థలం అమ్మట్లేదని చెప్పాడు. ఒక సంవత్సరం అయ్యింది. తరువాత ఇంటి

ప్రక్కనున్న ఆరు షాపులలో మిల్లు పెడదామని ప్రయత్నిస్తుంటే చాలా అడ్డంకులు వచ్చి చివరకు కోర్టు కేసు అయ్యి డబ్బులు ఖర్చుతో అది గెలిచి మిల్లు మా యింటి ప్రక్కగా పెట్టాము. పెట్టిన తర్వాత ఎప్పుడో 1,2 సం॥ల ముందర స్వామి అన్న మాటలు గుర్తు వచ్చి స్వామి మీద విశ్వాసం కుదిరింది.

2. మా పిల్లవాడికి ఇంటర్ మీడియట్‌లో 940 మార్కులు (1000 మార్కులకి) వచ్చినా హైదరాబాదులోని ఇంజనీరింగ్ కాలేజీలలో సంవత్సరానికి 3 లక్షల ఫీజు అడుగుతున్నారు. మేమంత ఖర్చు పెట్టలేక పాల్వంచలో సంవత్సరానికి లక్షరూపాయలు పెట్టి ఇంజనీరింగ్ సీటు తీసుకున్నాము. మా పిల్లవాడికి పాల్వంచలో చదవటం ఇష్టంలేదు. అందువలన గుంటూరులో జరిగే కౌన్సిలింగ్‌కి వెళ్ళేముందర స్వామి ఆశీస్సులకని ముందర రోజు దర్గాస్వామి దగ్గరకి మా బాబు, మావారు వెళ్ళారు. దర్గాస్వామి ఆరోజు రాత్రి అక్కడే ఉండమన్నారు. కానీ మా అబ్బాయి స్వామితో తర్వాత రోజు కౌన్సిలింగ్ ఉందని చెప్పాడు. అప్పుడు స్వామి "నీవు ఇంటికి వెళ్ళే సరికి చూసొచ్చిన కాలేజీ నుండి ఫోన్ వస్తుందిరా. కౌన్సిలింగ్ వద్దు, నీ మొహం వద్దు" అన్నారు. తర్వాత రోజు బయలుదేరి యింటికి వచ్చి బాత్‌రూమ్‌లో ముఖం కడుగుతున్నప్పుడు హైదరాబాద్‌లో ఒక ఇంజనీరింగ్ కాలేజీ వారినుండి ఫోను వచ్చి ఆ కాలేజీలో ఇ.సి.ఇ. గ్రూపులో సీటు, ఇ.ఇ.ఇ. గ్రూపులో ఒక సీటు ఉన్నాయి, ఏది కావాలంటే అది తీసుకోవచ్చు. సంవత్సరానికి 80వేలు ఫీజు అని చెప్పారు. మావాడు ఆనందంగా ఆ కాలేజీలో చేరాడు.

3. మా అమ్మాయి చదువులో కొంచెం డల్‌గా ఉండేది. అందువలన ప్రతి సంవత్సరం ఇది చదివిన తర్వాత చదువు ఆపేద్దాములే అని నచ్చచెపుతూ చదివిస్తుండేవారము. గుంటూరు విజ్ఞాన్‌లో ఇంటర్‌మీడియట్ అయిన తర్వాత మా అమ్మాయి ఎంసెట్ కోచింగ్ తీసుకుంటానన్నది. మా అమ్మాయి మార్కులని బట్టి ఎంసెట్ పరీక్షలో కనీస పాస్ మార్కులు రావని మా అభిప్రాయం. కానీ మా అమ్మాయి పట్టుబట్టింది. అప్పుడు స్వామి ఆశీస్సులు తీసుకున్న తర్వాత ఏదో

కాలేజీలో చేర్పిద్దామని తలచి స్వామి దర్శనానికి వెళ్ళాము. అప్పుడు ఉరుసు జరుగుతోంది. చాలా మంది భక్తులు వచ్చారు. స్వామితో మాట్లాడే అవకాశం రాలేదు. ఆరోజు సాయంత్రం ఇంటికి ఫోన్‌చేస్తే మా ఆయనకి చాలా జ్వరంగా ఉండి మీరొచ్చేలోపల చచ్చిపోతానేమోనని చెప్పి వెంటనే రమ్మన్నారు. అంత రాత్రి పూట ప్రయాణం కష్టమని తర్వాత రోజు అమ్మయ్య్య సమాధి దగ్గర ఉన్న హుండీలో దక్షిణ సమర్పించి వెళదామనుకున్నాము. మా అమ్మాయికి మాత్రం స్వామీజీ ఆశీస్సులు తీసుకోకుండా వెళుతున్నామని చాలా బాధగా ఉంది. తర్వాత రోజు ఆమ్మయ్య్య సమాధి దగ్గర స్వామి కూర్చొని ఉన్నారు. మేము దూరంగా ఉండి దక్షిణ సమర్పిస్తున్నాము. స్వామి మా వంక ప్రశ్నార్థకంగా చూచారు. మా అమ్మాయి స్వామి ఆశీస్సులు దొరకలేదని బాధతో ఏడ్చేస్తోంది. స్వామి "ఏమిటని" అడిగితే మా అమ్మాయి 'స్వామీ! మీరు మాట్లాడలేదని బాధగా ఉంది. మా నాన్నకేమో బాగోలేదు. అందువల్ల వెళ్ళిపోతున్నాము' అని చెప్పి ఏడుస్తోంది. అప్పుడు స్వామి "మీ నాన్నకు బాగాలేకపోతే మీరిక్కడ ఉంటే ఏమయ్యిందిరా. ఇందాక వెళ్ళి వచ్చాను. కావాలంటే ఫోన్ చెయ్యి" అని ఫోన్ ఇచ్చారు. ఫోన్ చేస్తే మా వారు అక్కడ ఉరుసు కదా అక్కడే రెండు రోజులుండండి. నాకు కొంచెంసేపటినుండి బానే ఉంది అన్నారు. సంతోషంతో మా అమ్మాయి 'స్వామీ! ఎంసెట్ కోచింగ్ తీసుకుందామనుకుంటున్నాను స్వామీ' అంటే "తీసుకోరా. నీకు ర్యాంకు వస్తుంది. మంచి కాలేజీలో సీటు వస్తుంది" అని ఆశీర్వదించారు. చాలా ఆనందం వేసింది. ఉరుసు జరిగిన మూడు రోజులు అక్కడే ఉండి సేవ చేసుకొనే మహాభాగ్యం స్వామి కల్పించారు. స్వామి చెపితేనే యింటికెళదామనుకున్నాము. మా పాపకు స్వామి పాదాలను తాకి నమస్కరించుకోవాలని కోరిక. కానీ ఆ అవకాశం రాలేదు. గంధం ప్రసాదంగా ఇచ్చిన తర్వాత భక్తులు స్వామికి పాద నమస్కారం చేసుకుంటున్నారు. కానీ మా అమ్మాయి అంతకు ముందే ఆదమరచి నిద్రపోతోంది. స్వామి నన్ను చూచి "పిల్ల ఏది? తపించిపోతోందిగా" అన్నారు. పరిగెత్తుకుంటూ మా అమ్మాయి దగ్గరకు వెళ్ళి స్వామి

రమ్మంటున్నారు అంటే అంత నిద్రలో ఉన్న మా అమ్మాయి పరుగెత్తుకుంటూ వెళ్ళి పాదాలను తాకి తలకాయ పాదాల దగ్గర పెట్టింది. "అలానే 10ని॥లు ఉంచమన్నారు" స్వామి.

తరువాత స్వామి "మీకు టైమ్ లేదు, మీరు వెళ్ళిపొండి" అన్నారు. మేము కడప బస్టాండుకి చేరి బస్సులైనా, ట్రైన్‌లేమైనా ఉన్నాయా అని చూస్తున్నాము. ఇంతలో దర్గాస్వామి దగ్గరనుండి చంద్రశేఖర్ రెడ్డిగారు (నెల్లూరు) మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి మిమ్మల్ని స్వామి గొలగమూడిలో దించమని చెప్పారు. అందువలన నాతో రండి అని అన్నారు. ఆయన్ని ఇబ్బంది పెట్టడం ఎందుకని వద్దంటుంటే ఆయన మిమ్మల్ని తీసుకెళ్ళకపోతే మా టైర్లు కదలనివ్వరు స్వామి, ఇలా స్వామి సేవ చేసుకోనివ్వండి అని మమ్మల్ని ఆయన వాహనంలో ఎక్కించుకొని గొలగమూడిలోని శ్రీ పెసల సుబ్బరామయ్యగారింటి ప్రక్కన ఉన్న సాయి మాష్టార్ నిలయంలో దించి వెళ్ళారు. ఆనందంగా వెంకయ్యస్వామి దర్శనం చేసుకున్నాము. యింటికి వచ్చి మా పాపను ఎంసెట్ కోచింగ్‌లో చేర్చాము. మా అమ్మాయికి ఎంసెట్‌లో లక్ష ర్యాంకు వచ్చినా స్వామి దయవలన శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చింది.

4. ఒకసారి ఉరుసుకి మా బాబు కాలేజీ మానేసి వచ్చాడు. మావారు ఫోన్ చేసి కాలేజీ పోతోంది, త్వరగా కాలేజీకి వెళ్ళు అన్నారు. అక్కడ చాలా మందితో స్వామి ఉన్నారు. స్వామికి చెప్పకుండా ఎలా వెళ్ళటమని తలచి మా వాడు స్వామి దగ్గర నిలుచొని ఉన్నాడు. చుట్టూ అంత మంది ఉన్నా స్వామి మా వాడి వంక చూసి "కాలేజీ పోతోంది నాన్న" అన్నారు. వెంటనే స్వామికి నమస్కరించుకొని మావాడు బయలుదేరి వెళ్ళాడు.

## శ్రీకాంత్‌గారు, చెన్నై

శ్రీ సద్గురు దర్గాస్వామివారి పాద పద్మములకు నా వినయపూర్వక నమస్కారములు. 2002లో స్వామి చెన్నై వచ్చినప్పుడు మా యింటికి అమ్మయ్యతో కలిసి వచ్చారు. స్వామి, అమ్మయ్యలను కూర్చోపెట్టి నమస్కారం చేసుకుంటే స్వామి "అదిగో మా గురువుగారు మీయింటికి

వచ్చారు" అని చెప్పి మమ్మల్ని ఆశీర్వదించారు.

తర్వాత ఇల్లు అమ్మటానికి స్వామి అనుమతి అడిగినప్పుడు స్వామి "మీ ముగ్గురు అన్నదమ్ములు అమ్ముదామనుకుంటున్నామని ఒక పేపరులో వ్రాసి, సంతకాలు చేసి, ఆ కాగితాన్ని మీ తల్లిదండ్రుల ఫోటోల దగ్గర పెట్టి దీపారాధన చేసి ప్రార్థించండి" అన్నారు. మేము అలానే చేసాము. తరువాత రోజు ఉదయం 10 గంటలకి ఒకతను వచ్చి అడ్వాన్సు ఇచ్చి వెళ్ళాడు. స్వామి చూపించిన కరుణకు కృతజ్ఞతగా 30,000 రూపాయలను విల్లివాకంలో నిర్మిస్తున్న దర్బారు సాయి మందిరానికి దక్షిణగా సమర్పించుకోగలిగాను. ఇల్లు అమ్మాలంటే ఎంత తలకాయ నొప్పి ఉంటుందో అదేమీ లేకుండా చేసిన స్వామికి నా హృదయపూర్వక నమస్కారములు.

2. మా దంపతులకు మొదట ఆడపిల్ల పుట్టింది. మా యింట్లో అందరూ ఆడపిల్లలు పుడుతున్నారని తర్వాత బిడ్డకోసం మేము కావాలని ప్రయత్నాలు చేయట్లేదు, కావాలని ఆలస్యం చేస్తున్నాము. మేమేమీ చెప్పకుండానే దర్గాస్వామి ఒకరోజు మమ్మల్ని పిలిచి తీర్థంలో ఊదిని కలిపి యిచ్చి ఇద్దరినీ త్రాగమన్నారు. తర్వాత 10 నెలలకు మాకు మగబిడ్డ జన్మించాడు.

స్వామి, అమ్మయ్యగార్లు చెప్పినట్లు విల్లివాకం దర్బారు సాయిమందిరంలో సాయిబాబాకు ఆరతులు, అభిషేకాలు చేసుకుంటున్నాను. స్వామి ఆదేశించినట్లు భగవద్గీతలో పురుషోత్తమప్రాప్తి యోగం అనే అధ్యాయాన్ని దర్గాలకి వెళ్ళినప్పుడు చేసుకోవటం వల్ల అది నిత్య పారాయణ అయ్యింది. నేను శిరిడీ, కాశీ, కేదార్‌నాథ్, బదరీనాథ్ మొదలైన యాత్రలకు వెళ్ళి వచ్చాము అని చెప్పిన వెంటనే స్వామి "నేనూ నీతో పాటే వచ్చి అక్కడ దర్శనమిచ్చాను. కానీ నేను టికెట్ లేకుండా వచ్చాను" అని చెప్పారు.

అమ్మయ్య, స్వామీజీల దయవలన మా జీవితాలు ఏ ఇబ్బందీ లేకుండా సాఫీగా, సార్థకంగా కొనసాగుతున్నాయి.

3. 2004 సం॥ నాకు సయాటిక్ నొప్పి ఎంత తీవ్రంగా వచ్చిందంటే

కూర్చుంటే నిల్చోలేను, నిలుచుంటే కూర్చోలేను. చెన్నైలోని డాక్టర్లకు చూపెడితే ఆపరేషన్ చేయాలని చెప్పారు. అలాంటి పరిస్థితిలో దర్గాల దగ్గర ఉరుసు ఉత్సవానికి వెళ్ళాను. చాలా మంది భక్తులు వచ్చి చాలా భక్తిశ్రద్ధలతో ఆ ఉత్సవంలో పాల్గొంటారు. నేను స్వామికీ విషయం చెప్పలేదు. నా ప్రయత్నాలు నేను చేసాను. ఉరుసురోజు రాత్రి 2గం॥లకు దర్గాల దగ్గర నుండి స్వామి వస్తూ నన్ను చూసి "అరెయ్ శ్రీకాంత్ ఇలా రారా" అని పిలచి ప్రక్కనున్న గంధంతో నా తొడ క్రింద నుండి పాదం వరకు మూడుసార్లు రాసి చేతిని రెండుసార్లు నేలకేసి కొట్టినట్లు కొట్టారు. ఆ రోజు రాత్రి నిద్రపోయి తెల్లవారేసరికి నొప్పిలేదు. నాకు ఇంక నొప్పిరాదని ఆ వ్యాధి స్వామి తొలగించాడని నమ్మి నేను తీసుకువెళ్ళిన యాన్‌టీ బయోటిక్ మందులు దర్గా దగ్గరున్న బావిలో పడేశాను. తరువాత ఎప్పుడూ ఆ నొప్పి రాలేదు. అచంచల విశ్వాసంతో ఆ సద్గురువును సేవించి ఆయన కృపకు పాత్రుడనయ్యేటట్లు చేయమని స్వామినే ప్రార్థిస్తున్నాను.

## మల్లిఖార్జున రెడ్డిగారు, నెల్లూరు

1. 2002లో ఒకసారి మా కుటుంబం అంతా స్వామి దర్శనానికి వెళ్ళాము. మధ్యాహ్నం భోజనాలైన తర్వాత బయలుదేరదామని స్వామి అనుమతి అడిగితే "ఎవరెవరు వచ్చారు?" అన్నారు. ఇలా నా భార్య, నాపాప కూడా వచ్చారు అన్నాను. "ఇంకెవరూ రాలేదా?" అన్నారు. నెల్లూరు నుండి కృష్టారెడ్డిగారు వచ్చారని చెప్పాను. వెంటనే కృష్ణారెడ్డితో "అరెయ్ నువ్వు కూడా వీళ్ళతో వెళ్ళు. కలసిపోండి" అన్నారు. తర్వాత బయలుదేరినాక బద్వేలులో కృష్ణారెడ్డి వ్యాన్‌లో ఉన్న భక్తులు టీ త్రాగటానికి దిగారు. మేము వాళ్ళని దాటివెళ్ళిన తర్వాత మా కారు రేడియేటర్‌లో ఏదో యిబ్బంది వచ్చి కూలెంట్ (చల్లబరిచే) నీరు కారిపోతోంది. కారు మర్రిపాడు గ్రామం దగ్గరకి వచ్చేసరికి పూర్తిగా ఆగిపోయింది. కారు అక్కడ పెట్టి వెళ్ళామంటే కారు పార్టులు ఎవరో ఒకరు దొంగిలిస్తారని కృష్ణారెడ్డి వ్యానుకు తాళ్ళతో మా కారును కట్టి ప్రయాణం సాగించాము. దీనికి తోడు మర్రిపాడు దాటిన తర్వాత గాలి,

వాన ప్రారంభమయ్యాయి. అప్పుడు కానీ స్వామి "కలిసిపోండి" అన్న మాటలోని ఆంతర్యం అర్థం కాలేదు. మేము ఇబ్బంది పడతామని ముందే తెలిసిన స్వామి మా తరువాత బయలుదేరుదామనుకున్న కృష్ణారెడ్డిగారిని మాతో పంపించి మమ్మల్ని నెల్లూరుకి చేర్చారు.

2. మా అమ్మాయి మెడిసిన్ ఎంట్రన్సు పరీక్షలకు ఆంధ్రలోనే కాకుండా కర్ణాటక మిగిలిన రాష్ట్రాలలో ప్రయత్నించాలనుకుంటే స్వామి మాత్రం ఆంధ్రలోనే వ్రాయమని చెప్పారు. స్వామి మాట ప్రకారం ఎంసెట్ రాస్తే 2400 ర్యాంకు వచ్చింది. ఆ ర్యాంకుకి నెల్లూరు నారాయణలో రాదు కనుక కుప్పం కాలేజీలో చేరుద్దామనుకుంటే, స్వామి "కుప్పం కాలేజీ వద్దని, నారాయణ కావాలని, నారాయణలో వస్తుందని" అన్నారు. ఆ సంవత్సరం ఫీజు రీయెంబర్సమెంట్ పథకం ద్వారా మా అమ్మాయికి నారాయణాలో పేమెంట్ సీటు వచ్చింది. ఫీజులు కూడా ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతి ప్రకారం మాకు అనుకూలంగా కట్టటం జరిగింది. ఇప్పుడు మా అమ్మాయి 3వ సం॥ మెడిసిన్ చదువుతోంది. మేమెక్కడో దూరంగా చదివించాల్సి వస్తుందేమోననుకుంటే ఇంట్లోనుండి ప్రతిరోజు కాలేజీకి వెళ్ళి వస్తోంది. మేము చాలా ఆనందంగా ఉన్నాము.

3. నేను స్వామి అనుమతి తీసుకొని ప్రతి మంగళవారం స్వామికి ఫోను చేస్తాను. ఏదైనా కారణం వలన ప్రక్కరోజు ఫోన్ చేస్తే నిన్నెందుకు చేయలేదు అని స్వామి అడుగుతారు. మా కుటుంబ విషయాలు, వారంలో జరిగినవి, ఎక్కడకైనా వెళుతున్నా స్వామికి చెప్పుకుంటాను. ఆయన ఆశీస్సులు ఉంటేనే అనుకున్న పని చేస్తాను. స్వామి కూడా మా పాప ఎలా చదువుతుందని, పరీక్షలు ఎప్పుడని అడగటం చేస్తుంటారు. మా ఇంటికి పెద్ద దిక్కుగా స్వామిని చూస్తుంటాము.

2011, జనవరి 22 సాయంకాలం 103 డిగ్రీల జ్వరం, ఒళ్ళునొప్పులు వచ్చాయి. డెంగ్యూ జ్వరంలాగా ఉందని పరీక్షలు చేయిస్తే రిపోర్టుల్లో ఏమీలేదని వచ్చింది. నాకు ఊహ తెలిసిన తర్వాత మొదటిసారి ధర్మామీటరుతో చూడవలసి వచ్చింది. ఆదివారం మొదలైనది మంగళవారం దాకా అలానే ఉంది. ఆరోజు స్వామికి ఫోను చేసి చెప్తే స్వామి "నాయనా!

నువ్వేనా. నిన్నటినుండి సతాయిస్తోంది నాకు. ఎవరికో ఏవో బాగోలేదనుకున్నాను. నాకు కూడా నిన్న సాయంత్రం,రాత్రి, ఇవాళ ఉదయం దాకా 3 పూటలా సతాయించింది పోతుందిలే' అని అభయమిచ్చారు.

స్వామి చెన్నైలో విల్లివాకం దర్బార్ సాయి మందిరం వెళ్ళి అక్కడ గోవర్ధన్ గారింట్లో 3 రోజులు ఉంటారు. నేను స్వామితో మాట్లాడదామని అక్కడున్న ఒక భక్తుడికి ఫోను చేసాను. ఫోన్ చేసే ముందర నా ఎడమ కాలు పట్టేసింది. నేను ఆ భక్తుడితో స్వామి గురించి అడుగుతున్నాను. ఇంతలో స్వామి "అరెయ్! కాలు పట్టేసింది" అని అంటున్నారు. తర్వాత స్వామికి భక్తులు ఫోన్ ఇస్తే "ఎట్లా ఉన్నావు?" అని అడిగారు. 'కాళ్ళు మాత్రం వాస్తున్నాయి, బాగా నొప్పి ఉంది అన్నాను. వెంటనే "ఎడమకాలా?" అని అడిగి నేను ఇప్పుడే విదిలించాను పోయింది పో ఏమీ కాదు. ఈ సారి వచ్చినప్పుడు విబూది ఇస్తాను పూసుకుందువులే ఏమీ కాదు పో, నువ్వు రెండు రోజులనుండీ ఎందుకో గుర్తు వస్తున్నావు" అని అన్నారు.

స్వామి నేను గుర్తువస్తున్నాను అనే మాట అనేసరికి ఇక ఉండలేక నేను ఆరోజు మధ్యాహ్నం దాకా హాస్పిటల్ పని చూసుకొని ఒక్కడినే కారులో చెన్నై వెళ్ళిపోయాను. సాయంత్రం ఆరతి అయ్యి ప్రసాదాలు పంచిన తర్వాత నన్ను పిలిచారు. **ఊదీ ఇస్తారేమోననుకుంటే స్వామి ఊదీ తీసుకొని కాలికి మొత్తం పూసారు.** నేను స్వామి అలా చేసేసరికి షాక్ తిన్నాను. తేరుకొనేసరికి చాలా సేపు పట్టింది.నొప్పి చాలా మట్టుకు తగ్గింది. ఎప్పుడైనా ఎక్కువసేపు కూర్చుంటుంటే కొంచెం నొప్పిగా ఉంటోంది. స్వామికి చెప్తే "పూర్తిగా తగ్గిపోతుందిలే. దాని గురించి ఆలోచన వదిలేసెయ్" అని చెప్పారు.

తర్వాతరోజు స్వామి దగ్గర సెలవు తీసుకొని నెల్లూరు దగ్గరకొచ్చేసరికి స్వామి ఫోను చేసి "క్షేమంగా చేరావా" అని అడిగి తెలుసుకున్నారు. స్వామికి ఎంత ప్రేమో!

## రాజుగారు (నాంపల్లిబాబా సమాధి మందిరంలో పనిచేసిన పూజారి)

నేను గొలగమూడిలో కొన్ని సంవత్సరాలుగా ఉంటున్నప్పుడు దర్గాస్వామి ఒక ధర్మసత్రం ప్రారంభోత్సవమునకు గొలగమూడి వచ్చారు. ఆయన దర్శనము చేసుకున్నాను. అప్పటినుండి ఆయన సేవ చేసుకుందామని సుబ్బరామయ్య సార్ గార్ని అడిగితే వెళ్ళమన్నారు. వెళ్ళాలనుకున్నాను కానీ ఎప్పుడో నిర్ణయించుకోలేదు. గొలగమూడిలో ఉండే మిలట్రీ స్వామి కూడా స్వామి దర్శనానికి వస్తాననేసరికి ఒకరోజు వెళదామనుకున్నాము. ఆ క్రితం రోజు రాత్రి దర్గాస్వామి, అమ్మయ్యగార్లు కలలో చాలా సేపు కనపడ్డారు. తర్వాత రోజు దర్గాల దగ్గరకి వెళ్ళేసరికి సాయంత్రం 7గంటలయ్యింది. స్వామి దీపాలు పెట్టి లోపలకి వెళ్ళిపోయారు. అక్కడున్నవాళ్ళు ఇంక స్వామి దర్శనం తర్వాత రోజే అక్కడ దర్గాల దగ్గర పడుకోవాలని చెప్పారు. ఇంతలో రామయ్య వచ్చి 'ఇక్కడ వెంకయ్యతాత దగ్గరనుండి వచ్చిన రాజును స్వామి రమ్మంటున్నారు' అని చెప్పేసరికి స్వామి దగ్గరకి వెళ్ళాను. పడుకున్న స్వామి లేచి నన్ను చూస్తూ "రారా నువ్వు వస్తున్నావని సాయిబాబా చెప్పారు" అని చాలా ఆప్యాయంగా మాట్లాడారు. స్వామి సర్వజ్ఞత్వం చూచి నేను చాలా ఆశ్చర్యపోయాను.

తర్వాత నేను కొన్ని నెలలు స్వామి సేవలో ఉన్నాను. నేను గమనించిన విషయమేమంటే **దర్గాల దగ్గరకిగానీ, మందిరంలో ఆరతికి వెళ్ళేటప్పుడుగానీ హాలు బయటకు వచ్చే ముందర స్వామి తప్పకుండా అమ్మయ్యతో "అమ్మయ్యా! దర్గాల దగ్గరకి (మందిరానికి) వెళ్ళి వస్తా" అని చెప్పిన తర్వాతనే వెళ్ళేవారు.** నాకు మలేరియా జ్వరం వచ్చి నెల్లూరులో చికిత్సకోసం వెళ్ళాను. ఆ తర్వాత అక్కడ నుండి సాయిబాబాను సేవించటానికి వెళ్ళాను. అక్కడ నుండి నాకు హైదరాబాదులోని శ్రీ నాంపల్లిబాబాను సేవించటానికి అవకాశం వచ్చింది. వెళ్ళాలా వద్దా అని సంకోచిస్తున్నప్పుడు దర్గాస్వామికి ఫోను చేస్తే **"ఆయన సాక్షాత్తు పరమేశ్వరుడు"** అని స్వామి చెప్పారు. తర్వాత నాంపల్లి బాబా దగ్గరకు వచ్చిన తర్వాత కొన్ని రోజులకి నాకు

వీపు క్రింద నొప్పిగా ఉండేది. నేను అదేమైనా వ్యాధేమోనని తలచి నాంపల్లిబాబాకు చూపిస్తే ఆయన చూచారు కానీ ఆ నొప్పి తగ్గలేదు. నాంపల్లిబాబా సమాధి తర్వాత విగ్రహం ఎలా తయారు చేయించాలి, సమాధి దగ్గర ఎలా సేవ చేయాలో అనే విషయాలపై దర్గాస్వామి ఆశీస్సుల కోసం వెళ్ళినప్పుడు స్వామికి నా నొప్పి గురించి చెప్పాను. స్వామి నన్ను వెనక్కు తిరగమని చెప్పి దండంతో తాకి "భయపడాల్సిందేమీలేదని" చెప్పారు. అప్పటినుండి చాలా కొద్దిరోజులలో ఆ నొప్పి తగ్గిపోయింది. నాంపల్లిబాబాగారి(సమాధి) సేవ చేసుకోగలిగాను. నన్ను నాంపల్లిబాబా దగ్గరకు వెళ్ళమని చెప్పటమే కాక, నా అనారోగ్యాన్ని తొలగించి నేను తృప్తికరంగా సేవించుకునే భాగ్యం కలిగించారు.

## యన్. యస్. గోవర్ధన్, విల్లివాక్కం, మదరాసు (చెన్నై).

1. మా కుటుంబం మొదటిసారిగా స్వామి అమ్మయ్య గార్లను గురించి తెలిసికొన్నది చిన్మయమిషన్ బ్రహ్మచారుల ద్వారా. ఆ దివ్య దంపతుల దర్శనం మాకు లభించింది 2001వ సంవత్సరంలో. ఆరోజు మంగళవారం. మేము దర్గాకువెళ్ళి దర్శనం చేసుకోగానే శ్రీ స్వామివారు "జన్మ జన్మల అనుబంధం!" అన్నారు. అప్పటి నుండి మా కుటుంబంయొక్క బాగోగులు వారే చూచుకొంటున్నారు. మొదటిసారి మేము స్వామి దర్శనానికి వెళ్లినప్పుడు మాకు ఒక కుమారుడు మాత్రమే. శ్రీ స్వామివారు అప్పుడే అన్నారు, "త్వరలో మీకు కుమార్తె పుడుతుంది" అని. నా భార్య గర్భముతో ఉన్నప్పుడు దర్గాకు స్వామి దర్శనానికి వెళ్లి వస్తుండేది. స్వామివారు, అమ్మయ్యలు విల్లివాకంలోని మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చినప్పుడు మా ఇంట్లోనే విడిది చేశారు. అదే అమ్మయ్య మద్రాసుకు ఆఖరుసారి రావడం. తిరిగి దర్గాకు వెళ్లేటప్పుడు అమ్మయ్య తనచీర ఒకటి మా అమ్మకు ఇచ్చి "జాగ్రత్తగా దాచమని, నేను మళ్ళీ వస్తాను" అని చెప్పారు. అది మా సుకృతఫలంగా భావిస్తున్నాము. అటు తర్వాత 11 సెప్టెంబరు 2004 న అమ్మయ్య సమాధి చెందారు. అక్కడ నుండి ఆరవ రోజున అనగా 16 సెప్టెంబరు 2004, గురువారం మాకు ఆడపిల్ల పుట్టింది. ఆ అమ్మయ్యయే మా ఇంట

వెలిసింది అనుకున్నాము.

2. 2003లో దత్తాత్రేయ జయంతినాడు బయలుదేరుతుంటే స్వామి ఒక పూలమాల ఇచ్చి "కారుకు కట్టుకుని పోయిరాపోండి" అని అన్నారు. నేను కారు బోనెట్‌కి కడుతూంటే స్వామి పిలిస్తే స్వామివైపు తిరిగాను. స్వామి స్థానంలో శ్రీ శిరిడీ సాయి కనపడ్డారు. అలానే కొద్దిసేపు చూస్తూ వుండిపోయాను. ఏమీ మాట్లాడలేకపోయాను. మేము బయలుదేరి మెయిన్‌రోడ్డు మీదకొచ్చాక మాత్రమే నాకు "సాయిబాబాకు పాద నమస్కారం చేసుకుంటే బాగుంటుంది కదా" అని స్ఫురించింది. దర్గాస్వామి, శిరిడీ సాయి ఒకటేనను నా విశ్వాసం దృఢపడింది.

3. ప్రతి గురువారం ఇంట్లో స్వామి అభయహస్తంతో వున్న పెద్ద ఫోటోకి ఆరతి ఇస్తాము. 2003లో పెద్ద యాక్సిడెంటు అయ్యి మనస్సు అంతా డిస్టర్బ్ అయ్యి, మనస్సులో కొంచెం బాధగా వుంది. అలానే ఆరతి ఇస్తున్నాను. స్వామి ప్రత్యక్షంగా నాకు అభయహస్తం పెట్టి ఆశీర్వదించటం నా భార్య చూచింది. నేను ఆరతి చేయటంలో నిమగ్నమై వుండటం వల్ల నేను ఇదేమీ గమనించలేదు. తరువాత ఆ విషయం తెలుసుకుని చాలా ఆనందపడ్డాను. అంతేకాక నా మనస్సులోని బాధ మాయమైపోయింది. చాలాసార్లు నా వెనుకనే స్వామి వున్నట్లు మా ఆవిడకి స్వామి దర్శనం ఇచ్చారు.

4. నేను సామాన్యంగా దర్గాల దగ్గర 3 రోజులుండి ఇంటికి బయలుదేరుతుంటాను. 2006 జూన్ 6 నాటికి శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయి జ్ఞాన మందిరానికి మొదటి సంవత్సరము పూర్తి కానున్నది. దీనికి వారం ముందర నన్ను ఉద్యోగం నుండి అకారణంగా తొలగించారు. జూన్ 4, 2006న శ్రీ దర్గాస్వామివారి వద్దకు వెళ్ళి వారిని 6వ తేదీన జరుగనున్న మొదటి సంవత్సర ఉత్సవానికి తోడ్కొని రావడానికి పోవడమైనది. ఆ సందర్భంగా నా ఉద్యోగ విషయం వివరించడమైనది. దానికి శ్రీ స్వామి "ఇది నాకు పరీక్ష కానీ నీకు కాదు" అని 5వ తేదీన చెన్నై విచ్చేసి 5,6,7 తేదీల వరకు ఉండి వార్షికోత్సవం చేయించి, ఆ బాబాతో మొరపెట్టి మళ్ళా వారం తిరగకుండానే వేరొక మంచి కంపెనీలో

స్థిరమైన ఉద్యోగం ఇప్పించారు. 2006 జూన్ 19వ తేదీ ఉదయం ఆరతికి శ్రీ స్వామి వెనుకాలే మందిరానికి వెళ్ళాను. స్వామి నాతో "గురువు నడిచిన దోవలో నడిచావు. నీకు అన్నింటా జయం అవుతుంది" అని రెండు హస్తములతో ఆశీర్వాదం చేసారు. నాటి నుండి ఇప్పటికీ నా తోడు నీడగా వుండి సమర్థ సద్గురు శ్రీ దర్గాస్వామివారు నడిపిస్తూ వున్నారు.

## సత్యకళ, కృష్ణ

మా అబ్బాయి ఒక అమ్మాయిని ప్రేమించటం వలన ఎమ్.ఎస్. అయిపోగానే పెళ్ళి చేసాము. అతనికి ప్రాక్టీసు ఎక్కువ లేదు కనుక ఇల్లు గడవడం కొంచెం కష్టంగా ఉంది. మా అబ్బాయికి పిల్లవాడు పుట్టాడు. మా మనుమడి అన్నప్రాసన స్వామి దగ్గర చేసాము. స్వామి డబ్బులు ఎత్తి పెట్టి స్టీలు ప్లేటు, వెండిగ్లాసు మా అబ్బాయికి ఇచ్చి, "డబ్బులు ఎత్తి బీరువాలో పెట్టమన్నారు. సంవత్సరానికి ఒకసారి వచ్చి దర్గాల దగ్గర నిద్ర చేయండి నాయనా! మీకు మంచి జరుగుతుంది" అని చెప్పారు. మా అబ్బాయి అలాగే చేసాడు. సంవత్సరం తిరగకుండానే ప్రాక్టీసు పెరిగి మంచి డాక్టరుగా పేరు పొందాడు. మా కోడలికి ఉద్యోగం వచ్చింది. స్వామికి 50,000 రూపాయలు దక్షిణగా ఇచ్చారు. మా అబ్బాయికి స్వామి ఎన్ని లక్షలు ఇప్పించాడోకదా ఈ 50,000 రూపాయలు దక్షిణగా యిచ్చాడు అని తలచి చాలా సంతోషించాను.



## అధ్యాయము - 9

# స్వామి దర్శన, ఆశీస్సుల మాహాత్మ్యము

మహనీయుల దర్శనం పుణ్యం, స్పర్శనం పాపనాశనం అన్నారు పెద్దలు. మన సాధనతో నిర్మూలించుకోలేని దుర్గుణాలు మహనీయుల దర్శనంతో నిర్మూలించబడతాయని శ్రీ రమణ మహర్షి చెపుతారు.

"నిప్పు దగ్గర వున్న వ్యక్తి నా గుడ్డల చెమ్మ పోగొట్టమని ఆ అగ్నిని ప్రార్థించనక్కరలేదు. అక్కడున్న వేడికి మన గుడ్డల తేమ హరించబడుతుంది. అలాగే మహనీయుల సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన మనము సాధనతో నిర్మూలించుకోలేని దుష్టసంస్కారాలన్నీ వాటికై అవే మన నుండి దూరమౌతాయి. గనుక శ్రీ వెంకయ్యస్వామివారు మీ ప్రాంతానికి వస్తే వదిలి పెట్టకుండా సాధ్యమైనంతసేపు వారి సన్నిధిలో వుండు" అని ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు శ్రీ పెసల సుబ్బరామయ్యగారిని ప్రోత్సహించి స్వామిదర్శనం చేయించారు.

మహనీయుల దర్శన, చరిత్ర పారాయణతో మనకి ఆధ్యాత్మికత మీద ఉన్ముఖం కలిగి సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వము, సద్గురుసేవ అనేవి మనకు అలవడి తద్వారా భగవంతునికి సంతృప్తిగా జీవించగలుగుతాము.

సామాన్యంగా మనకి జరిగే ఇబ్బందులు, ఆందోళనలు, మానసిక అలజడి వలన ప్రక్కవారి మీద రాగద్వేషాలు ఏర్పరచుకొని క్రొత్త ఋణానుబంధాలు తగిలించుకుంటాము. మన అజ్ఞానం వలన చిన్న చిన్న విషయాలకి కూడా ఆందోళన, మానసిక అలజడిని అనుభవిస్తాము. ఇంక పెద్ద ఇబ్బందులు ఎదురైతే ఎలా వుంటుందో కూడా ఊహించటానికి భయమేస్తుంది. మరి మనస్సు హాయిగా, ప్రశాంతంగా వుండాలంటే తప్పనిసరిగా ఎవరు ఆ పరిస్థితులను

శాసించగలరో వారిని తప్పక ఆశ్రయించి, వారు సూచించిన ప్రకారం మన జీవితాన్ని నడుపుకోవాలి. ఇప్పటిదాకా వివిధ భక్తులకు చూపిన దివ్యలీలల ద్వారా స్వామి సర్వసమర్థత్వము, సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, భక్తుల మీద స్వామికున్న అపార ప్రేమ, కరుణలను అర్థం చేసుకోగల్గాము. ఈ అధ్యాయములో స్వామి దర్శన , ఆశీస్సుల ప్రభావమెంతటిదో చూద్దాము.

## మల్లిఖార్జున్‌గారు, షుగర్ డాక్టరు, నెల్లూరు

2003వ సంllలో నెల్లూరు ట్రస్టు ప్రారంభోత్సవానికి దర్గాస్వామిని పిలుచుకు వచ్చే అవకాశం కలగటం వల్ల, స్వామిని దర్గాల దగ్గర దర్శించుకునే భాగ్యం కలిగింది. స్వామిని దర్శించిన దగ్గరనుండీ ధైర్యంగా వుండేది. అప్పటికి నేను నా ప్రాక్టీసు ఒక అద్దె ఇంట్లో చేస్తున్నాను. క్రొత్త ఇంటిని కొందామనే ఆలోచన వుంది కానీ నా దగ్గర అంత డబ్బు లేదు. కానీ ఒక ఇంటిని చూసి వున్నాను. ఆ విషయం స్వామికి చెప్పాను. "నాయనా! నీవు తప్పక కొంటావు, డబ్బులు వస్తాయి" అని ఆశీర్వదించారు. నెల్లూరు ట్రస్టు శంకుస్థాపన అయిన తర్వాత డాll శ్రీధర్ రెడ్డిని పిలిచి ఆయనకి నన్ను చూపించి "శ్రీధర్! మావాడు మంచివాడు. ధైర్యం కొంచెం తక్కువ. నీవు చేయేస్తే కానీ పని కాదు" అని అన్నారు. ఆ మాటలు చాలా క్యాజువల్‌గా తీసుకున్నాను. స్వామికి నేను చూసిన ఇంటిని చూపాను, స్వామి తన దండంతో నేలమీద కొట్టి "ఈ స్థలం నీదే నాయనా" అని అన్నారు.

కొన్నిరోజుల తర్వాత డాll శ్రీధర్‌రెడ్డి నాతో "అరెయ్ ఎవరో ఇంకొకరు నీవు చూసిన ఇంటిని కొందామనుకుంటున్నారు" అని సమాచారం తెలిపాడు. అప్పుడు మధ్యవర్తుల ద్వారా విషయం తెలుసుకుంటే ఆ ఇల్లు తల్లీ, కొడుకులది. మేము కొడుకుతో మాట్లాడుతుంటే ఇంకొకరు తల్లితో మాట్లాడుతున్నారు. వెంటనే మా తమ్ముడు (అమెరికా) పంపించిన 5 లక్షల రూపాయలు అడ్వాన్సు ఇచ్చి తర్వాత కొనుక్కున్నాను.అప్పుడు అంకణం 75 వేల

రూపాయలుంటే ఇప్పుడు అంకణం 7 లక్షల రూపాయలు. కేవలం స్వామికృపతో ఇంతటి ఇంటిని కొనగలిగాను. పైగా శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన సమాచారం తర్వాతనే విషయం తెలుసుకుని త్వరగా ఇల్లు కొనుక్కోగలిగాను. స్వామి చెప్పిన మాట "శ్రీధర్ చేయేస్తే పని అవుతుంది" ఇల్లు కొన్న తర్వాత కానీ అర్థం కాలేదు.

## రమేష్, మార్బుల్స్, నెల్లూరు

స్వామి దర్శనానికి వెళ్ళినప్పటి నుండి నా ఆర్థిక పరిస్థితి మెరుగు కాజొచ్చింది. మాగుంట లేఔట్‌లో ఒక స్థలం అమ్మకానికి పెట్టారు. అది అన్నివిధాల నా వ్యాపారానికి లాభకారి. కానీ నా దగ్గర దాన్ని కొనేంత డబ్బు లేదు. స్వామికి చెప్తే ఆ స్థలాన్ని నాకిప్పిస్తామన్నారు. ఆ స్థలం ఒకటిన్నర సంవత్సరం తర్వాత కూడా ఎవరూ కొనుక్కోలేదు. ఒకతను అడ్వాన్సు ఇచ్చి వున్నాడు కానీ మొత్తం ఇవ్వలేకపోయాడు. నేను ఒకటిన్నర సంవత్సరానికి పెరిగిన రేటు ఇచ్చి స్వామి దయ వలన కొనుక్కోగలిగాను. వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. నేనెప్పుడు స్వామి దర్శనం చేసుకున్నా స్వామి నాతో "ఎన్ని కోట్లు కావాలి?" అని అడుగుతారు. అలానే నాకు కోట్ల ఆదాయం ఇచ్చారు.

## కె. ఉమ మరియు యశోదమ్మగార్లు

1996వ సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన మేము మొదటిసారిగా దర్గాకు వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నాము. అప్పుడు నేను ఆఖరి సంవత్సరం బి.టెక్. చదువుచున్నాను. గేట్ ఎంట్రన్సు పరీక్ష వ్రాసి వున్నాను. స్వామీజీ నాకు మద్రాసు గిండీ కాలేజీలో సీటు వస్తుందని చెప్పారు. తర్వాత నాకు మద్రాసు ఐ.ఐ.టి.లో ఎమ్.టెక్. సీటు వచ్చింది. ఐ.ఐ.టిలో చేరిన తర్వాత నాకు ఆ వాతావరణం చూసి భయం వేసింది. చదువు మానివేద్దామనుకున్నాను. కానీ స్వామీజీ "నువ్వు చదవక తప్పదు" అని చెప్పి, ధైర్యం చెప్పి ఎమ్.టెక్. చదివించారు. నాకు మేథమేటిక్స్‌లో సెంట్ వస్తుందని చెప్పారు. అలానే వచ్చింది. ప్రాజెక్టు బాగా చేయమని చెప్పారు. నా ప్రాజెక్టు బెస్ట్ ప్రాజెక్టుగా సెలక్టు చేసి

వైస్ ప్రెసిడెంటు చేత అవార్డు ఇప్పించారు.

ఆ తర్వాత స్వామీజీ, అమ్మయ్యల ఆశీర్వచనం వలన నాకు క్యాంపస్ ఇంటర్వ్యూలో హె.సి.ఎల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

## యశోదమ్మగారు ఇలా చెపుతున్నారు

మా పెద్దమ్మాయి ప్రసవానికి ఆస్పత్రిలో చేర్పించి వున్నాము. ఏ సమయంలోనైనా ప్రసవమయ్యేటట్లు వున్నది. ఆ సమయంలో దర్గాస్వామి నెల్లూరు వచ్చి వున్నారని తెలిసి స్వామి దర్శనానికి వెళ్ళలేకపోతున్నానని చాలా బాధపడుతున్నాను. స్వామి కృష్ణారెడ్డిగారితో ఫోను చేయించి "పురుడు తల్లికి కానీ నీకు కాదు, నువ్వు వచ్చి దర్శనం చేసుకో" అని చెప్పారు. స్నానం చేసి స్వామి దగ్గరకి వెళ్ళేసరికి స్వామి అమ్మయ్యతో "అమ్మయ్యా! యశోదమ్మ బిడ్డకి జయ, విజయులు పుట్టారు. కృత్తికా నక్షత్రం, నా నక్షత్రమే" అని చెపుతున్నారు. నేను నమస్కారము చేసుకోగానే మీ పాపకే కాదమ్మా, మీ పాప ప్రక్కనున్న రూములో కూడా ఒక పాపకి బాబు పుట్టాడు. వాళ్ళు వేంకటేశ్వరస్వామి భక్తులు. వేంకటేశ్వరస్వామి దగ్గరుండి డెలివరీ చేసి వెళ్ళినాడు" అని చెప్పారు. స్వామి దర్శనం తర్వాత ఆస్పత్రికి వెళ్ళి ప్రక్కరూములో నున్న వాళ్ళని అడిగితే వాళ్ళు వేంకటేశ్వరస్వామి భక్తులము అని చెప్పారు. సర్వసృష్టిలో ఎక్కడ ఏమి జరుగుతున్నదో స్వామికి ఎరుకే.

## జె.వి. నారాయణ మూర్తి, నెల్లూరు.

1998 నాటికి నేను విద్యాసంస్థలు పెట్టి నష్టం వచ్చి అప్పుల్లో వున్నాను. సాయికుమార్ అనే భక్తుడి ద్వారా దర్గాస్వామి గురించి తెలిసి కావలి రమా నర్సింగ్ హెూమ్‌కి స్వామి వచ్చినప్పుడు మా కష్టాలు చెప్పుకోవటానికి నా భార్యతో కలసి వెళ్ళాను. వేల సంఖ్యలో భక్తులు వచ్చారు. సాయంత్రం మాత్రమే స్వామికి చెప్పుకునే అవకాశం కలిగింది. నేను నాకున్న రెండు సమస్యల గురించి చెప్పాను. అవి

1. నా భార్యకు మోకాళ్ళ నొప్పులు (ముఖ్యంగా పని ఎక్కువ చేయటం వలన వచ్చినవి). క్రింద కూర్చోలేదు. చాలా మంది డాక్టర్లకు

చూపించినా ఫలితం లేకపోయేసరికి నా భార్య విసిగిపోయి మరే డాక్టరు దగ్గరకి వెళ్ళేది కాదు. కానీ దర్గాస్వామి "కూర్చో అక్కా!" అనే సరికి ఏ యిబ్బందీ లేకుండా క్రింద కూర్చో కలిగింది. స్వామి దండంతో వీపు మీద నిమిరి తగ్గిపోతుంది అని అన్నారు. ఆ అమృతవాక్కుతో 10 సం॥ల క్రితం నుండీ వున్న మోకాళ్ళ నొప్పులు ఆ రోజు నుండీ తగ్గిపోయాయి.

2. నా అప్పులు గురించి విన్నవిస్తే స్వామి "నేను సగం ఇస్తా, నువ్వు సగం వేసుకో" అన్నారు. తర్వాత ప్రయోజకులైన నా విద్యార్థులను అడగంగానే కొంత డబ్బు ఇచ్చారు. నాకున్న ఇంటిని అమ్మివేసి అప్పులు తీర్చేశాను. తర్వాత దర్గాల దగ్గరకి వెళ్ళినప్పుడు స్వామితో 'మీరు సగం ఇస్తానన్నారు కానీ నేను అప్పులు తీర్చేశాను' అని చెప్పగానే "అదేమిటయ్యా! నీ శిష్యులు అంతా తలా ఒక చెయ్యి వేసారు కదా. అదే నేను, అదే నేను" అని స్వామి తమ విశ్వరూపాన్ని ప్రకటం చేసారు. 'అన్ని జీవులలో వెంకయ్య వున్నాడని వ్రాసుకోమన్న" గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి మాటను మరలా చెపుతున్నారు. అంతటా తానైన పరమాత్మలో భాగమై ఉండి కూడా ఆ స్పృహను కోల్పోయిన మనలను ఉద్ధరించటానికి ఆ పరమాత్మే వివిధ మహనీయుల (సద్గురువుల) రూపాలలో ఆయా దేశ, కాల పరిస్థితులను బట్టి వస్తారు. శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ దర్గాస్వామి, శ్రీ సాయిబాబా మొదలైన మహనీయులందరి రూపాలు వేరైనా వారి రూపంలో వున్న పరమాత్మను గుర్తించి తరించెదము గాక! సద్గురువు విశ్వరూపుడని, ఏ జీవిని ఆదరించినా, బాధించినా అది ఆ సద్గురువుకే చెందుతుందని గుర్తించి నడుచుకుందుము గాక!

3. ఒకసారి దత్తయజ్ఞం చేస్తున్నామని చెప్తే "నేనొస్తాను" అని ఆశీర్వదించారు. జులై 14, 15, 16లలో నా కాలేజీ క్యాంపస్‌లో దత్తయజ్ఞం చేసాను. చిట్టచివరి రోజున పెద్ద మీసాలు, తెల్ల జుబ్బా వేసుకొన్న ఒక క్రొత్త వ్యక్తి వచ్చిన వారికి కుర్చీలు వేస్తున్నాడే, ఎవరీ క్రొత్తవ్యక్తి అని

మా కోడలు చూస్తూండగా అతను కూడా మా కోడలు వంక చూసి అదృశ్యమైపోయాడు. ఈ విషయం నాకు తెలియదు. దర్గాల దగ్గరకి వెళ్ళినప్పుడు 'స్వామీ! మీ ఆజ్ఞతో యజ్ఞం బాగా జరిగింది' అని చెప్పాను. వెంటనే "నేనొచ్చాను, మీ కోడలు నన్ను చూసి నవ్వింది, మీసాలు పెట్టుకొని, తెల్ల జుబ్బా వేసుకొని వచ్చాను. మీ బావమరిది భార్యకు కుర్చీ కూడా వేసాను " అని చెప్పేసరికి నేను చాలా ఆనందపడ్డాను. మా కోడలు (స్వామి నెల్లూరు వచ్చినప్పుడు) స్వామి దర్శనం చేసుకున్నప్పుడు స్వామి మా కోడలు చేతులు పట్టుకుని "అమ్మా! మీ మామగారు యజ్ఞం చేసినప్పుడు నేనొచ్చాను. నువ్వు చూసావు" అని చెప్పేసరికి మా కోడలు చాలా ఆనంద పడింది.

## జె. బాలార్క (జె.వి. నారాయణమూర్తి గారి కోడలు), నెల్లూరు

నాకు సాయిబాబా మీద పాటలు రావు. దత్తమఠంలో జరిగే కచేరీకి ముందర రెండు మూడు పాటలు నేర్చుకుని వెళ్ళాను. సాయిబాబా మీద పాట చెప్పమ్మా అన్నారు. నేను పాడుతుంటే పాటలు యథాతథంగా వచ్చాయి. అది స్వామి దయ.

"నీవు నాకూతురువి. వేసవి కాలంలో కూతురు, అల్లుడు ఇంటికొస్తే కదా నాకు ఆనందంగా వుండేదని మా వారిని దర్గాలకు రమ్మని" స్వామి మా ఆయనను నన్ను దర్గాలకు తీసుకురమ్మని చెపుతుంటారు.

నా కూతురుతో "నీకు 10వ తరగతిలో 550 మార్కులు పైన వస్తే వెయ్యిన్నూటపదహార్లు ఇస్తానని" అన్నారు.

## వెంకట్రావు, దూరదర్శన్ కేంద్రం

1. 2008లో శిరిడీ వెళ్లినప్పుడు ఒక గురువారం ద్వారకామాయిలో కూర్చుని వున్నాము. ఆ రోజు చావడి ఉత్సవం జరుగుతోంది. అందువలన మమ్మల్ని అందరినీ బయటకు పంపించారు. నేను, నా భార్య మా యిద్దరి పాపల్ని ఎత్తుకుని నుంచున్నాము. అన్ని లక్షలమందిలో నన్ను, నా భార్యని ముక్కూ, ముఖము తెలియని వ్యక్తి ద్వారకామాయిలోకి రమ్మని పిలిచి లోపల కూర్చోబెట్టాడు. స్వామే ఆ

రూపంలో వచ్చి మమ్మల్ని అలా అనుగ్రహించారని భావిస్తున్నాను.

నాకు ఇద్దరు ఆడపిల్లలు. నాకొక బాబును ఇస్తామని స్వామి చెప్పారు. తర్వాత నా భార్య గర్భవతి అయింది. నేను స్వామి దగ్గరున్నప్పుడు నా భార్యకి నొప్పులు వస్తున్నాయని ఫోను ద్వారా తెలిసి స్వామికి చెప్తే స్వామి ఊదీ ఇచ్చి "భద్రం నాయనా! 1వ తారీఖు 10 గంటలు దాటితే మొత్తం అనుకూలంగా వుంటుంది" అని చెప్పారు. నా భార్యకు 29వ తారీఖు తెల్లవారుఝామున 3 గం॥ 45 ని॥లకు జన్మించాడు. పిల్లవాడిని బయటకు తీసేటప్పుడు తేడా జరగడంతో నా భార్యకు బాగా బ్లీడింగ్ అయ్యి, కోమాలోకి వెళ్ళింది. నా ఇంజనీరింగ్ స్నేహితులు 5 బాటిల్స్ రక్తం ఇచ్చారు. కానీ ఎక్కించిన రక్తం అంతా బయటకు వచ్చేసింది. డాక్టరమ్మ, ఆమె భర్త నా భార్య నాడి చూసి బ్రతకదని చెప్పారు. స్వామికి ఫోను చేసి విషయం చెపితే చాలా కోపంగా "ఎవడ్రా వాడు చెప్పేదానికి, కర్త అనేవాడు వున్నాడు చనిపోయిందని చెప్పటానికి. ఒక బాటిల్ రక్తం ఎక్కించుకుంటూ వేలూరు పోండి. ఏమీ కాదు పో ఆ పాపకు" అని అభయమిచ్చారు. మేము అలానే వేలూరు వెళ్ళి ఆస్పత్రిలో చేర్పించాము. మరురోజు ఉదయం కల్లా నా భార్య పరిస్థితి మెరుగైంది. కానీ మా బాబు 1వ తారీఖు ఉదయం 5 గం॥ 15 ని॥లకు మరణించాడు. ఇంటికి వచ్చిన తర్వాత స్వామి దగ్గరకి వస్తే "చెట్టు (తల్లి) కావాలా? , కాయలు (పిల్లలు) కావాలా?" అని అడిగారు. నేను చెట్టే కావాలన్నాను. తర్వాత స్వామి నాతో "నీకు మగబిడ్డనిద్దామనుకుంటున్నాము, ఇస్తాయురా" అని ఆశీర్వదించారు. స్వామి ఆశీస్సులే లేకుంటే 5 బాటిల్స్ రక్తం ఎక్కించినా ఎక్కనిది ఒక బాటిల్ రక్తం ఎలా ఎక్కింది?, అప్పటిదాకా ప్రమాదకరంగా వున్న పరిస్థితి ఒక్కరోజులో ఎలా మారుతుంది. ఓం సర్వ సమర్థ సద్గురు శ్రీ దర్గాస్వామినే నమ:

## అనూరాధ(ఎన్. శ్రీనివాసులుగారి కూతురు), వైజాగ్

1. 2004లో స్వామి దగ్గరకి వెళ్ళి స్వామితో చెన్నై, హైదరాబాదు, బెంగుళూరు ఏ వూరిలో షాపు పెట్టుకోమంటారు అని అడిగితే స్వామి

"వైజాగ్ వెళ్ళ"మన్నారు. నేను హైదరాబాదులో తెలిసినవారు వున్నారంటే స్వామి వద్దన్నారు. చెన్నై దగ్గరగా వుంటుందని చెప్పాను. అదీ వద్దన్నారు. వైజాగ్‌లో తెలిసిన వారెవరూ లేరని చెపితే "మీ ఆయన స్నేహితుడు వున్నాడు. అతను చూసుకుంటాడు. అక్కడ దేవుడిలాగా సహాయపడే వాళ్ళు వుంటారని" చెప్పారు. వైజాగ్ నుండి దర్గాలకి రావాలంటే దూరం అని చెప్పాను. "అక్కడ గోపాల్‌బాబా వున్నారు. ఆయన దర్శనం చేసుకోండి. నన్ను ఆయనలో దర్శించుకోండి. అవసరమైనప్పుడు ఫోను చెయ్యండి" అని చెప్పారు.

మేము ఇంటికి వచ్చాక ఇంకా దాని గురించే ఆలోచిస్తున్నాము. ఒకరోజు స్వప్నంలో ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి సతీమణి శ్రీమతి అలివేలు మంగమ్మగారు కనిపించి శ్రీ దర్గాస్వామి ఫోటో చూపించి ఆయన మాట వినండి, మీకు మంచి జరుగుతుంది అని చెప్పారు. మేము అలానే వైజాగ్ వెళ్ళాము. స్వామి చెప్పినట్లే చుట్టుప్రక్కల వారి సహాయంతో అంతా సవ్యంగా జరుగుతోంది.

2. 2008లో మావారికి జ్వరంగా వుండి తగ్గకపోతే షుగర్ పరీక్ష చేస్తే 430 వుంది. డాక్టరుగారు అడ్మిట్ అవ్వమన్నారు. మావారు చాలా కంగారుపడి ఇంటికి వచ్చాక దర్గాస్వామికి మంగళవారం ఫోను చేస్తే " ఏమీ కంగారు పడాల్సిన అవసరం లేదు. డాక్టరు సూదిమందు వేస్తారు, భయపడవద్దు, మళ్ళీ శనివారం ఉదయం 10గంటలకి ఫోను చెయ్యండి" అని స్వామి అభయమిచ్చారు. డాక్టరుకి చూపిస్తే ఇన్సులిన్ ఇంజెక్షన్లు ఇచ్చారు. శనివారానికి కొద్దిగా కోలుకున్నారు. స్వామికి ఫోను చేస్తే స్వామి "ఇప్పుడు ఫరవాలేదు కదా" అన్నారు. 'ఇప్పుడు ఫరవాలేదు, కానీ మా ఆయనకు రాత్రిపూట నిద్ర రావటం లేదు స్వామీ' అని విన్నవించాను. "పడుకునే ముందర సాయినామం 20సార్లు జపించమన్నారు. అంతా సాయినాథుని దయతో జరుగుతుంది" అని చెప్పారు. అలానే చేస్తే హాయిగా నిద్రపట్టేది. 15రోజుల తర్వాత డాక్టరుగారు షుగర్ పరీక్ష చేస్తే నార్మల్‌గా వుంది. డాక్టరుగారు ఆశ్చర్యపోయి 15రోజులలో ఎలా తగ్గింది అని అడిగితే మావారు

దర్గాస్వామి ఆశీర్వదించటం వలన అని చెప్పి స్వామి గురించి చెప్పారు.

3. మా అబ్బాయికి చిన్నప్పుడే డాక్టర్లు పరీక్ష చేసి కంటిలో గ్లుకోమా వచ్చే అవకాశం వుందని చెప్పారు. స్వామికి చెప్తే కంటి చూపుకి ఢోకా లేదని చెప్పారు. 4 సంవత్సరముల తర్వాత మామూలుగా చెకప్ కోసమని వెళ్ళితే ప్రముఖ డాక్టరు కంటిలో ప్రాబ్లమ్ వుందని చెప్పాడు. వెంబడే చెన్నైలోని శంకర్ నేత్రాలయలో చూపిస్తే గ్లుకోమా వుందని నిర్ధారించి తరువాత రోజు రమ్మన్నారు. మరురోజు ఉదయం ఫీల్డ్ టెస్ట్ చేసి గ్లుకోమా లేదని తేల్చి ఇంకొక వార్డుకి పంపిస్తే అక్కడ చెక్ చేసి చుండ్రు, దురదల వలన ఇలా అయ్యిందని చెప్పి, కళ్ళకి ఆయింట్‌మెంట్, డ్రాప్స్ ఇచ్చి, వేడి నీళ్ళతో కానీ, చల్లటి నీళ్ళతో కానీ కాపడం పెట్టమన్నారు. ప్రముఖ డాక్టర్లు అధునాతనమైన ప్రయోగశాలల్లో తేల్చి చెప్పింది లేకుండా పోయిందంటే స్వామి వాక్కు ఎంతటి మహిమాన్వితమైనదో తెలుస్తోంది.

4. 2008లో మా అమ్మాయికి (10సంవత్సరాలు) ఒక చర్మవ్యాధి వచ్చి శరీరమంతా నల్లటి మచ్చలు వచ్చాయి. చాలా వికారంగా తయారయ్యింది. డాక్టరుగారికి చూపిస్తే పూవా థెరపీ (కరెంట్‌తో చేసేది) 20సార్లు చేసారు అయినా తగ్గలేదు. పైగా మా అమ్మాయి చాలా నీరసించింది. డాక్టరిని అడిగితే ఇంకొక 20 లేదా 40సార్లు చేయాల్సి వుంటుందని చెప్పారు. చాలా భయమేసి దర్గాస్వామికి చెప్తే "ప్రాణహాని లేదు. మీ కులదైవాన్ని మరిచిపోయారు. ఆయనకు మొక్కుకోండి, తగ్గిపోతుంది" అని చెప్పారు. తరువాత రోజు గోపాల్‌బాబాగారి దర్శనానికి వెళ్ళితే ఆయన మౌనంగా వేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవిల ఫోటో ఇచ్చి పట్టుకోమన్నారు. నేను, మావారు, మా పాప, బాబు (నలుగురం) ఆ ఫోటో పట్టుకొని అరగంట నిల్చున్నాము. మా కులదైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి. మేము పాపకి చర్మవ్యాధి తగ్గిపోతే తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామికి పాప తలనీలాలు సమర్పిస్తామని మొక్కుకున్నాము. తరువాత చెన్నైలో డాక్టరుకి చూపిస్తే ఒక ఆయింట్‌మెంట్, ఒక ఆయిల్ బాటిల్ వ్రాసిచ్చారు. వెంటనే అంతటి భయంకర చర్మవ్యాధి తగ్గిపోయింది. ఇంతటి ఇబ్బంది నుండి రక్షించిన

దర్గాస్వామికి నమస్కరించుకోవటము తప్ప ఏమిచ్చుకోగలము?

మా కులదైవానికి మొక్కుకోమని చెప్పటమూ, గోపాల్‌బాబా మా కులదైవము ఫోటో ఇవ్వటమూ బట్టీ దర్గాస్వామి, గోపాల్‌బాబా వేరుకాదని గుర్తించి ఆ మహనీయులను ఏ భేదభావము లేకుండా సేవించెదముగాక!

## అనూరాధ భర్తగారు చెపుతున్నారు

గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బదరీనాథ్‌లను కలిపి చార్‌ధామ్ అంటారు. చార్‌ధామ్‌కి వెళ్ళాలని స్వామి అనుమతితో నేను ఒక్కడినే టిక్కెట్లు రిజర్వు చేయించుకున్నాను. ఒక్కడినే వెళ్ళుతున్నానని నా భార్య మదనపడుతుండేది. ఆ భగవంతుని కృప వలన తెలిసినవారు ఐదుగురు కలిసి వస్తామని టిక్కెట్లు రిజర్వు చేయించుకున్నారు. యాత్రకు బయలుదేరే ముందర స్వామి ఆశీస్సులకై ఫోను చేస్తే "జయం, జయం, జయం" అని ఆశీర్వదించారు. అన్నిచోట్ల బాగా దర్శనం జరిగింది. ఉత్తర కాశీ నుండి బయలుదేరి కేదార్‌నాథ్ దగ్గరకి వచ్చేసరికి వర్షం పడుతోంది. పైకెళ్ళే కొద్దీ ఆక్సిజన్ తగ్గిపోతుండడం వలన నాకు ఊపిరి తీసుకోవటం కష్టమైంది. దాంతో ఆ రోజు ప్రయాణం ముగించి ఉత్తర కాశీకి వచ్చేశాము. నా అనారోగ్యం వలన నేనొచ్చినా రాకపోయినా నాతోపాటు వచ్చినవాళ్ళని తర్వాతరోజు కేదార్‌నాథ్ వెళ్ళిరమ్మన్నాను. కానీ ఆ రోజు రాత్రి 12 గం॥ 30 ని॥లకు స్వప్నంలో దర్గాస్వామి, దర్గామాత, గోపాల్‌బాబా కనపడి ప్రక్కనే వున్న శివుడు, పార్వతీదేవిలతో నన్ను చూపి "వీడు నా బిడ్డ. మీ దర్శనం ఇచ్చి జాగ్రత్తగా పంపించండి" అని చెపుతున్నారు. ఈ స్వప్నం ఎంత అమోఘమైనదంటే తెల్లవారేసరికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చి మా వారందరి కంటే ఉత్సాహంగా బయలుదేరి కేదార్‌నాథ్‌కెళ్ళి రాగలిగాను. అంతేగాక చుట్టుప్రక్కల ప్రదేశాలు కూడా చూడగలిగాను. మా వారందరూ ఓపిక లేక ఆ ప్రదేశాలకు రాలేకపోయారు. సద్గురు ఆశీస్సులతో చేసిన యాత్ర ఎంత సార్థకవంతమవుతుందో ప్రత్యక్షంగా అనుభవమైంది, కొసమెరుపేంటంటే మేము కేదార్‌నాథ్‌కి వెళ్ళిన రోజు వాతావరణం

చాలా ఆహ్లాదకరంగా వుండి ముందరరోజు, తర్వాతరోజు కూడా వర్షం పడింది. ఇలా ప్రకృతి కూడా ఎంతో సహకరించింది.

## వి.వి.రామారావుగారు, నెల్లూరు

1997లో నా శ్రీమతి చనిపోయింది. 1999లో మా పెదబాబుకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నాము. పిల్లవాడు వరంగల్ ఆర్.ఇ.సి (ఎన్.ఐ.టి)లో డిస్టింక్షన్‌లో పాసై ఉద్యోగం చేస్తున్నా ఏదో కారణంతో చాలా పెళ్ళిసంబంధాలు తప్పిపోయాయి. అదీగాక మా తాతల దగ్గర నుండి ప్రతీ తరంలో ఎవరో ఒకరు పెళ్ళికాకుండా వుంటున్నారు. (మా పెద్ద తాతయ్య, మా పెదనాన్న, మా అన్నయ్యలకు పెళ్ళిళ్ళు కాలేదు). దీనితో మా వాడి పెళ్ళి గురించి ఆదుర్దా ఎక్కువైంది. 1999 జనవరిలో ఈ విషయమై స్వామి దగ్గరకి వెళ్ళి విన్నవించుకున్నాను. మే మొదటివారంలో పెళ్ళి అవుతుంది అన్నారు. నా ప్రయత్నమేమీ లేకుండా పెళ్ళివారు వారికై వారు వచ్చి మాట్లాడుకుని వెళ్ళారు. స్వామి దయ వలన మే 9 వ తారీఖు పెళ్ళి అయ్యింది.

నేను రాపూరులో సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా వుంటున్నప్పుడు నా దగ్గర పనిచేసే షరాఫ్ విపరీతంగా త్రాగేవాడు. వీడి త్రాగుడు అలవాటు వలన అతని చెల్లెలికి పెళ్ళి సంబంధం కుదరట్లేదు. ఒకరోజు ఆ పిల్ల నా దగ్గరకొచ్చి బాధపడితే నేను ఆ పిల్లను దర్గాస్వామి దర్శనానికి తీసుకెళ్ళాను. స్వామి ఆ పిల్లతో "అమ్మా! మీకు గొలగమూడి దగ్గర కాబట్టి 6 శనివారాలు వెంకయ్యస్వామి దర్శనం చేసుకొని, ఒక ప్రదక్షిణ చేసి, ధునిలో కాయ సమర్పించు" అని చెప్పారు. ఆ పిల్ల అలానే చేయటం ప్రారంభించిన 4వ వారానికల్లా సూళ్ళూరుపేటలో బంధువుల పెళ్ళికి వెళ్ళితే అక్కడ ఒక కుటుంబం వారు చూసి ఇష్టపడి మాట్లాడుకొని 6వ శనివారం కల్లా పెళ్లి కుదిరింది, ఆ తర్వాత పెళ్ళి అయి వారు ఆనందంగా వున్నారు.

మా యింటి దగ్గర వుండే భార్యాభర్తలకి పడేది కాదు. అతను ఆటో డ్రైవరు. అతను ఒకటంటే దానికి పూర్తి వ్యతిరేకంగా భార్య మాట్లాడేది. రేకుల షెడ్డులో వుండేవారు. అతన్ని తీసుకొని స్వామి దగ్గరకి వెళ్ళితే

స్వామి అతనితో "బాబూ! నీ భార్య మాట విను. నీ భార్య కంట నీరు పెట్టుకుంటే నీకు డబ్బు ఎలా నిలుస్తుంది. నీవు నీ భార్య మాట వినకపోతే నా దగ్గరకి రాకు. వింటావా? వింటావా? వింటావా?" అని చెప్పి పంపించారు. అతను స్వామి చెప్పినట్లు వింటున్నాడు. ఇప్పుడు హాయిగా వుంటున్నారు. మిద్దె ఇల్లు కట్టుకున్నారు.

## సుధాకర్, ఫత్తేఖాన్‌పేట, నెల్లూరు

ఒకసారి దర్గాస్వామి దర్శనానికి క్రొత్త టైర్లు వేసిన వ్యాన్‌లో నా స్నేహితులతో బయలుదేరాను. మేమంతా మాకు తెలిసిన వ్యక్తి దుర్గుణాల గురించి మాట్లాడుకుంటూ ప్రయాణం చేస్తున్నాము. కొంతసేపటికి టైరు పంక్చరయ్యిందని తెలిసి చూసేసరికి అది కొన్ని కిలోమీటర్ల ముందరే పంక్చరయ్యిందనీ, పంక్చరయిన టైరు చాలా నలిగిపోయి దాన్ని తీసి పారెయ్యాల్సి వచ్చింది. అప్పుడు కానీ మహనీయుల దర్శనానికి వెళ్ళేటప్పుడు సద్గురు స్మరణతో వెళ్ళాలనీ, అలా వెళ్ళకపోవటం వలననే టైరు పంక్చరయ్యిందని మనస్సులో ముద్రపడింది. ఇతరులను నిందించటం పంది మల భక్షణ చేయటం వంటిదని సాయిబాబా చేసిన హెచ్చరికను గుర్తుంచుకుని నడుచుకుందుముగాక!

మా అబ్బాయి 10వ తరగతి చదివేటప్పుడు మొదటిసారి స్వామి దర్శనానికి తీసుకువెళ్ళాను. స్వామి పాసవుతాడు అని ఆశీర్వదించారు. నాకు మా వాడు పాసవుతాడు అనే నమ్మకం లేదు. కానీ స్వామిదయ వలన 10వ తరగతి పాసవటమే గాక ప్రస్తుతానికి ఎమ్.ఎస్‌సి(కంప్యూటర్ సైన్సు) చదువుతున్నాడు. ఒక్క దర్శనంతో మావాడి చదువు బాధ్యత అంతా స్వామే వహిస్తున్నారు.

## సాయిప్రసాద్, నెల్లూరు

1. 1995లో మావాడు ఐ.ఐ.టిలో ఎమ్.టెక్ పూర్తి చేసాడు. అమెరికాలో పిహెచ్.డి కోసం ప్రయత్నిస్తే రాకపోయేసరికి రిలయన్స్ కంపెనీలో ఇంజనీరుగా చేరాడు. తర్వాత సంవత్సరం ప్రయత్నిస్తే ఒక యూనివర్శిటీలో అడ్మిషన్ వచ్చింది. అమెరికాకి పంపించాలా లేదా

అని దత్తసాయి మందిరం సుబ్రహ్మణ్యంగారిని అడిగితే ఆయన 'నేను కాదు చెప్పేది. కడప దగ్గర దర్గాస్వామి వున్నారు, ఆయన చెప్పినట్లు చేస్తే మంచిది' అన్నారు. నాకు స్వాములంటే నమ్మకం లేదు. కానీ పెద్దాయన సుబ్రహ్మణ్యంగారు చెప్పారని స్వామి దగ్గరకి బయలుదేరాను. నేను అక్కడకి వెళ్ళకముందే స్వామి అక్కడవున్న నెల్లూరు భక్తులతో ఇవాళ నెల్లూరునుండి ఇంకొక భక్తుడు వస్తున్నాడు అని చెప్పారు. నేను వెళ్ళిన తర్వాత స్వామి "ఎవరు నీవు? ఎందుకు వచ్చావు?" అని అడిగారు. స్వామీ! నేను నెల్లూరు నుండి వచ్చాను. నేను నిష్కపటంగా మాట్లాడతాను. నాకు మీ దగ్గరకి రావటానికి ఇష్టంలేదు. ఒక విషయమై నెల్లూరు దత్తసాయిమందిరం సుబ్రహ్మణ్యంగారిని అడిగితే ఆయన మిమ్మల్ని కలవమన్నారు. "ఏమిటి మీ సమస్య" అన్నారు స్వామి. మా అబ్బాయికి అమెరికాలో పిహెచ్.డి చేసే అవకాశం వచ్చింది. మీరు పొమ్మంటే పోతాడు. వద్దంటే వెళ్ళడు" అని చెప్పాను. క్షణమాలోచించి మా అబ్బాయి పేరడిగి "ఆ అబ్బాయిని నిరభ్యంతరంగా వెళ్ళమని చెప్పు. ఆ అబ్బాయి వెల్ఫేరు (బాగోగులు) అంతా నేను చూసుకుంటాను" అని అన్నారు. మా అబ్బాయి తర్వాత స్వామి దర్శనం చేసుకొని మరలా ఆ విషయమై అడిగి స్వామి చెప్పినట్లు అమెరికా వెళ్ళి పిహెచ్.డి పూర్తి చేసి సైంటిస్టుగా పనిచేస్తున్నాడు. తర్వాత కూడా స్వామి "మీ వాడ్ని అమెరికాకి పంపించింది నేనే, మరలా వాడ్ని నేనే ఇండియాకు తీసుకువస్తాను. కొంచెం సమయం పడుతుంది" అని మాకు అభయమిచ్చేవారు.

2. 1998లో మా అమ్మాయికి పెళ్ళిసంబంధాలు చూస్తూ ఒక పిల్లవాడి ఫోటో స్వామికి చూపించాము. స్వామి "ఏమీ ఇబ్బందులు లేవు. సమస్యలు రావు. బాగుంటుంది. పెళ్ళికి వస్తాను ఏ రూపంలో వస్తానో చెప్పను" అన్నారు. పెళ్ళికి స్వామి ఆశీస్సులతో ఉత్తరం వ్రాయించి ఇంకొక భక్తుని చేత పంపించారు. వాళ్ళు స్వామి దయ వలన హాయిగా వున్నారు. ప్రస్తుతం పూణేలో పెద్ద ఇల్లు కట్టుకున్నారు.

3. 2001లో మా అబ్బాయి అమెరికాలో పిహెచ్.డి పూర్తి చేసి

ఉద్యోగంలో చేరి వున్నాడు. మమ్మల్ని అమెరికాకి రమ్మన్నాడు. మా తల్లిదండ్రులు ఇద్దరికీ చాలాకాలం క్రిందటే పక్షవాతం వచ్చింది. మా ఇంట్లో వుండేవారు. కానీ కొన్ని ఇబ్బందుల వలన వాళ్ళని కొన్ని నెలల క్రితం హైదరాబాద్‌లోని మా తమ్ముడి ఇంట్లో వుంచాము. అందువలన వారి అనుమతి తీసుకొని, స్వామి ఆశీస్సులు తీసుకొని అమెరికాకి వెళ్ళి 2001 నవంబరుకి ఇండియాకి వచ్చాము. మా నాన్నగారు 2001 డిసెంబరులో శరీరం వదిలేసారు. అప్పటినుండీ మా అమ్మగారు కోమాలోకి వెళ్ళారు. ఎంతకాలం బ్రతుకుతారో తెలియదు. కానీ అంతకుముందునుండీ మా అబ్బాయికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నాము. పైగా మా అబ్బాయి పెళ్ళి చేయటానికి ఏమీ అభ్యంతరము లేదు. అందువలన ఒక మూడు సంబంధాలు తీసుకుని స్వామికి చూపిస్తే వైజాగ్‌లో స్థిరపడిన నెల్లూరు సంబంధమును స్వామి ఖాయం చేసారు. ఆ అమ్మాయి నిదానంగా వుంటుందని పిల్లవాడికి అనుకూలంగా వుంటుందని చెప్పారు. మేము పెళ్ళి 25 ఏప్రియల్ 2002న నిర్ణయించి స్వామి దగ్గరకి వెళ్ళి పెళ్ళి విషయము, మా అమ్మ ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పాను. అప్పుడు స్వామి “ముందే మీ అమ్మ పోతుంది. అదే ముహూర్తానికి పెళ్ళి జరుగుతుంది” అని చెప్పారు. మా అబ్బాయి పెళ్ళికని ఏప్రియల్ 22వ తారీఖున 11 గంటలకి ఇండియాకు వచ్చాడు. మా అమ్మ అదే రోజు 11 గం॥ 30 ని॥లకు కాలం చేసారు. స్వామికి ఫోను చేసి విషయం చెప్తే ‘నేను చెప్పాను కదా మీ అమ్మ ముందర వెళ్ళిపోతుందని, మీరు పెళ్ళి చేసుకోండి అదే ముహూర్తానికి” అని చెప్పారు. మా అమ్మ దహన సంస్కారాలు చేసాక మా తమ్ముడు మిగిలిన కార్యక్రమం చేయటంతో నేను పెళ్ళికి వెళ్ళగలిగాను. పిల్లవైపువారికి కూడా ఇలాంటి సమయంలో పెళ్ళి చేసుకోవటానికి ఏమాత్రం అభ్యంతరం లేకపోయేసరికి ఆ ముహూర్తానికే పెళ్ళి చాలా వేడుకగా జరిగింది. ఇదంతా స్వామికృప కాకపోతే అన్ని సంఘటనలు ఏమాత్రం ఇబ్బంది లేకుండా ఎలా జరుగగలవు? నమో సద్గురురాయా! నమస్తే నమ:

4. నా భార్యతో స్వామి ఒకసారి "నీకు తెలుసా! మీ అల్లుడి చేత పెద్ద ఇల్లు కట్టిస్తున్నాను. పూనా కెళ్ళి చూడు" అన్నారు. తర్వాత పూనా కెళ్ళి చూస్తే నిజంగానే చాలా పెద్ద ఇల్లు కట్టారు. పైగా అది డూప్లెక్సు ఇల్లు. మాకు ఇల్లు కడుతున్నారని తెలుసుగానీ ఎంత ఇల్లు అనే విషయాలు ఏమీ తెలియవు. ఎక్కడో నీలకంఠరావుపేటలో కూర్చున్న స్వామికి అంత స్పష్టంగా తెలుస్తున్నాయి అంటే స్వామి సర్వవ్యాపకుడని, సర్వజ్ఞుడని స్పష్టమవుతున్నది.

## అమర్‌నాథ్, స్వరూపగుప్తాగారి తమ్ముడు

1. మా అమ్మాయి పెళ్ళి అయిన తర్వాత స్వీడన్ వెళ్ళటం కోసం వీసాకి అప్లై చేసి వున్నాము. స్వామి "ఇద్దరూ కలిసి వెళతారు" అని ఆశీర్వదించారు. కానీ మా అల్లుడు ఢిల్లీ వీసా ఆఫీసుకి ఫోను చేస్తే ఇంకొక 10రోజుల దాకా రాకపోవచ్చు అని చెప్పారు. అంతటితో అతను మా అమ్మాయిని తర్వాత పంపించండి నేను ముందర వెళ్ళిపోతాను అని తర్వాత రోజు అన్నాడు. నేను అతనితో స్వామి చెప్పారంటే మీరిద్దరూ తప్పనిసరిగా ఒకేసారి వెళతారు అని స్వామి ఆశీర్వచనం గుర్తు చేసాను. అద్భుతంగా ఆ రోజు సాయంత్రానికి కల్లా మా అమ్మాయికి వీసా వచ్చింది. మా అల్లుడు స్వామి గొప్పతనాన్ని అప్పుడు గ్రహించాడు. స్వామి మాట జరిగి తీరవలసిందే.

2. ఒకసారి దర్గాలో ఒక ఫంక్షన్ జరిగిన రోజు నేను, నా అన్న, నా భార్య, నా వదిన కలిసి ఆటోలో స్వామి దగ్గరకి వెళ్ళాము. ఆటో సరిగ్గా పని చేయట్లేదని ఆటో డ్రైవరు రిపేరు చేస్తున్నాడు. స్వామి దగ్గర సెలవు తీసుకొని మా ఇంటికి బయలుదేరబోతే ఆటో స్టార్టు అవ్వట్లేదనీ, లైట్లు వెలగట్లేదనీ, రాత్రిపూట లైట్లు లేకుండా వెళ్ళటం కష్టమని చెప్పాడు. స్వామి పంపించారు కాబట్టి నేను ధైర్యంగా ఆటో డ్రైవర్‌తో 'నువ్వు స్టార్టు చేయి. పంపించేవాడు ఆయన' అని చాలా నమ్మకంగా చెప్పాను. వెంటనే ఆటో స్టార్టు అవటమేగాక లైట్లుకూడా వెలిగాయి. అందరూ ఆశ్చర్యపోయారు. ఆటో అతను 'ఏమి అన్నా! ఇలా స్టార్టు అయ్యింది'

అంటే "మనలో ఎవరికో సందేహం వుండి వుండాలి. దాన్ని తీసెయ్యటానికే స్వామి ఇలా చేసుంటారు" అని చెప్పాను.

3. మా అన్న షష్ఠిపూర్తి కార్యక్రమము స్వామి సొంత ఖర్చుతో దర్గాలలో చేయించినారు. మొత్తం 500 మందికి పైగా భోజనాలు ఏర్పాటు చేయించినారు.

4. సత్యసాయిబాబా మందిర నిర్మాణమప్పుడు స్వామి ఆశీస్సులకని వెళ్లినప్పుడు స్వామి కొంత డబ్బులిచ్చి, భూమి పూజ చేయించారు. అప్పటినుండీ సలహాలకోసం స్వామిని కలుస్తుండేవారము. సాయిబాబా, కృష్ణుని విగ్రహాలు తీసుకురావటానికి నేను, నా తమ్ముడు జైపూర్ వెళ్ళటానికి స్వామి ఆశీస్సులకోసం వెళ్ళాము. మాటల సందర్భంలో స్వామిని ఎంత ఖర్చవుతుంది స్వామీ అంటే 70, 80 వేలు అవుతుందన్నారు. స్వామితో విగ్రహం సెలెక్టు చేయటం నాకు తెలియదు. మీరే మనస్సుకి తెప్పించి తీసుకోరా అంటేనే తీసుకుంటాను అని చెప్పాను. "ఏమిరా తెలివిగా మాట్లాడుతున్నావు" అని అన్నారు. 'నా ప్రమేయం అంటూ ఏమీ లేదు. మీరే విగ్రహం తీయించాలి' అని విన్నవించుకున్నాను. "అలాగే నువ్వు వెళ్ళరా" అన్నారు. జైపూరు వెళ్ళి అడుగుతుంటే డబ్బులు ఎక్కువ చెపుతున్నారు. ఒకచోట డబ్బులెక్కువైనా సాయిబాబా విగ్రహానికి అడ్వాన్సు ఇచ్చాను. మేము కృష్ణుడి విగ్రహం చూసి వచ్చేసరికి మేము తీసుకుందామనుకున్న సాయిబాబా విగ్రహాన్ని మరెవరికో ఇచ్చేశామని చెప్పారు. మేము ఇచ్చిన అడ్వాన్సు తీసుకున్న తర్వాత ఆ విగ్రహాన్ని మరలా తేరిపార చూడగా బాబా అభయహస్తం వెనకాల రాయి చీలి వుంది. అందుకోసమే స్వామి ఆ విగ్రహాన్ని తీసుకోకుండా చేశారని స్ఫురించింది. తర్వాత రోజు నామస్మరణ చేసుకుంటూ పోతే బాబా, కృష్ణుని విగ్రహాలు క్రిందటిరోజు చేయమన్నవారు ఎక్కువ డబ్బులకు చేస్తామని చెప్పి చేసిన తర్వాత స్వామి చెప్పినట్లు 80 వేలు మాత్రమే తీసుకున్నారు. అట్లానే విగ్రహం తీసుకురావటానికి 15వేలకి వాహనం మాట్లాడి అడ్వాన్సు ఇచ్చాము. మా ట్రైన్ మధ్యాహ్నం 3గంటలకు. ట్రాన్సుపోర్టు డ్రైవర్ 2గంటలైనా రాలేదు. ఇంతకు ముందు ఇంకొక

మందిరంలో విగ్రహం తీసుకొచ్చినతను మమ్మల్ని చూసి ఎందుకొచ్చామో వంటి ప్రశ్నలడిగి అతను 3 రోజుల తర్వాత బయలుదేరి వస్తానని చెప్పి అతను విగ్రహాన్ని భద్రంగా తీసుకొచ్చాడు. స్వామి ఆశీర్వాదంతో బయలుదేరితే బాధ్యతంతా స్వామిదే కదా!

## ఆదర్శ్, హైదరాబాద్

మా యింటి దగ్గర మా ప్లాటు కబ్జాకు గురైంది. స్థానిక పోలీసు ఎస్.ఐ. అండ చూసుకొని కొంతమంది మమ్మల్ని బేరసారాలకి పిలిచారు. స్వామీజీ దగ్గర విన్నవిస్తే "అంతా మంచి జరుగుతుంది" అని అన్నారు. స్వామికి చెప్పుకున్న చాలా కొద్దిరోజులకి స్థానికంగా వుండే మహిళలు ఎస్.ఐ. అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని కేసు పెట్టారు. దానితో అతనిని బదిలీ చేసారు. ఆ స్థానంలో కొత్త ఎస్.ఐ. వచ్చాడు. చాలా స్ట్రిక్టు. కబ్జా చేసిన వాళ్ళని అరెస్టు చేసాడు. అంతటితో మా స్థలం మాకు దక్కింది. స్వామి సర్వసృష్టినీ తగు విధంగా ప్రేరేపించగల సమర్థులు.

మా అమ్మగారికి బలహీనతగా వుండి చురుకుగా ప్రయాణాలలో పాల్గొనలేకపోయేవారు. ఒకసారి స్వామి, అమ్మయ్యల ఆశీర్వాదం తీసుకొని మానాన్న, అమ్మ మానస సరోవర యాత్రకు వెళ్ళారు. స్వామి ఆశీర్వాద ఫలితంగా అంత ప్రయాణంలో మా అమ్మ ఎంతో హుషారుగా తిరిగింది. కొంచెం కూడా అస్వస్థత లేదు. ఇది చాలా అద్భుతం.



శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమ:

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 10

## స్వామి బోధ

**"సాయి సూక్తులు కేవలం మనస్సు కర్థమయ్యే పదజాలమూ, శబ్దజాలమూ మాత్రమేకాదు. అవి మహా మంత్రాలు, నిరంతర ఆత్మనిష్ఠయందు నిలిచియుండే ఆత్మవేత్తల వాక్యాలు అట్టి అతీత తపశ్శక్తి చేత ఉత్తేజితమై ఉంటాయి. ఆ వాక్యాలకు అర్హులైన వారి హృదయాలపై మనస్సుకూ, బుద్ధికీ అతీతమైన ప్రభావముంటుంది. మనస్సు, బుద్ధి ఏ ఆత్మనుండి ఉద్భవిస్తాయో అట్టి మూలమైన చైతన్య క్షేత్రంలోనే ఒక విశిష్టమైన జాగరణను కల్గించగలవు. కనుక మహనీయుల వాక్యాలన్నీ శృతులే, శృతులలా ఏర్పడినవే. వాటిని అధ్యయనం చేయడం, మనన నిధి ధ్యానలను సలపడం ఆత్మప్రాప్తికావశ్యకం".**

**ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**
**(శ్రీ సాయినాథ ప్రబోధామృతం, పేజి:41)**

■ ఒకరోజు దమ్మపేట మోహనరావుగారి స్వప్నములో స్వామి కన్పించి "ఒరే మోహనా వచ్చినావా అని, నన్ను దర్గాల దగ్గరకి ఎత్తుకుని తీసుకువెళ్ళు దీపం పెట్టాలి" అన్నారు. అంటే నాకు ఆరోగ్యం బాగుండకపోయినా నిత్యకార్యక్రమము చేస్తున్నాను. నీకు మంచిగా వున్నా సేవ చేయడం లేదని హెచ్చరించినట్లుగా వున్నది. ఈ స్వప్నం తర్వాత సాధన మంచిగా జరుగుతోంది. చిన్న చిన్న అడ్డంకులను సాకుగా తీసుకుని నిత్యకృత్యాన్ని తారుమారు చేసే మనకు ఈ బోధ చాలా చక్కగా ఉపయోగపడుతుంది.

■ ప్రదక్షిణ చేసేటప్పుడు త్వరత్వరగా నడువరాదు. భూదేవికి దెబ్బ తగలని విధంగా మెల్లగా నెమ్మదిగా హృదయమంతటితో

మనస్సులో వేరే ఆలోచన రానీయకుండా అలా ప్రదక్షిణ చేస్తూ వారిని స్మరించే అవకాశమిచ్చిన పరమాత్మను కృతజ్ఞతతో స్మరించుకుంటూ నడవాలి. భావనే ప్రధానం కానీ ఎన్ని చుట్లు తిరిగాము అనేది కాదు. ఇది శ్రీ వెంకయ్యస్వామి క్లుప్తంగా "ఒక్క చుట్టే గదయ్యా" అన్న మాటలాగానే వున్నది.

■ దర్గాల దగ్గర దీపం పెట్టమని శంకరయ్యకు చెపితే శంకరయ్య వెళ్ళి అక్కడ మాటల్లో పడిపోయాడు. అతను స్వామి దగ్గరకి వచ్చిన తర్వాత దీపం పెట్టేటప్పుడు మాట్లాడకుండా మనస్సును లగ్నం చేస్తూ ప్రార్థనలో గడపాలని ఎన్నిసార్లు చెప్పాలిరా అని చాలా కోప్పడ్డారు.

■ టెంకాయ కొట్టేటప్పుడు టెంకాయనీరు క్రింద పడకుండా చెంబులోకి పట్టవద్దు. భూదేవిని త్రాగనివ్వండి. టెంకాయ కొబ్బరంతా మనమే తింటిమి, నీళ్ళన్నీ మనమే త్రాగుతుంటిమి. ఆ కాయను ఇచ్చిన భూమాతకేమిస్తున్నాము? కాయలిచ్చినందుకు అన్ని టెంకాయ నీళ్ళయినా ఇవ్వవద్దా?

■ గురువు అంటే డబ్బులిచ్చి సంతలో కొనుక్కునే వస్తువు కాదు. అలా అయితే అందరూ కోటి రూపాయలు ఇచ్చి కొనుక్కుని చంకలో పెట్టుకు తిరుగుతారు. గురువు నిరంతరం మనలోనే వుండి నిరంతరం అంతర్వాణి ద్వారా చెపుతూ వుంటారు. పాలు చేతిలో పట్టుకొని వెన్న కోసం తిరగడంలా వుంటుంది గురువు కోసం వెతకడం.

ఒకతను నోటిలో సిగరెట్టు పెట్టుకుని చేతిలో దీపం పట్టుకొని అగ్గిపెట్టె కోసం నాలాంటి ముసలతని దగ్గరకి వచ్చి అగ్గిపెట్టె అడుగుతున్నాడట. అప్పుడా ముసలతను నీ చేతిలో వున్న దీపంతో వెలిగించుకో అని చెప్పాడట. గురువు కోసం వెతకటం అలా వుంటుంది.

■ మనం తిన్న ఆహారాన్ని సద్గురువే లోపల ఉండి జీర్ణం చేసి, అవయవాలన్నింటికీ శక్తినీ, బలాన్నీ, తేజస్సునూ ఇస్తున్నారు.

■ మనలో గుణమూ, రూపమూ లేని వాడొకడున్నాడు. భోజనం చేసేటప్పుడు ప్రతిముద్దా వాడికి తినిపిస్తున్నామని తినాలి.

■ If you loose your character, everything is lost!

■ I am always with you; not seperate from you.

I am always with you; not seperate from you.

I am always with you; not seperate from you.

■ కొందరు యువకులకు స్వామి చెప్పినది:

mind wavering గా ఉంటుంది. కాన్‌సెన్‌ట్రేషన్ కుదరటంలేదు అంటే

"నీ కిష్టమైన నామం చెప్పుకుంటూ ఉండు"

"సాయినాథా, సాయినాథా" అనుకో అని కొందరికి,

"ఓం శ్రీ సాయినాథాయనమ:" అని కొందరికి,

"సద్గురు దేవా " అని, "జయ గురు దత్త" అని కొందరికి చెప్పారు.

■ ఎప్పుడూ నామస్మరణ చేస్తూ వుండండి. దాని ద్వారా చూపు, వినికిడి, ఆలోచన, మనస్సు ప్రక్షాళన అవుతాయి. లోపల వున్న దైవం మేల్కొని నిలిచి వుంటాడు.

■ ఉద్యోగం చేసుకుంటూ వీలున్నప్పుడల్లా మహనీయులు తపస్సు చేసిన స్థలాలు దర్శిస్తుండాలి.

■ వస్తువులను సృష్టించడం, అద్భుతాలు ప్రదర్శించడం నిన్ను నువ్వు డిసీవ్ (మోసం) చేసుకోవటం అవుతుంది. నీలో ఉన్న సత్యమే అందరిలోను ఉంది. అందరిలో పని చేసే సత్యం ఒక్కటే!

■ కరుణ, ప్రేమ ఉంటే సాయినాథుడు చేతిలో ఆడుతూ ఉంటారు.

■ ప్రశ్న: స్వామీ! ఎవరితోను సంబంధం లేకుండా ఏకాంతంగా (విడిగా ఒక్కణ్ణే) నా పని నేను చేసుకుంటూ ఉన్నప్పుడు ధ్యాస నిలుస్తున్నది. కానీ వర్క్ కోసమై కాలేజీలో వ్యవహరించడంలో, పనిచేయడంలో ధ్యాస మరుగున పడిపోతోంది. తరువాత మనసు నిలవటం లేదు.

స్వామి: జాబ్ చేసుకుంటూనే ఉండాలి. కానీ ఏ పని చేస్తున్నా సద్గురువే మనలో ఉండి చేయిస్తున్నారన్న భావంతో చెయ్యాలి. అసలు మన చేతులు, కాళ్ళు కదులుతున్నాయంటే మనం తిన్న ఆహారాన్ని సద్గురువు జీర్ణం చేసి, అవయువాలన్నింటికీ శక్తినీ, తేజస్సునూ

ఇస్తుండడం వల్లనే పని చేయగలుగుతున్నాము. కాబట్టి మనలో ఆ సద్గురువు వుండి ఈ పని చేయిస్తున్నారు. ఆయన వల్లనే మన కాళ్ళూ, చేతులూ ఆడుతున్నాయి, ఆలోచించగలుగుతున్నాము అని ప్రతి పనీ అహంకారమూ, కర్తృత్వమూ లేకుండా చేయాలి.

■ చైతన్యరూపుడై పలికిస్తున్నదీ, నడిపిస్తున్నదీ, అవయవాలన్నింటికీ బలాన్నిస్తున్నదీ, అన్నీ చేస్తున్నది ఆ పరమాత్మే. అందరిలో కలుస్తూనే, నీ పనులన్నీ చేస్తూనే, అహంకారము, కర్తృత్వ భావమూ లేకుండా ఆ పరమాత్మే చేయిస్తున్నాడు అని దృఢంగా నమ్మ. సాయినాథుడు అన్నీ చేస్తూనే అందరిలో ఉన్నాడు గదా! అల్లా మాలిక్ అన్నాడా లేదా?

■ శ్రీ వేంకటేశ్వర వజ్ర కవచం సాయంత్రం ఆరతి తర్వాత చదివిస్తున్నారు. అందులో 'కార్య కారణం' అని వచ్చింది అంటే ఏమిటి? అని అడిగి స్వామివారే ఇలా చెప్పారు.

"కార్యం అంటే కుండ. కారణం అంటే మట్టి. మట్టితోనే కుండ చేయబడింది. అలానే ఈ దేహంలో పరమాత్మ ప్రాణ రూపంలో ఉండటం వల్లనే ఇది ఇట్లా వుంది. అది పోతే శరీరం కుళ్ళిపోయి రెండు రోజులకి తీసి అవతల పారెయ్యమంటారు. ఆ పరమాత్మే మన లోపల వుండి మనలను ఇలా నడిపిస్తున్నాడని ఎప్పుడూ గుర్తు పెట్టుకుని అహంకరించకుండా వుంటే ఆయనే మనకు కవచమై మనలను ఎల్లప్పుడూ రక్షిస్తాడు. అది వేంకటేశ్వర వజ్ర కవచం" అని చెప్పారు.

■ ఇంకొక అరగంటలో సత్సంగం అయిపోతుంది అని స్వామివారి సేవకుడు ఒకతను అంటే స్వామివారు "మనమెప్పుడూ సత్సంగంలోనే వుంటాము. సత్ అంటే అంతటినీ నడిపించేది. అది లేకుంటే ముల్లు ఊడిపోతే తక్కెడ ఎలా పడిపోతుందో మన శరీరం అలానే పడిపోతుంది. మనమెప్పుడూ సత్సంగంలోనే వుంటాము" అన్నారు.

■ ఒకప్పుడు దమ్మపేట గ్రామస్థులు కొందరు స్వామిని దర్శించినప్పుడు స్వామి వారితో అన్న మాటలు "నడక బాగుండటం

లేదు. కానీ కేవలం గురుచరిత్ర పారాయణ చేయడం వలననే మీరు ఇక్కడకు రాగలుగుతున్నారు".

■ ఏమి స్వామీ! ఇంత వయస్సు అయిపోయిన తర్వాత మీరు దొరికినారు, మీరింత దగ్గరగా వుండినా పొందలేకపోయాము అని అమర్‌నాథ్‌గారు అడిగితే "ఎవరికెంతో అంతేరా. 40, 50 ఏళ్ళ నుండీ వస్తుంటారు, కొంచెం కూడా డెవలప్‌మెంట్ లేనివాళ్ళు వుంటారు. వాళ్ళనేమి చేయాలి. ఎవరికెంతో అంతే వుంటుందిరా భగవంతుని కృప. ఇది మీ అదృష్టంగా భావించి సద్వినియోగం చేసుకోండి" అని స్వామి చెప్పారు.

■ భగవంతుడిని ప్రతిష్ఠించవలసినది మందిరాలలో కాదు మన హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి. సాయిబాబా చరిత్రగానీ, భగవద్గీతగానీ, భాగవతంగానీ, దత్తాత్రేయస్వామి చరిత్రగానీ, తాజుద్దీన్‌బాబా చరిత్రగానీ, రామకృష్ణ పరమహంస చరిత్రగానీ లేక ఇతర ఏ మహాత్ముల చరిత్ర చదివినా అందులో చెప్పబడిన గుణాలను మనం పొందే ప్రయత్నం చెయ్యాలి.

■ భగవద్గీతలో **విద్యార్థికి ఉండవలసిన లక్షణాలు:**

**1. మితాహారం 2. మిత భాషణం 3. మిత నిద్ర**

*మనమంతా అంతటా వున్న భగవంతుని దర్శించటానికి ప్రయత్నిస్తున్న విద్యార్థులమే. అందువలన భగవంతుడు చెప్పినది మనందరికీ ఆచరణీయమైనది.*

■ నీలో ఆడే ప్రాణశక్తే నాలోనూ ఉంది. సత్యమైన జీవిత విధానం వుండాలి. భగవంతుడు మనకు ఒక రూపాయి ఇచ్చాడు. దానిని సరిగా ఉపయోగించుకోవడమా లేక పాడు చేసుకోవడమా అనేది మన చేతులలోనే వుంది. మనందరినీ భగవంతుడు ఒక్కొక్క పని మీద భూమి మీదకు పంపాడు. మన లోపల ఆ పరమాత్మే వుండి మనలను ఆడిస్తాడు. ఈ విషయం మరచి అహంకరించకూడదు.

■ స్వామిని సాయిశివ అడిగినవి:

ప్రశ్న: స్వామీ! మేము ఏం చేస్తే, ఏ విధంగా నడుచుకొంటే మీకు తృప్తి కలిగించగలుగుతాము?

**స్వామి: మనను నిలకడ చేసి ఏకాగ్రతతో నీలో వున్న సత్యమే అందరిలోను, అంతటా ఉందని తెలునుకుంటే అందరికీ తృప్తిగా ఉంటుంది. నాకూ ఎంతో తృప్తిగా ఉంటుంది.**

**ప్రశ్న:** స్వామీ! మీరు నాలో ఉన్నదే - అందరిలోనూ ఉందన్నారు కానీ నాకు తెలియటం లేదు

**స్వామి: పాలను చూనన్తా వెన్న ఎక్కడుంది? నెయ్యి ఎక్కడుంది అంటే ఎక్కడుంటుంది? పాలను చిలికితే వెన్న కనిపిస్తుంది. అదే విధంగా మనను నిలకడ చేస్తే, ఏకాగ్రతతో నీలో వున్న నత్యం తెలుస్తుంది. ముందు నీలో ఉన్న నత్యం తెలిస్తే తరువాత అంతటా ఉన్నది తెలుస్తుంది. నామన్మరణ చేస్తే మనను నిలకడవుతుంది. పిలిచిన తక్షణమే (నామం ఉచ్ఛరించిన వెంటనే) నద్గురువే మనకు నరెండర్ అయి మన చెంత ఉంటారు. ప్రేమతో నామన్మరణ చేయి.**

■ ప్రశ్న: స్వామీ! **తపన్సంటే ఏమిటి?**

స్వామి: **తపస్సంటే కూర్చొని చేసేది కాదు. నోటినుండి పొరపాటున కూడా కఠినమైన, పరుషమైన మాటలు రాకూడదు. ఇతరులను నొప్పించకుండా, మృదు-మధురమైన మాటలే రావాలి. ఎదుటివాడు మనల్ని చెంపమీద కొట్టినా పరుషమైన వాక్యాలు రాకూడదు. మాట్లాడేముందు ఆలోచించి మాట్లాడాలి. అందరిలోనూ, నీలోనూ ఒక్కటే సత్యం పని చేస్తోంది. ఎదుటి వారిలో కూడా అదే సత్యం ఉంది. ఇది గుర్తించి తగు విధంగా మనస్సు, వాక్కు, పని మూడు ఒక్కటిగా నడుచుకోవటం. (ఈ సూత్రానికి అనుగుణంగా శరీరాన్ని, అన్ని అవయవాలనూ అదుపులో ఉంచుకోవడం)**

■ ఉపనయనం (ఒడుగు) అయిన తర్వాత స్వామి వద్దకెళ్ళినప్పుడు "ఈ శరీరం నువ్వుకాదని, ఈ దేహాన్ని ఉపాధిగా చేసుకొని ఉంటున్న సత్య స్వరూపమయిన పరమాత్మే నువ్వని చెప్పారా?" అని అడిగారు.

## సుబ్బరామయ్యగారు మిమ్ములను అడిగి కొన్ని విషయాలు తెలుసుకోమన్నారు అంటే :

స్వామివారు ఈ విధంగా అన్నారు. "నా గురించి చెప్పుకోవడానికి ఏముంది? అసలు నేను ఎవరు? హూ యామ్ ఐ? నేను అంటే ఈ కాళ్ళు, చేతులు, కన్ను, ముక్కు వున్న శరీరమా? ఏ మహాత్ముడైనా తన గురించి తాను చెప్పుకోడు. ఆ సద్గురువే నాలో వుండి ఆడిస్తున్నాడు. ఇంతకు ముందు ఎవరైనా తన దగ్గర ఏమైనా పెట్టుకుంటే వాళ్ళను ఆ సద్గురువే నా వద్దకు పంపుతున్నాడు. ఆయనే నా ద్వారా వారికి చెపుతున్నాడు. నా గురించి చెప్పుకోవటానికి ఏమీ లేదు. ఐ యామ్ హిజ్ సర్వెంట్."

## విద్యానగర్ శ్రీ జి. సూర్యప్రకాశరావు గారికి స్వామి వ్రాసిన లెటరు:

చిరంజీవి శ్రీ సూర్యప్రకాశరావుగారికి శ్రీ సద్గురు దర్గాస్వామీజీ హృదయ పూర్వక ఆశీర్వాదములు. నీ మనస్సులో ఏది సంకల్పించినా ఆ పని కానప్పుడు మనస్సుకు వికల్పము జరుగును అదే చింతలో వుంటాము. మనస్సులో అర్థంలేని భావనలు వచ్చి తలనొప్పి వుండును.

**నీకు నచ్చిన రూపము వుంచుకొని ఆ రూపములో వున్నవారి పేరు మాటిమాటికి ధ్యానించిన ఏకాగ్రత వచ్చి మైమరచగలవు గదా! సుషుప్తి వచ్చి సుఖనిద్ర పట్టును.** మాత్రలు పూర్తిగా విసర్జించి ధ్యానించి తరించేది. చిరంజీవి! మీకు మా హృదయపూర్వక ఆశీర్వాదములు.

ఇంతే సంగతులు

శ్రీ సద్గురు దర్గాస్వామీజీ

## శ్రీ ఎ. రంగారావుగారు, రిటైర్డు హెడ్మాస్టరు, కావలి

ఒకరోజున నేను శ్రీ స్వామివారి సన్నిధిలో జపం చేస్తున్నాను. లెక్క కొరకు జపమాల చేతిలో ఉంది. జపం చెయ్యడం అయ్యాక శ్రీ స్వామివారు నన్ను పిలిచి ఎంత జపం చేశావని అడిగారు. జపమాల సహాయంతో చేసాను గనుక ఇంత సంఖ్య అని చెప్పాను. వెంటనే శ్రీ

స్వామివారన్నారు “అది జపమే కాదు. జపానికి ఎప్పుడూ లెక్క వుండకూడదు. అలాగే ప్రదక్షిణలు చేసేవారు కూడా లెక్కపెట్టి చేయడం తప్పు”.

**తన కొడుకు తాగుడు మాన్పించమని అడిగిన ఆమెతో స్వామి చెప్పినవి:**

ఒకరోజు ఒక తల్లి, తన కోడలుతో స్వామి వద్దకు వచ్చి తన కొడుకు రోజూ రెండు సీసాలు మందు త్రాగుతాడని, అతని త్రాగుడు మాన్పించమని కోరారు. దానికి స్వామి “ఆ త్రాగుడు మానాలి అనుకున్న వ్యక్తే తమ వద్దకు వస్తే రోజూ దర్గాల వద్ద తీర్థం ఇస్తాము. అది తీసుకుంటే త్రాగుడు క్రమంగా పోతుంది. కానీ ఒకసారి తీర్థం తీసుకున్నాక మరలా త్రాగితే వాంతులు, బేదులు అవుతాయి. దానికి సిద్ధపడితేనే రమ్మను. లేకుంటే వద్దు” అని చెప్పి పంపించి వేశారు. అంటే **ఎవరికి బలహీనతలు వున్నాయో వారికి స్వతహాగా బలహీనతలను తొలగించుకోవాలని కనీస కోరిక, చేతనైన ప్రయత్నం వుంటే స్వామికృప త్వరగా అనుభవమవుతుందని తెలుస్తోంది.**

# తస్మై జాగ్రత్త జాగ్రత్త

**ఒకసారి కొందరు విద్యార్థులు దర్గాస్వామి వారి వద్దకు వెళ్ళినప్పుడు, వాళ్ళు అడిగిన ఒక విషయమై స్వామివారి సంభాషణ,** అందరికీ కూడా ఉపయోగపడుతుంది అనే ఉద్దేశ్యంతో, ఇక్కడ పొందుపరచబడినది:

నువ్వు నన్ను అడిగిన ప్రశ్న చాలా గొప్పది: భగవంతుని ప్రేరేపణతో, ఏ పనైనా ఆయన మన లోపల ఉండి చేయిస్తున్నాడు కదా అన్నావు, అదే కదా?

(విద్యార్థి: అవును స్వామి)

నేను నీ గురువుని; నా నడక నీకు రావాలా వద్దా? చెప్పవోయ్, తంతా ఎగిరి కాల్తో, చస్తావు ఇప్పుడు నా చేతిలో.

(విద్యార్థి: రావాలి స్వామి)

నేను బ్రాందీ తాగే వాడినా? సారాయి తాగే వాడినా? వ్యభిచారినా?

వేరే ఆలోచనలు (థాట్స్) ఉండే వాడినా? అటువంటి గురువు దగ్గర పొందినప్పుడు మనమే స్థితిలో ఉండాలి?

భగవద్గీతలో కృష్ణుడు ఏమి చెప్పినాడు? సర్వ పనులు నే చేయిస్తున్నాను అంటే, వాని విధి కర్మలను బట్టి వాడు చేసినా కూడా, నువ్వు బాధ్యతగా వుండు అని ఆయన చెప్పినందుకు, దాన్ని తీసుకొచ్చి, "గురువు నాలో ఉండి చేయిస్తున్నాడు కదా" అన్నావు. అన్నావా లేదా?

(విద్యార్థి: అన్నాను స్వామి)

గురువు నీలో ఉండి చేయించేది మంచి కార్యాలు చేస్తాడా? చెడ్డ కార్యాలు చేస్తాడా?

(విద్యార్థి: మంచి కార్యాలే)

మా గురువు దగ్గర ఉపదేశమయినాదండి. ఆ గురువు యొక్క నడక నాకు కావాలా వద్దా?

(విద్యార్థి: కావాలి)

గబ్బు పురుగేరా భ్రమర కీటకము, భయం చేతనో, భక్తి చేతనో దాని రూపాన్ని పొందుతుంది. మనం కూడా ఆయన పాదాలు చూస్తూ తిరుగాడుతోంటే, ఈ సచ్చరిత్ర చదువుతున్నామంటే, దీంట్లో నుంచి ఒక్క గుణమన్నా మనం మంచిది తీసుకోవాలా వద్దా? వద్దా అయ్యా?

(విద్యార్థి: తీసుకోవాలి)

ధర్మరాజు 'అశ్వత్థామ హత: కుంజర:' అని పాపం చేసినాడు కాబట్టి, నేను ఎన్నైనా చెప్తాను. కీచకుడు సైరంధ్రిని పట్టడానికి పోయినాడు, చచ్చాడు. సంకల్పం మంచిది ఉండాల్నా? చెడ్డది ఉండాల్నా?

(విద్యార్థి: మంచిదే ఉండాలి)

నువ్వు అడిగిన ప్రశ్న మంచిదే.

తప్పు, భగవానుడు నాలో ఉండి ప్రేరేపణ చేస్తున్నాడు అంటే, పరిపూర్ణ అవతారుడైన పరబ్రహ్మం నాలో ఉన్నాడు వాసుదేవుడుగా. నేను జీవుడు కాను; ఆయన యొక్క లక్షణం ఉంది; నన్ను జీవుడు అని ఎందుకు అంటున్నారు? భయం ఉంది; నా ఇల్లు, నా భూమి, నావి నావి అని అంటున్నారు, నేను అన్నది ఏదో తెలియక. నా శరీరము

అంటున్నానేగాని ఈ శరీరాన్ని నడిపే సత్య స్వరూపము నేను అని తెలుసుకోవడం లేదు. సబ్ కా సత్తా, అల్లా మాలిక్” అనేది తెలియాలి, అందరిలో ఉన్న సత్యమే నేను అని గ్రహించినప్పుడు, హింస రాదు నాయనా!

సద్గురువు నాలో ఉండి నడిపిస్తున్నాడు కదా, ఆయన ప్రేరేపణతో నాలో నుంచి ఈ పనులు అవుతున్నాయి అని అంటావే, అది మంచిదా చెడ్డదా అనే విచక్షణా జ్ఞానం నీకు ఇచ్చాడా లేదా? తప్పు, ఒప్పు, డెసిషన్ లేదూ?

(విద్యార్థి: ఇచ్చారు స్వామి)

ఉండినప్పుడు నువ్వు ఎట్లా పోతావయ్యా? ఉదాహరణ కూడా చెప్పాను కదా, ఆమె చేతిలో ఒక ఉంగరం ఉంది. ఉంగరం తీసుకోమంటోంది చూపు. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అంటోంది, “ఆమె అబల, పైన పడు” అంటోంది. నువ్వు లేస్తే అవుతుందా? ఊరికే ఉంటే అవుతుందా?

నేను ఎందుకు చెబుతున్నానంటే, మనం ఎప్పుడూ జాగ్రత్తగా మెలగాలి. ఇతరుల చేతిలో మనము ఎప్పుడూ ఇరుక్కోకూడదు. ఎందువల్ల చెబుతున్నానంటే, దైవ ప్రేరణ అయ్యింది కదా అని, ఒక లేడీనే కాదు, ఒక ఫ్రెండ్ షిప్పే కాదు, ఎవరైనా కాదు, భగవంతుడు నాకు ప్రేరేపణ చేసాడు లోగూడమని ఏమో అని కూడిపోతాము. First remove that from your brain and heart నాకూ రవంత ఇంగ్లీష్ వస్తాది.

బాబూ, పరమాత్ముడు ఈ శరీరాన్ని ఎందుకు పంపించాడు? దీంట్లో ఆయన చొరబడినాడు. ఆయన చొరబడినప్పుడు తప్పు, ఒప్పు అనే నిర్ణయం (డెసిషన్) తెలుసుకోవడానికి మార్గం ఇస్తాడు. బండి పోతూ ఉంది, అది ఇటువైపు కూలబడుతుందా? అటువైపు కూలబడుతుందా? కాదు. సెంటర్ ఆఫ్ గ్రావిటీతో జాగ్రత్తగా నడిపిస్తే పోతుంది. అట్లే మనలోని ప్రేరేపణ శక్తి - “అంతర్వాణి” యొక్క లక్షణాన్ని విని, సక్రమంగా నడుస్తూ

వస్తే కానీ ఏమీ రాదు. అదే గురునానక్ భక్తులకు చెప్పినది.

నిన్ను నేను కొట్టలేదు, తిట్టలేదు. సరి అయిన ప్రవర్తనలో నడవాలని కోరుకుంటున్నాను.

ఆ...... మా భగవద్గీతలో చెప్పారు కదా, జూదం ఆడేవాడిలో నేనే వున్నాను, వ్యభిచారిలో నేనే వున్నాను, అన్నీ నా ప్రేరేపణతో జరుగుతున్నాయి అని అంటాడే: అట్లాగాక "భగవంతుడు నాలో వుండి పనులు చేయిస్తున్నాడు" అంటే "ఏ కార్యాలు చెయ్యాలి? ఏ కార్యాలు చెయ్యకూడదు? ఉన్నతం ఏమీ లేదూ?"

(భగవద్గీతలో) శ్రద్ధాభక్తుల్లో సత్వ రజో తమో గుణాల యొక్క లక్షణాలు గురించి చెప్పలేదూ? మనిషి అవి ఉపయోగించడు! దాని యొక్క స్వరూపాన్ని తెలుసుకొని దాన్ని మొదట తొలగించాలి (ఫస్ట్ రిమూవ్ దట్). బాగా సమ్మెట దెబ్బలతో కొట్టాల. కొరివి తీసుకుని కాల్చి పారవెయ్యాల, కండ్లల్లో కామం లేకుండా, మనస్సులో చింత లేకుండా.

"చింత దీర్చుటకెంత మోడి రా అంతరాత్మ చెంత రాక నే నెంత వేడుకొందురా రాఘవా" అని కొట్టుకొని చస్తా ఉండాము మేము చిన్నప్పుడు... "పంతమేలరా ఓ రాఘవా" అని.... ఆ పరమేశ్వరుడు మనకు అన్నీ ఇస్తాడు. మంచేదో, చెడేదో కూడా తెలియ జేస్తాడు. నడచాల్సిన గుణం కావాలి కదా? దానికే కదా గురువు దగ్గర పండుకునేది? మనం మరి ఆ గురువు చెప్పింది గ్రహించకుండా......, తస్మై, తస్మై, తస్మై శ్రీ గురువేనమ: అనడం ఎందుకు?

ఆయన మనలో ఉండి చేస్తున్నాడు అంటే, ఆ స్వామి ఈ పని చేసేవాడా? మా గురువు ఈ పని చేస్తాడా? అంటే, (నాలాగే) బ్రహ్మంగారు, నీలాంటి శిష్యులు అందరినీ తీసుకొని, వెడుతోవుంటే, నేను (బ్రహ్మం గారు) ఏమి చేసానంటే, వెళ్లి సారాయి అంగడిలో ఓ ముంత కల్లు తాగాను. మీరందరూ కూడా వెళ్లి ఛాన్స్ రా అని తలో ఒక ముంతా తాగేశారు. అప్పుడు వాళ్ళని చూసి నేను (బ్రహ్మం గారు), "ఒరేయ్, ఈ నా కొడుకులికి బుద్ధి రావాల్రా" అనుకున్నాను. గల-గల-గలా కాలిపోయే మూస (సీసం)

చేతిలో తీసుకొని లొట-లొట-లొటా తాగితే ఈ శిష్యులందరూ బెంబేలు పడిపోతున్నారు. అప్పుడు బ్రహ్మంగారు, "యేమిరా మీరూ తాగట్లేదే?" అని అడిగారు. "అది తాగితే చచ్చిపోమూ!" అన్నారు (శిష్యులు). "చస్తానని భ్రమ ఉన్న నాకొడక, నే చేసిన పని ఎందుకురా నువ్వు చేసినావు?" అన్నారు. అట్లా అన్నమాట.

ఇంకా, నీలాంటి పిల్లలు ఏమన్నారంటే, సిద్ధయ్య అనే శిష్యుడు నాకు (బ్రహ్మం గారికి) బాగా ఇష్టమైన వాడు అని, సిద్ధయ్యని బాగా ప్రేమతో చూస్తున్నాడు, మమ్మల్ని చూడటం లేదు, అని బ్రహ్మంగారిని నిందిస్తున్నారు. చూసారు. ఒకసారి, బ్రహ్మంగారు బండిలో పోయేటప్పుడు, ఆయన బండిలో ఉన్నారు; సిద్ధయ్య, తక్కిన శిష్యులు అందరూ వెనకాల క్రిందన ఉన్నారు. కొంత దూరం అట్లా పోయాకా అక్కడ క్రింద ఒక చచ్చిపోయిన కుక్క ఒకటి ఉంది. గబ్బు కొట్టి చస్తోంది. అందరూ ముక్కులు మూసుకొని చస్తున్నారు. అప్పుడు బ్రహ్మంగారు, "ఒరేయ్ నాయనలారా, ఇలా రండి" అన్నారు. అందరూ ఆయన దగ్గరకు వచ్చారు. అప్పుడు ఆయన ఆ కుక్కను చూపిస్తూ, "నాయనలారా, భక్షించండి, భక్షించండి!", అన్నారు. 'వాసన వచ్చి చచ్చి పోతోంటే, దాన్ని భక్షించడం ఏమిటి?' అని అలా నిలబడి ఉండిపోయారు. ఇలాంటి దుండగులు ఎక్కడైనా ఉంటారు. అప్పుడు, "సిద్ధా!" అన్నారు; 'గురుదేవా' అన్నాడు; "నాయనా, అది భక్షించు" అన్నారు. 'చిత్తం గురుదేవా' అని వాడు అక్కడకు పోయి, దాన్ని తిందామని దోసిట్లోకి తీసుకోగానే, అది పప్పు-పరమాన్నాలయిపోయింది. అప్పుడు అది చూసి, మిగతా వాళ్ళందరూ, తినడానికి పరిగెత్తుకు వచ్చేశారు.

అట్లాగ, జాగ్రత్తగా నడచాలి స్వాముల వారూ, సరి అయిన భావన (సద్భావన), సత్ప్రవర్తన తెచ్చుకోవాలి తండ్రీ; ముళ్ళు ఇప్పేది కాదు. అంతే! భగవంతుడు ప్రేరేపణ చేస్తున్నాడని, దేంట్లో అంటే దాంట్లో పడకూడదు. జాగ్రత్తగా నడుచుకోవాలి. తస్మై జాగ్రత్త జాగ్రత్త.

అంటే, నా లోపల తప్పు అనేది ఇమడదు. అందరూ పరిశుద్ధులు

కావాలని కోరుకుంటాను.

ఈ మందిరంలో పిల్లలందరూ, మావంటి గురువులు దగ్గరకు వచ్చిన వాళ్లందరూ, ఒక తూరి కాకపోతే రెండు తూర్లలో గాని, మూడు నాలుగు తూర్లు, పది తూర్లలోనైనా, గోల్ కొట్టి తీరాలి. "Arise! Awake! and stop not till the goal is reached" - అని స్వామి వివేకానంద అన్నారు.

మీరు అనుకున్న Aim fulfillment అయ్యే వరకూ మర్చిపోవద్దు ---- **తస్మై జాగ్రత్త జాగ్రత్త.**



శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 11

## స్వామి సూక్తులు

1. గుండు సూదులపై నృత్యం చేయడం కంటే గురువుసేవ చేయడం కష్టమైన పని.
2. పాలల్లో నెయ్యి తీయ్యడంలో ఎటువంటి ప్రక్రియ దాగివున్నదో పరమాత్మ తత్వము తెలుసుకొనడంలో అటువంటి ప్రక్రియ మనస్సుకు అవసరం.
3. భగవంతుని వద్ద 10 నిముషాలు స్థిరముగా కూర్చోలేని వాడికి బ్రహ్మజ్ఞానం ఎవరు ఇస్తారు.
4. శరీరము మట్టిలో కలిసినప్పుడు గంధం వాసన రావాలి. వాడే సాధకుడు.
5. ప్రపంచంలో ఎక్కడ చెడిపోయినా, గురువు దగ్గర బాగుపడగలడు. కానీ గురువు వద్ద వుండి చెడిపోయినవాడు ఎక్కడికి పోయినా బాగుపడలేడు.
6. పుస్తక పఠనం విజ్ఞానాన్ని మాత్రమే ఇస్తుంది. ఆచరణ అనే క్రియ జ్ఞానాన్ని కల్గిస్తుంది.
7. కదిలే సూదిలో దారం ఎక్కించలేము. స్థిర చిత్తము లేనివాడికి గురువు కడు దుర్లభం.
8. కాలింగ్ బెల్లు ద్వారా ఇంటిలోని వారిని ఎలా పిలుస్తామో, నీలోని భగవంతుడిని అలా బెల్‌తో పిలిస్తే, సేవకుడై సేవ చేస్తాడు.
9. జీవితం సమస్యల నిలయం వాటిలో కొన్ని పరిష్కరించబడతాయి. కొన్ని పరిష్కరించబడవు. అప్పుడు సాయి నామస్మరణ చేస్తూ ఉంటే వాటికవే దూరమవుతాయి.
10. శమము దమములతో లయము అయినవాడే దైవీ సంపదకు వారసుడు.
11. ఎంతటి బాధలో ఉన్నా దర్గామాత రూపంలో సమాధి చెంది ఉన్న జగన్మాత దర్శనంతో సుఖసంపదలు పొందగలవు.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 12

## బోధనా దక్షత

### శ్రీ ఎ. రంగారావుగారు, రిటైర్డు హెడ్మాస్టరు, కావలి

ఒకరోజు నేను చేసిన చిన్న తప్పుకు గట్టిగా బుద్ధి చెప్పారు. శ్రీ స్వామివారు కావలి వచ్చియున్నారు. నేను స్వామి సన్నిధిలో వుండగా నా స్నేహితులొచ్చారని మనిషి వచ్చాడు. ఆ వచ్చింది ఎవరైందీ నాకు తెలుసు. ఎంతసేపు నేను ఇంట్లో వుండాలో తెలుసు, వాళ్ళను రైలు ఎక్కించిగానీ నేను శ్రీ స్వామి సన్నిధికి రాలేనని కూడా తెలుసు. ఇన్ని తెలిసి కూడా శ్రీ స్వామివారికి నిజం చెప్పకుండా 'ఇంటిదాకా వెళ్ళి వస్తాను' అని చెప్పి వెళ్ళాను. ఆ మిత్రులను రైలు ఎక్కించి వచ్చేసరికి శ్రీ స్వామివారు కారులో నీలకంఠరావుపేట వెళ్ళిపోతున్నారు. శ్రీ స్వామివారికి నమస్కారాలు చెప్పాలని మరొకరి కారులో వెంబడించాను. ఐదు, పది నిమిషాలలో శ్రీ స్వామివారి కారుని క్రాస్ చేయగలనని తలచాను. అలాంటిది ఒక గంట తర్వాత కలుసుకున్నాను. నమస్కరించి వచ్చేయాలనుకున్నాను. కానీ నన్ను తన కారు ఎక్కమని నేను వచ్చిన కారును వెనుకకు పంపారు. కారులో తన ప్రక్కన కూర్చోబెట్టుకొని ఒక గంటసేపు సద్గురువును ఎలా సేవించాలో బోధించారు. ఇంతా ఆ మాటల సారాంశం ఒక్కటే. **<u>గురువుగారితో లోపలొకటి బయటొకటిగా మాట్లాడరాదు. అది చాలా దోషం</u>** అని బోధించారు. ఇది నేను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తమని గ్రహించాను.

### ఎన్. జానకి, మద్రాన్

2010లో జులై నెలలో నేను, మా బాబు, మా ఆయన కలిసి దర్గాస్వామి వారి దర్శనముకు శనివారము 4-5 గంటల మధ్యలో చేరుకున్నాము. దర్గాస్వామివారి దర్శనము చేసుకున్నాము. దర్గాస్వామి

"ఉంటారా నాయనా?" అని అడిగారు. రెండురోజులు వుంటామని అనుకుంటున్నాము స్వామి అని అన్నాము. "సరే నాయనా మీ ఇష్టం. ఉన్నన్ని రోజులు ఉండవచ్చు" అని స్వామివారు అన్నారు. వెనుకనున్న హాస్టల్లో ఒక రూములో ఆ రోజు రాత్రి వున్నాము. తర్వాత రోజు ఆదివారం 10 గంటలకు స్వామివారి దర్శనమునకు వెళ్ళాము. స్వామివారి దగ్గరకు మావారు వెళుతుండగా స్వామివారు ముఖము చాలా ఇబ్బందికరంగా పెట్టారు. "ఆ! ఏంటి చెప్పు" అని అన్నారు. మధ్యాహ్నం బయలుదేరాలనుకుంటున్నాము స్వామి అని అన్నారు. స్వామివారు వెంటనే చాలా కోపంగా "నిన్న ఏమని అన్నావురా? ఇప్పుడు ఏమని అంటున్నావురా? చెప్పు" అని అడిగారు. అలా కోపంగా అడిగేసరికి మావారికి అసలు నోట మాట రాలేదు. ముందురోజు అన్న మాటలు చెప్పారు. **"చెప్పరా చెప్పు రావటం నీ ఇష్టమేనా, వెళ్ళటం నీ ఇష్టమేనా నీకు దెబ్బలు పడతాయిరా"** అని దండం స్వామివారు పైకెత్తారు. 'కొట్టండి స్వామీ' అని మావారు తలవంచి దగ్గరగా వెళ్ళారు. స్వామివారు "**ఆ నిన్ను కొట్టను కానీ పాలిష్ చేస్తాను. పాలిష్ చేద్దామ**"ని అనుకుంటున్నాను అని మళ్ళీ అన్నారు.

అక్కనుండి బయటకు వచ్చేశాము. ఇంక స్వామివారి దగ్గర నుండి వచ్చిన తర్వాత స్వామివారి దగ్గర వుండాలో, వెళ్ళాలో తెలియటం లేదు. మా ప్రక్కన వున్న ఒక అబ్బాయి 'ఈ రోజు రాత్రి మీరు దర్గాల దగ్గర పడుకోండి' అని అన్నాడు. కానీ స్వామివారి అనుమతి లేకుండా అలా చేయకూడదని మావారు అంటారు. ఏమి చెయ్యాలో తెలియటం లేదు. 12 గంటల ఆరతికి వెళ్ళాము. అక్కడ స్వామివారు శంకరయ్యతో "ఇంజనీరింగ్ చదివి ఉద్యోగం చేస్తున్న మా వేణు గొప్పా?, ఇంజనీరింగ్ చేసి ఉద్యోగం చేయని మీ మేనల్లుడు గొప్పా? ఎవరు గొప్ప? చెప్పు శంకరయ్య" అని అడిగారు. శంకరయ్య ఏమీ మాట్లాడలేదు. చెప్పు శంకరయ్య అని మళ్ళీ రెండు సార్లు అడిగారు. శంకరయ్య అసలు మాట్లాడలేదు. ఊ ఊ అని అంటున్నాడు. అప్పుడు స్వామివారు ఎక్కువ స్వరం చేసి "మీ మేనల్లుడు గొప్పా?, చెన్నైలో వుంటున్న మా వేణు

గొప్పా?" అని అడిగారు. అప్పుడు శంకరయ్య మా మేనల్లుడే గొప్ప అని అన్నాడు. స్వామివారు ఒక నిమిషం ఆగి "మా చెన్నై వేణే గొప్ప. ఎలాగో తెలుసా **మూడు రోజులు వుంటాను అని నీతో చెప్పి రెండు రాత్రులు వుండి మరునటి రోజు వెళతానన్న మీ మేనల్లుడు నీకు పాఠం నేర్పాడు, వీడేమో (వేణు) రెండు రోజులు వుంటానని నిన్న రాత్రి వుండి ఇప్పుడు వెళతానని నాకు చెప్పి వీడు నాకే పాఠం నేర్పుతున్నాడు. అందుకే మా చెన్నై వేణే గొప్ప**" అని అన్నారు. అందరం మౌనంగా వుండిపోయాము. స్వామివారే ఆరతి అయిన తర్వాత శంకరయ్యతో వాళ్ళని భోజనం చేసి బయలుదేరమను అని శంకరయ్యతో చెప్పగా, శంకరయ్య వచ్చి మాకు చెప్పి మమ్మల్ని చెన్నై వెళ్ళమని చెప్పాడు. **స్వామివారికి శనివారం మరియు ఆదివారం ఉదయం వరకు వుండి వెళతామని మేము చెప్పలేదు. ఈ రోజు, రేపు వుంటామని చెప్పటం మా తప్పని తెలుసుకున్నాము.** మహాత్ముల దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలని, వారితో జాగ్రత్తగా మాట్లాడాలని తెలుసుకున్నాము.

## ఎన్. వేణుగోపాల్, మద్రాస్

నేను చెన్నైలో స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠింపబడిన సాయిబాబా మందిరమునకు అప్పుడప్పుడూ వెళ్ళుతుండేవాడిని. వెళ్ళాలని ఉన్నా వెళ్ళలేక పోవటం వలన ఒక నిర్ణయానికి వచ్చాను. ఒక 6 నెలలు కష్టపడి వ్యాపారం అభివృద్ధి చేసి ఆ తర్వాత నుండి క్రమం తప్పకుండా మందిరానికి వెళదామని నిర్ణయించాను. అప్పుడు ప్రతి శని, ఆది వారాలు ఏదో పుణ్య క్షేత్రానికైన వెళ్ళాలని మంచి కారు కొనుక్కోవాలని నిర్ణయించాను. నేను ఈనిర్ణయం జనవరి 2010లో తీసుకున్నాను. స్వామి జనవరి 16,17,18 చెన్నై సాయిబాబా మందిరానికి వచ్చినప్పుడు సత్సంగం ప్రారంభించి "రెక్కలు యిస్తే ప్రపంచం అంతా చుట్టుకొని వస్తానన్నాడు ఒకడు" అని ఆగి నా వైపు చూసారు. నేను కారు కొనుక్కోవటం గురించే అలా అన్నారు అనుకున్నాను. అంటే

అలా అని ఒక దగ్గర ఉండి ఏమి చేసినా పని చేస్తుంది తప్ప తిరిగి తిరిగినంత మాత్రాన ఏమి పుణ్యాలు వచ్చేస్తాయి మనకి అని, నా ఆలోచన స్వామికి సమ్మతంకాదని మనస్సుకి తోచింది. చిత్రంగా ఆ మాటతో నా మనస్సు సమాధానపడి అవసరమైతే స్వామే చెప్పాలని నా ఆలోచనను మానుకున్నాను. తర్వాత 6 నెలలు రాత్రింబవళ్ళు ఆఫీసులో చాలా కష్టపడ్డాను. ఇంట్లో పారాయణలు కూడా చేసేవాడిని. మందిరానికి వెళ్ళేవాడిని కాను. 6 నెలలైనా వ్యాపారం ఏ మాత్రం అభివృద్ధి పొందలేదు అనుకున్న ఫలితాలు రావట్లేదు. జూన్‌లో స్వామి మరలా వచ్చినప్పుడు దర్శించుకుంటే స్వామి నాతో కోపంగా "ఏరా ఎందుకురా వస్తున్నావు? అవసరం ఉంటే వస్తున్నావు. కోరికలు తీరటానికి వస్తున్నావు, ఏరా వేణు" అన్నారు. నేను నా కోరిక మంచిదే కదా అని అనుకోవటం వలన స్వామి అన్న మాటలకి గమ్మున ఉండిపోయాను.

తర్వాత స్వామి దగ్గరకి నీలకంఠరావుపేట వెళ్ళినప్పుడు నన్ను కూర్చోపెట్టుకొని "దేవుడు అంతటా ఉన్నాడు. నువ్వు మీ యింట్లో చేసుకున్నా కూడా ఉంది. కానీ కొన్ని క్షేత్రాల్లో కొంత శక్తి ఉంటుంది అక్కడికి వచ్చి చేస్తే ఫలితాలు వేరే. అలాంటి క్షేత్రాల్లో ఏమి చేయకుండా ఉన్నా మంచిదే. నువ్వు పారాయణలు, పూజలు ఇంట్లో ఉండి చేసుకుంటే పుణ్యమొచ్చేస్తుందనుకుంటే చేసుకోరా, పోరా" అన్నారు. సరే స్వామి అని తర్వాత ఒక వారం రోజులు మందిరానికి వచ్చేసరికి స్వామి గోవర్ధన్‌గారితో "వాణ్ణి ఉదయం, పవళింపు ఆరతులుకి రమ్మను, బాగుపడుతాడు" అని చెప్పి పంపారు. అప్పటినుండి క్రమంగా మందిరానికి వెళుతున్నాను. వెంటనే ఆఫీసులో ఫ్రీ అయిపోయాను, వ్యాపారం అభివృద్ధి చెందింది

పై లీల ద్వారా నాకు పుణ్యక్షేత్రాలు తిరుగుతూ వుందామనుకుంటే అది కాదని సూచించారు. ఆ తర్వాత భగవంతుడు అంతటా ఉన్నాడు కదా అని ఇంట్లో పారాయణలు, పూజలు చేసుకుంటే అలా మాత్రమే చేయకూడదని, సద్గురువు నిర్దేశించిన క్షేత్రాల్లో మన సాధన చేయాలని

సూచించారు. నేను వ్యాపారం చక్కపెట్టుకుని ఆ తర్వాత రెగ్యులర్‌గా మందిరానికి వెళదామనుకుని 6 నెలలు కష్టపడితే ఆశించిన ఫలితం సాధించలేకపోయాను. స్వామి చెప్పినట్లు మందిరానికి వెళ్ళి ఆరతులకి హాజరవుతుంటే వ్యాపారం అభివృద్ధి సాధించటం, నాకు మానసిక ప్రశాంతత, ఆర్థికంగా అభివృద్ధి రావటం జరిగింది. అందువలన నా యిష్టాయిష్టాలకి తావు యివ్వకుండా అనన్య చింతనతో సద్గురు సేవ చేసుకుంటే నాకేది శ్రేయస్కరమో ఆ సద్గురువే చేస్తాడని నమ్ముతున్నాను.

ఇక్కడ శ్రీ ఆచార్య భరద్వాజ మాష్టారు గారు పరిప్రశ్న అనే గ్రంథంలో (ద్వితీయ ముద్రణ: పేజీ నెం: 24) ఒక భక్తునికి ఇచ్చిన సమాధానంలో ప్రస్తావించిన విషయాన్ని 'జపపూజాదులేమి చేసినా యింటివద్ద కంటే నదీ తీరంలోను, అంతకంటే పుణ్యక్షేత్రంలోనూ, అన్నిటికంటే మహాత్ముని సన్నిధియందూ ఎన్నోరెట్లు అధిక ఫలితం కలిగియుంటాయని ఋషులందరూ చెప్పారు' గుర్తుంచుకోవాలి. అందువలన వీలు చేసుకొని భౌతికంగా వున్న దర్గాస్వామిలాంటి మహనీయులను దర్శించుకొని వారి ఆశీస్సులు పొందాలి.

## శేఖర్‌రాజు గారు, బి.టి.ఎమ్. టెంపుల్, బెంగుళూరు

స్వామివారు చెట్టు దగ్గర దీపం పెట్టి ప్రదక్షిణం చేస్తున్నప్పుడు అక్కడ ఒక భక్తురాలు తన కోరిక తీరడానికి స్వామివారి (దర్గాలకు) సేవ చేస్తుండేది. అమ్మా! ఫలితం పొందాలంటే అని స్వామి ఒక కథ చెప్పారు. అది ఏమిటంటే - "తిరువణ్ణామలైలో ఒక ముసలావిడ ఒక కోరికతో వెళ్ళి అక్కడ భోజనాలు తింటూ సేవ చేసుకుంటుండేది. అలా 3 సంవత్సరాలు అయినా ఆవిడ కోరిక తీరలేదు. ఒకరోజు బాధపడుతూ పడుకుని ఎందుకు అందరి కోరికలు 10,15, నెలరోజులలో తీరిపోతుంటే నాది మాత్రం 3 సంవత్సరాలయినా తీరడం లేదని అనుకుంటుంటే ఆమెకు ఒక భావన వచ్చింది. **"మేము పెట్టే భోజనం నువ్వు తింటూ నువ్వు సేవ చేసుకుంటే నీ కోరిక ఎలా తీరుతుంది**" అని భగవంతుని నుండి సందేశం వచ్చింది.

మరురోజు నుండి కొండపై నుండి మోదుగ ఆకులు తెచ్చి అవి కుట్టి అమ్మి ఆ డబ్బుతో సేవ చేసేది. ఈ విధంగా 3 నెలలు చేసినా ఆమెకు కోరిక తీరలేదు. తరువాత ఆమెకు కొండపైన ఆకులు మీ అబ్బవా అని అనిపించింది. ఆమె తరువాత సొంత ఇంటికి వెళ్ళి డబ్బు తెచ్చుకుని సేవ చేసుకునేది. తరువాత 15 రోజులలో ఆమె కోరిక తీరింది''. ఈ కథ స్వామి అక్కడ సేవ చేసే ఆమెకు చెప్పినప్పుడు అక్కడే వున్న నాకు వెంటనే మనస్సులో 'నేను బెంగుళూరులో బి.టి.ఎమ్ లేఔట్‌లో వున్న బాబా గుడిలో బాబా ప్రసాదాలు తింటూ సేవ చేస్తున్నాను అనుకుంటున్నాను, కానీ బాబానే దర్గాస్వామి రూపంలో వచ్చి నాకు జ్ఞానోదయం కలిగించారు. ఇకమీదట **సేవ చెయ్యాలి అంటే నిస్వార్థంగా సేవ చెయ్యాలి** అని నిర్ణయించుకున్నాను'. ఆ విధంగా చేయటానికి ప్రయత్నిస్తున్నాను. ఒక్క సన్నివేశంతో ఇద్దరు భక్తులకి (సేవ చేసే భక్తురాలికి, శేఖర్‌రాజుగారికి) జ్ఞానోదయం అయింది. అదీ సద్గురుని బోధనాదక్షత.

## స్వామి మనకి చెప్పిన పని మనమే చెయ్యాలి

## రమేష్, (మార్బుల్స్ వ్యాపారి), నెల్లూరు

ఒకసారి దర్గాల దగ్గరకి మార్బుల్ రాళ్ళు పంపిచమంటే నేను ఒక లారీ లోడ్ మధ్యాహ్నం 2గం॥లకి స్వామి దగ్గరకి పంపించాను. స్వామికి ఫోను చేసి ఇలా పంపించాను అంటే **"నీకు చెప్పిన పని నువ్వొచ్చి చూసుకుని చేసుకు పోవాలి కానీ మీ స్టాఫ్‌కి చెప్తే వాళ్ళు వాళ్ళ స్టాఫ్‌కి చెప్తారు. నువ్వొచ్చి చేస్తే నీకే మంచిది. ఇక్కడకు పంపించే వారు చాలామంది వున్నారు"** అని చెప్పారు. నేను వెంటనే స్వామికి కూడా చెప్పకుండా దర్గాల దగ్గరకి బయలుదేరి రాత్రి 2గంటలప్పుడు చేరాను. అప్పటికి నాకోసం వంట తయారుగా వుంది. నేనొస్తున్నాని స్వామి అక్కడ వుండేవారికి చెప్పి వంట తయారుచేయమని, నేనొచ్చాక నాకు పెట్టమని చెప్పారని చెప్పారు.

## చంద్రశేఖర్ (నెల్లూరు) స్వామి చెప్పిన మాటల్లోని సూక్తులు ఇలా చెపుతున్నారు.

నేను ఆర్థిక ఇబ్బందుల వలన స్వామిని దర్శనం చేసుకున్నప్పుడు "అరెయ్! నీకు మానసిక శాంతిని ఇస్తాను కానీ సూట్‌కేస్‌లో డబ్బులు ఇమ్మంటే ఇవ్వనురా! మంచి మార్గంలో వుండు నాయనా!" అని చెప్పారు.

"నమ్మండి సొమ్మవుతుంది. దర్గాలలో వున్నప్పుడు వుండే నియమ నిష్ఠలలో అణావంతు మీ ఇండ్ల దగ్గర వుంటే మీకు అన్నీ జరుగుతాయి. రీజనబుల్ కోరిక కోరండి. అమ్మాయికి లక్ష రూపాయలు పెట్టి పెండ్లి చేయాలంటే భగవంతుడిని అడిగితే అప్పోసొప్పో పుట్టించి ఇస్తాడు. సైకిల్ వుండి స్కూటర్ కావాలని అడిగితే ఇస్తాడు. అలా కాక బెంజి కారు కావాలంటే వున్న సైకిల్ పోతుంది. అత్యాశ కాకుండా వుంటే భగవంతుడ్ని లేదా సాయిబాబాను అడిగెయ్. నేను కూడా ఆయన్ని ప్రార్థిస్తాను"

పునరపి జననం పునరపి మరణం గురించి ప్రస్తావన వస్తే స్వామి **"నీలో కోరిక చస్తే నీవు పుడితే ఏంటి, చస్తే ఏంటి"** అని అన్నారు. ఆశబోతే అంతాబోతుండ్లాయ్యా! అన్న గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి మాటే దర్గాస్వామి కూడా నొక్కి చెపుతున్నారు. ఆచరించి తరించెదముగాక!



# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 13

## అమ్మయ్యగారు

**సంతానం కావాలని ప్రార్థన చేయాలి. శాపగ్రస్థులై జన్మించిన, క్షణికోద్రేక ఫలితంగా పుట్టిన, నిరోధించలేనందున జన్మించిన పిల్లల నుండి, అలాంటి వారసత్వం సంతరించుకొన్నవారి నుండి మనం ఏం ఆశించగలం?**

**స్వామి వివేకానంద**

(స్వామి వివేకానంద సమగ్ర, సప్రామాణిక జీవిత గాథ , పే 15)

నీలకంఠరావుపేట శ్రీ కొణిజేటి అనంతయ్య, సుబ్బమ్మగార్లు మాతాజీగారికి తల్లిదండ్రులు. వీరు చాలాకాలం సంతానం లేక యెన్నో పుణ్యక్షేత్రాలను దర్శించి సేవించి, తుదకు పండరి క్షేత్రం వెళ్ళి శ్రీ పాండురంగస్వామిని కొంతకాలం సేవించారు. తత్ఫలితంగా జన్మించిన బిడ్డయని తల్లిదండ్రులు 'రంగనాయకమ్మ' అని పేరు పెట్టి పెంచి పెద్ద చేశారు. ప్రాథమిక విద్యను చెప్పించారు.

రంగనాయకమ్మ బాల్యం చాలా వరకు నీలకంఠరావుపేటలో గడిచింది. ఆ తల్లి ఊరిలోని ప్రాథమిక పాఠశాలలోనే ఐదవ తరగతి వరకు చదివింది. తరువాత అమ్మమ్మగారింట్లో ఉండి కొంతకాలం సంగీతం నేర్చుకున్నది. ఆట పాటలలో కూడా చురుకుగానే పాల్గొనేది. తల్లికి ఇంటిపనులలో సహాయం చేసేది. అల్లరి చేయడం అనేది మన రంగనాయకమ్మ ఎన్నడూ యెరుగదు. హాస్యానికైన అబద్ధమాడదు. తగవులాడటం, పరుషముగా మాట్లాడటం ఆ మహాతల్లి తత్త్వం కాదు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు సుగుణాలు బాల్యంలోనే ద్యోతకమయినాయి.

అమ్మయ్యకు 17 వ ఏట ఋణానుబంధం వలన వివాహం జరిగింది కానీ సామాన్య మానవులవలె శారీరక సంబంధం లేదు.

వధూవరుల జీవితంలో మరుపురాని మొదటిరాత్రి కొద్ది గంటలలో రాబోతుంది. ఆ సమయంలో దేవదూత ఆదేశించిన ప్రకారం దర్గాస్వామి వచ్చి అమ్మయ్యగారితో శారీరక సంబంధం వుండకుండా జీవించమని దేవదూత ఆదేశిస్తున్నారని, నీ నిర్ణయం తెలుపమని అడుగగా "అంతకంటే మహాభాగ్యమా" అని అన్న తల్లి మన అమ్మయ్యగారు.

స్వామి మొదట ఈ దర్గా వెనుకనే ఉన్న రాతి స్థంభాల మంటపంలో ఉండేవారు. రాత్రి పూట ఒక చిన్న నూనె దీపం మాత్రమే ఉండేది. మాతాజీ వచ్చిన తర్వాత మండపానికి నాల్గు వైపులా తాటాకులు కట్టి దానిని ఒక చిన్న గదిగా చేసుకున్నారు. **మొదట మూడు నెలల కాలం అక్కడ మాతాజీ ఏక వస్త్రంతోనే గడిపింది.** స్వామీజీ కౌపీనం ధరించి జడలు కట్టిన జుత్తుతో తన సాధన కొనసాగిస్తూ ఉండేవారు.

**సంపన్న కుటుంబంలో జన్మించి యున్న తల్లి భౌతికమైన భోగభాగ్యాల నాశింపక స్వామి తోడిదే లోకమని భావించెను. ఆ తరుణంలో దర్గాలో చిన్న కుండలో అన్నం వండుకునే వారు. అప్పుడప్పుడు బియ్యం లేకుండేవి. అలాంటి సందర్భాలలో వారికి నిరాహారమే.** ప్రక్క గ్రామం నుంచి ఒకామె పాలు తెచ్చియిస్తే అవి త్రాగి కాలం గడిపే వారు. ఒకనాడు పదిమైళ్ళ దూరంలో గల గ్రామం నుంచి ఒకామె సజ్జ రొట్టెలు, కారం తెచ్చి ఇస్తే అవి తిని కొన్నాళ్ళు గడిపారు. అయితే ఇదిలేదు అన్న భావన వారిద్దరిలో ఎవరికీ ఎన్నడూ రాలేదు. ఆకలి దప్పులకు శీతోష్ణ పరిస్థితులకు ఆధ్యాత్మిక సంపన్నులైన ఆ దివ్య దంపతులు పూర్తిగా అతీతులు.

స్వామివారు కడపకు వెళ్ళినప్పుడు గానీ, షోలింగర్‌లో తపస్సు చేయటానికి వెళ్ళినప్పుడు కానీ మాతాజీ, మాతాజీ తల్లిగారు మాత్రమే ఆ అరణ్య ప్రదేశంలో ఉండేవారు. తానే దర్గాల వద్ద దీపాలు వెలిగించేది. దర్గాలోని గురువులకు భక్తులు తెచ్చినవి చదివింపులు చేసేది. దర్గాకు వచ్చిన భక్తులు హుండీలో డబ్బులు వేస్తే ఆ డబ్బు దీపాలకు నూనె కొరకు ఖర్చు చేసేది. భయం అనేది మాతాజీ

యెరుగరు. మాతాజీ బంధువులు కొందరు అమ్మా ఈ అడవిలో నిర్జన ప్రదేశంలో ఉండడానికి నీకు భయం లేదా? అని అడిగారు. దానికి మాతాజీ జవాబు: **భయమా? అది ఎలా ఉంటుంది. చూపించు చూస్తాను** అని అన్నారు. మాతాజీ కేవలం గృహిణి మాత్రమే కాదు. స్వామీజీ లాగే ఆధ్యాత్మిక మార్గంలో పరిణతి సాధించిన మహాయోగిని. అయితే తన శక్తిని, నిజతత్వాన్ని ప్రయత్న పూర్వకంగా మరుగు పరుచుకొని సాధారణ గృహిణిలాగే ప్రవర్తించేది. వివాహం జరిగిన కొత్తలో స్వామీజీ అమ్మగారిని ఒక ప్రశ్న అడిగారు: **"ఎవరు ఎవరిని కాపాడుతారు?"** అని. ఆ ప్రశ్నకు అమ్మగారు ఇచ్చిన సమాధానం **"అందరినీ కాపాడే వాడు ఆ పరమాత్మ, అందరికీ అతడే రక్షకుడు"** అని. అటువంటి జవాబు ఇవ్వగలగడం కేవలం మహాయోగినులకే సాధ్యం.

ఒకరోజు మాతాజీ పూలు కట్టుకుంటూ కూర్చుని ఉన్నది. అమ్మగారి మేనమామ చూడడానికి వచ్చాడు. ఆయన ఒక ఫర్లాంగు దూరంలో ఉండగానే మాతాజీ చుట్టూ ఒక దివ్య జ్యోతి వ్యాపించి ఉండటం చూశాడు. దగ్గరకు వచ్చే కొద్దీ ఆ వెలుగు మరింత ప్రకాశం కావడంతో ఆయనకు చాలా భయం వేసింది. చాలాసేపు ఆయన మామూలు స్థితికి రాలేక పోయాడు.

మరొకసారి మాతాజీ ఆశ్రమంలో ఒక గోనెపట్టపై కూర్చుని ఉంది. ఆ పట్ట క్రింద రెండు పెద్ద పాములు ఉన్నాయి. మాతాజీ లేవగానే ఆ రెండు పాములు ప్రశాంతంగా బయటకు వచ్చి జరజరా వెళ్ళిపోయాయి. మాతాజీ ఏ మాత్రం కంగారు పడలేదు, చలించలేదు. మామూలుగానే ఉన్నారు.

## పిల్లల్ని ఎలా పెంచాలో అమ్మయ్యగారి ఆచరణ:

ఒకప్పుడు దర్గాల వద్ద ఒక గర్భవతి అయిన ఆమె వచ్చి ఉంటుండేది. ఆమెకు కలగబోయే బిడ్డకు జ్ఞానాన్ని ప్రసాదించి తమ తదనంతరం ఆశ్రమ విషయాలు ఆ బిడ్డకు అప్పగించాలని

అమ్మయ్యగారు తలచారు. ఈ సంకల్పంతో అమ్మయ్యగారు ఒక రొట్టెను తయారుచేశారు. **ప్రహ్లాదుడికి గర్భంలో వుండగానే నారాయణ జపం వలన జ్ఞానం కల్గినట్లు, ఆ గర్భవతిచే ఈ రొట్టె తినిపించడం ద్వారా ఆమె కడుపులో ఉన్న బాబుకు జ్ఞానం ప్రసాదించాలని అమ్మయ్యగారు సంకల్పించారు**. ఆ రొట్టె ఆమెకు ఇవ్వాలని దానిని ఒక కవరులో చుట్టి దానిపై ఇంకొక కవరు తొడిగి దానిపై మరలా ఒక కాగితం చుట్టి, బొడ్డులో దోపుకొనే డబ్బు సంచిలో పెట్టుకున్నారు. ఇదంతా చూస్తూ ఉన్న స్వామివారు, నవ్వుతూ ఏమిటి అని అడుగగా అమ్మగారు వివరించారు. అప్పుడు స్వామి నవ్వుతూ అలా నీవు అనుకున్నట్లు ఏమీ జరుగదు. దానిని నీ నుండి కడప స్వామి తీసుకుని తింటారు చూడు అన్నారు. కొద్దిసేపటికి కడపలో దిగారు. ఎక్కడనుండి వచ్చారో తెలియదుగానీ దిగిన వెంటనే కడపస్వామి వచ్చి దోపుకున్న సంచి పట్టుకుని విడువలేదు. అప్పుడు అమ్మయ్యగారు దర్గాస్వామివారివైపు చూడగా ఆయన పకపకా నవ్వుతూ నీవు ఆ రొట్టెను ఆయనకు ఇవ్వక తప్పదు లేకుంటే ఆయన ఇక్కడ నుండి కదలరు అని చెప్పగా, అమ్మగారు ఆ రొట్టె కడపస్వామివారికి ఇచ్చేశారు. ఆయన ఆ రొట్టె తిని వెళ్ళిపోయారు. దీని గురించి దర్గాస్వామి చెపుతూ "కడపస్వామి అలా రొట్టెను స్వీకరించి మాకు జ్ఞానాన్ని ప్రసాదించారు" అని అన్నారు.

**మనం తినే ఆహారం హృదయపూర్వకమైన నామస్మరణతో తయారు చేస్తే ఆ ఆహారం తిన్నవారికి భక్తిశ్రద్ధలు అబ్బుతాయని, సత్వగుణం వృద్ధియగుతుందన్నది ఒకటవ సందేశం. నామస్మరణతో చేసిన ఆహారమంటే భగవంతునికెంతో ఇష్టము. దానిని ప్రీతితో స్వీకరిస్తారని ఈ లీల తెలుపుతుంది. అలా చేసి అందరమూ తరిద్దాము.**

ఆ తరువాత కొంతకాలానికి ఆ గర్భవతికి బాబు పుట్టాడు. ఆ బాబును అమ్మయ్యగారే పెంచారు. స్నానం చేయించటం మొదలు

అన్నీ అమ్మయ్యగారే స్వయంగా చేసేవారు. 10వ తరగతి వరకూ చదువు చెప్పించారు. బి.కామ్. కూడా చదివించి స్వామివారే చీటి వ్రాసి ఇచ్చి బ్యాంకులో ఉద్యోగం వేయించారు. కొన్నాళ్ళకు అతను తన తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిపోతానని చెప్పి ఆశ్రమం నుండి వెళ్ళిపోయాడు. అతను లౌకికమైన విషయాలలో పడిపోయాడు గానీ ఎంత చెప్పినా సరే అదృష్టం లేక జ్ఞానం అబ్బలేదు. **అంటే గర్భవతులుగా వున్నప్పుడు చేసే భగవంతుని సేవ వలన పుట్టబోయే బిడ్డ సంస్కారము తేలికగా మారగలదని, పుట్టిన తర్వాత చేసే దాని ఫలితము కష్టతరమని మనం గుర్తించాలి.**

1964లో ఏలూరు నుంచి భార్యాభర్తలు ఇరువురు దర్బారు నగరం వచ్చారు. వారి వద్ద ఉండే బంగారు వడ్డాణాన్ని మాతాజీకి ఇవ్వాలని భర్త ఉద్దేశ్యం. ముమ్మిడివరం బాలయోగికి ఇవ్వాలని భార్య ఉద్దేశ్యం. నాలుగు సంవత్సరాలుగా వారి మధ్య ఆ వివాదం జరుగుచుండేది. చివరగా మాతాజీకే ఇవ్వాలని నిర్ణయించుకొని మాతాజీని అడిగారు. ఆమె వెంటనే "బంగారం, బంగారు ఆభరణాలు మాకెందుకు?" అని తిరస్కరించింది. భార్య భర్తలు కడపలో ఉన్న స్వామీజీ వద్దకు వెళ్ళి వారినడిగారు వారు. **"మాతాజీ ప్రకృతి స్వరూపిణి, ఆమె నిరాకరించిన తర్వాత నాకెందుకు"** అని స్వామి అన్నారు. వారికే స్వామీజీ ఇలా చెప్పారు: "మాతాజీ ముక్తి కాంత, ఆదిశక్తి ప్రతిరూపం" అని. మనసా, వాచా, కర్మణా మాతాజీ, స్వామీజీలు అభేదరూపాలు.

ప్రతి సంవత్సరం ఫాల్గుణ పూర్ణిమనాడు దర్గావద్ద మూడు రోజులు ఉరుసు జరుగుతుంది. దానికి భక్తులు అసంఖ్యాకంగా వస్తారు. వచ్చిన వారందరికీ స్వామీజీ, మాతాజీలు భోజనం పెడతారు. ఒక సంవత్సరం పెద్ద కరువు వచ్చింది. బియ్యం ధర చాలా పెరిగి పోయింది. అప్పుడు మాతాజీ బంధువు ఒకాయన 'ఈ సంవత్సరం కూడా భక్తులకు భోజనాలు పెడతారా?' అని అడిగాడు. దానికి మాతాజీ ఇచ్చిన జవాబు: "ఒక్కొక్క బియ్యపుగింజ ఒక్కొక్క రూపాయైనా భోజనాలు పెట్టడం మానము"

అని. మాతాజీ ధృడ సంకల్పానికి కార్యదీక్షకు ఈ జవాబు చక్కని ఉదాహరణ. మరొక సంవత్సరం నీలకంఠరావుపేటలో అగ్నిప్రమాదం సంభవించింది. చాలా మంది ప్రజలు సర్వం కోల్పోయి నిరాశ్రయులైనారు. వారు మాతాజీ వద్దకు వచ్చి తమ గోడు విన్నవించుకున్నారు. మాతాజీ వారందరినీ ఓదార్చి ఒక్కొక్క కుటుంబానికి పదిశేర్ల బియ్యం, యాభై రూపాయలు రొక్కం ఇచ్చి పంపారు. మరుసటిరోజు ఉగాది పర్వదినం. భోజనాలకు బియ్యం కావాలి. మాతాజీ అవేవీ ఆలోచించలేదు. కష్టాల్లో ఉన్నవారిని ఎలా ఆదుకోవాలనే ఆమె తపన, ఆమె ధ్యాస. ఉదారత్వానికీ, త్యాగశీలతకు, సానుభూతికి మాతాజీ మరోపేరు.

దైవకార్యాలకు, భక్తుల సౌకర్యాలకు మాతాజీ, స్వామివారు చేసిన కృషి, ధన సహాయం అపారం. షిర్డీసాయి విగ్రహప్రతిష్ఠ అనేక గ్రామాలలో, పట్టణాలలో వారు చేశారు. ఉదాహరణకు నెల్లూరులోనే అయిదు ప్రదేశాలకు పైగా మరియు వింజమూరు, కావలి, కనిగిరి, ఆత్మకూరు, కొండబిట్రగుంట, కడప, రాయచోటి, పొదలకూరు, అప్పారావుపాళెం, మొగిలిచర్ల, డేగపూడి, కండలేరు, చెన్నైలలో శ్రీ సద్గురు షిర్డీ సాయినాధుని విగ్రహాన్ని స్వామీజీ తమ స్వర్ణ హస్తాలతో ప్రతిష్ఠించగా, మాతాజీ తమ స్వర్ణ హస్తాలతో మందిరానికి అవసరమైన ధనసహాయం, వస్తుసహాయం కూడా చేశారు. అంతేగాక, గువ్వల చెరువులో మసీదులకు, దర్గాలకు కూడా ధన సహాయం చేశారు. అలాంటి సహాయం వారి సర్వమత సమభావానికీ, పరమత సహనానికి అత్యుత్తమ నిదర్శనం. కేవలం షిర్డీసాయి విగ్రహాలనేకాక వారు సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను, నవగ్రహాలను, గణపతి, దత్తాత్రేయ స్వామి, శివపార్వతులు వగైరా దేవతా విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. మరొక విశేషం, శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారుగారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం.

భక్తుల సౌకర్యార్థం పుణ్యక్షేత్రాలలో, ఇతర ప్రదేశాలలోకూడా వారు భూరి విరాళాలు ఇచ్చిఉన్నారు. వాటిలో మచ్చుకు కొన్ని :

శిరిడీలో అఖిల భారత శిరిడీ క్షేత్ర సాయిభక్త నివాస్ ట్రస్టువారికి భక్తులవసతికై ఒక గది నిర్మాణానికి ఒకలక్ష వేయినూటపదహారు రూపాయలు; అదే సత్రంలో నిత్యాన్నదానానికి ఇరవై అయిదువేల నూటపదహారు రూపాయలు; షిర్డీ సంస్థాన్ వారి నిత్య అన్నదాన పథకానికి యాభైవేల రూపాయలు; తమిళనాడులోని షోలింగర్‌లో శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారి సన్నిధిలో గది నిర్మాణానికి ధనసహాయం; నెల్లూరులో శ్రీ షిర్డీసాయి రూరల్ వెల్ఫేర్ మరియు మెడికల్ ఫౌండేషన్‌వారు నిర్మించిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మరియు శ్రీ సాయి మందిరం ఆవరణలో ధ్యాన మందిర నిర్మాణానికి ఒక లక్ష రూపాయలు; భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి పుణ్యక్షేత్రమైన గొలగమూడిలో అన్నదానానికీ, పేద విద్యార్థుల నివాసానికి ధర్మసత్ర నిర్మాణము; ఉచిత వివాహాలకై కళ్యాణ మండప నిర్మాణార్థం శంకుస్థాపన. ఇలాంటి వితరణ కార్యాలలో సంకల్పమూ, ప్రోత్సాహము మాతాజీదే. రూపకల్పన, నిర్వహణ స్వామీజీది. స్వామీజీతో మాతాజీ, "స్వామీ, మీ చేతుల మీదుగా లక్షలు ఖర్చవుతాయి. లక్షలు కూడా అదేరీతిలో చేతికి వస్తాయి" అనేవారు. ఇంతగా దాన ధర్మాలు చేసినా వారిలో నిగర్వత, నిరాడంబరత మినహా మరేమీ కనుపించదు. వీటిని గురించి ప్రస్తావిస్తే, మాతాజీ "మాదేముంది, వారిసొమ్ము వారికిచ్చాం" అనేవారు.

దర్బారు నగరంలో (దర్గావద్ద) ఉరుసు, జెండా ఉత్సవమేగాక, శ్రీరామనవమి, గురుపూర్ణిమ, విజయదశమి, దత్త జయంతి, ఆంగ్ల నూతన సంవత్సరాది, శ్రీ సమర్థ సద్గురు సాయినాథ మందిర వార్షికోత్సవం వగైరా జరుపుతారు. వాటికి కుల, మత, ప్రాంత, ధనిక, బీద లాంటి తారతమ్యాలు ఏమీ కనుపించవు. అందరికీ ఒకే పంక్తి. అందరికీ అదే మృష్టాన్న భోజనం. అందర్నీ మాతాజీ స్వయంగా "భోజనం చేశారా లేదా?" అని అడుగుతారు. అంతేగాక దూర ప్రాంతాల భక్తులు ఇళ్ళకు వెళ్ళేటప్పుడు వారికి స్వీట్లు వగైరా ప్యాకెట్లు ఇచ్చి పంపుతారు. ఇవన్నీ మాతాజీ స్వీయ పర్యవేక్షణలో జరుగుతాయి.

1992లో ఒకరోజు ఒక దుస్సంఘటన జరిగింది. ఆరోజు మాతాజీ స్వామివారితో "స్వామీ, ఈరోజు నాకేదో జరగబోతోంది" అని అన్నారు. స్వామి "లేదు లేదు, అది నా వెంటబడింది, నాకే వస్తుంది" అన్నారు. అయినా ఆరోజు స్వామివారు మాతాజీ వెంటనే ఉన్నారు. సాయంకాలం మాతాజీ ఆవు దగ్గర పాలు తీస్తున్నారు. ఉన్నట్టుండి ఆవు ఆమెను కాలితో తన్నింది. మాతాజీ కిందపడ్డారు. అప్పుడు స్వామీజీకి ఒక నల్లని ఆకారం కనుపించింది. వెంటనే స్వామీజీ మాతాజీ వీపుపై ఒక దెబ్బ వేసి, నేనుండగా నీవెట్లా వస్తావు" అని అన్నారు. మాతాజీ "స్వామీ, అది వచ్చింది, పోయింది, నా కాలు కీలు తొలగింది. లేపండి" అని అన్నారు. చూడగా మాతాజీకి తుంటి ఎముక విరిగిపోయింది. రెండుసార్లు కాలికి ఆపరేషన్ చేయవలసి వచ్చింది. ఆ తర్వాత స్టిక్ స్టాండ్ సహాయంతో నడుస్తూ ఉండేవారు. అప్పటినుండి మాతాజీ పక్కకు ఒత్తిగిలి పడుకోడం వీలుపడక వెల్లకిలా పడుకునేవారు. 1998లో మద్రాసులో మూడవసారి ఆపరేషన్ జరిగింది. ఆ తర్వాత ఏ సహాయం లేకుండా నడవగలిగినా మునుపటిలాగా నడవలేకపోయారు. పైగా మోకాళ్ళ నొప్పులు కూడా ఎక్కువగా ఉండేవి.

## కె.యం.యన్. చంద్రశేఖరరావు, హైదరాబాదు:

నేను మొదటిసారి దర్గాకు వెళ్ళినప్పుడు నా పేరు కానీ, నేనెవరనో కానీ వారికెవరికీ తెలియదు. నేను చెప్పలేదు. అమ్మయ్య వద్దకు వెళ్ళి పాదనమస్కారము చేసుకున్నప్పుడు అమ్మయ్య "నీవు సుకన్య భర్తవు కదా!" అని అడిగారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. నా భార్య అప్పుడు నా ప్రక్కన లేదు. మరొకసారి వెళ్ళినప్పుడు స్వామివారు ఆశ్రమంలో లేరు. అమ్మయ్యకు నమస్కారం చేసుకొని నా కుమారుని చదువు సంగతి ప్రస్తావించాను. అప్పుడు దానికి పరిష్కార మార్గం చూపించారు. ఆ తర్వాత స్వామివారి దర్శనం చేసుకొని అదే విషయం చర్చించగా స్వామివారు అమ్మయ్యగారు చెప్పినదే చెప్పారు. అది నాకు చాలా వింతగా అనిపించింది. వారిద్దరి అంతరంగం ఒకటేనని

అర్థమైంది.

## జి.వి.యన్. కళ్యాణ్, ప్రొద్దుటూరు

ఒకసారి అమ్మయ్యగారి ఆశీస్సులతో విహారయాత్రకు వెళ్ళాను. ఘాట్ రోడ్డు ప్రయాణంలో ఒక మలుపులో బస్సు వెనుక భాగం వెనుకకు వాలింది. వెనుక అగాధమైన లోయ. అలాంటిదే మరొక చోట జరిగింది. బస్సులో అందరం భయపడ్డాం. తిరిగి ఇల్లు చేరుకోగానే స్వామివారికి ఫోను చేశాను. స్వామి వెంటనే "నాయనా టూర్ బాగా జరిగిందా? నీవు ప్రయాణంలో రెండు చోట్ల భయపడ్డావు కదరా? నాకు అమ్మయ్య చెప్పిందిలే" అన్నారు. అప్పుడు నాకు అర్థమైంది నాకు ప్రయాణంలో అనుక్షణం అమ్మయ్య రక్షణ వున్నదని.

## కె. ఉమ, నెల్లూరు

నా తమ్ముడు చెడు సహవాసం వలన ఒకసారి మద్యాన్ని రుచి చూసాడు. ఈ విషయం మాకు తెలియదు. దర్గాల దగ్గరకి వెళ్ళినప్పుడు అమ్మయ్య వాడ్ని దగ్గరకు పిలిచి ఎలాంటి వాడివి ఎలా అయిపోయావు చూడు అని అరచి జరిగిన విషయం స్వామితో చెప్పి వాడిని మార్చమని చెప్పింది. అప్పటినుండి వాడు దర్గాల దగ్గరకి వెళుతున్నాడు. చెడు సహవాసాలన్నీ దూరమైనాయి.

## యశోదమ్మగారు (నెల్లూరు)ఇలా చెపుతున్నారు

మా పెద్దమ్మాయి పెళ్ళి ముందర రోజు  స్వామి, అమ్మయ్యలు వచ్చి పెళ్ళికూతురుని చేసారు. అమ్మయ్య స్వయంగా వడియాలు పెట్టారు. పెళ్ళిరోజు మేము 800 మందికి వంట చేస్తే ఒక వెయ్యికి పైగా బంధువులు, మిత్రులు వచ్చారు కానీ ఏ మాత్రం శబ్దం లేదు, వంటకాలు సంతృప్తిగా సరిపోయాయి మరియు ఒక్కరు కూడా దేనికీ వంకలు పెట్టలేదు.

## కె. జయశ్రీ, రవీంద్ర నగర్, నెల్లూరు

సాధారణంగా అమ్మయ్య ఎక్కడికైనా వెళ్ళినప్పుడు అమ్మయ్య వెంట ముగ్గురు లేక నలుగురు మహిళా భక్తులు ఉంటారు. అయితే

మా యింటికి 2004 మే లో స్వామి, అమ్మయ్య వచ్చినప్పుడు అమ్మయ్యతో పాటు ఎవ్వరూ రాలేదు. ఈ విషయం అమ్మయ్యను అడిగితే అమ్మయ్య "**జయశ్రీ! ఇక మీద నాకు ఎవ్వరితో అవసరం లేదు. నేను నెల్లూరు రావడం ఇదే చివరిసారి. ఇకమీద స్వామి ఒకరే వస్తారు**" అని అన్నారు. తర్వాత విశ్రాంతి తీసుకుని సాయంత్రం కడపకు వెళ్ళిపోయారు. ఆ తర్వాత కొద్దిరోజులకే అమ్మయ్య నిర్యాణ వార్త అందింది. ఎంతో దు:ఖించాను. అమ్మయ్య ఆనాడు అన్నమాట అంతరార్థం అప్పుడు అవగతమైంది.

మద్రాసు వాస్తవ్యులు గోవర్ధన్‌గారు స్వామిభక్తులు. వారు చెన్నైలో విల్లివాకంలో సాయిబాబా మందిరం కట్టించారు. విగ్రహ ప్రతిష్ఠకు ముహూర్తం దగ్గరలో లేనందున షిర్డీసాయి పటం పెట్టి సత్సంగం జరపాలని సంకల్పించి దానికి స్వామివారిని రమ్మని ఆహ్వానించారు. దానికి సెప్టెంబరు 5వ తేదీన స్వామీజీ, అమ్మయ్య మద్రాసు వచ్చారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులలో ఒక డాక్టరు దంపతులు మాతాజీకి పాద నమస్కారం చేస్తూ ఆమె పాదాలు వాచి ఉండటం చూశారు. మాతాజీని తమ నర్సింగ్‌హోమ్‌కు తీసుకొనిపోయి పరీక్షచేసి పంపుతామని స్వామీజీ అనుమతితో తీసికొని వెళ్ళారు. రెండురోజులు తమతో ఉంచుకొని పరీక్షలు చేసి పాదానికి మోకాళ్ళకు మధ్య ఎముక మరలా విరిగి సద్గురుకృపవలన అతుకొనినదని వారు స్వామివారికి చెప్పారు. ఆ తర్వాత స్వామీజీ, మాతాజీలు దర్బారునగరం వచ్చేశారు.

మద్రాసులో నర్సింగ్‌హోమ్ మొత్తం ఎ.సి. చేసినది. దానివలన మాతాజీకి ఊపిరితిత్తులలో నెమ్ము చేరి ఆయాసం వచ్చింది. దానివలన మాతాజీ అక్కడ ఉన్నప్పుడు చాలా బాధపడ్డారు. సెప్టెంబరు 9వ తేదీ గురువారం అయినందున మాతాజీ శ్రీ సమర్థ సద్గురు సాయినాధునికి నైవేద్యం యథావిధిగా చేసి పెట్టారు. మాతాజీ ఆరోజు ఆహారం ఏమీ తీసుకోలేదు. ఆయాసం వలన గుండెలో నొప్పి వచ్చింది. తరువాత రాత్రి 10 గంటలకు మాతాజీకి మూత్రవిసర్జన కానందున

నొప్పి, ఆయాసం ఎక్కువైనాయి. స్వామీజీ సంకల్ప బలం వలన 11 గంటలకు అన్నీ సర్దుకున్నాయి. అయితే ఉదయం 5 గంటలకు మరలా ఆయాసం ఎక్కువైంది. రాయచోటిలోని డాక్టరు బయారెడ్డి గారికి ఫోన్ చేయగా వారు 6 గంటలకు వచ్చి స్వామీజీవారి అనుమతితో మాతాజీని రాయచోటికి తీసుకొనివెళ్లారు. మాతాజీ ఎక్కడికైనా ఒంటరిగా వెళ్లడం అదే ప్రథమం.

రాయచోటిలో చికిత్స చేసిన తర్వాత ఆయాసం కొద్దిగా తగ్గింది. అప్పుడు మాతాజీ కొద్దిగా ఇడ్లీ తిన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మరలా గుండెలో నొప్పిరాగా డాక్టర్లు ఆమెను కడపకు (కార్డియాలజిస్టు వద్దకు) తీసుకెళ్లాలని నిశ్చయించారు. అయితే స్వామి అనుజ్ఞ లేనిదే తానెక్కడికీ రానని ఫోన్ చేసి వారి అనుజ్ఞ తీసుకొన్నారు. కడపకు వెళ్తూ కారు దారిలో దర్బారునగరం వచ్చింది. మాతాజీని లోపలికి తీసికొని వచ్చారు. మరలా కారు బయలుదేరినప్పుడు స్వామివారు మాతాజీ చెవిలో ఏదో చెప్పారు. వెంటనే మాతాజీ చిన్ముద్రలో ధ్యానం చేయటం ఆరంభించారు. తర్వాత కారు కడపకు వెళ్లిపోయింది. కడపలో మాతాజీ రాత్రి 12 గంటలకు రాయచోటి సత్యంతో "పోయి దర్గాలో పాలు, నీళ్ళు పెట్టిరా" అన్నారు. ఆ మాటల అంతరార్థం అప్పుడు ఎవ్వరికీ అవగతంకాలేదు. దర్గాలో పాలు, నీళ్ళు పెట్టడం అంటే స్వామివారికి ప్రతిదినమూ మరచిపోకుండా ఒక గ్లాసు పాలు, ఒక గ్లాసు నీళ్ళు ఇవ్వడం. అందువలన స్వామీజీ అప్పటి నుండి వారంలో రెండు రోజులు అశ్వత్థవృక్షం వద్ద ఒక గ్లాసు పాలు, ఒక గ్లాసు నీళ్ళు పోస్తారు. మాతాజీ మాటల అంతరార్థం ఆ విధంగా ప్రకటితమైంది.

తెల్లవారురఝామున 3 గంటలకు మాతాజీకి ఆయాసం ఎక్కువైంది. బి.పి. తగ్గిపోయింది. తాను సద్గురువు సన్నిధికి పోయే సమయం ఆసన్నమైందని అవగతమైంది. వెంటనే చిన్ముద్రతో ధ్యాన సమాధిలోకి వెళ్ళిపోయారు. ఉదయం 7గం. 45ని॥లకు మాతాజీ శ్రీ

సమర్థ సద్గురు సాయినాథుని నిరంతర సన్నిధికి చేరుకున్నారు. ప్రకృతి పురుషులు మరలా ఏకమైనారు. ఆనాడు శనివారం, సెప్టెంబరు 11, 2004 శ్రావణ బహుళ ద్వాదశి. ఆరోజు శ్రావణ మాసంలో ఆఖరు శనివారం. మాతాజీ ఆవిర్భావం (జననం) కూడా శ్రావణ మాసం ఆఖరు శనివారం నాడే, మహాత్ములకు జనన మరణాలు అభేదం.

శనివారం ఉదయం 6 గంటలకు డా॥ బయారెడ్డిగారు, ఆయన భార్య డా॥ సంగమ్మగారు దర్బారు నగరం వచ్చి స్వామివారిని వెంటనే కడపకు రావలసిందిగా అభ్యర్థించారు. త్రికాలజ్ఞానియైన స్వామివారు వారి అభ్యర్థనను మన్నించలేదు. "ప్రతీదీ సర్వేశ్వరుని ఆజ్ఞ ప్రకారం జరుగుతుంది. దైవనిర్ణయాన్ని ఎవరూ తప్పించలేరు. మీరు వెళ్లిరండి" అని వారితో స్వామి అన్నారు. మాతాజీ నిర్యాణ సమయం అప్పటికి ఇంకా గంటకు పైగా ఉన్నది. డాక్టర్లు కడపకు వెళ్లిపోయినారు.

ఉదయం 10 గంటలకు మాతాజీని దర్గాకు తీసికొని వచ్చారు. అమ్మ ముఖంలో ఆ దివ్యకాంతి ఏమాత్రం తగ్గలేదుకదా మరింత దేదీప్యమానంగా దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్నది. మధ్యాహ్నం 1 గంట వరకు నాడి ఆడుతూనే ఉన్నది. అనంత శాంతి నైర్మల్యాలు ఆమె ముఖంలో భాసిస్తుండటం భక్తులు అంతటి విషాదంలో కూడా అత్యంత ఆశ్చర్యంగా గమనించారు. ఆరోజు వరకు మాతాజీ, స్వామీజీలు భౌతికంగా ఇద్దరు. ఆత్మపరంగా ఒక్కరు. ఆ రోజు నుండి భౌతికంగా, ఆత్మపరంగా కూడా ఒక్కరే. అంతకు ముందు మాతాజీని "అమ్మయ్య" అనేవారు (అమ్మ+అయ్య). ఇప్పుడు స్వామివారే అయ్య+అమ్మ అయినారు. ద్వైతం మరలా అద్వైతమైంది. ఓం తత్సత్.

మాతాజీ నిర్యాణ వార్త తెలియగానే భక్తులు వందలు, వేలు దర్బారునగరం చేరుకున్నారు. అందరిలోను విషాదం, అందరి హృదయంలోను ఎవరూ ఎప్పటికీ తీర్చలేని వెలితి. అత్యంత విలువైనది ఏదో కోల్పోయామన్న వేదన. భక్తులకు చివరి దర్శనార్థం అమ్మ భౌతిక శరీరాన్ని సమాధి మందిరానికి ముందున్న హాలు మధ్యలోఉంచారు. ఆ సమాధి మందిరం చాలా సంవత్సరాల

క్రితమే,1960లో, మాతాజీ కోరి నిర్మింపచేసికొన్నది. సర్వసంగ పరిత్యాగి, రాగద్వేషాతీతుడు అయిన స్వామీజీ శోకతప్త హృదయులైనారు. మహాత్ములు భావోద్వేగాలకు అతీతులే, అయితే శుష్కహృదయులుకాదు,ఆర్ద్రహృదయులే. రమణమహర్షిగానీ, రామకృష్ణ పరమహంసగానీ, షిర్డీసాయిగానీ సన్నిహితులు మరణించినపుడు విలపించినవారే. అది వారి ప్రేమానురాగాలకు నిదర్శనమేగాని మరొకటి కాదు.

మాతాజీ శరీరాన్ని ఆదివారం, సెప్టెంబరు 12, 2004 నాడు సమాధి చేయాలని స్వామివారి అనుజ్ఞతో భక్తులు నిర్ణయించారు. తదనుగుణంగా ఆదివారం ఉదయం 11 గంటలకు మాతాజీ శరీరాన్ని ఆశ్రమ ఆవరణలోగల బావిలోని పవిత్ర జలంతో స్నానం చేయించారు. అమ్మ శరీరం మామూలుగానే ఉన్నది. సాధారణంగా మృత శరీరాలు త్వరగా బిగుసుకుపోతాయి. మాతాజీ శరీరంలో అలాంటిదేమీ కనుపించలేదు. తర్వాత శరీరాన్ని పూలమాలలతో అలంకరించారు. భక్తులు వరుసగా వచ్చి అమ్మకు తుది నమస్కారం చేసుకున్నారు. తర్వాత సమాధిలో కుర్చీలో కూర్చోబెట్టి కర్పూరం, విభూది, ఉప్పు, సుగంధద్రవ్యాలు కలిపిన ఇసుకతో సమాధిని నింపి బండతో సమాధిని మూసివేశారు. ఇక మాతాజీ భౌతిక శరీరం మనకు కనుపించదు. అయితే ఆమె ఎక్కడికి పోలేదు. స్వామీజీ మాటలలో "అమ్మ ఇక్కడే ఉన్నది. ఎక్కడికీ పోలేదు. నాలోనే ఉన్నది. చూడగలిగిన వారికి ఆమె కనుపిస్తూనే ఉంటుంది. అయితే జ్ఞాననేత్రంతో మాత్రమే".

మాతాజీ పరమయోగశిఖామణి. మరణానంతరం ఆమె శరీరం చెక్కుచెదరలేదు. కుడి చేతి బొటనవేలు చూపుడువేలు కలిసే ఉన్నాయి. (బొటనవేలు పరమాత్మకు, చూపుడువేలు జీవాత్మకు మిగిలిన మూడువేళ్లు త్రిగుణాలకు సంకేతాలు. బొటనవేలు చూపుడు వేలు కలిసి ఉండటం త్రిగుణరహితమైన జీవాత్మ పరమాత్మతో కలిసి ఉండటాన్ని సూచిస్తుంది). నిర్యాణం నాటినుండి అమ్మ సమాధి వద్ద పూజ, కుంకుమార్చన, లలితా సహస్రనామార్చన, భజనలు వగైరా

కార్యక్రమాలు ఉదయం సాయంత్రం యథావిధిగా జరుగుతున్నాయి. అఖండ జ్యోతి నిరంతరం వెలుగుతూ ఉంటుంది. నవరాత్రి ఉత్సవంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. అన్నింటినీ స్వామీజీ స్వయంగా పర్యవేక్షిస్తారు. సమాధి నుండే మాతాజీ అనేక లీలలు చూపారు, చూపిస్తారు. అంతా మన భక్తి విశ్వాసాలమీదే ఆధారపడి ఉంటుంది. నమ్మకం ఉన్నవారికి నిర్యాణానంతరం కూడా అమ్మ దర్శనం అనేక విధాలుగా లభించింది.

మాతాజీది అద్భుతమైన అత్యంత మహత్తరమైన పరిపూర్ణ వ్యక్తిత్వం. అయితే తన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని, శక్తిని ఏమాత్రం పైకి కనపడనీయకుండా జాగ్రత్తపడేది. భక్తులు అసంఖ్యాకం ఆమె దర్శనానికి వచ్చేవారు. తమ కష్టసుఖాలు, సమస్యలు ఆమెకు విన్నవించుకునేవారు. వారిని ఓదార్చి, సమస్యలకు పరిష్కారం సూచించి వారికి మనశ్శాంతిని ప్రసాదించేది. కొంతమందిని స్వామివారి వద్దకే పంపేది. అమ్మ మితభాషిణి. నా జీవితమే నా సందేశం అన్నట్లుగా ఉండేది. ఆమె ఏ సందర్భంలోను ఎవరిపైన కోపగించుకోవడం ఎవరూ చూడలేదు, వినలేదు. స్వామి మాటే తనమాట అని భావించి తదనుగుణంగా జీవితాన్ని గడిపిన పతివ్రతా శిరోమణి మాతాజీ. స్వామీజీ మాతాజీలు ప్రపంచానికి భార్యభర్తలు. అయితే కామవాసన లేశమైనా లేని పవిత్ర దివ్య దాంపత్యం వారిది. ఆధ్యాత్మిక చింతన, పరోపకారం, దీనజనోద్ధరణ వారి సాంసారిక జీవితం యొక్క లక్ష్యం.

## శ్రీ సద్గురు దర్గా మాతాజీ దివ్యసూక్తులు

1. ఏపనినైనా అహంకారంతో "నేను చేస్తున్నాను" అనే భావన లేకుండా సేవా భావంతో చేసేవాడే నిజమైన భక్తుడు.

2. సంపాదించడం గొప్ప కాదు. సంపాదించిన దానిని సద్వినియోగ పరచడమే గొప్ప.

3. నూరు రూపాయలు వచ్చాయని రూపాయను మరచిపోవద్దు.

4. బ్రతికి పనిచేయి, పనిచేసి బ్రతుకు.

5. పౌరుషానికి పోక, పంతాలువీడి, విచక్షణాజ్ఞానంతో మెలగినవాడే నిజమైన జ్ఞాని.
6. మీ పనిని మీరు చూసుకొండి. ఇతరులతో మాటలు వద్దు.
7. నీ సొమ్ము అయితే నడిరోడ్డులో వేసినా ఎక్కడికీపోదు.
8. చెంబెడు నీళ్లకే బెంబేలుపడితే బానెడు నీళ్లు ఎప్పుడు తాగగలవు?
9. చెప్పింది చేయి. పెట్టింది తిను.
10. ఆవగింజంత ఆయుష్షు ఉంటే పులినోటిలో పడినా తిరిగివస్తాడు. అది లేకపోతే నట్టింటిలోనే పోతాడు.

# అమ్మయ్య మహా సమాధి అనంతరం లీలలు

## గంగిశెట్టి వెంకట శివప్రసాద్, ప్రొద్దుటూరు

2004 నవంబరులో మా తండ్రిగారి ఆరోగ్యం బాగోలేనందున మద్రాసుకు చికిత్సకు వెళ్ళాము. మా నాన్నగారు చికిత్సకు సుముఖంగా లేరు. మేము మాతాజీని ప్రార్థించగా మా తండ్రిగారికి స్వప్నదర్శనమిచ్చి ఆయనను చికిత్సకు ఒప్పించింది. మరుసటిరోజు నుండి మా తండ్రిగారు కోలుకొని మెల్ల మెల్లగా నడువగలిగినారు.

## సిద్ధేశ్వరరావు గారు, లక్కిరెడ్డిపల్లి

2007లో మా అమ్మకి డయేరియా వచ్చి ఊళ్ళోని డాక్టర్లు చాలా ప్రమాదకరమని చెప్పేసరికి తిరుపతి స్విమ్స్‌లో చూపిస్తే అక్కడి డాక్టర్లు ఇప్పటిదాకా చాలా పవర్‌ఫుల్ మందులు వాడారు, కిడ్నీలు బాగా దెబ్బతిన్నాయి. అందువలన డయాలసిస్ చేయాలి. చేసినా మేము ప్రాణానికి హామీ యివ్వలేము. డయాలసిస్ చేయాలా వద్దా అని అడిగితే నేను మా కుటుంబసభ్యులతో సంప్రదించి చెపుతానన్నాను. మా బావ అరగంటలో హాస్పిటల్‌కి వస్తానని చెప్పాడు. ఆయన వచ్చేలోపల నాకు రెండు రోజుల నుండి సరిగా నిద్రలేకపోవటం వలన తూగులాగా వచ్చి గోడకు ఆనుకొని నిద్రపోతున్నాను. స్వప్నంలో 'నేను దర్గాల దగ్గరకి వెళ్ళినట్లు, దర్గామాత నన్ను "ఇక్కడేమి పనిరా

నీకు, లేయ్ లేచిపో" అని అన్నది. నా మనస్సులో అమ్మా! ఎందుకు లేచిపోమంటున్నావు. నేను చేసిన తప్పేమీ అనుకుంటున్నాను' మెలకువ వచ్చింది. స్వప్నంలో అమ్మ చెప్పింది ఈ హాస్పిటల్ నుండి వెళ్ళమన్నట్లుగా తోచి స్వామి మీద భారం వేసి ఇంటికి తీసుకువచ్చాము.

మా యింటివైపు కూరగాయలమ్ముకునే ఆవిడొచ్చి డా॥ బయ్యారెడ్డిగారు యిలాంటి కేసులు బాగా చూసి చికిత్స చేసి వున్నారు. మమ్మల్ని కూడా వెళ్ళమని బలవంతం చేసింది. డాక్టరు బయ్యారెడ్డిగారి దగ్గరకి చికిత్సకు వెళ్ళిన వారానికల్లా మా అమ్మకి బాగయింది. ఇప్పటికీ ఆరోగ్యంగా వున్నది. ఇదంతా జరిగిన తర్వాత స్వామి దగ్గరకి వెళ్ళాను. నేనేమీ చెప్పకుండానే "ఏమిరా! మీ అమ్మకి బాగుందా" అని స్వామి అడిగారు. నేను మనస్సులో స్వామికేమీ చెప్పలేదు కదా అని అనుకుంటుంటే స్వామి "నువ్వు చెప్పవులేరా! నువ్వు చెప్తేనే నాకు తెలుస్తుందా" అని స్వామి అన్నారు. మేము దర్గాల దగ్గరకి వీలైనప్పుడల్లా వచ్చి దర్శిస్తున్నందుకు **మా ప్రార్థనతో నిమిత్తం లేకుండా అమ్మయ్యగారు స్వప్న దర్శనమిచ్చి, తర్వాత నేనేమి చేయాలో ప్రేరణ ఇచ్చి నడుచుకొనేటట్లు చేశారు**. మా అమ్మ మాకు దక్కింది అంటే అది అమ్మయ్యగారి కృపవలననే. పైగా మా అమ్మ ఆరోగ్యం గురించి మేమేమీ చెప్పకుండానే స్వామి అడిగి తమకి, అమ్మయ్యకు భేదం లేదని, వారిద్దరూ ఒకటేనని, మాకు శ్రేయస్కరమైనది అడగకుండానే చేస్తున్నారని తెలియచేశారు. ఓం దర్గా మాత్రే నమ:

## శంకర నారాయణ (శంకరయ్య), ఆశ్రమవాసి

1. అమ్మయ్య సమాధి అయిన తర్వాత ఒకరోజు రాత్రి సుమారు 12గం॥ నుండి 1గం॥ మధ్య ఒక కల వచ్చింది. ఆ కలలో మాతాజీ "ఒరే శంకరా! వర్షం వస్తున్నది. కట్టెలు కొద్దిగానైనా లోపల వెయ్యి" అని చెప్పింది. వెంటనే నాకు మెలుకువ వచ్చింది. వెలుపలకు వచ్చి చూస్తే అప్పుడే వర్షం మొదలైంది. వంటశాలకు వెళ్ళి కట్టెలు లోపలికి వేశాను. ఆ రోజు రాత్రి వర్షం ఎక్కువగానే పడింది.

2. 10-8-2005 న జరిగిన సంఘటన. సుమారు 10 రోజుల నుండి నాకు నడుము క్రింద నుండీ పాదాల వరకూ చాలా నొప్పిగా ఉండినది. నేను స్వామీజీని, దేవతలను స్మరించుకుంటూ అలాగే నొప్పి భరిస్తున్నాను. ఒకసారి అమ్మయ్యతో చెప్పుకొని ఏడ్చాను. తర్వాత సాయి మందిరంలో భజన చేస్తుంటే నడుము క్రింద భాగంలో నల్లని చీమ కుట్టింది. భజన అయిపోగానే నొప్పులు కూడా పోయాయి.

3. ఒకసారి పళ్ళనొప్పి ఎక్కువగా వచ్చింది. పది రోజులు బాధ పెట్టింది. శ్రావణ శుద్ధ పౌర్ణమి శుక్రవారం నాడు మాతాజీ పంచలోహ విగ్రహానికి మొదటిసారిగా పంచామృతాభిషేకం జరిగింది. స్వామివారు "ఆ పంచామృతం పుక్కిట ఉంచుకో, పంటి నొప్పి పోతుంది" అన్నారు. అలాగే చేశాను. పంటి నొప్పి మాయమైంది. ఆ విధంగా శ్రీ సద్గురు దర్గా మాతాజీ సమాధి నుండే తమ భక్తులను కాపాడుచున్నారు.

## రాజీవ్‌గారు ఇలా చెపుతున్నారు

అమ్మయ్య మహా సమాధి తర్వాత ఒకసారి స్వామి అమ్మయ్య కుర్చీమీద చేతులు పెట్టుకునే చెక్కమీద వున్న పుస్తకాలు (ఇవి అమ్మయ్య నిత్యం చదివేవి) దులుపుతూండగా, ఒక పుస్తకం నుండి చిన్న న్యూస్ పేపరు కటింగ్ తీసి నాకు చూపించారు. దాంట్లో స్వామి ఫోటో, స్వామికి చేసిన సన్మానం విషయాలు వున్నాయి. ఎప్పుడో జరిగిన దాన్ని ఎంతో భద్రంగా అమ్మయ్య దాచుకోవటం చూసి స్వామి కళ్ళు చెమ్మగిల్లాయి. అన్యోన్య దాంపత్యం అంటే ఇదే కదా!

అమ్మయ్య మహా సమాధి చెందిన తర్వాత స్వామి రాజీవ్‌గారితో "అమ్మయ్య ఫోటోలు ఏమైనా నీ దగ్గర వున్నాయా?" అని అడిగారు. తర్వాతసారి దర్గాల దగ్గరకి వచ్చేటప్పుడు అమ్మయ్య కుర్చీలో కూర్చున్న ఫోటోని లామినేషన్ చేయించి తీసుకువచ్చి స్వామికి ఇచ్చాను. ఆ ఫోటో చూసిన స్వామి చాలా ఎమోషనల్‌గా ఫీల్ అయ్యారు. దాన్ని అమ్మయ్య కూర్చుండే కుర్చీలో పెడదామని చూస్తే ఫోటో కుర్చీలో సరిగ్గా సరిపోయింది. స్వామి దాన్ని చూసి చాలా ఆనందపడ్డారు. నేను తిరిగి ఇంటికి వచ్చేసరికి నన్ను 3 నెలలకి ఆఫీసు పని మీద మలేషియా వెళ్ళి

రమ్మని పని అప్పగించారు. స్వామికి ఇష్టమైన ఫోటో చేయించటానికి ఖర్చు పెట్టిన ప్రతి రూపాయికి 300 రెట్లు ఇచ్చారు. ఇది స్వామి ఇచ్చిన ఆశీర్వాదం.

ఈ విషయం గుర్తు పెట్టుకొని స్వామిని సంతోషపెట్టే పనులు చేస్తే మనం నోరు విప్పి అడుగకుండానే స్వామి ఎంత ఆశీర్వదిస్తారో కదా!



## అధ్యాయము - 14
## సద్ధర్మ సంరక్షకుడు

ఇప్పటిదాకా చూసిన స్వామియొక్క దివ్యలీలలను బట్టి స్వామి సర్వవ్యాపకుడనీ, సర్వసమర్థుడనీ మనస్సులో స్థిరపరచుకొని మనం ఏ పని చేసినా అది స్వామిసేవగా తలచి మన జీవితాలను యజ్ఞమయం చేసుకోవటం మన విధి. అందుకు స్వామి జీవితాన్ని గురించి, తత్వాన్ని గురించి చింతన చేస్తే అవే లక్షణాలు మనలోనూ సంస్కారాలుగా ఏర్పడి, బలపడి మనకు తెలియకనే మనకు సహజమైన పరమశ్రేయస్సును చేకూరుస్తాయి.

స్వామి వివిధ భక్తులకు చేసిన హెచ్చరికలు, సూచనలు, భక్తులచే ఆచరింపచేసినవి మననం చేసుకుని మన జీవితాలను స్వామికి తృప్తికరంగా నడపటానికి హృదయపూర్వకమైన ప్రయత్నం చేద్దామనే ఉద్దేశ్యంతో చేసినదే ఈ చిన్న ప్రయత్నం.

### సాయిశివ, దమ్మపేట

నాకు తిండిమీద వ్యామోహం పోవట్లేదని మనస్సులో అనుకుంటున్నప్పుడు నేనేమీ చెప్పకుండానే స్వామి ఇచ్చిన బోధ: “ఎదురుగా గూట్లో లడ్డూ కనిపించి తినాలనిపించింది. అయినా సరే కూర్చున్న చోటునుండే లేవకుండా పట్టుదలగా అక్కడే కూర్చోనుంటే తినకుండా నిగ్రహించుకోగలుగుతామా? లేక కంట్రోల్ లేకుండా లేచి లడ్డూ దగ్గరకు వెళ్ళిపోతే తినకుండా ఉండడం అవుతుందా? అలా కదలకుండా అక్కడే కూర్చోనుండగలగాలంటే ఏం కావాలి? అని స్వామి తన తొడ కొడుతూ **“బాడీ (శరీరం) కంట్రోల్ కావాలి, బాడీ కంట్రోల్ ఎలా వస్తుంది? ఆసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు చేస్తే వస్తుంది** అన్నారు.

## ప్రసాద్ (బెంగుళూరు):

1. నేను ఆఫీసు పని మీద అమెరికాలో వున్నప్పుడు ఒకమ్మాయి గురించి పిచ్చి ఆలోచనలు చేస్తుండేవాడిని. స్వామికి ఫోను చేసినప్పుడు పేరు చెప్పకమునుపే చాలా కోపంగా, చికాకుగా "నీ టైమ్ వేస్టు చేస్తున్నావు, నా టైమ్ వేస్టు చేస్తున్నావు, ఫోను పెట్టెయ్యనా" అని మూడుసార్లు అరిచి **"మనస్సు గాలిపటంలాగా తిరుగుతోంది. 40రోజులు నామస్మరణ చెయ్యి, నామం చెపుతూ ఆ అమ్మాయిని చూడు, నామస్మరణ చేస్తావా?"** అని అన్నారు. మొదట చేస్తానని, మరలా చెయ్యకపోతే తప్పు అవుతుందని ప్రయత్నం చేస్తాను స్వామీ' అని అన్నాను. స్వామి "మరలా 40 రోజులు అయిన తర్వాత ఫోను చెయ్యమని" ఫోను పెట్టేశారు. స్వామి దయ వలన నామస్మరణ బాగా తీవ్రంగా జరిగి ఆ అమ్మాయి ఆలోచనలు నా మనస్సు నుండి మాయమైపోయినాయి. 40 రోజుల తర్వాత ఫోను చేస్తే స్వామి ఎంతో ప్రేమగా మాట్లాడారు.

ఎక్కడో అమెరికాలో వున్నా నా మనస్సులోని ఆలోచనలు చెప్పకుండానే స్వామికి తెలుసు అనీ, అంతేకాక ఆ ఆలోచనల వల్ల స్వామికి ఎంత యిబ్బందిగా వున్నదో స్వామి మాటల ధోరణిలో తెలుస్తోంది. వచ్చిన సమస్యకి పరిష్కార మార్గం చూపిస్తూ దానిని ఆయనే ఆచరింప చేయించి 40 రోజుల తర్వాత మనస్సులో అటువంటి ఆలోచనలు పోయాక ఎంతో ప్రేమగా మాట్లాడారు. స్వామి ప్రేమమయుడే, కృపాకరుడే అయినా నాలోని దుష్టవాసనలు ఆయనకి యిబ్బంది కలిగిస్తాయని తలచి అటువంటి దుష్ట తలంపులను కూకటి వ్రేళ్ళతో తీసివేయమని, దానికి తగిన వివేక, వైరాగ్యాలను ప్రసాదించమని స్వామిని అనన్యంగా ప్రార్థిస్తున్నాను.

2. నేను ఇండియాకు తిరిగి వస్తున్న విషయం స్వామికి చెప్తే "దర్గాల దగ్గర రెండు రోజులు వుండేటట్లు రమ్మ"న్నారు. అలానే ఇండియాకు వచ్చిన వెంటనే స్వామి దగ్గరకు వెళ్ళితే "ఎందుకొచ్చావు?" అని అడిగారు. 'మీరు రమ్మన్నారు కదా!' అన్నాను. అంతే స్వామి

కోపంగా తిట్టి లోపలికెళ్ళారు. ఎందుకు తిట్టారో అర్థం కాలేదు. రమ్మనమన్నది స్వామే, ఆ మాటే చెపితే ఎందుకు తిట్టారో అర్థం కాలేదు. మధ్యాహ్నం స్వామి కూర్చొని భక్తులతో మాట్లాడుతున్నప్పుడు స్వామి మరలా ఎందుకొచ్చావు అని అడిగారు. 'మీ ఆశీస్సుల కోసం' అన్నాను. స్వామి ఎంతో ఆనందంగా "అది. ఆ మాటే ఇందాక చెప్పవచ్చు కదా!" అన్నారు. అప్పటికి కానీ నేను చేసిన తప్పు అర్థం కాలేదు. నన్ను రమ్మన్నది అంతటి ఆపద నుండి కాపాడరనే కృతజ్ఞత కలిగి వుండి స్వామిని దర్శించాలని, స్వామి రమ్మన్నప్పుడు నేను వెళ్ళటం వలన నాకు మాత్రమే శ్రేయస్కరము, ఉపయోగము గానీ నేను వెళ్ళటం, వెళ్ళకపోవటం వలన స్వామికి ఏ మాత్రం తేడా వుండదని తెలుసుకున్నాను.

ఇక్కడ ఆచార్య భరద్వాజ మాష్టారు రచించిన 'శ్రీ ఆనందమాయి అమ్మ' అనే గ్రంథంలో 77వ పేజీలో శ్రీ అఖండానందస్వామి చెప్పినది బాగా హృదయగతం చేసుకోవాలి. అదేమంటే "శిష్యుడిగా మనమాచరించవలసిన ధర్మం తెలుసుకొని, దానిని రూపొందించిన మహర్షులపై అపారమైన విశ్వాసంతో దానిని తరచూ తప్పకుండా పాటిస్తుండాలి. **మనతో గురువెంత ప్రేమగా మనులుకున్నా మనం మాత్రం మన ధర్మం మరచిపోకూడదు. అది వారి ధర్మం, ఇది మన ధర్మం. దానిని విడిస్తే వారు మహాత్ములూ కారు. దీనిని విడిస్తే మనము సాధకులమూ గాము.**" స్వామి చూపిన లీలలను బట్టి ఆయన భగవంతుడేనని మనస్సులో నిశ్చయం చేసుకొని స్వామి మనతో ఎంత ప్రేమగా వ్యవహరించినా మనం మాత్రం స్వామితో వినయపూర్వకంగా ప్రవర్తించాలని తెలుస్తోంది.

తర్వాత రోజు ఉదయ ఆరతి అయిన తర్వాత భజన చేయమన్నారు. స్వామి నన్ను స్త్రీ వ్యామోహం నుండి రక్షించిన సంఘటనను మనస్సులో తలచుకుంటూ భజన చేసాను. భజన తర్వాత స్వామి ఎంతో ఇష్టంగా ఇవాళ భజన బాగుంది అని మెచ్చుకున్నారు. కృతజ్ఞతతో కూడిన ప్రార్థన భగవంతునికి

ఇష్టమౌతుందని అనుభవమైంది. భగవంతుని ప్రతిరూపమైన స్వామివారు తృప్తి చెందితే సర్వ సృష్టి తృప్తి చెందుతుందని హృదయగతం చేసుకొని స్వామి తృప్తి చెందునట్లుగా నా జీవితాన్ని నడిపించమని స్వామిని వేడుకుంటున్నాను.

## శ్రీమతి డి.శారదగారు, దమ్మపేట, ఖమ్మం జిల్లా

ఈమెకు నిత్యం రాత్రి 9 గం॥ 30 ని॥లకు టి.వి. చూచే అలవాటు. ఆ దురలవాటు పోగొట్టమని శ్రీ సాయినాధునికి అనేకసార్లు చెప్పుకొన్నది. కానీ ఆ అలవాటు పోలేదు.

ఈమె దర్గాస్వామిని దర్శించినప్పుడు కూడా తన దురలవాటును గురించి చెప్పడం గానీ, మనస్సులో ప్రార్థించడం గానీ చేయలేదు. దమ్మపేటలో నున్న ఈమెకు ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో దమ్మపేట భక్తులు శ్రీ దర్గాస్వామి దగ్గరకు పోతుంటే ఈమె తన నమస్కారాలు శ్రీ స్వామివారికి తెల్పమని చెప్పింది. వాళ్ళు శ్రీ స్వామివారికి అలానే చెప్పారు. వెంటనే శ్రీ స్వామివారు "ఆమెకు 9-30గంటలకి వుండే దుస్సాంగత్యం తొలగించుకోమని చెప్పు" అని అన్నారట. ఆ మాట శ్రీ స్వామివారే నాకు చెప్పినట్లుగా ఉంది అంటుంది ఈమె. కానీ తన దురలవాటు మానలేకపోయింది.

మరలా కొన్నాళ్ళకు శ్రీ దర్గాస్వామివారు ఈమె స్వప్నంలో కనిపించి "నీవు వ్యామోహం తొలగించుకోలేకున్నావు. ట్రాక్ దిగిపోతావు జాగ్రత్త" అని కండ్లెర్రజేసి బెదిరిస్తున్నారట. ఈమె భయపడి గజగజ వణికిపోయింది. స్వప్నం అంతమైంది. తెల్లవారి నుండి టి.వి. చూడటం తనకు తెలియకుండానే పోయి పారాయణ చక్కగా జరుగుతుందట.

ఈ కరుణామయునకు మన అంతరంగాలు తెరచిన పుటలవలె ఉంటాయి కాబోలు. మన ప్రార్థన లేకుండానే మన దురభ్యాసాలు తొలగించడం ఎంత చిత్రమో చూడండి. ఇట్టి మహనీయుని మన మధ్య నిలిపిన ఆ దైవానికి ప్రణామములు.

## సత్యకళగారు ఇలా చెపుతున్నారు.

మాకు గత 20 సంవత్సరాలుగా స్వామి తెలుసు. మాతో చాలా సార్లు స్వామి **"అమ్మా సత్యా! మీరు 15రోజులకొకసారి ఇక్కడకి వచ్చి నిద్ర చెయ్యండి. మీకేమి కావాలో అదిస్తాను నేను"** అని అన్నారు. మా జీవితాలు, మా పిల్లల జీవితాలు స్వామి దయవలన సాఫీగా జరుగుతున్నాయి.

స్వామి దయవలన మా అమ్మాయి పెళ్ళి జరిగింది. తరువాత కాపురం నిలబడింది.

మా అమ్మాయి తను చేసే కంపెనీలో ఒకతన్ని ప్రేమించింది. అతను గుంటూరు జిల్లావాడు. మా వారు కష్టపడి హైదరాబాదులో కొనుక్కున్న ఫ్లాటు మా తదనంతరం మా అమ్మాయికి ఇవ్వగలము. ఎక్కువ కట్నాలు ఇవ్వలేము, పైగా ప్రేమించుకున్నారు కాబట్టి కట్నం ప్రసక్తే అవసరం లేదని అబ్బాయి తల్లిదండ్రులకు చెప్పారు. వారు దానికి కష్టంగానే సమ్మతించారు. ముహూర్తాలు మాట్లాడుకునేటప్పుడు ఆడపడుచుకట్నం దగ్గర పేచి వచ్చింది. మాకేమీ ఆడపడుచు కట్నం ఆనవాయితీ కాదు. వారేమో కావాలని పట్టుబట్టారు.

ఈ విషయంలో అబ్బాయికి ఏమి చెప్పారోకానీ అతను పెళ్ళి వద్దన్నాడు. మేము స్వామి దగ్గరకి వెళ్ళి విషయం చెపితే స్వామి మా చేత అబ్బాయిని రప్పించి అతనితో "ఊరికే మాట్లాడవద్దు. ఈ అమ్మాయి అంటే నీకు ఇష్టమా కాదా? ఒక మాట చెప్పు. చేసుకుంటావా? చేసుకోవా?" అని అడిగేసరికి అబ్బాయి 'ఇష్టమే, పెళ్ళి చేసుకుంటాను' అన్నాడు. "అట్లాగయితే ఎందుకంత గలాట చేసుకుంటావు" అనేసరికి అంతా సద్దుమణిగి తిరుపతిలో పెళ్ళి జరిగింది.

మా అమ్మాయి గర్భవతిగా ఉన్నప్పుడు 'కంపెనీ వాళ్ళు ఆస్పత్రి ఖర్చులు యిస్తారు, మీరే బెంగుళూరుకి రండి' అని మమ్మల్ని పిలిచింది. అట్లానేనని మేము బెంగుళూరు వెళ్ళి మా అమ్మాయికి

పురుడు పోసాము. ఆస్పత్రి ఖర్చులు 80,000/- అయితే కంపెనీ వాళ్ళు 60,000 ఇచ్చారు. మా అమ్మాయి తన డబ్బుతో మిగిలిన 20,000 కట్టి, కంపెనీవాళ్ళు మొత్తం డబ్బు ఇచ్చారని చెప్పింది. మేము దాని గురించి పట్టించుకోలేదు. కానీ ఈ విషయం మా అల్లుడి తల్లిదండ్రులకు తెలిసి ఆ డబ్బు మేము వాళ్లకి ఇవ్వాలని అడిగితే మా అమ్మాయి ఎందుకు యివ్వాలని వాదించింది. దానితో అదంతా చిలికి చిలికి గాలివాన అయ్యింది. మేము ఈ విషయం స్వామికి చెప్పుకుంటే స్వామి "అమ్మా! వాళ్ళు డబ్బు మనుషులు. వాళ్ళు గృహప్రవేశానికి వచ్చినారంటే ఏం మాట్లాడకూడదు. **ఆడపిల్లను ఇచ్చిన వాళ్ళం మనవేమీ మాట్లాడకూడదు. మనవే తగ్గిపోవాలి. వాళ్ళనుకుంటే అనుకుంటారు.** 20,000 రుపాయలు ఇచ్చేసి ఏమీ మాట్లాడవద్దు" అన్నారు. అంతా స్వామి చెప్పినట్లు చేసి ఆ విషమ పరిస్థితి నుండి బయటపడ్డాము.

కొన్ని నెలల తర్వాత మా అల్లుడు అమెరికాకు వెళ్లాడు. అక్కడ ఒక సంవత్సరం ఉన్న తర్వాత మా అమ్మాయిని ఉద్యోగం మానేసి అమెరికా రమ్మన్నాడు. మా అమ్మాయికి ఉద్యోగం మానటం ఇష్టంలేక రానంటే మనస్పర్థలు ఏర్పడి విడాకులు ఇచ్చుకునేంత వరకు వెళ్ళింది. మా అమ్మాయిని స్వామి దగ్గరకి తీసుకొని వెళ్ళి విషయం చెప్పాను. నేను నా మనస్సులో ఎందుకు అనవసరంగా నెలకు 60,000 రూపాయలు వచ్చే ఉద్యోగం మానేసి అమెరికాకి వెళ్ళటం అని అనుకున్నాను. వెంటనే స్వామి నా వంక తీక్షణంగా చూస్తూ **"నువ్వు సాకాలనుకుంటే ఇక్కడ పెట్టుకో నీ బిడ్డని"** అన్నారు. వెంటనే నేను 'మీ ఇష్టం స్వామీ'! అన్నాను. మా అమ్మాయితో "అమ్మా ఇక్కడ ఉండొద్దు. వాళ్ళమ్మా,నాన్న ప్రభావం అతని మీద ఉంది. ఏది మంచి, ఏది చెడు తెలుసుకునే శక్తిలేదు. అబ్బాయి మంచివాడు. ఎందుకు చిన్నదానికి గొడవలు పడతారు. నువ్వెళ్ళిపోమ్మా! ఆ అబ్బాయి మారుతాడు పో, నీకేం భయం లేదు నేనున్నాను పో" అని ఆశీర్వదించారు.

మా అమ్మాయి వెళ్ళి ఇప్పటికి 3సం॥ అయ్యింది. వాళ్ళు హాయిగా ఉన్నారు. స్వామి సలహాను పాటించటం వల్ల మా అమ్మాయి కాపురం ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా నిలిచి హాయిగా ఉన్నారు.

## మోహనరావుగారు, దమ్మపేట:

నన్ను విజయదశమికి రెండు రోజులు ముందుగా రమ్మని చెప్పినారు. అరటి తోట తడపాలి నాకు వీలుపడదు అని ఫోటో రూపంలో వున్న స్వామితో గురువారం రోజు చెప్పినాను. ఆ రోజు రాత్రి 7 దుక్కుల వర్షం పడింది. ఇక తోట పని ఏమీ లేదని శుక్రవారం బయలుదేరి స్వామి వద్దకు వెళ్ళినాను. నన్ను చూచి స్వామి "ఒరే మోహనా! నీవు వర్షం పడకపోతే రానన్నావుట, వర్షం పడిందటగా, వర్షం సరిపోతుందా? ఇంకా కావాలా? అని అడిగినారు. తరువాత ఇంటికి వెళ్ళేటప్పుడు నన్ను గొలగమూడి వెంకయ్యస్వామి దర్శనం చేసుకొని వెళ్ళమని చెప్పారు. అలానే గొలగమూడికి వచ్చి సాయి మాష్టార్ నిలయంలో బసకు దిగాను. ఆయాసం వల్ల గత కొన్ని రోజులుగా ఉదయ ఆరతికి రాని సుబ్బరామయ్యగారు ఆరోజే ఆరతికి వచ్చి నన్ను దర్గాస్వామి విషయాలు అడిగి తెలుసుకుని ఈ విధంగా చెప్పారు.

**గురువు చెప్పిన తర్వాత మనం ప్రాణం పోయినా గురువు చెప్పిన పని చేసి తీరాలని** గురుచరిత్రలోని ఉదాహరణలు స్వయంగా తనకు జరిగిన సన్నివేశాలు చెప్పి సత్సంగం చేశారు. ఇది విన్న నాకు స్వామి రమ్మన్న తరువాత ఎంతటి ఇబ్బందైనా స్వామి చెప్పిన పని చెయ్యాలన్న సంకల్పం నాలో దృఢపడింది.

ఈ విషయాలు పరిశీలిస్తే దర్గాస్వామి ఎంత నిశితంగా బోధిస్తున్నారో అర్థమవుతుంది. స్వామికై స్వామే గురుమహిమ గురించి చెప్పటం కాకుండా వెంకయ్యస్వామి దగ్గరకి పంపించి, శ్రీ వెంకయ్యస్వామిని, శ్రీ భరద్వాజ మాష్టార్‌ని సేవించి, వారి అభీష్టానుసారం జీవిస్తున్న శ్రీ సుబ్బరామయ్యగారి చేత చెప్పించటంలో స్వామి యొక్క బోధనాదక్షత తెలుస్తోంది. **స్వామి ఏదీ నరదాకి**

**మాట్లాడరని తెలుసుకుని స్వామి చెప్పినది యథాతథంగా ఆచరించెదము గాక!**

గోవర్ధన్‌గారి (చెన్నై) కుటుంబానికి కారు ప్రమాదమై కారు తుక్కుతుక్కు అయిపోయినా గోవర్ధన్‌గారి తల్లిగారి కాలుకు చిన్న దెబ్బ తగలటం తప్పించి స్వామిదయ వలన ఎవరికీ ఎటువంటి దెబ్బ తగల్లేదు. స్వామికి విన్నవిస్తే కారును బాగు చేయించమన్నారు. స్వామి గొప్పతనం తెలిసిన గోవర్ధన్‌గారు మాత్రం ఒక్కమాట మాట్లాడకుండా స్వామి చెప్పినట్లు కారును 5 లక్షలు పెట్టి బాగుచేయించుకుని దానినే మరలా వాడారు. 6 లక్షలు పెట్టి కొన్న కారుకి 5 లక్షలు పెట్టి రిపేరు చేయించాల్సి వస్తే సామాన్యంగా లాభనష్టాలు బేరీజు వేసుకొని రిపేరు చేయించటం కన్నా క్రొత్తకారు కొనుక్కుంటే బాగుంటుందనుకుంటాము. స్వామి చెప్పిన మాట తుంగలో తొక్కి మన ఇష్టానికి ప్రవర్తిస్తున్నామని గుర్తు వుండదు. కానీ ఎవర్ని ఎలా రక్షిస్తున్నారో స్వామివారికే ఎరుక, అందువలన స్వామి చెప్పినట్లు చేయటమే శ్రేయస్కరము.

శ్రీ స్వామివారి మాటకు అర్థం ఎంతలోతు ఉంటుందో ఆ మాట ఎంత సూక్ష్మంగా ఉంటుందో తెలుసుకోవడం సామాన్య మానవులకు సాధ్యంకాదు. వారు మనకొక మాట చెప్పినప్పుడు అది అర్థం కాకుంటే ఆ మాట యొక్క అర్థం మనకు తెలిసేటట్లు చెప్పమని భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి సేవకుడైన రోశిరెడ్డివలె **"ఓ ప్రభూ నీ మాట యొక్క నిజమైన అర్థం తెలుసుకొని నీకు ప్రీతికరంగా నేను ఆచరించలేను. తమరే నాలో ప్రేరణపెట్టి మీకు ప్రీతికలిగేటట్లు నేను మీ మాటను ఆచరించేటట్లు చేయండి స్వామీ"** అని స్వామివారిని హృదయ పూర్వకంగా కన్నీటితో ప్రార్థించాలి. శ్రీస్వామివారు చెప్పారు, అది అర్థంకాలేదు అని వదిలేస్తే నష్టపోయేది మనమే.

## మునగా బాలసుబ్రహ్మణ్యం, లక్కిరెడ్డిపల్లె, కడప జిల్లా

1999లో శిరిడీ వెళ్ళి వచ్చిన 3 నెలలకి దర్గాస్వామి దర్శనం కలిగింది. ఆ సంవత్సరమే బంధువులందరితో శిరిడీ వెళదామనుకొని టిక్కెట్లు రిజర్వు చేసుకున్నాము. కానీ ప్రయాణపురోజు మా అబ్బాయికి కొంచెం జ్వరం, (అమ్మవారు వచ్చినట్లుగా ఉంటే) రావటం వలన నేను, నా భార్య, పిల్లవాడు తప్ప మిగిలిన వాళ్ళని పంపించాను. తర్వాత 6 నెలలకి దర్గాస్వామితో శిరిడీ వెళదామనుకుంటున్నానని చెపితే మంచిది నాయనా! వెళ్ళిరా అని, వచ్చేటప్పుడు మన్మాడ్‌లో అశోక్‌బాబా అని ఉంటారు ఆయన దర్శనం చేసుకో. ఆయన చూడడానికి పిచ్చివాడిలా ఉంటాడు. ఆయన చుట్టూ 4 కుక్కలు ఉంటాయి, మురికి కాలువల దగ్గర ఉంటాడు. ఆయన తిట్టినా, కొట్టినా, అరచినా మీరు ఎదురు అరవవద్దు అని చెప్పారు. శిరిడీ సాయి దర్శనం చేసుకొని మన్మాడ్ స్టేషన్ దగ్గరకి వచ్చిన తర్వాత నేను బాబాను వెతకటానికి వెళ్ళి బాబా దర్శనం అవక వచ్చేసరికి అంతకు ముందే అశోక్‌బాబా దర్గాస్వామి చెప్పినట్లు నాలుగు కుక్కలతో మా కుటుంబ సభ్యులకు స్టేషన్ దగ్గర దర్శనం ఇచ్చి ఏ ట్రైనుకి వెళుతున్నారని అడిగి, ప్రక్కనున్న షాపులో అరటిపండు కొని ఇస్తే దాన్ని తిని, ఆశీస్సులు యిచ్చి వెళ్ళారని చెప్పారు. అంతటితో నాకు చాలా బాధేసింది. ఇంటికి వచ్చిన తర్వాత దర్గాస్వామి దర్శనం చేసుకుంటే దర్శనం అయ్యిందా అని అడిగారు. నేను స్వామితో 'స్వామీ! మా వాళ్ళంతా రైలు టైము అయిపోతుందన్నా అందరినీ తోడ్కొని పోయాను. అందరూ స్టేషన్‌లో కూర్చుంటే నేను మాత్రం స్వామికోసం వెతికాను మరి నాకు దర్శనమివ్వకుండా వీళ్ళకి దర్శనమిచ్చారు అశోక్‌బాబా' అని చనువు మీద అడిగాను. వెంటనే స్వామి **"నాయనా! నీకు యాన్‌జైటీ (ఆదుర్దా) ఎక్కువ, ఆయన్ని వెతుక్కుని పోయినావు. ఆయన్ని వెతికి కనుక్కోలేవు. సద్గురుదేవా అని ఉన్న చోట గమ్మున కూర్చుంటే ఆయనే**

**నీదగ్గరకి వస్తారు కదా! ఆయన్ని చూడాలని ఊరంతా వెతికి వచ్చావు. ఆయనే సాక్షాత్తు దత్తుడు నాయనా!"** అని చెప్పారు. అప్పటిదాకా అశోక్‌బాబా అంటే ఎవరో తెలియని మేము ఆయన సాక్షాత్తు దత్తుడని వినేసరికి ఎంతో ఆశ్చర్యపోయాము. మరలా వెళ్ళినప్పుడు నాకు దర్శనం అవలేదు అని చెప్పినప్పుడు **"నాయనా! నువ్వు ఆయన్ని వెతుక్కుని పోయినావు. దేవుని వెతుక్కుని చూడాలని చూడలేవు. ఉన్నచోటనే సద్గురువు ఆశీర్వాదం ఉంటే ఆయనదర్శన మిస్తారు. నువ్వు ఇప్పుడు బాధపడుతున్నావు దర్శనమే కదా! ఇస్తాంలే పో నాయనా"** అని అన్నారు. ఆరోజు నాకు స్వప్నంలో 'శిరిడీసాయి సాక్షాత్తు భౌతికంగా సింహాసనంలో ఒక యోగ నిద్రలో ఉన్నారు. మా పిల్లవాడు ఇలా ప్రత్యక్షంగా వచ్చారా అని ముట్టుకొని చూస్తున్నాడు. బాబా ఒక మిద్దె అంత ఎత్తు ఉన్నారు. అప్పుడే అశోక్‌బాబా, దర్గాస్వామి చాలామంది మహనీయులు దర్శనమిచ్చారు. తర్వాతరోజు స్వామి దగ్గరకి వెళ్ళితే నేనేమి చెప్పకుండానే "అయ్యడా! దర్శనమిచ్చారా?" అని అడిగారు. నేను దర్శనమిచ్చారు అనగానే స్వామి నాతో "మంచిది నాయనా! నీవెప్పుడైతే నమ్ముతావో వాళ్ళు ఖచ్చితంగా దర్శనమిస్తారు, తోడువుంటారు" అని చెప్పారు.

ఈ సంఘటనతో మహనీయులందరి రూపాలు వేరైనా వారందరిలో ఉన్న సద్గురువు ఒక్కడే అని మనస్సుకు దృఢంగా నాటుకుంది.

నాకు స్వామి దగ్గర కొన్ని అనుభవాలు జరిగిన తర్వాత తరచి చూస్తే స్వామి బోధించే విధానం ఎంత అద్భుతంగా వుంటుందోననిపించింది. నేను ప్రయత్నిస్తే అశోక్‌బాబాగారు దర్శనమివ్వకుండా ఇష్టంలేకపోయినా నాతో వచ్చిన వారికి దర్శనమిచ్చారు. నాకు కొంచెం గిలిగా ఉండి స్వామితో విన్నవించుకుంటే నా ప్రయత్నాలకన్నా సద్గురువు ఆశీస్సులు ఎంత ముఖ్యమో చెప్పారు. అంతేకాక తర్వాత చాలామంది మహనీయుల స్వప్నదర్శనమిచ్చి రూపాలు వేరైనా సద్గురువు ఒక్కడేననేది నా

మనస్సులో దృఢపరిచారు. అంతేగాక నాకు స్వప్న దర్శనమైందని నేనేమి చెప్పకుండానే స్వామి చెప్పి సర్వజ్ఞులని తెలియపరిచారు. నేను స్వామి చెప్పినది చేసినందుకు అద్భుతమైన బోధ, అవగాహన ఇచ్చారని నమ్ముతున్నాను.

# సంఘసేవ

స్వామి ఆచరణద్వారా చూపినది, తనను ఆశ్రయించినవారికి చెప్పి, ప్రోత్సహించి చేయించింది సంఘసేవ. సంఘసేవ అంటే సంఘాన్ని గురుస్వరూపంగా భావించి నిష్కామంగా సేవ చేయటం. పరులకు సహాయం చేయటంతో పాటు చేసిన సహాయం వలన పని సఫలమైనా, విఫలమైనా సంతోషంగానీ, విచారంగానీ లేకుండా సమభావం వహించడమే నిష్కామకర్మకు గీటురాయి. ఈ నిష్కామకర్మ అంతా మనలోని లోపాలను, బలహీనతలను గుర్తించి వివేకవైరాగ్యాలతో తొలగించుకునేందుకేనని గుర్తించాలి. ఈ బలహీనతలను మలదోషం అన్నారు. ఈ మలదోషం నిష్కామకర్మ ద్వారా మాత్రమే పోతుంది.

## స్వరూపగుప్తాగారు, రాయచోటి

1. అది 2006వ సం॥ స్వామివారి ఆశీస్సులతో రాయచోటిలో ఉచిత సామూహిక వివాహాలు జరిపించాము. వివాహ ముహూర్తం తర్వాత స్వామిని మేము నిర్మిస్తున్న లయన్స్ క్లబ్ కంటి అస్పత్రి నిర్మాణ కార్యక్రమాలను పరిశీలించి, నిలిచిపోయిన నిర్మాణాన్ని ప్రారంభం అయ్యేలా చేయమని ప్రార్థించాను. స్వామివారు ఆస్పత్రికి విచ్చేసి త్వరలోనే పూర్తవుతుందని చెప్పారు. కానీ 2007వ సంవత్సరానికి కూడా యెటువంటి అభివృద్ధి జరుగలేదు. ఒక సందర్భంలో నా సతీమణి ప్రార్థన మేరకు స్వామివారు మా యింటికి విచ్చేశారు. అప్పుడు స్వామిని ఆస్పత్రి దర్శించమని కోరగా విచ్చేశారు. స్వామివారికి ఆస్పత్రిని చూపిస్తూ నా మనస్సులోని కన్నీటితో నా అశక్తతను వివరించాను. కాసేపు మౌనంగా వున్న స్వామి అకస్మాత్తుగా **“ఏరా ఈ నిర్మాణం**

**పని అంతా నీవే చేస్తున్నావని అనుకుంటున్నావా?''** అని అడిగేసరికి నేను నిరుత్తరుడయ్యాను. వెంటనే స్వామీజీ **''పైనున్నవాడు ఇస్తున్నాడు. బేలుదారి పని, మేస్త్రీ చేస్తున్నాడు. నీవెంటు కలిపేవాడు కలుపుతున్నాడు. కట్టేవాడు కడుతున్నాడు. పైవాడు ఇచ్చాడు. నీవు చేయిస్తున్నావు. వాడు ఇవ్వలేదు. నువ్వు చేయించలేదు. ఎందుకురా విచారిస్తావు? ఆయన ఇచ్చినప్పుడు పూర్తి చెయ్యి. నీవు నిమిత్తమాత్రుడవని గుర్తుంచుకో. అంతా మంచి జరుగుతుంద''ని** చెప్పి ''నాకు దాహం వేస్తోంది. ఒక గ్లాసు నీళ్ళు ఇప్పించు'' అని అన్నారు. విషయం అర్థం చేసుకోలేని నేను స్తబ్ధతలో వున్నాను. వెంటనే తేరుకొని నీటికోసం చూసాను. మాతో వచ్చిన రెండు కారులలో కానీ, ఆసుపత్రి ఆవరణలో కానీ నీళ్ళు దొరకలేదు. అప్పుడే పోయిన కరెంటు వచ్చింది. వాచ్‌మెన్ పరిగెత్తుకుంటూ ఒక స్టీలు చెంబు వెతికి, మోటారు వేసి ఆ చెంబుని నీళ్ళతో కడిగిన తర్వాత చెంబుడు నీళ్ళను స్వామికి ఇచ్చాము. స్వామి నీరు త్రాగి ''నా దాహం నీవు తీర్చావు - నీ దాహం నేను తీరుస్తాను'' అని చెప్పి నా భుజంపై చెయ్యి వేసి ''ప్రజల అవసరం కోసం నీవు చేసే ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేస్తాను'' అని చెప్పి ఆశీర్వదించారు.

నాలుగు రోజుల తర్వాత బెంగుళూరులో వున్న నన్ను పిలిపించి స్వామి ''నీవు డాక్టరు బయారెడ్డి, డా॥ నారాయణ రెడ్డి, డా॥ బలరామరాజు, డా॥చంద్రశేఖరరెడ్డి వద్దకెళ్ళి ఆసుపత్రి నిర్మాణానికి తలా ఒక లక్షరూపాయలను అడుగు, మాతృశ్రీ దర్గామాత ఒక లక్ష రూపాయలను ఇస్తుంది'' అని చెప్పారు.

నాకైతే దిక్కు తోచలేదు. డా॥ బయారెడ్డిగారు తప్ప మిగిలిన వారిని యెలా అడగాలని చాలా సంశయించాను. మిత్రుడు టంగుటూరి సత్యనారాయణగారు వచ్చి స్వామివారు చెప్పారు కాబట్టి సంశయం వద్దు వెళ్ళి అడుగు అని నాతో వచ్చారు. అడిగిన వెంటనే అందరు డాక్టర్లు ఆనందంగా 'స్వామీజీ చెప్పారా! ఇది నిజంగా మా

అదృష్టం, మేము తప్పక ఇస్తామ'ని చెప్పి దక్షిణ ఇచ్చారు.

"అమ్మ దుర్గామాతాజీగారు ఇక్కడి కంటి ఆసుపత్రి పూర్తికి సహకారం అందించి ప్రజలకు సేవలందించాలని అమ్మగారి ఆజ్ఞ అయిందని, ఈ పైకంను ఆపరేషన్ పరికరాల కొరకే వినియోగించాలని" స్వామివారు నన్ను ఆజ్ఞాపించారు. పరికరాలకు తక్కువ వస్తుందని చెపితే మరో రెండు లక్షల రూపాయలు నాకు ప్రసాదించి ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసేందుకు నన్ను ఆశీర్వదించి పంపారు.

ఆశ్చర్యకరంగా కోరిన వెంటనే మిత్రులు, బంధువులు, దూరప్రాంతాలవారు కూడా స్పందించి అందించిన ధన సహాయంతో ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయగలిగాము. ప్రతి విషయంలో కూడా సూచనలందించి ఈ సేవను చేయగలిగే భాగ్యాన్ని స్వామీజీ, మాతాజీ నాకు ప్రసాదించారు. ఈ ఋణాన్ని తీర్చుకోవడం పేద ప్రజలకు ఉచిత కంటి ఆపరేషనుల ద్వారానే అని నమ్ముతున్నాను. అందుకు శ్రీ మాతాజీ గారికి, సద్గురు స్వామివారికి నేను సదా కృతజ్ఞుడనే.

2. అది 2009 సం॥లో ఆసుపత్రి ద్వారా ప్రజలకు సేవలందించడం ప్రారంభించాము. నాకు వస్తున్న సమస్యలను, అక్కడ జరిగే విషయాలను స్వామివారికి వివరించేవాడిని. దానికి స్వామివారి సూచనలు, సలహాలను పాటిస్తూ వాటినధిగమించేవాడిని. అప్పటికి వున్న ఆర్థిక సమస్యలను, ఆసుపత్రి అభివృద్ధికి కావలసిన వాటి గురించి ధ్యానంలో మాతాజీకి చెప్పుకునేవాడిని. ఒకరోజు స్వామివారు నన్ను పిలిచారు. వెళ్ళగా స్వామి "ఒరే! అమ్మ ఆసుపత్రిలో ఇంకొక మైక్రోస్కోపు పెట్టించి ఇంకా ఎక్కువమంది ప్రజలకు సేవలందించాలని నాకు చెప్పింది. కాబట్టి ఇంకొక మైక్రోస్కోపు మరియు ఇతర మిషన్లు తీసుకో అని రెండు లక్షల రూపాయలు ఇమ్మనింది" అని చెప్పారు.

అంతేకాదు స్వామివారు తన శిష్యులతో నా గురించి చెబుతూ వాడికి ఆసుపత్రిలో అనేక సమస్యలు వస్తున్నాయి. అవి

అధిగమించడానికి వానికి మనోధైర్యం కావాలి. అందుకు అమ్మయ్య వాడి హృదయంపై సదా తోడుగా వుండాలని ఆశీర్వదించి అమ్మయ్య డాలర్‌ను మాతాజీ వర్ధంతి నాడు నా గుండెలపై ఉంచారు. ఆనాటి నుండి నాకు ఎటువంటి సమస్య వచ్చినా అమ్మయ్య దయతో దూదిపింజలాగా ఎగిరిపోయి నాకు ఎంతో శక్తిని ప్రసాదించింది. ఎక్కువ ఆపరేషన్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎక్కువమందికి సేవలందించే అవకాశాన్ని కలుగజేసింది. ఆరోగ్యరీత్యా, ఆర్థికరీత్యా, వ్యాపారపరంగా, శారీరకంగా, సామాజికంగా ఎంతో ప్రోత్సాహాన్ని, శక్తిని, హితుల, స్నేహితుల, సేవాతత్పరుల, సహకారాన్ని అందిస్తూ నన్ను సదా ముందుకు నడిపిస్తున్నది. అందులకు ఎంతో కృతజ్ఞుడను.

## సురేంద్రగారు, నెల్లూరు

మేము కొంత మంది డాక్టర్లము కలసి 1994లో రూరల్ వెల్‌ఫేర్ పథకం క్రింద పేదవారికి సేవచేయటం ప్రారంభించాము. 2002లో ఒక హాస్పిటల్ కట్టి ఉచితంగా సేవలు అందిద్దామనుకున్నాము కానీ మా దగ్గర డబ్బులు లేవు. మాకు లోను ఇవ్వటానికి కూడా ఎవరూ ముందుకు రాలేదు. కానీ మేము ఉత్సాహంగా ఆస్పత్రి, సాయిబాబా గుడి కడదామని డా॥ శ్రీధర్‌రెడ్డిగారి ద్వారా దర్గాస్వామి గురించి తెలుసుకొని శంకుస్థాపనకు స్వామిని ఆహ్వానించాము. స్వామి వచ్చి లక్ష రూపాయలు మొదటి డొనేషన్ ఇచ్చి మాకు ధైర్యం చెప్పి 'ఏం కాదురా నువ్వు చెయ్యి అయిపోద్ది'' అని చెప్పారు. అలానే మొదలుపెట్టిన తర్వాత కొన్ని నెలలకు ఒక బ్యాంకువాళ్ళు తమంత తామే మా ప్రాజెక్టు గురించి తెలుసుకుని 22 లక్షల లోను ఇచ్చారు. నిర్మాణ సమయంలో ఎంతెంత అవసరమో అంత చాలా చిత్రంగా సమకూరేవి. కొన్ని చెక్కులు చెల్లక వెనక్కు వెళ్ళిపోతే స్వామికి చెప్పుకుంటే ''అవెక్కడికీ వెళ్ళవు, మరలా వస్తాయి'' అని అభయమిచ్చారు. అలానే చాలా విచిత్రంగా చెల్లవని పంపించిన చెక్కులే చెల్లాయి.

మా ఆస్పత్రికి ఆనుకుని సాయిబాబా గుడి వుంది. ఒకసారి మాటల సందర్భంలో "ఈ మందిరంలో అన్నీ వుంచాము, ఎవరికి ఏమి కావాలో వారికి అవి లభిస్తాయి" అని స్వామి ఆశీస్సులు ఇచ్చారు.

ఒకసారి 25సం॥ల యువకునికి గుండె ఆపరేషన్ జరిగింది. ఒక సం॥ తర్వాత అతనికి హెపటైటిస్ - బి వచ్చి ఇంజక్షన్ చేస్తే రక్తం కారుతూ వుండేది. బ్రెయిన్ హెమరేజ్ మొదలైంది. నేను చాలా కంగారుపడ్డాను. కానీ స్నేహితులు డా॥ శ్రీధర్‌రెడ్డి నాతో **'మనమెందుకన్నా భయపడేది. మనమంతా పోస్టుమాన్‌లాగా చేసేది. అంతా చేసేది స్వామే'** అని చెప్పేసరికి చాలా ధైర్యం వచ్చింది. తర్వాత మేము చేసిన వైద్యం కేవలం నామమాత్రం. కానీ స్వామి దయ వలన అంతటి ప్రమాదకర పరిస్థితి పోయి అతను ఇప్పటికీ హాయిగా వున్నాడు. ఈ సంఘటనతో చేసేదంతా స్వామేనని, మాకు ఇలా ఈ విశ్వ యజ్ఞంలో పాలు పంచుకునే అవకాశం ఇచ్చినారని అర్థమై స్వామి మీద భక్తి, విశ్వాసాలు పెరిగాయి.

# మందిర నిర్మాణాలకి స్వామి ఆశీస్సులు

## నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు దగ్గర సాయి మందిర నిర్మాణం

### కె. శ్రీనివాసరెడ్డి, నెల్లూరు ఇలా చెపుతున్నారు

2002సం॥లో సాయిబాబా మందిర నిర్మాణానికి స్వామి దగ్గరకెళ్ళి ఆశీస్సులు తీసుకొని వెళ్ళాము. మందిర నిర్మాణానికి దక్షిణ యిస్తామన్న వారు ఇవ్వకపోయేసరికి మందిర నిర్మాణం ఆగిపోయింది. స్వామి దగ్గర కెళ్ళి చెపితే స్వామి, **"సచ్చరిత్రలో బాబా ఏమి చెప్పాడు. ఆయన్ని నమ్ముకోమని చెప్పారు. మీరు ఎవరినీ అడగనక్కరలేదు. సాయి సచ్చరిత్ర నిత్య పారాయణ చేస్తుండండి, అన్నీ ఆ భగవంతుడే చేస్తాడు"** అన్నారు. అలాగే నిత్య పారాయణ చేయటం మొదలు పెట్టగానే ఏ రోజుకి ఎంత కావాలో భక్తులు తీసుకు వచ్చి మేము ఇంతకు ముందు అడగనివారు కూడా వారికై వారు వచ్చి మందిర నిర్మాణానికి దక్షిణగా సమర్పించారు.

# చెన్నై విల్లివాకంలో సాయిమందిర నిర్మాణం

యస్. యస్. గోవర్ధన్, విల్లివాక్కం, మదరాసు (చెన్నై) ఇలా చెపుతున్నారు

నా తల్లిదండ్రులైన శ్రీమతి ప్రభావతమ్మ, శ్రీ శ్రీనివాసులుగారు కొద్దికాలం దర్గాలో గడపాలని అంతా సిద్ధమై వెళ్ళినారు. అందుకు స్వామివారు "ఆ సాయియే మీ వద్దకు వస్తారు, మీరు పోయి అక్కడే సేవ చేసుకోండి" అని చెప్పారు. దాని ఫలితమే విల్లివాక్కం, లక్ష్మీ స్ట్రీట్‌లో శ్రీ సమర్థ సద్గురు దర్బారుసాయి జ్ఞాన మందిర నిర్మాణం.

స్వామివారు అమ్మయ్య మొదటిసారిగా ఫిబ్రవరి 2002లో లక్ష్మీ స్ట్రీట్ (తిరుమంగళంరోడ్డు, విల్లివాక్కం, చెన్నై) లోని మా ఇంటికి వచ్చారు. అప్పుడు అక్కడ సాయిమందిరం నిర్మించాలని స్వామివారు మాకు సూచించారు.

వారు చెప్పినది సరిగా అర్థం చేసుకోలేక మేము మందిరానికి స్థలం కొరకు వెదకడం ప్రారంభించాము. స్వామివారు ఆగస్టు 2002లో వచ్చినప్పుడు మరలా ఆ విషయం ప్రస్తావించారు. కొన్ని నెలల తర్వాత మా ఎదురింటిలో వున్న మా బంధువులు శ్రీ కృష్ణమూర్తి, శాంతమ్మగార్లు వచ్చి తమ ఇంటికి పడమరలో వున్న 15 అడుగుల వెడల్పున్న ఖాళీ స్థలాన్ని ఇస్తామని ప్రస్తావించారు. ఈ విషయాన్ని స్వామివారికి చెప్పడమైనది. అప్పుడు స్వామివారు "ఆ స్థలాన్ని అమ్మినా అమ్మకపోయినా ఫరవాలేదు కానీ వారింటికి వాయువ్యంలో పెరిగి వుంది కనుక అక్కడ వున్న మెట్లను తీసివేస్తే వారి కుటుంబానికి మంచిది" అని సలహా ఇచ్చారు. శాంతమ్మ, కృష్ణమూర్తిగార్లు అందుకు అంగీకరించి మెట్లను తీసివేసి మిగిలిన ఖాళీ స్థలాన్ని చేర్చి 17 అ॥ 35 అ॥గా చేసి శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయి ట్రస్టుకు అమ్మడం జరిగింది. భూమిపూజ స్వామి అమ్మయ్యల సమక్షంలో 23-2-2004న జరిగింది. స్వామివారు తమ ఆశీర్వచనంతో పాటు రు. 516/- విరాళం

కూడా అందజేశారు. ఆ తరువాత స్వామివారు మరొక లక్షరూపాయలు మందిర నిర్మాణానికి గాను మాకు అందచేశారు. వీటితో పాటు శ్రీ స్వామివారు మందిరానికి కావలసిన పూజా సామాగ్రి మొత్తం ఇచ్చారు.

మందిర నిర్మాణ సమయంలో కూడా స్వామివారి అనుగ్రహం మాకు స్పష్టంగా గోచరించింది. మొదటి అంతస్తుకు స్లాబ్ వేసేటప్పుడు దట్టంగా మబ్బులు ఉన్నాయి. అయినా స్లాబ్ పని పూర్తయేవరకు ఒక చుక్క వర్షం కూడా రాలేదు. ఈ విషయాన్ని మా నాయనగారు శ్రీ అమ్మయ్యగారి వద్ద దర్గాకు పోయి ప్రస్తావించగా "మంచి కార్యాలకు ఎలాంటి ఆటంకాలూ రావు" అని చెప్పారు. తర్వాత, 6 సెప్టెంబరు 2004 కృష్ణాష్టమి నాడు ద్వారకామాయి సాయిబాబా ఫోటోని ప్రతిష్టించి, మందిరానికి కావలసిన సమస్త వస్తువులను శ్రీ అమ్మయ్యగారు సమకూర్చారు. ఆ తర్వాత తేదీ 20 జూన్ 2005 జ్యేష్టమాసం త్రయోదశినాడు స్వామివారు తమ దివ్య హస్తాలతో సమర్థ సద్గురు శ్రీ దర్బారుసాయి, శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు మందిరంలో ప్రతిష్ఠించారు. ఆ సందర్భంగా జరిగిన మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది.

## కల్పాకంలో సాయిబాబా మందిర నిర్మాణం

కల్పాకం చెన్నై నుండి 80 కి.మీ. దూరంలో మరియు మహాబలిపురానికి చాలా దగ్గరలో వున్న అణు విద్యుత్ శాఖ ఉద్యోగులు నివసించే టౌన్‌షిప్. మా కల్పాకం టౌన్‌షిప్‌లో ప్రతి గురువారం సత్సంగం అక్కడున్న భక్తుల ఇళ్ళల్లో చేస్తున్నాము. సత్సంగం సభ్యులు సాయిబాబా మందిరం కడదామని సంకల్పంతో అయ్యప్ప గుడి కమిటీ వారిని అడిగితే వారు కాదన్నారు. అదేవిధంగా ఇంకొక గుడి యాజమాన్యం కూడా ఒప్పుకోలేదు. ప్రత్యేకంగా మందిరం కడదామని ప్రయత్నించి ఇక్కడి అధికారులకు స్థలం ఇచ్చే అధికారం లేకపోవడం వల్ల విఫలమైనాము. దర్గాస్వామి దగ్గరకొచ్చి విన్నవిస్తే "నేను స్థలానికి వచ్చి ధ్యానం చేస్తే ఆటంకాలు తొలుగుతాయి. మీకు నిదానంగా స్థలం వస్తుంది" అని

అన్నారు. తర్వాత కూడా ప్రయత్నించి విఫలమైనాము. ఆ సమయంలో దర్గాస్వామి చెన్నైలో వచ్చి ఉంటే స్వామిని కల్పాకం ఆహ్వానించాలని వెళ్ళాము. మాకు మందిరానికి స్థలము దొరకలేదు. మరి స్వామిని తీసుకువస్తే స్వామి ఎక్కడ ధ్యానం చేస్తారు? అనే శంక ఉండడంతో స్వామితో మేము హృదయపూర్వకంగా చెప్పలేకపోయాము. మా బాధ స్వామికి తెలియకపోతే కదా! మేము మా ప్రయత్నాల గురించి చెపితే స్వామి “నేను అంత దూరం ప్రయాణం చేసి రాలేను. ఇక్కడనుండే చేస్తాను, నిదానంగా పనులు అవుతాయి” అన్నారు.

చాలా చిత్రంగా స్వామి ఏమి ప్రేరణను ఇచ్చారో చాలా ధైర్యంగా (మేము చేసిన ప్రయత్నాలకు ఎన్నో యిబ్బందులు వచ్చాయి. ఎన్నో కమిటీలవారి అనుమతులు, పైగా అనుమతి యిచ్చినట్లు వ్రాస్తారు అసలు మందిరం కట్టటానికి అనుమతి ఉండదు) మంజునాథ అనే ఆయన చొరవతో మందిరానికి స్థలం, కట్టడానికి అనుమతి వచ్చింది. శంకుస్థాపనకని స్వామి దగ్గర కెళితే స్వామి మేము తీసుకెళ్ళిన మందిర స్థలంలో శిలను చూచి అమ్మవారు కనిపిస్తున్నారని చెప్పారు. మేమేమి అడగకుండానే “మంజునాథ ధైర్యవంతుడు, శివుడిని ఆరాధిస్తాడు” అని 2-3 ని॥ ఆయన గొప్ప లక్షణాలు చెప్పి మంజునాథ చేత శంకుస్థాపన చేయించమని మరియు శంకుస్థాపనకు రెండు కొబ్బరి కాయలు కొట్టమని చెప్పారు. మా సత్సంగసభ్యులలో కొందరు శంకుస్థాపన సమయంలో ఒక కొబ్బరికాయ సరిపోతుందని, మిగిలినవారు స్వామి చెప్పినట్లు రెండు కొట్టాలని అన్నారు. మా ప్రమేయం లేకుండా మొదటి కొబ్బరికాయ కుళ్ళిపోగా రెండవకాయ కొట్టవలసి వచ్చింది. పై లీలను తరచి చూస్తే స్వామి సర్వప్రేరణాధికారియై మంజునాథగారిని ప్రేరేపించి అనుమతి లభించేటట్లు చేసారని, మందిర స్థలంలో పుట్టలు ఉన్నాయని మేము తీసుకు వెళ్ళిన రాళ్ళలో అమ్మవారు ఉన్నారని, మేమేమి చెప్పకుండానే మంజునాథగారి గురించి చెప్పి, రెండు కొబ్బరి కాయలు కొట్టండని చెప్పి అలానే జరిపించిన స్వామివారు సర్వజ్ఞులని, సర్వసమర్థులని,

సర్వప్రేరణాధికారి అని తెలుస్తోంది. ఎన్నో అధికారిక అడ్డంకులు వున్నా ఇలాంటి ఒక టౌన్‌షిప్‌లో మందిర నిర్మాణానికి స్థలం రావటం, అనుమతి యివ్వబడటం ఒక పెద్ద అద్భుతం. అదే స్వామి మహిమ.



శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 15

## దర్బార్ నగరంలో ఉత్సవాలు

| | |
|---|---|
| 1. తెలుగు నూతన సంవత్సరము | : చైత్ర శుద్ధ పాడ్యమి |
| 2. శ్రీ రామ నవమి | : చైత్ర శుద్ధ నవమి |
| 3. ఉరుసు ఉత్సవం | : ఫాల్గుణ పౌర్ణమి |
| 4. దర్బార్ సాయి మందిర ప్రతిష్ఠాపన వార్షికోత్సవం | : జ్యేష్ట బహుళ పాడ్యమి |
| 5. గురు పౌర్ణమి | : ఆషాఢ పౌర్ణమి |
| 6. అమ్మయ్య ఆరాధన | : శ్రావణ మాసం ఆఖరి శనివారం |
| 7. శరన్నవ రాత్రులు (దసరాలు) | : ఆశ్వయుజ మాసం |
| 8. శ్రీ సాయిబాబా మహా సమాధి | : విజయదశమి |
| 9. దత్త జయంతి | : మార్గశిర పౌర్ణమి |
| 10. ఇంగ్లీషు నూతన సంవత్సరము | : జనవరి 1 వ తేదీ |

## నిత్య కార్యక్రమములు

| | |
|---|---|
| 1. ఉదయ ఆరతి | : ఉ॥ 5 గం॥ 15 ని॥ |
| 2. మధ్యాహ్న ఆరతి | : మ॥ 12 గం॥ |
| 3. సాయం ఆరతి | : సా॥ 6 గం॥ 30 ని॥ |
| 3. పవళింపు ఆరతి | : రా॥ 10 గం॥ |

ప్రతి నెల పౌర్ణమి శ్రీ సమర్థ సద్గురు దర్బార్ సాయి సత్య వ్రతము, ప్రతి గురువారం దర్గాలకు, దర్బార్ సాయిబాబాకి అభిషేకం జరుపబడును. అన్ని పండుగలలో కుల, మత, భాష, ధనిక, బీద తేడాలు లేకుండా భక్తులు అధిక సంఖ్యలలో వస్తుంటారు.

## అశ్వత్థ వృక్షానికి స్వామి దీపం పెట్టటం:

1964 ప్రాంతంలో స్వామి కడపకి వెళ్ళినప్పుడు మాతాజీ ఒక అశ్వత్థ వృక్షాన్ని (రావి చెట్టు) నాటారు. ఆ తర్వాత స్వామి ఆ అశ్వత్థ వృక్షం ప్రక్కనే ఒక వేపచెట్టును నాటారు. 1974 ప్రాంతంలో ఆ రావిచెట్టుకు, వేపచెట్టుకు స్వామి, అమ్మయ్యలు వివాహం జరిపించారు. ఆ చెట్లవద్ద స్వామి ప్రతిరోజు ఉదయము, సాయంత్రము దీపం పెడతారు. భక్తులు పూజ్యభావముతో వాటికి ప్రదక్షిణలు చేస్తారు.

## ఉరుసు ఉత్సవం:

దర్గాలో ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమినాడు ఇద్దరు బాబాలకు మూడురోజుల పాటు ఉరుసు ఉత్సవం జరుగుతుంది.

మొదటి రోజు : గంధము ఉత్సవము

రెండవ రోజు ; జండా మెరవణి (ఉరుసు)

మూడవ రోజు : ప్రసాద వితరణ

ఈ ఉత్సవంలో ఖవ్వాలీ పాట కచ్చేరీ జరుగుతుంది.

## దర్బార్ సాయి మందిరము

పరిపూర్ణావతారుడు, పరబ్రహ్మస్వరూపుడు, పరమాత్ముడు, రాజాధిరాజ, యోగిరాజ, షిర్డీ సాయినాథుడు 16-6-1998 న హజరత్ దర్బారు కోరికపై దర్బారు నగరములో భక్తులచేత నిర్మించిన సమర్థ సద్గురు దర్బారు సాయి మందిరములో ప్రతిష్ఠింపబడినారు. అప్పటినుండి తనవద్దకు వచ్చు భక్తులకు, శరణార్థులకు వారి వారి మనోభీష్టములు నెరవేర్చి, స్వప్నదర్శనమిచ్చి తరింపజేయుచున్న శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయిని దర్శించి పూజించి వారి తీర్థ ప్రసాదములు తీసుకొని వారి కృపకు పాత్రులు కావలెనని మా మనవి.

ఈ మందిర ప్రతిష్ఠ వార్షికోత్సవమునాడు షోడశ పూజలు, హోమము, పల్లకి ఉత్సవము జరుపబడును.